# I. ఆధునిక కవిత్వం

## 1. నవ్య సంప్రదాయ కవిత్వం
## (1990-1991)

ఆది కవి నన్నయనుండి నేటివరకూ అవిచ్ఛిన్నంగా వస్తున్న ఛందోబద్ధమైన పద్యవిద్యను గౌరవిస్తూనే, ఆధునిక జీవితానికి సంబంధించిన వివిధముఖాలను ప్రదర్శించే కవిత్వం నవ్యసంప్రదాయ కవిత్వం. ఆచార్య నాయని కృష్ణకుమారిగారు చెప్పినట్టు, 'సంప్రదాయం' అంటే అంతా ప్రాచీనమైనదీ, చాదస్తమైనదీ అని అర్థంకాదు. గతం, వర్తమానానికి అందించే కాలానుగుణమైన మార్పుల్ని సంతరించుకున్న వారసత్వమే సంప్రదాయం. తెలుగులో ఆధునిక యుగ ప్రవర్తకులైన కందుకూరి వీరేశలింగం పంతులుగారు సంప్రదాయాన్ని మన్నించినవారే. కాని ఆనాటి సాహిత్యంలో ప్రచురంగాలేని కొన్ని కొత్త పోకడల్ని ప్రవేశపెట్టాలనీ, కొన్ని పనికిమాలిన పోకడల్ని మార్చాలనీ దృఢమైన సంకల్పం కలవారు. వీరు తమ 'సరస్వతీ నారద సంవాదము' అనే రచన ద్వారా తనకాలంనాటి కవిత్వంలో ఉన్న వ్యర్థపదాడంబరాన్నీ, రసహీనతనూ నిరసించారు. అంటే వీరేశలింగంగారు సాంప్రదాయిక కవిత్వంలో ఆధునికతను ప్రవేశపెట్టి, నవ్యసంప్రదాయకవిత్వానికి నాంది పలికారని అర్థం.

1900-1947 మధ్యకాలంలో ఉన్న సాంప్రదాయిక కవిత్వంలో ఆచార్య నాయని కృష్ణకుమారిగారు ఐదు విభాగాలను గుర్తించారు. అవి -

**1) ఆస్థానకవుల, ఆశ్రితుల కవిత్వం**

ఇది 1900-20 మధ్య కనిపించే ఆస్థానకవుల, ఆశ్రితుల, పండితుల, కవిత్వం. ఈ కవిత స్తుతి, ఆశీస్సు, ప్రశంస వంటి అంశాలను కలిగివుంటుంది. వీరు శతకాలు ఎక్కువగా వ్రాశారు. భగవన్మాహాత్మ్య వర్ణన, క్షేత్రమాహాత్మ్యాలు, పోషకుల ప్రశంస, ఈ కవిత్వంలో కనబడతాయి. పురాణాలను ఆంధ్రీకరించడం, పురాణ కథల్ని కావ్యాలుగా మలచడం కూడా ఉంది. కొక్కండ వెంకటరత్నంశర్మ, వడ్డాది సుబ్బరాయకవి, కాళ్ళకూరి నారాయణరావు, మధిర సుబ్బన్న దీక్షితులు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, జయంతి రామయ్య పంతులు, కాశీ కృష్ణాచార్యులు, శ్రీమతి కొటికలపూడి సీతమ్మ, శ్రీమతి ఆత్మూరి అన్నపూర్ణమ్మ, 'కవికలహంసి' చేబ్రోలు సరస్వతీదేవి, 'విద్వత్కవయిత్రి' కాంచనపల్లి కనకాంబ, శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మ,

శ్రీమతి గునుపూడి ఇందుమతీదేవి మొదలైన వారెందరో ఇటువంటి కవిత్వం వ్రాశారు. ఇందుమతీదేవి మొదలైన వారెందరో ఇటువంటి కవిత్వం వ్రాశారు.

**2. పురాణ కథలను తిరిగి కావ్యాలుగా మలచిన కవిత్వం**

కేవలం కల్పనాకథలు కృత్రిమరత్నాలనీ, ఆద్యసత్కథలే వావిరి పుట్టు రత్నములనీ, రామరాజ భూషణుడు నిర్ణయించాడు. ఈ ఉద్దేశంతో సంప్రదాయం మీది మోజుతో కొందరు కవులు పురాణ కథల్ని తిరిగి కావ్యాలుగా చెప్పారు. వీరందరూ ప్రాచీన భారతీయ సంస్కృతిని శిథిలం కాకుండా కాపాడాలనే తీవ్రమైన ఆదర్శం కలవారు. వావికొలను సుబ్బారావుగారు, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు మొదలైనవారు ఈ వర్గానికి చెందుతారు.

**3. అవధాన కవిత్వం**

1900–1934 మధ్య అవధాన కవిత్వం ప్రస్ఫుటంగా కనిపించింది. ఇది ప్రాచీన సాహిత్యంలో లేకపోయినా, దీనికి మూలబీజమైన ఆశుకవిత్వం పూర్వం చతుర్విధ కవితలలో ఒకటిగా పేరుపొందింది. చతుష్షష్టి కళలలో సమస్యాపూరణం, పుస్తక పఠనం, పద్యపాదపూరణం కూడా ఉన్నాయి. ఆశుకవిత ఆధారంగా పుట్టి, అలంకారాలు చేసుకుని, శాస్త్రాన్ని పెంచుకుని, అందంగా తయారయిన సాంప్రదాయిక కవిత్వపు రెమ్మ అవధాన కవిత్వం. మాడభూషి వేంకటాచార్యులు, తిరుపతి వేంకటకవులు, పిశుపాటి చిదంబర శాస్త్రి, గాడేపల్లి వీరరాఘవశాస్త్రి, కొప్పరపుకవులు, మండపాక పార్వతీశ్వరశాస్త్రి దుర్భాగ రాజశేఖర శతావధాని, శ్రీపతి త్ర్యంబకరావు, వేలూరి శివరామశాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు, గడియారం వేంకటశేషశాస్త్రి మొదలైనవారు ఈ శతాబ్ది పూర్వార్థంలో అవధానాలు చేసిన కవి పండితులు ఉత్తరార్ధంలో ఇటీవల అవధానాలు చేసేవారు – సి.వి.సుబ్బన్నగౌరి పెద్దిరామసుబ్బశర్మ, బులుసు వెంకటరామమూర్తి, నరాల రామారెడ్డి మాడుగుల నాగఫణిశర్మ, గండ్లూరి దత్తాత్రేయశర్మ, కడిమిళ్ల వరప్రసాదరావు, మేడసాని మోహన్, ఆశావాది ప్రకాశరావు, జోస్యుల సదానందశాస్త్రి మొదలైనవారు.

**4. వర్ణనాత్మకమయిన వస్తుకవిత్వం**

ప్రకృతి వస్తువుల్ని, పల్లెపట్టుల్ని, ఆయా స్థలాలలో ప్రసిద్ధమైన గాథల్ని, వ్యక్తుల్ని విశేషాల్ని వర్ణించేకావ్యాలు కొన్ని సాంప్రదాయిక పద్ధతిలో కొనసాగాయి. ఇతివృత్తం ఒక్కొక్కసారి కథను కలిగి వుంటుంది. ఒక్కొక్కసారి సంఘటనల్ని మాత్రమే వర్ణిస్తుంది.

కట్టమంచి రామలింగారెడ్డిగారి 'ముసలమ్మ మరణం', దువ్వూరి రామిరెడ్డిగారి 'నలజారమ్మ అగ్నిప్రవేశం', నిడుదవోలు వేంకటరావుగారి 'మించుపల్లె', నాళం కృష్ణారావుగారి 'మధురకవితలలో చిన్నకథలు', విశ్వనాథ సత్యనారాయణగారి 'కొండవీటి పొగమబ్బులు', 'చంద్రవంకయుద్ధము' వంటి ఖండికలు, జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి 'ఉదయశ్రీ', 'కరుణశ్రీ' లు ఈకోవలోకి చేరుతాయి.

### 5. జాతీయతా భావ ప్రబోధకమయిన కవిత్వం

1900-1947 మధ్యకాలంలో జాతీయతను పెంపొందించే సంఘటనలెన్నో జరిగాయి. రాణాప్రతాపసింహుని చరిత్ర, శివాజీ చరిత్ర, 1857 నాటి సిపాయికలహం, ఝాన్సీలక్ష్మీబాయి శౌర్యం, తాంతియాతోపే సాహసం, భగత్ సింగ్ విప్లవం, తిలక్ 'స్వాతంత్ర్యం నా జన్మహక్కు' నినాదం, గాంధీజీ సత్యాగ్రహ సమరం, నేతాజీ 'ఢిల్లీచలో' నినాదం, 'వందేమాతరం' ఉద్యమం, ఆగస్టు 1942 విప్లవం మొదలైనవన్నీ భారతీయుల్ని దేశభక్తిలో మునిగి తేలెట్లాచేశాయి. దుర్భాక రాజశేఖర శతావధానిగారి 'రాణాప్రతాప సింహచరిత్రము', గడియారం శేషశాస్త్రిగారి 'శివభారతము', తుమ్మలసీతారామమూర్తిగారి 'ఆత్మకథ' దేశభక్తినీ, జాతీయతాభావాన్నీ ప్రబోధించే మహాకావ్యాలు. చిలకమర్తి లక్ష్మీనరసింహగారి 'భరతఖండంబు చక్కని పాడియావు' అనే పద్యం, గరిమెళ్ల సత్యనారాయణగారి 'మాకొద్దీ తెల్లదొరతనమూ' అనే పాట దేశభక్తిని చాటెడివే. ఆంధ్రుల చారిత్రక ఉజ్జ్వలత్వాన్ని తెలిపే కావ్యాలు కూడా వచ్చాయి. విశ్వనాథవారి 'వేగిక్షేత్రం', కొడాలివారి 'హంపీక్షేత్రం' శ్రీనివాస సోదరుల 'ఓరుగల్లు కోట' మొదలైనవి ఇట్టివి.

1947 తర్వాత కూడా సాంప్రదాయిక కవిత్వం వివిధ రూపాలలో అభివృద్ధి చెందుతూనే ఉంది. ముదిగొండ వీరభద్రకవిగారి 'వందేమాతరము', మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి 'ఆంధ్రపురాణము', వానమామలై వరదాచార్యులవారి 'పోతన చరిత్ర'; జాషువాగారి ఖండకావ్యాలు, జంధ్యాలవారి ఖండకావ్యాలు మొదలైనవి పేర్కొనవచ్చును. విశ్వనాథవారి 'రామాయణ కల్పవృక్షము' స్వాతంత్ర్యానికి పూర్వం మొదలు పెట్టబడి స్వాతంత్ర్యానంతరం పూర్తి చేయబడింది. పైన చెప్పిన కవులే కాకుండా పుట్టపర్తి నారాయణాచార్యులు, బొడ్డుబాపిరాజు, పింగళి-కాటూరి, నండూరి రామకృష్ణమాచార్య, ముదివర్తి కొండమాచార్యులు, దేవరకొండ బాలగంగాధర తిలక్, కరుటూరి సత్యనారాయణ, ఉండేల మాల కొండారెడ్డి, జె. బాపురెడ్డి, గుంటూరు శేషేంద్రశర్మ, పోచిరాజు శేషగిరిరావు, తుమ్మపూడి కోటేశ్వరరావు, బేతవోలు

రామబ్రహ్మం, రసరాజు మొదలైన కవులెందరో స్వాతంత్ర్యానంతర నవ్యసంప్రదాయ కవిత్వాన్ని సుసంపన్నం చేశారు, చేస్తున్నారు.

నవ్యసంప్రదాయకవిత్వ వస్తువులో వ్యక్తికి సంబంధించిన దైవభక్తి, తాత్త్వికాంశాల వంటి విషయాలూ ఉంటాయి. సమాజానికి సంబంధించిన దేశభక్తి, సంఘ సంస్కరణం, మానవతా వాదం మొదలైన అంశాలూ ఉంటాయి. ప్రకృతిని వర్ణిస్తూ కూడా సమాజ పరిస్థితుల్ని ధ్వనింపజేసిన కవులూ ఉన్నారు. ఈ పద్యకవిత్వంలో పేదలబాధల్ని, విప్లవాన్ని వర్ణించిన కవులు కూడా ఉన్నారు. (శేషేంద్రశర్మగారి 'ఋతుఘోష' కావ్యం, 'పక్షులు' కావ్యంలోని 'జ్వాల' పద్యాలు ఇందుకు చక్కని ఉదాహరణాలు). కాబట్టి ఇది కొత్తసీసాలో పాతసారాయి కాదు; పాతసీసాలో కొత్తసారాయి. అందువల్లనే దీనిపేరు 'నవ్యసంప్రదాయకవిత'. ఆకృతి ఛందోబద్ధమైన సాంప్రదాయికమైన పద్యం; వస్తువు వైయక్తికమూ సామాజికమూ అయిన ఆధునిక జీవితం. పురాణ కథలనూ చారిత్రక కథలనూ వస్తువుగా స్వీకరించినప్పుడు కూడా, అవి ఆధునిక జీవిత నేపథ్యంలోనే తీర్చిదిద్దబడతాయి.

(–ఆచార్య నాయని కృష్ణకుమారిగారి 'సంప్రదాయకవిత' అనే వ్యాసం ఆధారంగా)

## ఎ) శరదృతువు

– విశ్వనాథ సత్యనారాయణ

ఱెక్కలు చాఁచి తీరికగాఁగ గాలిలోఁ
దేలిపోయెదు నంచవోలె వచ్చి
సితవస్త్రకృతగరున్మతి నృత్తసమభంగ
తురికీల నర్తకిసరణి వచ్చి
ఇరుదెసల్ కాంతిచే నొరయ సూర్యున కెదు
రౌ సితాంబుజలక్ష్మి యట్లు వచ్చి
నిమ్నోన్నతములు లేని కులాంగనాచ్ఛ కూ
లంకష ప్రేమ కల్పముగ వచ్చి
చందిరునివోలె నవనీరజాతబంధు
కిరణసంస్పర్శ చేత వెల్గించుకొంచుఁ
దన తనూసృష్టి సర్వ మందముగ వచ్చెఁ
దల్లి కృష్ణాతటిని శరత్కాలమూర్తి.

చిందిపోయెదు వయశ్శ్రీశోభ విరియగాఁ
బచ్చాకు బంగరువన్నె తిరిగి
వైదూర్యశకలముల్ పట్టి కుప్పలు చేయు
గతి నున్న యందాలకంకె వదలి
వలయీకృతములు శోభాతరంగావలుల్
గగన వీథికకు మెట్లుగ నమర్చి
ఇట ముదాకృతి దేవు నెగచి పయోధర
ప్రౌఢవారీగజపతినిఁ జేసి
అనయపథజన నేత్రకుట్టన నిమిత్త
మైన పౌష్కల్యమేఁచి యూహలకు నూహ
సొగసు సంపాదనము చేయుచున్న దిదిగొ
శరదమలమూర్తి కేదార సస్యలక్ష్మి.

మిన్నను పాములచిన్నదాని గళాన
నత్తగుల్లల పేరనంగ మొరసి

అతివాయువేగధూతాప్సరోంగనల చీ
రల చెంగు లనఁగ గూళ్ళులుగ నెగిరి
గగనవార్నధితరంగములు నేలను దీర
ములఁగట్టు నురుసు తెట్టెలుగఁ దోఁచి
సంకల్పగోఖురాంచల కాంతి వెడఁద యై
ధరణికి డిగ్గిన సరణి వచ్చి
కూడి ఱెక్కలు తపతపఁ గొట్టుకొంచుఁ
గాలు మోపెడు తఱి నారికేళ విటపి
గములఁ గొల్లేటినుండి కొంగలు సహస్ర
ములుగ విడిసె మాలాబద్ధములుగ వచ్చి.

పలుచని బురదలోపల మానిసినిఁ జూచి
నెగచి యూఁకున దూఁకె నీటిపాము
వెలివడ్డ బొరియ ముంగల నిక్కి తెల్లఁబో
యెను గొంగ కెఱగాని యెండ్రకాయ
ఒడ్డున బురదలో గొడ్డు గిట్టలు దిగి
పడె జంఘదఘ్నమై పంటకాల్వ
జనుము చల్లుటకుఁ దీసినపాయ పాపట
చక్కఁదీరిచి దిద్దె సస్యలక్ష్మి
పలుచగా వేఁడియెక్కుఁ బవళ్ళతోడఁ
బైరగాలి పొరల్ తడియారఁ జొచ్చె
పగటి కుషసు నా నొప్పె నవార్షుకములు
కాఱులకుఁ దొల్తగా శరత్కాలలక్ష్మి.

అనిలాహతిఁ దబకలాడె నొడ్డులు మోచి
క్రొత్త నీరము పెట్టుకొన్న చెఱువు
కాల గ్రుచ్చుకొనె డొంకలు గొడ్ల గిట్టలు
దిగిన గుర్తులతోడ బిగిసి యెండి
క్రొత్త నూర్చిన వడ్లకు సరికి సరి రేగు
పండ్లమ్మ వచ్చె లంబాడి పడుచు

వినిపించె వీథిలోనన గంగిరెద్ల దా
సరి సీత పెండిలి సలుపు కేక
బువ్వ చిక్కము కొడవలిఁ బూని బయలు
దేఱ వరికోఁతకొఱకుఁ బాలేరుచాన
ఒక విచిత్రమ్మ యగు శోభ నొలుకఁ బోసె
వడి శరద్వేళ మాగాని పల్లెటూరు.

ప్రొద్దుటింతలు వాయువులు తావికై మెల్ల
కొతిమేర చేలపైఁ గొసరులాడె
చిఱుచేఁదు వలచెఁ గోసిన జొన్న చేనిలో
దొడిమదగ్గర పచ్చి దోసపండు
పండి కోయని మిరపలు పెండ్లి కూఁతుంద్ర
వలె సకుంకుమశోభఁ గులుకులాడె
వడిసెలఱా, తప్పు నొడుపు నేర్పెను దల్లి
చిన్నిపిట్టకు మొక్కజొన్న చేలఁ
జెలఁగెఁ దలగిల్లిన పొగాకు సెనగతంప
టలును, బంతిపూల్ మిరపతోటలకు మధ్య
శరదృతు సమస్తమును బ్రదర్శనము చేసెఁ
గూడి మెట్టపొలాల వికుంఠలక్ష్మి.

చిఱుధూళి పొర కావి చెన్నుగా నిండ్ల కే
తెంచి గోవులు తలాడించుకొంచు
తొలిచూలు చేమంతి తుదఁ బిందెవలె మొగ్గ
దొడిగి ప్చచఁ దనమ్ము తొంగిచూచె
వాలుప్రొద్దు షికార్లు వచ్చిన గాలులు
చిఱుచలితోఁ బరాచికములాడె
చెదరిపోవు మొగిళ్ళ నదలించి పరవఁ దో
లించె దర్జాల బాలేందు రేఖ
పవలు చివరి సగము పఱఁగ రాతిరి తొలి
సగము పరిణమించు సొగసు లొలికి

జిలుఁగు జిలుఁగు వెన్నెలలు చూడ ననిపించె
సర్వ మగు శరత్తు చంద్రిక దని.

బురద త్రొక్కఁడు కాపుబుడుతఁడు మహిషంబు
          పైస్వారి పోవును బాలయముఁడు
చింకిజుత్తునకుఁ గై సేయు నంత్రింతలు
          పసిమాలకన్నియ పట్టమహిషి
చీడ నూఁగగు మిన్పకాడ కాయలను మూఁ
          జూడదు దూడ నాజూకుకాన
అంతంత మూన్నెల లరకకట్టని గిత్త
          యాంద్రించు నందిదాయాదిగాఁడు
అట్టెవాన వెనుక పట్టినయంతలో
నంతనంత నెమ్ము నారినంత
కాచి కాచి యెండ కాసినయంతలో
ఇవురుటెండఁ బుంత లెండినంత.

పొలపొల విరిసిపోవుచు నల్పు విఱుగుచు
          మొల్లమ్ము చెడిన మొగిళ్ళవలన
పసిపస రేదు మవ్వపు సన్న జాజి మొ
          గ్గల తొలివిప్పు నా వెలఁదు లగుచు
ఎడపడ్డ వానల జడులచేఁ జెమ్మ లా
          రిన లేఁత పొరగాలిపనల వలన
మరు సెలకట్టె మాదిరి దూసి చను కమ్మ
          గేదెఁ గితావులై స్వాదు లగుచు
చివర తెలిదారముల నూఁగు జిలుఁగు లొలయు
పొట్లపూ వలెఁ బెరటిలోఁ బొలుపు లగుచు
నలరు నేడాకులనఁటి మొవ్వాకు జిగికి
నెలవులు శరత్తు తలిరువెన్నెలలు వచ్చె.

తలపైని మినువాక తెలిమంచుపెఱ క్రాఁగి
          యొడల నోడిక లగుచున్న యటుల

నిచ్చలు తల్లిఁ దానే కూడి యున్కి సు
గమ్ముచెమ్మట మేనఁ గ్రమ్మినట్లు
మౌళిభూష శశాంకు మన్నించుటకుఁ జంద్ర
కాంతమ్ముగా రూపుఁ గన్నయట్లు
తన లెంకలకు నెండతలఁకు మాన్పంగఁ గ్రొ
మ్మంచుగద్దగఁ దానె మలఁగినట్లు
శ్రీఁ బ్రకాశించె నిత్యాభిషేక వారి
వ్యంగ్యభూతదయావాచ్య మైన మూర్తి
నందమూరున నన్న పూర్ణాంబికా స
నాథుఁడై యేలుకొను విశ్వనాథ శివుఁడు.

**(– ఋతు సంహారము నుండి)**

## బి) శ్మశాన వాటి

**- గుఱ్ఱం జాషువా**

ఎన్నో యేండ్లు గతించిపోయినవి గానీ, యీ శ్మశానస్థలిన్
గన్నుల్ మోడ్చిన మందభాగ్యు డొకడైనన్ లేచిరాడు, దక్కటా
యెన్నా ళ్ళీచలనంబు లేని శయనం? బేతల్లు లల్లాడిరో!
కన్నీటంబడి క్రాగిపోయినవి నిక్కంబిందు పాషాణముల్!

ఆకాశంబును కాఱుమబ్బుగము లాహోరించె; దయ్యాలతో
ఘూకంబుల్ చెరలాడసాగినవి; వ్యాఘోషించె నల్దిక్కులన్
గాకోలంబులు; గుండె ఝల్లుమనుచున్నంగాని యిక్కాటియం
దా కల్లాడిన జాడ లే; దిచట సౌఖ్యం బెంత క్రీడించునో!

ఇచ్చోట; నేసత్కవీంద్రుని కమ్మని
కలము, నిప్పులలోనఁ గఱఁగి పోయె
యిచ్చోట; నేభూము లేలు రాజన్యుని
యధికారముద్రిక లంతరించె!
యిచ్చోట! నే లేఁత యిల్లాలి నల్లపూ
సలసౌరు, గంగలోఁ గలసిపోయె
యిచ్చోట; నెట్టిపే రెన్నికం గనుఁగొన్న
చిత్రలేఖకుని కుంచియ, నశించె!

ఇది పిశాచులతో నిటాలేక్షణుండు
గజ్జె గదలించి యాడు రంగస్థలంబు;
ఇది మరణదూత తీక్ష్ణమౌ దృష్టు లొలయ
నవనిఁ బాలించు భస్మసింహాసనంబు.

ముదురు తమస్సులో మునిఁగిపోయిన క్రొత్తసమాధిమీఁదఁ బై
బొదలు మిణుంగురుంబురువు పోలిక వెల్గుచునున్న దివ్వె, ఆ
ముద ముడివోయినన్ సమసిపోవుట లేదది దీప మందుమా?
హృదయముసుమ్మి, నిల్పి చనియె న్గతపుత్రిక, యే యభాగ్యయో!

కవుల కలాలు, గాయకుల కమ్మని కంఠము లీ శ్మశానంపుం
గవనులఁ ద్రొక్కి చూచెడి; నొకానొకనాఁ డల కాళిదాస భా
రవుల శరీరముల్ ప్రకృతిరంగమునం దిపు డెంత లేసి రే
ణువులయి మృత్తికం కలిసెనో కద! కుమ్మరివాని సారెపై!

ఆలోకించిన గుండియ ల్గరఁగు; నాయా పిల్లగోరీలలో
నే లేబుగ్గల సౌరు రూపఱియెనో! యేముద్దు నిద్రించెనో!
యే లీలావతి గర్భగోళమున వహ్నిజ్వాల జీవించునో?
యీ లోకంబున వృద్ధిగాఁదగిన యేయే విద్య లల్లాడునో?

ఇట నస్పృశ్యత సంచరించుటకు దావేలేదు; విశ్వంభరా
నటనంబున్ గబళించి గర్భమున విన్యస్తంబు గావించి, యు
త్కటపుం బెబ్బులితోడ మేకఁ నొక ప్రక్కన్ జేర్చి జోకొట్టి యూ
ఱటఁ గల్పించు నభేద భావమును, ధర్మం బిందుఁ గారాడెడిన్.

వాకొనరాని గొప్ప ధనవంతుని నిద్దపుఁ బాలఱాతి గో
రీకడఁ బారవేయఁబడి ప్రేలికలం బొరలాడు ప్రేత మే
యాకటిచిచ్చునన్ గుమిలి, యార్చి, గతించిన పేదవాని దౌ
నోకద! వానికై వగవఁ డొక్కఁడు; దాఁచదు కాటినేలయున్.

## బి) శిశువు

**– గుఱ్ఱం జాషువా**

బొటవ్రేల ముల్లోకములు చూచి లోలోన
నానందపడు నోరులేని యోగి
తల్లిదండ్రుల తనూవల్లరీద్వయికి వ
న్నియcబెట్టు తొమ్మిది నెలలపంట
అమృతంబు విష మను వ్యత్యాస మెఱుcగ కా
స్వాదింపc జను వెఱ్ఱిబాగులాcడు
అనుభవించుకొలంది నినుమడించుచు మరం
దము జాలువాఱు చైతన్యఫలము

భాష రాదు; వట్టి పాలుమాత్రమె త్రాగు;
నిద్రవోవు; లేచి నిలువలేదు;
ఎవ రెరుంగ రితని దేదేశమోకాని;
మొన్న మొన్న నిలకు మొలిచినాcడు.

గాన మాలింపక కన్ను మూయని రాజు
అంబ కౌcగిటి పంజరంబు చిలుక
కొదమకండలు దేరుకొని పిల్లవస్తాదు
యుయ్యేల దిగని భాగ్యోన్నతుండు
ఊఁఊఁలు నేర్చిన యొక వింత చదువరి
సతిని ముట్టనినాటి సాంబమూర్తి
ప్రసవాబ్ధి తరియించి వచ్చిన పరదేశి
తనయింటి క్రొత్త పెత్తనపుదారి

ఏమిపనిమీcద భూమికి నేగినాcడో
నుడువ నేర్చిన పిమ్మట నడుగువలయు;
నేండ్లు గడచిన ముందు ముందేమొకాని
యిప్పటికి మాత్ర మేపాప మెఱుగc డితడు.

నవమాసములు భోజనము నీర మెఱుఁగ
పయనించు పురిటింటి బాటసారి
చిక్కు చీఁకటిఁ జిమ్ము జేనెఁడు పొట్టలో
నిద్రించి లేచిన నిర్గుణుండు
నునుఁ జెక్కిళుల బోసినోటి నవ్వులలోన
ముద్దులు చిత్రించు మోహనుండు
అక్షయంబైన మాతృక్షీర మధుధార
లన్నంబుగాఁ దెచ్చుకొన్న యతిథి

బట్టఁ గట్టడు; బిడియానఁ బట్టువడఁడు
ధారుణీ పాఠశాలలోఁ జేరినాఁడు;
వారమాయెనో! లేదొ? మా ప్రకృతికాంత
కఱపియున్నది వీని కాఁకలియు నిద్ర.

ఊయేల తొట్టి యే ముపదేశ మిచ్చునో?
కొసరియొంటరిగ నూకొట్టుకొనును;
అంబతో తన కెంత సంబంధ మున్నదో?
యేడ్చి యూడిగముఁ జేయించుకొనును;
పరమేశ్వరండేమి సరసంబు లాడునో?
బిట్టుగాఁ గేకిస ల్గొట్టుకొనును;
మూన్నాళ్ళలోన నెప్పుడు నేర్చుకొనియెనో?
పొమ్మన్నచోఁ జిన్నబుచ్చుకొనును;

ముక్కుపచ్చ లారిపోయి ప్రాయమువచ్చి
చదువు, సంధ్య నేర్చి బ్రదుకునపుడ
"నాదు పసిడికొండ నారత్న" మని తల్లి
పలుకు పలుకు లితఁడు నిలుపుకొనునె?

తనచేతి గిలకపండునకు ముచ్చట సెప్పు
బలుకలే దనుచుఁ గోపంబు సేయు
పొరుగింటి యిల్లాలి సరసఁ జేఁదరఁ జెంది
పరు లన్న భేదబావమును జూపు

మకరందమునకు సమ్మతిc జూపి నోరూరి
దరిcజేరి, రుచుల భేదములు తెలియు
ప్రతిశబ్ద మీను నుగ్రధ్వాన మాలించి
కంపించి తల్లినిc గౌcగలించు

దాయ లార్గురు నౌకరు నిద్దరును దప్ప
చేరుకొన్నార లీతని చిత్తవీథి;
జగతి నీతని జాతకచక్ర మందుc
బొంచియుందున దపయశంబో? యశంబొ?

## సి) కుంతీకుమారి

**- జంధ్యాల పాపయ్యశాస్త్రి**

అది రమణీయ పుష్పవన-మావనమునం దొక మేడ-మేడపై
నది యొక మాఱుమూలగది - ఆ గది తల్పులు తీసి మెల్లగా
పదునయిదేండ్ల యీడుగల బాలిక-పోలిక రాచపిల్ల-జం
కొదవెడి కాళ్ళతోడ దిగుచున్నది క్రిందకు మెట్లమీదుగన్!

కన్నియలాగె వాలకము కన్పడుచున్నది - కాదు కాదు - ఆ
చిన్ని గులాబి లేత అరచేతులలో - పసిబిడ్డ దున్నయ
ట్లున్నది - ఏమి కావలయునోగద ఆమెకు - అచ్చుగ్రుద్దిన
ట్లున్నవి-రూపురేక-లెవరో యనరా దత డామెబిడ్డయే!

దొరలు నానంద బాష్పాలొ-పొరలు దుఃఖ
బాష్పములొ గాని యవి గుర్తుపట్టలేము;
రాలుచున్నవి ఆమె నేత్రాలనుండి
బాలకుని ముద్దు చెక్కుటద్దాల మీద!

పొత్తులలోని బిడ్డనికి పుట్టియు పుట్టకముందె యెవ్వరో
క్రొత్తవి వజ్రపుం గవచకుండలముల్ గయిసేసినారు! మేల్
పుత్తడి తమ్మిమొగ్గ జిగిబుగ్గల ముద్దులు మూటగట్టు నీ
నెత్తురుకందు నెత్తుకొని నెచ్చెలి యెచ్చటి కేగుచున్నదో!

గలితాకున జలతారు మేలిముసుగు
జాఱె నొక్కింత - అదిగొ! చిన్నారిమోము!
పోల్చుకొన్నాములే! కుంతిభోజ పుత్రి
స్నిగ్ధ సుకుమారి ఆమె కుంతీకుమారి!

కడువేగమ్మున చెంగుచెంగున తరంగాల్ పొంగ ఆ తోట వెం
బడి గంగానది పాఱుచున్నయది బ్రహ్మాండమ్ముగా - అల్లదే
బుడుతన్ చేతులలోన బట్టుకొని యా పూబోడియుంగూడ ని
య్యెడకే వచ్చుచునుండె గద్గదికతో నేమేమొ వాపోవుచున్.

"ముని మంత్రమ్ము నొసంగనేల? ఇదెబో మున్ముందు మార్తాండు
రమ్మని నే కోరగలనేల? కోరితినిబో అతండు రానేల? వ
చ్చెనుబో కన్నియనంచు నెంచక ననున్ జేపట్టగానేల? ప
ట్టెనుబో పట్టి నొసంగనేల? అడుగంటెన్ కుంతి సౌభాగ్యముల్.

ఏయెడ దాచుకొందు నిపు డీ కసిగందును? కన్నతండ్రి "ఛీ
ఛీ" యనకుండునే? పరిహసింపరె బంధువు? లాత్మగౌరవ
శ్రీ యిక దక్కునే? జనులు చేతులు చూపరె? దైవయోగమున్
ద్రోయగరాదు – ఈ శిశువుతో నొడిగట్టితి లోకనిందకున్.

ఈ విషాదాశ్రువులతోడ నింక నెంత
కాల మీ మేను మోతు? గంగాభవాని
కలుషహారిణి–ఈ తల్లి కడుపులోన
కలసిపోయెద నా కన్నకడుపుతోడ"

అనుచు పసివాని రొమ్ములో నదుముకొనుచు
కుంతి దిగినది నదిలోన – అంతలోన
పెట్టె, కాబోలు పవన కంపిత తరంగ
మాలికా డోలికల తేలితేలి వచ్చు!

మందసము రాక గనెనేము–ముందు కిడిన
యడుగు వెనుకకు బెట్టి దుఃఖాశ్రుపూర్ణ
నయనములలోన ఆశాకణాలు మెఱయ
ఆ దెసకె చూచు నామె కన్నార్పకుండ.

దూరదూరాల ప్రాణ బంధువు విధాన
అంతకంతకు తనకు దాపగుచున్న
పెట్టె పొడవును తన ముద్దుపట్టి పొడవు
చూచి తలయూచు మదినేమి తోచినదియొ?

ఆత్మహత్యయు శిశుహత్య యనక గంగ
పాలు గానున్న యీ దీనురాలిమీద
భువనబంధునకే జాలి పుట్టెనేమొ
పెట్టె నంపించి తెరువు చూపెట్టినాడు.

“ఇట్టులున్నది కాబోలు నీశ్వరేచ్ఛ”
యనుచు విభ్రాంతియై దిక్కు లరసికొనుచు
సగము తడిసిన కోకతో మగువ, పెట్టె
దరికి జని మెల్లమెల్లగా దరికి తెచ్చి –

ఒత్తుగావ పూలగుత్తుల నెత్తు పెట్టి–
పై చెఱగు చింపి మెత్తగా ప్రక్కపఱచి
క్రొత్త నెత్తలిరాకుల గూర్చి పేర్చి–
ఒత్తుకొనకుండ చేతితో నొత్తి చూచి–

ఎట్టకేలకు దడదడ కొట్టుకొనెడి
గుండె బిగబట్టుకొని కళ్ళనిండ జూచి
బాష్పముల సాము తడిసిన ప్రక్కమీద
చిట్టిబాబును బజ్జుండబెట్టె తల్లి.

చిన్ని పెదవుల ముత్యాలు చిందిపడగ
కలకలమటంచు నవ్వునేగాని, కన్న
యమ్మ కష్టము – తన యదృష్టమ్ముకూడ
నెఱుగ డింతయు నా యమాయికపు బిడ్డ.

చెదరు హృదయము రాయిచేసికొని పెట్టె
నలలలో త్రోయబోవును – వలపు నిలుప
లేక–చెయిరాక–సుతు కౌగిలించి వెక్కి
వెక్కి యేడ్చును – కన్నీరు గ్రుక్కుకొనను.

“భోగభాగ్యాలతో తులతూగుచున్న
కుంతిభోజను గారాబు కూతురునయి
కన్న నలుసుకు ఒక పట్టెడన్నమైన
పెట్టుకో నోచనైతి పాపిష్ఠిదాన.”

“నన్నతి పేర్మిమై గనెడి నా తలిదండ్రుల ప్రేమ యర్థమౌ
చున్నది; నేడు బిడ్డ నిట నొంటరిగా విడిపోవ కాళ్ళు రా

కున్నవి; యేమి సేతు; కనియున్ గనలేని యభాగ్యురాల నే
నన్నివిధాల-కన్న కడుపన్నది కాంతల కింత తీపియే!

"పెట్టియలోన నొత్తిగిలబెట్టి నినున్ నడిగంగలోనికిన్
నెట్టుచునుంటి తండ్రి! యిక నీకును నాకు ఋణంబుదీరె, మీ
దెట్టుల నున్నదో మన యదృష్టము! ఘోరము చేసినాను నా
పుట్టుక మాసిపోను! నినుబోలిన రత్నము నాకు దక్కునే!

"పున్నమ చందమామ సరిపోయెడి నీ వరహాల మోము నే
నెన్నటికైన చూతునె! మఱే! దురదృష్టము గప్పికొన్న నా
కన్నుల కంతభాగ్యమును కల్గునె? ఏ యమయైన ఇంత నీ
కన్నము పెట్టి ఆయువిడినప్పటిమాటగదోయి నాయనా!

"పాలబుగ్గల చిక్కదనాల తండ్రి!
వాలుగన్నుల చక్కదనాల తండ్రి!
మేలి నీలి ముంగురుల వరాల తండ్రి!
కాలుచెయి రాని తండ్రి! నా కన్నతండ్రి!

"కన్నతండ్రి నవ్వుల పూలు గంపెడేసి -
చిన్నినాన్నకు కన్నులు చేరెడేసి -
చక్కనయ్యకు నెరికురుల్ జానెడేసి -
చిట్టిబాబు మై నిగనిగల్ పెట్టెడేసి -

"బాలభానుని బోలు నా బాలు నీదు
గర్భమున నుంచుచుంటి గంగాభవాని!
వీని నే తల్లిచేతిలో నైన బెట్టి
మాట మన్నింపుమమ్మ! నమస్సులమ్మ!"

దిక్కులను జూచి భూదేవి దిక్కు చూచి
గంగదెస చూచి బిడ్డ మొగమ్ము చూచి-
సజల నయనాలతో ఒక్కసారి "కలువ
కంటి" తలయెత్తి బాలభాస్కరుని చూచె-

## డి) పక్షులు

**– గుంటూరు శేషేంద్రశర్మ**

కోకిల యాకులం దొదిగి
కోయని తీయని కేకవేసి, కా
రాకులు రాలువేళ, శిశిర
ప్రతిసీర తొలంగ ద్రోసె, నీ
లోకము నందు దోచె నవ
లోకము, నాకము నీ ధరిత్రితో
నేకము జేయు లేళ్ళు, సెల
యేళ్ళు, చిగిర్చిన కొండకోనలున్.

కాలము కూలమెక్కి యొక
కమ్మని ఈల వెలార్చి హేలగా
నీలి దిగంతకూలములు
నిండిన బాల కిసాల రాశిలో
నోలి గిరాటువేసె నొక
నూతన చేతన కాంతిఖండమున్
పూలు తటాలునం బొదలె
బుద్బుద పుంజ విలాసరోచులై.

చిగిరిచి పూచినట్టి తరు
సీమలు మేన ధరించి, నవ్వుచున్
నగములు తెల్లమబ్బులను
నాణెముగా తలపాగ జుట్టి, పై
దిగు సెలయేళ్ళ నాత్మ భుజ
దేశములన్ సవరించి ప్రత్యుషో
గగన విలాసినీ రుచిర
గండ తలమ్ములు ముద్దులాడెడిన్.

కెరలి వసంతవేళ పుల
కింపగ నింపగు కొండకోనలన్
బరుగిడు కన్నెకాలువలు
పచ్చని తోటల గున్నమావులం
దిరిగెడు గండు కోయిలలు
తీగెల నూగెడు చిల్క బోదలున్
విరిసిన రమ్యతా విపణి
వీథిగ దోచె సమస్తలోకమున్.

పచ్చని నునురెక్క పైట దాల్చిన చిల్క
గొంతెత్తి పిల్లన గ్రోవి నూదె,
సంపెంగ ముక్కును సవరించి పిచ్చుక
జలతరంగిణి మీటె శ్రావ్యసరణి,
శబల చూడము తలన్ చలియింప వడ్రంగి
ఖేలగా తియ్యని యీలవేసె,
గుమ్మడి పూవన్నె కుక్షి కదల్చుచు
భరతపక్షి సితారు పలుకరించె,
గరుడపక్షియు నీలాల గగన సీమఁ
దిరిగి సన్నాయి వాయించి తేనె గురిసె,
కసుమ పీఠికఁ దుమ్మెద కూరుచుండి
తంబుర న్మీటి శ్రుతిగూర్చె ధరణికెల్ల.

చల్లని రేల నింగి విర
జాజుల పందిరయై హసింపగా
తెల్లని సోగ వెన్నెలలు
తెమ్మరలుం జతగూర్చి నిండు జా
బిల్లి జగమ్ముమీద వల
వేసెను, లోపలజిక్కి చేపలై
యెల్లెడ జీవరాసు లటు
లిట్టులు గంతులు వేయుచుండగన్.

సాగె వసంత కాలపు బ
జారు హజారు విరుల్ పరాగముల్
రేగగ రంగు రంగు నును
రేకుల కోకలు దాల్చి కేకలన్
స్వాగత వాక్యముల్ విసరి
పై చెను; తుమ్మెద గుంపు లింపుగా
రాగము లాలపించుచు త్వ
రం బరుగెత్తె వసంత సంతకున్.

సంపెంగా! నను చంపకే, పొగడ! నీ
సౌరభ్య పూరమ్ములన్
ముంపం జూచెదవేలనే, నళిని! నీ
పుప్పొళ్ళు పై జల్లకే,
సొంపుల్ గుల్కు గులాబి ! నీ
సొగసులం జూపించి బంధింపకే,
కెంపుల్ బూచిన కింశుకమ్మ! అటులం
గ్రీగంట నన్ జూడకే.

అబ్బ! లోకమెల్ల అందాల గోలతో
నిండి యున్నదిచట నిలువలేను
నిమిషమైనగాని సమకూరకున్నది
శాంతి యీ వసంత సంతలోన.

ఓ విహగమ్ములార! ఎట
కోయి ప్రయాణ? మనంత వీథులం
దావనభూములన్ వదలి
యాగిరు లాఝురు లాసముద్రముల్
ఆ వియదధ్వముల్ గడచి
యావల తారల దాటి తేలుచున్
బోవుచు నుంటి రెచ్చటికి
పువ్వుల నవ్వుల గోల కావలన్.

చివురుల్ వేసిన వేయనీ మధువులుం
జిప్పిల్ల పుష్పంపనీ
చపులూరన్ ఫలగుచ్ఛముల్ పొదలనీ
శాఖోపశాఖాదులం,
దివి యంటం పెరగంగనీ, నిలువలే
నీ వృక్షమందింక, నా
యవదతాభ్ర పతాకముల్ కదలె దా
మాకాశ మార్గమ్ములన్.

అదిగో ఆ చిగురాకులందు చిలుకై
యానంద మందారమై
మృదుల స్వాదు ఫలమ్ము ముట్టక సము
న్మీలాక్షియై చూచుచు
న్నది యా పక్షి ననున్; క్షణమ్మయిన నుం
డం జాల నిచ్చోట; నా
కదిగో సుందర మందహాస రుచిరా
హ్వానమ్ము; నే బోయెదన్.

(1970 లో ప్రచురింపబడిన 'పక్షులు' అనే కవితా సంపుటినుండి)

# 2. భావ కవిత్వం
## (1910–1940)

ఆధునికాంధ్ర సాహిత్యంలో ప్రముఖంగా వెలసిన శాఖ 'భావకవిత్వం' లేక 'కాల్పనిక కవిత్వం' 'Romantic Poetry' ఇంగ్లీషు సాహిత్యంలోని 'Lyrical Poetry' 'Romanticism' ల ప్రభావంతో తెలుగులో వచ్చిన కవిత్వమిది.

'Romantic' పద ప్రయోగంమొదట జర్మనీలోను (17వ శతాబ్ది), తర్వాత ఫ్రాన్సులోను (18వ శతాబ్ది), తర్వాత ఇంగ్లండులోను కనిపిస్తున్నది. కాని సాహిత్యంలో కాల్పనిక వాదం మొదట ఇంగ్లండులోనే ప్రారంభమైందని చాలమంది విశ్వసిస్తారు. రూసో, కాంట్, ఫిక్తే వంటి తత్త్వవేత్తలు ఈ సాహితీ సంప్రదాయానికి మూల పురుషులు, 'రొమాంటిక్' పదాన్ని జర్మన్లు 'అత్యుక్తి', 'దిగ్భ్రాంతి', 'వైపరీత్యం' వంటి అర్థాలలో వాడేవారు. ఫ్రెంచివారు 'ఆర్ద్ర భావన', 'వేదన' వంటి అర్థాలలో శృంగార కరుణాది రసభావ గర్భితంగా వాడారు. ఇంగ్లీషు సాహిత్యంలో ఈ పదం 'వేదన', 'వ్యాకులత' లను సూచించేదిగా రూఢమైంది.

18వ శతాబ్దినాటికి ప్రకృతి ప్రీతి, సహజ జీవనాసక్తి, మానవ భావాలతో ప్రకృతి భావాలను మేళవించడం, ఆత్మగతమైన భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడం, గాఢావేశం ఈ రకపు కవిత్వ లక్షణాలైనాయి. అప్పట్లో ఇది సంప్రదాయ సాహిత్యంపై తిరుగుబాటుగా వచ్చింది. పాశ్చాత్యులలో విక్టర్ హ్యూగో, స్కాట్, కాల్‌రిడ్జ్, బ్లేక్, వర్డ్స్‌వర్త్, కీట్స్, షెల్లీ, బైరన్ వంటివారు ఈ రకపు కవిత్వం వ్రాశారు.

పాశ్చాత్య సాహిత్య రంగంలో 18, 19వ శతాబ్దంలో వచ్చిన ఈ రొమాంటిసిజమ్ ఛాయలు దాదాపు వంద సంవత్సరాల తర్వాత 1910–1940 సంవత్సరాల మధ్య తెలుగు వహిత్యంపై ప్రసరించాయి. తెలుగులో భావకవిత్వం, ప్రబంధ కవిత్వంపై తిరుగుబాటుగా, ఇంగ్లీషు విద్యా ప్రభావ ఫలితంగా వచ్చింది. 'భావ కవిత్వ' మనే పదం ప్రాచీన లక్షణకారులు ఉపయోగించారనీ, ఉద్భటుని కావ్యాలంకార సంగ్రహంలో ఇది శృంగార ప్రధానమైన రచలను సూచించేదిగా ప్రయుక్తమైందనీ తెలుస్తున్నది. ప్రేయస్విత అనే లక్షణంగల కావ్యం భావ కావ్యమని ప్రతీహారేందురాజు వివరించాడు.

ఆధునిక కవిత్వంలోని భావ కవిత్వం దీనికి భిన్నమైనది. ఆత్మాశ్రయత, అంతర్ముఖత్వం, దీని ప్రధాన లక్షణాలు.

ఇంచుమించుగా ఇంగ్లీష్ కాల్పనిక సాహిత్యంలోని కవితాశాఖలన్నీ తెలుగులోనూ వచ్చాయి. ప్రకృతి కవిత్వం, ప్రణయ కవిత్వం, భక్తి కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం, స్మృతి కావ్యాలు తెలుగులో భావ కవిత్వ శాఖలుగా ప్రచారంలో ఉన్నాయి. భక్తి కవిత్వం భారతీయులకు కొంతవరకు సాంప్రదాయకమైనదే. పాశ్చాత్య ప్రభావానికి తోడుగా రవీంద్రుని ప్రభావం కొంత, బ్రహ్మసమాజ మత ప్రభావం కొంత దీనిపై పడింది. దేశభక్తి కవిత్వం, సంఘసంస్కరణ కవిత్వం సమకాలికమైన రాజకీయ సాంఘికోద్యమాల ప్రభావంతో రూపుదిద్దుకొన్నాయి. ప్రణయ కవిత్వంలోని అమలిన శృంగారతత్త్వం, కుల పాలికాప్రణయం భావకవిత్వపు విశిష్ట భావనలు.

అనుభూతిని ప్రధానంగా ఎంచటం, సుకుమారమైన పదరచన, వియోగ ప్రాధాన్యం, స్వేచ్ఛ, నవ్యతాప్రీతి, రచనలలో పూర్వనియమాల ఉల్లంఘనమూ భావకవిత్వంలో కనిపిస్తాయి. రాయప్రోలు సుబ్బారావు, గురజాడ అప్పారావు, వేంకట పార్వతీశ్వర కవులు, పింగళి–కాటూరి, అబ్బూరి రామకృష్ణారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, తల్లావజ్ఝల శివశంకర్ శాస్త్రి, దువ్వూరి రామిరెడ్డి, మల్లవరపు విశ్వేశ్వరరావు, బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు, నాయని సుబ్బారావు, అడవి బాపిరాజు, కవికొండల వేంకటరావు, విశ్వనాథ సత్యనారాయణ, వేదుల సత్యనారాయణ శాస్త్రి ప్రభృతులు తొలితరం భావకవులలో ముఖ్యులు.

తృణకంకణం, లలిత, కష్టకమల, స్నేహలత, ముత్యాలసరాలు, ఏకాంతసేవ, సౌందరనందం, మల్లికాంబ, కృష్ణపక్షం, హృదయేశ్వరి, కడపటి వీడుకోలు, ఎంకిపాటలు, కిన్నెరసాని పాటలు, సౌభద్రుని ప్రణయ యాత్ర, దీపావళి ఈ కోవలో వెలువడిన విశిష్ట రచనలు, ప్రబంధాలలో ప్రబలిపోయిన భౌతిక శృంగారం స్థానంలో మానసికమైన ప్రేమనూ, అమలిన శృంగారాన్నీ నిలబెట్టి, మనిషికి మానవత్వానికి మహెూన్నతమైన విలువనిచ్చింది భావకవిత్వం.

**('తెలుగు సాహిత్యకోశము' ఆధారంగా)**

## ఎ) జన్మభూమి

**– రాయప్రోలు సుబ్బారావు**

ఏ దేశ మేగినా, ఎందు కాలిడిన
ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనిన
పొగడరా! నీ తల్లి భూమి భారతిని,
నిలుపరా! నీ జాతి నిండు గౌరవము!

ఏ పూర్వపుణ్యమో, ఏ యోగబలమొ
జనియించినాడ వీస్వర్గఖండమున
ఏమంచి పూవులన్ ప్రేమించినావొ
నిను మోచె, ఈ తల్లి కనకగర్భమున!
లేదురా, ఇటువంటి భూదేవి యెందు
లేరురా, మనవంటి పౌరు లింకెందు!

సూర్యుని వెలుతురుల్ సోకునందాక,
ఓడల జెండాలు ఆడునందాక!
నరుడు ప్రాణాలతో నడుచునందాక,
అందాక గల ఈ యనంత భూతలిని
మన భూమివంటి చల్లని భూమి లేదు!
పాడరా నీ తెన్గు బాలగీతములు

పాడరా నీ వీర భావభారతము!
తమ తపస్సులు ఋషుల్ ధారపోయంగ,
శౌర్యహారము రాజచంద్రు లర్పింప,
భావ సూత్రము కవి ప్రభువు లల్లంగ
రాగదుగ్ధము భక్తరత్నముల్ పిదుక
దిక్కుల కెగదన్ను తేజమ్ము వెలుగ
రాళ్ళతేనియలూరు రాగాలు సాగ
జగముల నూగించు మగతనం బెగయ

సౌందర్యమెగబోయు సాహిత్య మలర
వెలిగిన దీ దివ్య విశ్వంబు పుత్ర!
దీపించె నీ పుణ్య దేశంబు పుత్ర!
పొలములు రత్నాలు మొలిచెరా యిచట
వార్ధిలో ముత్యాలు పండెరా యిచట
పృథివి దివ్యౌషధుల్ పిదికెరా మనకు
కానల కస్తూరి కాచెరా మనకు
అవమాన మేలరా, అనుమాన మేల,
భరత పుత్రుcడ నంచు భక్తితోc బలుక!

**('ఆంధ్రావళి' నుండి)**

# ప్రబోధము

**– రాయప్రోలు సుబ్బారావు**

అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ
విద్యాలయములు స్థాపించునాడు,
ఓరుగల్లున రాజవీర లాంఛనముగ
బలు శస్త్రశాలలు నిలుపునాడు.
విద్యానగర రాజవీథుల గవితకు
పెండ్లిపందిళ్లు గప్పించునాడు;
పాట్నూరికి సమీపమున నాంధ్ర సామ్రాజ్య
దిగ్జయ స్తంభ మెత్తించునాడు
ఆంధ్రసంతతి కే మహితాభిమాన
దివ్య దీక్షాసుఖస్ఫూర్తి తీవరించె
నా మహావేశ మర్థించి యాంధ్రులార
చల్లు డాంధ్రలోకమున నక్షతలు నేడు.

తన గీతి యఖిలజాతిని పాటకులనుగా
దిద్ది వర్ధిల్లిన తెనుగువాణి,
తన పోటులు విరోధితండంబులకు సహిం
ననివిగా మెరిసిన తెనుగుకత్తి,
తన యందములు ప్రాంతజనుల కభిరుచివా
సన నేర్ప నలరిన తెనుగు రేఖ,
తన వేణికలు వసుంధరను సస్యశ్యామ
లను చేయ జెలగిన తెలుగు భూమి
అస్మదార్ద్ర మనోవీథి నావహింప
జ్ఞప్తి కెలయించుచున్నాడ; చావలేదు,
చావలేదు, ఆంధ్రుల మహోజ్జ్వలచరిత్ర
హృదయములు చీల్చి చదువుడో సదయులార!

కృష్ణాతరంగపంక్తిన్ ద్రొక్కి త్రుళ్ళింత
నాంధ్రనౌకలు నాట్యమాడునాడు
ఇంటింటదేశిసాహిత్య దీపములతో
నాంధ్రతేజస్సు రాపాడునాడు,
సుకుమార శిల్పవస్తు ప్రపంచమునందు
నాంధ్రనైపుణి పంతమాడునాడు,
సమర సేనావ్యూహ జయపతాకల క్రింద
నాంధ్రపౌరుషము చెండాడునాడు,

చూచి, సంతోషమున తలలూచి, గర్వ
మాచి, ఆంధ్రపుత్రీపుత్రు లందగలరు
శాంతి, నందాక లేదు విశ్రాంతి మనకు,
కంకణ విసర్జనల కిది కాల మగునె!

**('ఆంధ్రావళి' నుండి)**

## బి) నాగులచవితి

**- బసవరాజు అప్పారావు**

నీ పుట్టదరికి నా పాప లొచ్చేరు
పాపపుణ్యమ్ముల వాసనే లేని
బ్రహ్మస్వరూపులౌ పసికూనలోయి
కోపించి బుస్సలు కొట్టబోకోయి!

నాగుల చవితికీ నాగేంద్ర! నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి!

చీకటిలోన నీ శిరము తొక్కేము
కసిదీర మమ్మల్ని కాటేయబోకు
కోవపుట్టలోని కోడెనాగన్న
పగలు సాధించి మా ప్రాణాలు దీకు!

నాగుల చవితికీ నాగేంద్ర! నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి!

అర్థరాతిరివేళ అపరాత్రివేళ
పాపమే మెఱుగని పసులు తిరిగేను
ధరణికి జీవనాధారాలు సుమ్మ!
వాటిని రోషాన కాటేయబోకు!

నాగుల చవితికీ నాగేంద్ర! నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి!

అటుకొండ యిటుకొండ ఆ రెంటినడుమ
నాగులకొండలో నాట్య మాడేటి
దివ్యసుందరనాగ దేహి యన్నాము
కనిపెట్టి మమ్మెపుడు కాపాడవోయి!

నాగుల చవితికీ నాగేంద్ర! నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి!

పగ లనకరే యనక పనిపాటులందు
మునిగి తేలేటి నా మోహాలబరిణె
కంచెలూ కంపలూ గడిచేటి వేళ
కంపచాటునవుండి కొంప దీకోయి!

నాగుల చవితికీ నాగేంద్ర! నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి!

## సి) స్వాతంత్ర్య రథము

– దువ్వూరి రామిరెడ్డి

అంబుదంబుల నమృతపూరంబు లొలుక
నింద్రచాపంపుదోరణ మింపుఁ గులుక
గాఱు మెఱుగులు నెల్లెడ గడులు కొనగ
వెడలె స్వాతంత్ర్యరథము విన్వీథియందు!

జలధరమాల జీల్చికొని స్యందనకాంతి
నభోంతరాళ ముజ్జ్వలితముచేసి, యంధ
తమసంబులు పాటిన మూలనైన శోభల
ననలెత్తజేయుచు, బ్రభాతవిభాకర బింబమట్లు
సొంపిలుచు, నవీనజీవనము వింతగ నింపె
సమస్త సృష్టిలోన్!

ఆ రథమందు దీప్తమయమై కనుపట్టె
నిజప్రభావ దుర్వార పవిత్రమూర్తి
కనుపండువు సేయుచు; ధర్మజీవనాకారమొ,
శాంతిబింబమొ, యకల్మష సత్యనికేతనంబొ,
సంసారఫలస్వరూపము, ప్రజాహృదయంబొ
యనన్ వెలుంగుచున్!

ఒకచేతన్ రుధిరంపు బాత్రమును
వేరొక్కంట బీయూషపాత్రికయుం గైకొని,
'సభ్యతామిషమునన్ దేశంబులం దెల్ల నింతకు
ధర్మంబులుగాగ నెన్నబడు నన్యాయంబు
లీనాటితో వికలంబై చనుగాక' యంచు
గరుణావేశమ్ము దీపింపఁగన్!

పచ్చినెత్తురు నమృతంపు బాత్ర బోసి
దివ్యదుగ్ధంబుగా మార్చె దేవిమహిమ,

హాలహల గర్భమందైన నమృతరసము
సంభవించు నటం చిల జాటనేమొ!

నిలువదు స్యందనంబు ధరణీపతిపాలన
దండభీతిచే, నిలువ దనాథబాష్పములు
నిల్చిన పల్లపునేల, మోసగింపుల మఱపించు
క్రించు దనపుంజతురాత్ముల కాగబో,
దనర్గళజవమొప్పనేగెడిని గన్నులకుం
గనరానిచోటికిన్!

పూర్వసింహాసనంబులు, ప్రోజ్జ్వలంపు
మణిమయకిరీటములు, భోగమందిరములు
చక్రసంఘర్షణంబున జదిసిపోయి
యవి యివి యనంగరాక రూపఱెదు నేడు;
లేవు దివ్యతురంగముల్, లేవు కరులు,
ప్రజలె యా తేరు మోకుల బట్టువారు,
వాయుజవమునఁ దారకాధ్వమున వేగు
నంతరాయశతంబులైన దాటి!

తేరు జాడల నెత్తురు పాఱిపాఱి
బంగరుంబంట బండించె బక్కనేల,
జక్రనేములు దాకిన స్థలము లెల్ల
సస్యలక్ష్మికి గల్యాణశాల లయ్యె!

స్యందనా సీన యగు దేవి “శాంతి శాంతి”
యనుచు మంజుల గానమ్ము నలర జేసి
నవ్య నక్షత్ర వీణా స్వనమ్ము లందు
మేళవించెను జనులు విస్మితులుగాగ!

(1935లో ప్రచురింపబడిన ‘వైతాళికులు’ అనే కవితాసంకలనం నుండి)

## డి) ఈప్సిత లేశము

– నాయని సుబ్బారావు

అది నడుచువేళ నేల జీరాడుకుచ్చె
రేపు దుమ్మున నొక త్రసరేణువునయి
దాని తనువున బుట్టు స్వేదమున గలసి
కరగిపోదును రూపమేర్పరుపరాక.

అది యుషస్స్నాన మొనరించి యంత గట్టు
కొనిన పచ్చనిపట్టు దుకూలమందు
అర్ధమగు లేజరీయంచునై తదీయ
దేహమున గగుర్పాటులు దిద్దుకొందు.

అది శుచిర్భూతమై దేవతాళి పూజ
లైన వెనువెంట తన పూతహస్తమంటి
హారతికి వెలిగించు కర్పూరమునయి
వాసనలు చిమ్ముదురు దాని వదనమందు.

అది సుధారసమొలుక మాటాడునపుడు
దాని నాభిమూలమున నుద్గతనోజ్ఞ
ఫణితులం దొక్క ప్రణయభాషణము నగుచు
త్రోవలో దాని రసన కంటుకొనిపోదు.

ప్రణయినీ వదనాంచల భాగమందు
నక్క చిఱునవ్వుతరగనై యూగుచుందు,
ప్రణయినీ శీతలదృగంతపాతమందు
కరడుగట్టిన యొక సుధాకణము నగుదు.

ప్రణయినీ ప్రసూనాంగసంస్పర్శ తగిలీ
తగులనివిధాన కలిగినంతనె యనంత
దివ్యరాగస్రవంతిలో తేలిపోదు,

**పడవ పగిలిన**

ఇది పగిలిపోవు ననుభయ మ్మింతవలదు
ఈ తలంపున నానంద మిపుడు పొంగు;
పగిలిపోయిన చెక్కలపట్టు విడువ
కీవు పాథోనిధానమ్ము నీదెద వని,

ఇది పగిలిపోవు ననుభయ మ్మింతవలదు
ఈ తలంపున నిపు డుల్ల మిగురులొత్తు;
తునిగిపోయిన చెక్కలతో పయోధి
గర్భమున రత్నరథ మీవు కట్టేదవని,

ఇది పగిలిపోవు ననుభయ మ్మింతవలదు
ఈతలంపున నిపు డాత్మ కింతశాంతి;
విఱిగిపోయిన చెక్కల దరికిజేర్చి
నీ చితికి కాష్ఠములుగ మన్నించెదవని,

**శుక్రవారము**

ప్రేమపరిపూర్ణమైన నా హృదయపాత్ర
ఈదినము నీపెదవుల కందింతు ననెదు
నాసలో కన్నువిచ్చితి నమృతసరసి
ప్రాతరున్మిషితమ్మైన పద్మమట్లు.

ఆ త్రిలోకైక జనని పాదాబ్జ సవిధ
భూమి మీలితనేత్రవై మోకరిల్లి
నీవు పూజాసుమమ్మ వైనావు, హృదయ
కర్ణికామూలమున భక్తి కందళించి.

అదరు పారవశ్యమ్మున దొడిమయూడి
నేను పూవునై పడితిని నీదు చెంత
జంటపూవుల అమృతనిశ్వాససౌర
భమున రోదసి శుక్రవారము నదించె.

**(సౌభద్రుని ప్రణయయాత్ర నుండి)**

# 3. అభ్యుదయ కవిత్వం
## (1935–1955)

మార్క్సిస్టు దృక్పథంతో సామ్యవాదాన్ని కోరుతూ, వర్గ ప్రయోజనాన్ని ఆశిస్తూ వ్రాసిన కవిత్వం అభ్యుదయ కవిత్వం. 'అభ్యుదయం' అంటే 'పురోగమనం' లేదా 'ప్రగతి'. సాంఘిక చైతన్యానికి దోహదం చేసేది అభ్యుదయ సాహిత్యం. ఇరువయ్యో శతాబ్దంలోని సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య వ్యవస్థకు, ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా అనేక దేశాలలో ఉద్యమాలు బయలుదేరాయి. 1930లలో (Hungry Thirties) ఆర్థిక సంక్షోభం ప్రపంచాన్ని కుదిపి వేసింది. దీనికి కారణం పెట్టుబడి దారీ విధానం వైఫల్యమే. సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా నిలబడిన రష్యా 1917 విప్లవం తర్వాత శీఘ్రకాలంలోనే, ఆర్తిక అసమానతలు తొలగిపోగా, సుస్థిర సుఖశాంతులు నిలుపుకొని, అందరికీ ఆదర్శరాజ్యంగా కనిపించింది.

రెండో ప్రపంచ యుద్ధానికి ప్రపంచ దేశాలన్నీ ఆయత్తమవుతున్న తరుణంలో 1935లో ఏప్రిల్ నెలలో భారతదేశంలో 'అభ్యుదయ రచయితల సంఘం' ఏర్పడింది. పెట్టుబడిదారీ వ్యవస్థను, సామ్రాజ్యవాద తత్త్వాన్ని, యుద్ధోన్మాదాన్ని ఈ సంఘం తీవ్రంగా నిరసించింది. 1936లో ప్రేమచంద్ అధ్యక్షతన అభ్యుదయ రచయితల మొదటి మహాసభ జరిగింది. సమాజంలోని ఆర్థిక వ్యత్యాసాలకు, దోపిడీ దౌర్జన్యాలకు మూల కారణమేమిటో తెలుసుకొని, దాన్ని సాహిత్యం ద్వారా, ఇతర కళారూపాల ద్వారా ప్రజలకు అందించి, ప్రజల్లో అభ్యుదయ భావ చేతన రగిలించడం ఈ సాహిత్యోద్యమం ప్రధానధ్యేయం.నజ్రుల్ ఇస్లాం 'బిద్రోహి' గేయం, హరీంద్రనాథ్ చట్టోపాధ్యాయ 'ఘరూహువాహై జంగ్' వంటి పాటలు అభ్యుదయ వాదులకు ఆవేశాన్ని స్ఫూర్తినీ ఇచ్చాయి.

ఆంధ్రదేశంలో అభ్యుదయ కవిత్వం, భావ కవిత్వం మీద తిరుగుబాటుగా వచ్చింది. కార్మిక సమస్యలు, కార్మిక జీవితం కవితా వస్తువు లయ్యాయి. ఛందస్సులో, భావంలో, భాషలో కొత్త రీతులు వచ్చాయి. అంతవరకూ ఉన్న అన్ని రకాల కవితా

ప్రాతిపదికలనూ కాదని ఇది విప్లవాత్మకమైన మార్పు తెచ్చింది. ముఖ్యంగా 1948-50 ప్రాంతాలలో ఇది మహోద్యమంగా విస్తరించింది.

అభ్యుదయ భావాలతో కూడిన గేయ కవిత్వాన్ని సులభశైలిలో మొదట అందించిన మహాకవి గురజాడ అప్పారావుగారు ('ముత్యాలసరాలు'). తరువాత 1921-22 ప్రాంతాల్లో రచింపబడిన ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లి' నవల కూడా అభ్యుదయ భావాలతో వ్రాయబడినదే. (ఇదే అభ్యుదయ సాహిత్యానికి నాంది అనే విమర్శకులు కూడా ఉన్నారు). 1933-1941 మధ్య కాలంలో శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) గారు వ్రాసిన 'మహాప్రస్థానం మొదలైన గేయాలు' అభ్యుదయ కవిత్వానికి ఉద్యమ రూపాన్నిచ్చాయి. ఇవన్నీ 'మహాప్రస్థానం' పేరుతో 1950లో ముద్రింపబడ్డాయి. శిష్ట్లా ఉమామహేశ్వరరావు, శ్రీరంగం నారాయణబాబు, పఠాభి, 'నయాగరా కవులు' (బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, కుందుర్తి ఆంజనేయులు), ఆరుద్ర గంగినేని, అనిసెట్టి, సోమసుందర్, కాళోజీ, బైరాగి, దాశరథి, సి.నారాయణరెడ్డి, గజ్జెల మల్లారెడ్డి మొదలైనవారు అభ్యుదయ భావాలను వెదచల్లిన కవులు. (పద్య కవిత్వం వ్రాసిన త్రిపురనేని రామస్వామి చౌదరి, గుర్రం జాషువా, జంధ్యాల పాపయ్య శాస్త్రి, గుంటూరు శేషేంద్రశర్మ లాంటి కవులు కూడా అభ్యుదయకవులే).

కవిత్వం కవికోసం కాదు; సమాజం కోసం. సమాజంలోఉన్న శ్రమ జీవుల్ని గురించీ, ఆకలి దారిద్ర్యం నిరుద్యోగం లాంటి సమస్యల్ని గురించీ, ప్రజల తిరుగుబాటును గురించీ కవిత్వం చెప్పాలి. సమసమాజ స్థాపన కోసం కవి తన భావజాలాన్ని ఉపయోగించాలి. దీనికోసం అభ్యుదయ కవులు పద్యాన్ని వదలి, ప్రజలకు అందుబాటులో ఉండే మాత్రగణ బద్ధమైన గేయాన్ని ఆశ్రయించారు. తరువాత తరువాత వచన కవిత్వాన్ని కూడా వ్రాశారు. దాశరథి లాంటి కవులు పద్యంతో మొదలు పెట్టి, గేయంలోకి వచ్చి, పిమ్మట వచన గేయంలోకి అడుగుపెట్టారు. 1944-49 మధ్యకాలంలో తెలంగాణాలో జరిగిన సాయుధ విప్లవాన్ని సమర్థిస్తూ రకరకాల పాటలు, కవితలు, నవలలు వచ్చాయి. (కుందుర్తి 'తెలంగాణా'; వరవరరావు, జయధీర్ తిరుమల రావు సంకలనం చేసిన 'తెలంగాణ పోరాట పాటలు', దాశరథి రంగాచార్యగారి నవలలు, వట్టికోట ఆళ్వారు స్వామిగారి నవలలు మొదలైనవి). అందువల్ల అభ్యుదయ కవిత్వంలో విప్లవ కవిత్వం ఒక భాగంగా ఉండేదని చెప్పవచ్చు. పద్యాలలో వ్రాసిన గుంటూరు శేషేంద్ర శర్మగారి 'ఋతుఘోష' అభ్యుదయ కావ్యమే!

1955 వరకూ అభ్యుదయ కవితోద్యమం ఉద్ధృతంగా సాగినా, తరువాత కవుల మీదా, ఈనాటి యువకవుల మీదా కూడా ఈ అభ్యుదయ కవిత్వ ప్రభావం ఉందనడంలో అతిశయోక్తి లేదు. "కవిత్వం కవికోసం కాదు; సమాజం కోసం" అనే అంశాన్ని ఈనాడు (కొందరు అనుభూతి కవులు తప్ప) అందరూ అంగీకరించారు. ఈనాటి ప్రసిద్ధ కవి గుంటూరు శేషేంద్రశర్మగారిలో అభ్యుదయాంశ ఉంది అనడానికి వారి 'మండే సూర్యుడు' అనే కావ్యం సాక్షి.

శ్రీశ్రీ 'మహాప్రస్థానం' శ్రీరంగం నారాయణ బాబు 'రుధిర జ్యోతి', ఆరుద్ర 'త్వమేవాహం', అనిసెట్టి 'అగ్నివీణ' దాశరథి 'అగ్నిధార', సోమసుందర్ 'వజ్రాయుధం' కాళోజీ 'నా గొడవ', గంగినేని 'ఉదయిని' మొదలైనవి తెలుగులో ప్రసిద్ధ అభ్యుదయ కావ్యాలు.

('తెలుగు సాహిత్యకోశము' ఆధారంగా...)

## ఎ) పూర్ణమ్మ

– గురజాడ అప్పారావు

మేలిమి బంగరు మెలతల్లారా!
కలవలకన్నుల కన్నెల్లారా!
తల్లులుగన్నా పిల్లల్లారా!
విన్నారమ్మా యీ కథను

ఆటపాటల పేటికలారా!
కమ్మనిమాటల కొమ్మల్లారా!
అమ్మలగన్నా అమ్మల్లారా!
విన్నారమ్మా మీరీ కథను

కొండలనడుమను కోనొకటున్నది;
కోనకి నడుమా కొలనొకటుంది;
కొలనిగట్టునా కోవెలలోపల
వెలసెను బంగరు దుర్గమ్మ

పూజారింటను పుట్టిన చిన్నది
పుత్తడిబొమ్మా పూర్ణమ్మా;
అన్నల తమ్ముల కనుగై దుర్గకు
పూజకు పువ్వులు కోసేది

ఏయేవేళల పూసే పువ్వుల
ఆ యా వేళల అందించి
బంగరు దుర్గను భక్తితొ కొలిచెను
పుత్తడిబొమ్మా పూర్ణమ్మ

ఏయే ఋతువుల పండే పళ్ళను
ఆ యా ఋతువుల అందించి
బంగరు దుర్గను భక్తితొ కొలిచెను
పుత్తడిబొమ్మా పూర్ణమ్మ

పళ్ళను మీరిన తీపులనడలును
పువ్వులమీరిన పోడుములున్
అంగములందున అమరెను పూర్ణకు
సౌరులుమించెను నానాటన్

కాసుకులోనై తల్లీతండ్రీ
నెనరూ న్యాయం విడనాడి
పుత్తడిబొమ్మను పూర్ణమ్మను వొక
ముదుసరి మొగడుకు ముడివేస్త్రీ

ఆమనిరాగ దుర్గకొలనులో
కలకలనవ్వెను తామరలు
ఆమనిరాగా దుర్గవనములో
కిలకిలపలికెను కీరములు

ముద్దునగవులూ మురిపెములూ మరి
పెనిమిటి గాంచిన నిమిషమున
బాసెను కన్నియ ముఖకమలమ్మును
కన్నుల గ్రమ్మెను కన్నీరు.

ఆటలపాటల తోటి కన్నియలు
మొగుడు తాత యని కేలించ,
ఆటలపాటల కలియక పూర్ణమ
దుర్గను చేరీ దుఃఖించె

కొన్నాళ్ళకు పతి కొని పోవచ్చెను
పుత్తడిబొమ్మను పూర్ణమను;
చీరెలు సొమ్ములు చాలగదెచ్చెను
పుత్తడిబొమ్మకు పూర్ణమకు

పసుపురాసిరి బంగరు మేనికి
జలకమూలాడెను పూర్ణమ్మ;
వదినెలు పూర్ణకు పరిపరివిధముల
నేర్పులు మెరసీ కై చేస్త్రీ.

పెద్దలకప్పుడు మొక్కెను పూర్ణమ
తల్లీ తండ్రీ దీవించ్రీ;
దీవన వింటూ పక్కున నవ్వెను
పుత్తడిబొమ్మా పూర్ణమ్మా

చిన్నలనందర కౌగిటచేర్చుకు
కంటనుబెట్టెను కన్నీరూ;
అన్నల తమ్ముల నప్పుడు పలికెను
పుత్తిడిబొమ్మా పూర్ణమ్మ

"అన్నల్లారా తమ్ముల్లారా!
అమ్మను అయ్యను కానండీ!
బంగరు దుర్గను భక్తితొ కొలవం
డమ్మలకమ్మా దుర్గమ్మ

ఆ యా వేళల పూసే పువ్వుల
ఆయా ఋతువుల పళ్ళన్నీ,
భక్తిని గోసి శక్తికి యివ్వం
డమ్మలకమ్మా దుర్గమ్మ

నలుగురు కూచుని నవ్వే వేళల
నా పేరొకతరి తలవండి;
మీమీ కన్నబిడ్డల నొకతెకు
ప్రేమను నా పేరివ్వండి"

బల బల కన్నుల కన్నీ రొలికెను
పుత్తడిబొమ్మకు పూర్ణమకు
కన్నులు తుడుచుకు కలకల నవ్వెను
పుత్తడిబొమ్మా పూర్ణమ్మ

వగచిరి వదినెలు, వగచిరి తమ్ములు
తల్లియు కంటను తడిబెట్టన్

కాసుకులోనై అల్లుని తలుచుకుం
ఆనందించెను అయ్యొకడె

యెప్పటియట్టుల సాయంత్రమ్మున
యేరిన పువ్వులు సరిగూర్చి
సంతోషమ్మున దుర్గను కొలవను
వొంటిగ పోయెను పూర్ణమ్మ

ఆవులు పెయ్యలు మందల జేరెను
పిట్టలు చెట్లను గుమిగూడెన్
మింటను చుక్కలు మెరయుచు పొడమెను
యింటికి పూర్ణమ రాదాయె

చీకటినిండెను కొండలకోనల
మేతకు మెకములు మెసల జనెన్
దుర్గకు మెడలో హారము లమరెను
పూర్ణమ యింటికి రాదాయె.

కన్నుల కాంతులు కలవలచేరెను
మేలిమి జేరెను మేనిపసల్!
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను జేరెను పూర్ణమ్మ.

(1953 ఫిబ్రవరిలో ప్రచురించపబడిన 'ముత్యాలసరాలు' అనే కవితాసంపుటి నుండి)

## బి) కవితా! ఓ కవితా!

**- శ్రీశ్రీ**

కవితా! ఓ కవితా!
నా యువకాశల నవపేశల సుమగీతావరణంలో,
నిను నే నొక సుముహూర్తంలో,
అతిసుందర సుస్యందనమందున
దూరంగా వినువీథుల్లో విహరించే
అందని అందానివిగా
భావించిన రోజులలో,
నీకై బ్రదుకే ఒక తపమై
వెదుకాడే నిమిషాలందు నిషాలందున,
ఎటు నే చూచిన చటులాలంకారపు
మటుమాయల నటనలలో
నీ రూపం కనరానందున,
నా గుహలో, కుటిలో, చీకటిలో
ఒక్కడనై స్రుక్కిన రోజులు లేవా?

నీ ప్రాబల్యంలో,
చిరదీక్షా శిక్ష తపస్సమీక్షణలో
నిశ్చల సమాధిలో,
సర్గద్వారపు తోరణమై వ్రేలిన నా
మస్తిష్కంలో
ఏయే ఘోషలు, భాషలు, దృశ్యాల్ తోచాయో?
నే నేయే చిత్రవిచిత్ర శ్యమంత
రోచిర్నివహం చూశానో!
నా గీతం ఏయే శక్తులలో
ప్రాణస్పందన పొందిందో?

నీకై నే నేరిన వేయే ధ్వనులో,
ఏయే మూలల వెదకిన ప్రోవుల

ప్రోవుల రణన్నినాదాలో!
నడిరే యాకస మావర్తించిన,
మేఘా లావర్షించిన,
ప్రచండ ఝంఝూ ప్రభంజనం
గజగజ లాడించిన
నడిసంద్రపు కెరటాల్లో మ్రోగిన
శంఖారావం, ఢంకాధ్వానం!

ఆ రాత్రే,
కారడవులలో లయాతీతమై
విరుతించిన నానాజంతుధ్వనులో?
నక్షత్రాంతర్నిబిడ నిఖిలాగానం,
భూకంపాలు, ప్రభుత్వ పతనాలు,
విప్లవం, యుద్ధం,
నీ విశ్వరూప సాక్షాత్కారం!
అన్నీ నీ చైతన్యం!

మరి నిన్ను స్మరిస్తే
నా కగుపించే దృశ్యాలా?
వినిపించే భాష్యాలా?
అగ్ని సరస్సున వికసించిన వజ్రం!
ఎగిరే లోహశ్యేనం!
ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగ నాదం!

ఇంకా నే నేం విన్నానా?
నడిరే నిద్దురలో
అపుడే ప్రసవించిన శిశువు నెడద నిడుకొని
రుచిర స్వప్నాలను కాంచే
జవరాలి మనఃప్రపంచపు టావర్తాలు!
శిశువు చిత్ర నిద్రలో
ప్రాచీన స్మృతు లూచే చప్పుడు!

వైద్యశాలలో,
శస్త్రకారుని మహేంద్రజాలంలో,
చావుబ్రదుకుల సంధ్యాకాలంలో
కన్నులుమూసిన రోగార్తుని
రక్తనాళ సంస్పందన!
కాలువనీళులలో జారిపడి
కదలగనైనా చాలని
త్రాగుబోతు వ్యక్తావ్యక్తాలాపన!
ప్రేలాపన!

కడుపు దహించుకుపోయే
పదుపుకత్తె రాక్షసరతిలో
అర్ధనిమీలిత నేత్రాల
భయంకర బాధల పాటల పల్లవి!
ఉరితీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం!
ఉన్మాది మనస్సినీవాలిలో
ఘూంకంకేకా, భేకంబాకా!
సమ్మెకట్టిన కూలీల,
సమ్మెకట్టిన కూలీల భార్యల, బిడ్డల
ఆకటి చీకటిచిచ్చుల
హాహాకారం! ఆర్తారావం!
ఒక లక్ష నక్షత్రాల మాటలు,
ఒక కోటి జలపాతాల పాటలు,
శతకోటి సముద్రతరంగాల మ్రోతలు!
విన్నానమ్మా! విన్నా, నెన్నో విన్నాను.
నా విన్నవి కన్నవి విన్నవించగా
మాటలకై వెదుకాడగబోతే–
అవి,
పుంఖానుపుంఖంగా
శ్మశానాలవంటి నిఘంటువుల దాటి,

వ్యాకరణాల సంకెళ్ళు విడిచి,
ఛందస్సుల సర్పపరిష్వంగం వదలి
వడిగా, వడివడిగా
వెలువడినై, పరుగిడినై, నా యెద నడుగిడినై!
ఆ చెల రేగిన కలగాపులగపు
విలయావర్తపు
బలవత్ ఝరవత్ పరివర్తనలో,
నే నేయే వీథులలో
చంక్రమణం చేశానో,
నా సృష్టించిన గానంలో
ప్రక్షాళితమామక పాపపరంపర
లానంద వశంవద హృదయుని జేస్తే
నీకై మేలుకొనిన
సకలేంద్రియములతో
ఏది రచిస్తున్నానో, చూస్తున్నానో,
ఊపిరి తీస్తున్నానో,
నిర్వికల్ప సమాధిలో
నా ప్రాణం నిర్వాణం పొందిందో,
అటు నను మంత్రించిన,
సమ్ముగ్ధంగావించిన ఆగాంధర్వానికి,
తారానివహవు ప్రేమసమాగమంలో
జన్మించిన సంగీతానికి...
నా నాడుల తీగలపై సాగిన
నాద బ్రహ్మపు పరిచుంబనలో,
ప్రాణావసానవేళాజనితం,
నానాగానానూనస్వానావళితం,
బ్రదుకును ప్రచండభేరుండ గరు
త్పరిరంభంలో పట్టిన గానం,
సుఖదుఃఖాదిక ద్వంద్వాతీతం,

అమోఘ, మగాధ, మచింత్య, మమేయం,
ఏకాంతం, ఏకైకం,
క్షణికమై శాశ్వతమైన దివ్యానుభవం,
బ్రహ్మానుభవం కలిగించిన,
నను కరిగించిన కవనఘృణీ!
రమణీ!
కవితా! ఓ కవితా!
నా జనని గర్భంలో,
ఆకారం లేకుండా నిద్రిస్తూన్న
నా అహంకారానికి
ఆకలి గొల్పించిన నాడో!
నా బహిరంతరింద్రియాలలో
ప్రాణం ప్రసరించగ, నే నీ భూలోకంలో పడి
సుఖదుఃఖా లేవేవో
వస్తూంటే తలదాలిచి
ప్రపంచ పరిణాహంలో
ప్రయాణికుడనై,
పరివ్రాజడకునై,
విహ్వాలంగా వర్తించేవేళ
అభయహస్తముద్రతో నను దరిసిన
నన్ను పునీతుని కావించిన కవితా!
లలిత లలిత కరుణామహితా!
అనుపమితా!
అపరిమితా!
కవితా! ఓ కవితా!
నేడో, నా ఊహాంచల
సాహసికాంసం కప్పిన నా
నిట్టూర్పులు వినిపిస్తాయా?
నే నేదో విరచిస్తానని,

నా రచనలలో లోకం ప్రతిఫలించి,
నా తపస్సు ఫలించి,
నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ
నా జాతి జనులు పాడుకొనే
మంత్రంగా మ్రోగించాలని,
నా ఆకాశాలను
లోకానికి చేరువగా,
నా ఆదర్శాలను
సోరులంతా పంచుకునే
వెలుగుల రవ్వల జడిగా,
అందీ అందకపోయే
నీ చేలాంచలముల విసరుల
కొసనగాలులతో నిర్మించిన
నా నుడి నీ గుడిగా,
నా గీతం నైవేద్యంగా, హృద్యంగా,
అర్పిస్తానో
నా విసరిన రస విన్నమర
కుసుమ పరాగం!
ఓహో! ఓ రసధుని! మణిఖని! జననీ! ఓ కవితా!
కవితా! కవితా! ఓ కవితా!

(1950 జూన్‌లో ప్రచురింపబడిన 'మహాప్రస్థానం' నుండి)

## సి) జంట సింగిణులు

**– కాళోజి**

దానిమ్మ గింజలో దాగిన యెరుపు
లేత అరిటాకు పైపూతల నునుపు.
క్రొత్త మఖమలులోని మెత్తందనాలు
కన్నతల్లీ పాల కమ్మందనాలు.
గోదుగ్ధధారల గోర్వెచ్చదనము
ద్రాక్షఫలములలోన ద్రవియించుతీపి.
పువ్వు పొదుగుల్లోన పొంగేటితేనె
ముసిముసినవ్వుల కుసుమముల సొంపు.
అందచందాలొల్కు ఆనందఝురులు
చంటిపాపని పెదవి జంటసింగిణులలో
అన్ని చేరి ఆటలాడుతున్నాయి.

## డి) నీటి గడియారం

**– ఆరుద్ర**

నువ్వు ఎక్కదలచుకొన్న రైలు
ఎప్పుడూ ఒక జీవిత కాలం లేటు
ఏళ్లూపూళ్లూ నిరీక్షించ లేక
ఎక్కేస్తావేదో ఒక బండీ
నీ ఆదర్శాల లగేజీ
ఎక్సెసంటాడు టి.ఐ.సీ.
నీ ఈప్సితాల ట్రంకు పెట్లు
కలల బ్రేకులో పారెయ్యాలి
నువ్వు తెచ్చుకొన్న వన్నీ
ఎక్కించే లోపున
కదిలి పోతుంది బండీ
అందుకే అందులో కొన్ని
నీ అభిమాన హీరోల దగ్గరే
ఒదిలెయ్యి
నువ్వు వెళ్ళ దలచుకొన్న ఊరు
నువ్వు బతికుండగా చేరదా రైలు
దేవుడా! ఇంత చేశావా అని
ఉన్న ఊళ్ళోనే ఉండు!

**('త్వమేవాహం' అనే కావ్యం నుండి)**

# 4. అనుభూతి కవిత్వం
## (1968-1991)

స్వాతంత్ర్యానంతరం అన్ని రంగాలలోనూ వ్యాపార సంస్కృతి ప్రబలి పోయింది. నైతిక విలువలు నాశనమయ్యాయి. నిరాశ, నిరుత్సాహం, నిర్వేదం వ్యాపించాయి. ఆ సమయంలో చుట్టూ ఉన్న స్తబ్దతను దిగంబర కవులు చీల్చివేశారు. మన కుష్ఠు వ్యవస్థను బట్టబయలు చేశారు. ఈ వ్యవస్థను సాయుధ పోరాటంతో మార్చాలనే ధ్యేయంతో విప్లవ కవిత్వం పుట్టింది. దీనికి నక్సల్ బరీ ఉద్యమం, శ్రీకాకుళ గిరిజన సాయుధ పోరాటం వెన్నెముక. ఆ సమయంలో కొందరు మధ్యతరగతి కవులు ఈ విప్లవ మార్గాన్ని సమర్థించలేక, సాహిత్యంలో విప్లవ రాజకీయాలు ప్రవేశించడం ఇష్టం లేక, ఆత్మానుభూతుల్ని ఏర్పరచుకున్నారు. కవిత్వం స్వచ్ఛంగా ఉండాలన్నారు. ఈ ధోరణి మనస్తత్వంతో అనుభూతి వాద కవిత్వం ప్రారంభమయింది. ఒక రకంగా చూస్తే ఇది స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న భావకవిత్వమే అని చెప్పవచ్చు.

ఆధునికాంధ్ర కవిత్వంలో అనుభూతివాదం తలెత్తడానికి గల స్థితిగతుల్ని సమీక్షిస్తూ డా. నందిని సిద్ధారెడ్డిగారు తొమ్మిది కారణాలు చెప్పారు. అవి – మధ్యతరగతి మనస్తత్వం, వ్యక్తివాదం, శుద్ధకళావాదం, ఆనందలక్ష్యం, ఉనికి లేదా మేధావి వాసనలు, అత్యాధునికుల మనిపించుకోవటం, పరిస్థితుల సానుకూల్యం, పత్రికల ప్రోత్సాహం, శిల్పదృష్టి.

'అనుభూతి' అంటే అనుభవం, 'ప్రత్యక్షాది ప్రమాణ జన్యజ్ఞానం' అంటే 'ఇంద్రియముల ద్వారమున అంతఃకరణము పదార్థములపై వ్యాపించి ఆ పదార్థముల స్వరూపమును గ్రహించుట'. అనుభూతిని ఇంగ్లీషులో Experience అనీ "Feeling" అనీ అంటారు. Experience అంటే "Description of the subject-matter of psychology' అన్నమాట.

ఈ అనుభూతులు ప్రపంచ దర్శనం వల్ల కలుగుతాయి. ఇవి రెండు రకాలుగా వెలువడుతాయి. 1. లోకానుభూతులు (Extraverted), 2. ఆత్మానుభూతులు (Intraverted). వ్యక్తి చైతన్యం, సమాజ వృత్తం చుట్టూ నిండి ఉన్న అనుభవాల్ని

సమగ్రంగా దర్శించినప్పుడు సామాజికానుభూతులు బయటపడతాయి. అలా కాకుండా, ప్రకృతి, వ్యక్తి ద్వారా అంత స్సీమల్లోకి ఇంకిపోయినపుడు స్వాప్ని కానుభూతులుగా వెలువడుతాయి. ఇలా రెండు రకాలుగా వెలువడే అనుభూతులు కవిత్వంగా రూపు చెందుతాయి. మొదటి రకం కవిత్వం సామాజికమైన అభ్యుదయ కవిత్వం అవుతుంది రెండవ రకం కవిత్వం వైయక్తికమైన అనుభూతి కవిత్వం అవుతుంది.

కవి పొందిన అనుభూతులు క్రమబద్ధం కాకపోతే అస్పష్టత, అయోమయం సంభవిస్తాయి. 'అనుభూతి కళను అభ్యసించడమంటే సచేతనంగా, సబుద్ధికంగా, సంకల్ప సహితంగా జీవితాన్ని ఆచమనం చెయ్యటం' అని శేషేంద్రశర్మగారు భావించారు. 'బాహ్య ప్రపంచ దృశ్యాలు అంతరంగ ప్రపంచంలో దృశ్యత్వాన్ని కోల్పోయి, కేవలం అనుభూతిగా మిగుల్తాయి' అని ఇంద్రగంటి శ్రీకాంతశర్మ వివరించారు. వీరి దృష్టిలో అనుభూతుల్ని పువ్వుల్లా అల్లిన దండే కవిత్వం.

ఈ అనుభూతి వాదానికి మన ప్రాచీనులు చెప్పిన రసవాదంతోనూ, పాశ్చాత్యులు చెప్పిన, 'కళకళకోసమే' ('Art for Art Sake') అనే వాదంతోనూ అవినాభావ సంబంధం కనబడుతుంది. ఈనాడు అనుభూతివాదంగా ప్రచారమయ్యేదంతా జీర్ణించుకుపోయిన రసవాదమే అని అంటారు. సిద్ధారెడ్డిగారు. భరతుడు, కావ్యశరీరం ఇతివృత్తమయినా, కావ్యానికి సౌందర్య హేతువు రసం మాత్రమే అని స్పష్టంచేశాడు. ఆనందవర్ధనుడు కావ్య పరమ లక్ష్యం రసానుభూతి అనీ, వస్తు అలంకార రసధ్వనులలో రసధ్వనియే ఉత్తమమైనదనీ, ఈ రసధ్వనియే కావ్యానికి ఆత్మ అనీ నిర్ణయించాడు. కవిత్వానికి మధురమైన శబ్దాలు కావాలన్నాడు కాళిదాసు. ఫ్రెంచి సాహిత్యంలో 1890లో బయలుదేరిన 'కళ కళకోసమే' అనే వాదం యొక్క సారాంశాన్ని కూడా అనుభూతివాదులు పుణికి పుచ్చుకున్నారు... కళ, సౌందర్యానికి మాత్రమే చెంది వుంటుందనీ, సౌందర్యాన్ని ప్రతిష్ఠించడమే కవుల ధ్యేయమనీ ఈ కళావాదం యొక్క సారాంశం. అనుభూతివాదులు ఘోషించే సౌందర్యం కూడా ఇటువంటిదే. కళరూపాల్లో రాజకీయాలుండకూడదనీ, ఉంటే అది కళ కాదనీ, కళ అనేది సౌందర్య సూత్రం మీదనే నిర్మింపబడాలనీ అనుభూతి వాదులు వాదిస్తారు.

1910–1940 మధ్యకాలంలో తెలుగు సాహిత్యం మీద అత్యంత ప్రభావాన్ని చూపిన భావకవిత్వమే 1968–69 ప్రాంతాల్లో అనుభూతి కవిత్వంగా రూపాంతరాన్ని పొందిందనీ, ఈ అనుభూతివాదం భావకవిత్వమనే పాతక్రీమ్‌కి క్రొత్తలేబుల్ మాత్రమేననీ విప్లవ కవిత్వాభిమానుల విమర్శ. భావకవిత్వానికి ప్రధాన గుణాలైన అంతర్ముఖత్వం, ఆత్మాశ్రయతత్త్వం, అనుభూతి కవిత్వంలోనూ స్ఫుటంగా కనబడతాయి.

శబ్దాల కుండే రంగుల్ని, వాసనల్ని భావకవిలాగే అనుభూతికవీ విశ్వసించాడు. ఇద్దరూ స్త్రీ పురుషుల ఆత్మ సౌందర్యాన్ని వర్ణించిన వారే. ప్రకృతి వర్ణనల్లో సుకుమార సౌందర్య తత్త్వాన్ని అనుభూతి కవి నిర్దేశించాడు. మనోనేత్రానికి భాసించిన ప్రకృతి అనుభూతులే ఈ కవిత్వంలో చోటుచేసుకున్నాయి. ఈ అనుభూతి కవిత్వంలో సామాజికం, మానవతావాదం, శృంగారం మొదలైన శాఖల్ని గుర్తించవచ్చు. స్వాతంత్ర్యానికి పూర్వమున్న భావ కవిత్వం జాతీయోద్యమం చేత ప్రభావితమై దేశభక్తిని గానం చేసింది. స్వాతంత్ర్యానంతరం వచ్చిన అనుభూతి కవిత్వం ఎదురుగా ఉన్న విప్లవోద్యమాన్ని గుర్తించకుండా మానవతా వాదాన్ని సమర్థించింది. భావ కవిత్వానికీ అభ్యుదయ కవిత్వానికీ సమన్వయంగా అనుభూతి కవిత్వం వచ్చింది. ఇలా సమన్వయం చేసిన మొట్టమొదటి కవి దేవరకొండ బాలగంగాధర తిలక్. కాబట్టి ఆయన్నే మొదటి అనుభూతి కవిగా పేర్కొంటున్నారు విమర్శకులు. తిలక్ 'అమృతం కురిసినరాత్రి' లో ఇలాంటి కవితలు రెండు మూడు ఉన్నమాట వాస్తవమే.

1969లో ప్రకటింపబడిన వేగుంట మోహన్‌ప్రసాద్ 'చితి–చింత' మొట్టమొదటి అనుభూతి కావ్యం. దీనిలోని కవితలన్నీ అనుభూతి ప్రధానంగా వ్రాయబడినవే. వివిధ పత్రికలలో ప్రకటింపబడిన అజంతా కవితలు (ఇటీవల వీరికవితలన్నీ 'స్వప్నలిపి' అనే పేరుతో ప్రచురింపబడ్డాయి). ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారి 'అనుభూతి గీతాలు', ఇస్మాయిల్ గారి 'చెట్టు నా ఆదర్శం', 'మృత్యు వృక్షం', 'చిలకలు వాలిన చెట్టు', 'రాత్రి వచ్చిన రహస్యపువాన' మొదలైన కవితా సంపుటులు, శేషేంద్రశర్మగారి 'నీరైపారి పోయింది' కావ్యం, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణగారి 'వెలుతురు పిట్టలు' కవితా సంపుటి, వాడ్రేవు చినవీరభద్రుడు గారి 'నిర్వికల్ప సంగీతం' కవితా సంపుటి, వై. శ్రీరాములు గారి 'రంగుల పక్షి' కవితా సంపుటి తెలుగులో ప్రసిద్ధ అనుభూతి కావ్యాలు. అనుభూతి కవిత్వాన్ని ఒక వాదంగా ప్రతిపాదించినవారు ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారు. అనుభూతివాదం పరిపూర్ణమైన వాదం కాదనీ, ఒక బలహీనమైన ధోరణి మాత్రమే నని విప్లవ విమర్శకుల ఈసడింపు. పైగా అనుభూతివాదులుగా పిలిపించుకోవడం కొందరు కవులకు కూడా ఇష్టం లేదు. (ఉదాహరణానికి శేషేంద్రశర్మగారు).

సమాజం లేకపోతే అనుభూతి లేదు. అనుభూతి లేకుండా కవిత్వం ఉండదు. అన్ని రకాల కవిత్వంలోనూ అనుభూతి ఉండి తీరుతుంది.

(–డా. నందిని సిద్ధారెడ్డిగారి 'అనుభూతివాదం' అనే వ్యాసం ఆధారంగా...)

# ఎ) చెట్లు కూలుతున్న దృశ్యం

**- అజంతా**

ఆశలేదు, ఆస్కారం లేదు
ఫలానా రోడ్డు గమ్యం చేరుస్తుందనే సూచన ఎక్కడా లేదు
జీవితం ఎప్పుడూ ఇలా విషాద వాక్యాల మధ్యనే సాగుతుందనుకుంటాను
రోడ్డు పొడుగునా చెట్లు కూలుతున్న దృశ్యాలనే చూపుతుందనుకుంటాను
లేకుంటే ఎంతో అందమైన సాయంత్రం కదా ఇలా అపస్వరాలు వినబడటం
జరగదు
రోడ్లమీద ధూళీ, దారిద్ర్యం సమస్తం మిత్రుడు వెంకట్రావు ముఖం
మీదనే పరవళ్లు త్రొక్కడం సంభవం కాదు
ఐతే ఇప్పుడు నిరాణగా చెప్పుకోవచ్చు
మిత్రుడు వెంకట్రావు నిరుద్యోగి అని రూఢిగా చెప్పుకోవచ్చును
తలక్రిందులైన స్వప్నం మీద శల్యాకారంగా కూర్చున్న కుర్రవాడు
ఆపాద మస్తకం నూదులతో ముస్తాబై ఉన్నవాడు
అతని ముఖం నిండా స్ఫోటకం మచ్చలు
కళ్లలో శిలావిగ్రహాలు వీక్షణాలు
అతని చుట్టూ పరాజయ భారంతో క్రుంగుతున్న వృక్షాలు
ఇదే దృశ్యాన్ని ఇంకా ఉవ్వెత్తున్న భూతద్దాలతో చూడవచ్చు
విశాల వినీల గగనాల క్రింద విషాదాగ్ని ఆవిర్భావాన్ని కళ్లారా చూడవచ్చు
మిత్రుడు వెంకట్రావు ఎక్కడ ఏ భంగిమలో తనని తాను ఒలుచుకొని
తింటున్నాడో ఊహించుకోవచ్చు
నిరుద్యోగి వెంకట్రావు నగరం నడివీథిలో తన జీవితాన్ని ఆవిష్కరిస్తుంటే
ఎందుకో అకారణంగా సూర్యుడు ఖిన్నుడవుతాడు
చెట్లమీద ఆకుసైతం అల్లల్లాడదు
టెలీఫోన్ తీగలలో వార్తాప్రసారం సాగదు
నిరుద్యోగి వెంకట్రావు గాలిలో ధూళిలో ఎండుటాకులా సుడిగుండాలు
తిరుగుతుంటే
గృహస్థులు ఆ రోజున సన్యాసం స్వీకరిస్తారు.
పిల్లలు గల తల్లులు బావిలో దూకుతారు.

విద్యార్థులు నడివీథిలో పుస్తకాలు తగులబెడతారు
నిరుద్యోగి వెంకట్రావు నగరం గుండెలలో సాలిగూడులా అల్లుకుంటూ ఉంటే
ప్రభుత్వ భవనాలలో ఒక్క క్షణంపాటు ఎవరికి ఊపిరి ఆడదు
కలం కాగితం పట్టుకున్న అధికారి రాజీనామా పత్రం మీద సంతకం పెడతాడు
ప్రభుత్వ భవనాల మీద జెండా సిగ్గుతో తలవాల్చుకున్నా ఆశ్చర్యం లేదు
నిరుద్యోగి వెంకట్రావు తన ఆకలిని రాళ్లలో రప్పలలో నిక్షిప్తం చేస్తుంటే,
రాజకీయ వేత్తలు వాటిని వేలంపాటలో కొనుక్కుంటారు
విషాదం రంగు ఎలా వుంటుందో తెలుసుకొనేటందుకు కవులు చిత్రకారులు
అతని కన్నీళ్లపై పరిశోధనలు జరుపుతారు
అతని పాదధూళిలో చీకటి పుట్టుపూర్వోత్తరాలు వెతుకుతారు
నిరుద్యోగి వెంకట్రావు తన బాల్యస్మృతులు తలుచుకుంటూ ఉంటే
నగరంలో పసిపిల్లలు ఆపూట అన్నం ముట్టరు
పువ్వులు కోసుకుంటున్న పిల్లలు తిరిగి ఇంటికి చేరరు
నిరుద్యోగి వెంకట్రావు నగరం మీద ఒక మచ్చ
బాధ అనే దీపం పట్టుకొని
సర్వనాశనం అనే తాళం చెవి పట్టుకొని
వెంకట్రావు జీవితం అనే చీకటి నరకకూపంలో
భయంకరమైన ఆశ్చర్యాలు ఇంకా అనేకం చూడవచ్చు
జీవితం మీద నమ్మకం ఉన్నవాడు
వెంటనే అక్కడే ఉరిపోసుకొని చావడం ముమ్మాటికి సంభవం కావచ్చు
నిరుద్యోగి వెంకట్రావు ఈ నగరం మీద ముమ్మాటికీ ఒక మచ్చ
నిరుద్యోగి వెంకట్రావు చావడు
చావడం అనే పాపం చెయకుండా న్యాయాధిపతులు
ఎల్లవేళలా అతన్ని కాపాడుతూ ఉంటారు
నిరుద్యోగి వెంకట్రావు ఎన్నటికీ చావడు
అందుకే అందమైన సాయంత్రం వేళ నగరం అంతటాఅపస్వరాలు
వెంకట్రావు నడుస్తున్నంత మేరా చెట్లు కూలుతున్న దృశ్యం.

## బి) మృత్యు వృక్షం

**- ఇస్మాయిల్**

అకస్మాత్తుగా
ఒక రోజు
మృత్యువృక్షం
వ్యత్యస్తంగా
తలకిందుగా
మొలిచింది.

మూగిన బంధుమిత్రులు
మోసుకుపోయి అతణ్ణి
విత్తనంలా
పాతారు.
జనాల
మనో గగనంలో
చాపుకున్న
జ్ఞాపకాల కొమ్మల్నీ
గాఢానురాగాల
ఊడల్నీ
వెనక్కి పీల్చేసి
ఈ మృత్యుబీజం
ఏమీ తిరిగివ్వదు.
16.9.73-21.12.73

(1976 ఏప్రిల్‌లో ప్రచురింపబడిన 'మృత్యువృక్షం' అనే కవితా సంపుటినుండి)

## సి) చివరికి

**– వజీర్ రహ్మాన్**

చివరికేం
మిగలదు!
చావుని పల్కిన
భయానక సర్పం కూడా
నీటిమీద
గీతమల్లే
చెరిగిపోతుంది

దేహసారాన్ని పీల్చుకుని
సమాధిని చీల్చుకుని
ఏ పిచ్చి మొక్కో
మత్తుగా తలెత్తి
మాయమౌతుంది

ఏ పుర్రె యెమికో మిగుల్తుంది
ఎండలో దుమ్ములో దొర్లుతో,
నక్కలు కూడా
కాదని వొదిలే
చిన్న మురికి బొమికె

ఇంతే
చివరికేం మిగలదు!
దేహమోహాసీమని
మైక సంగీత మయం చేసిన
యౌవన మృదు పుష్పం
సైతం
మన్నులో మన్నై
మలినమై

ఎమికపై
నూగారు
గుర్తు కూడా!
చివికిన
చలిబారిన స్తనాల్ని,
వెక్కిరించే
ప్రేతరోత జ్ఞాపకాల్ని,
అసహ్యించి దుల్పుకుంటో

దేహాలయ శిధిలాలు వొదిలి
విషణ్ణుడై వెళ్లక తప్పదు
రసికుడు

తప్పదు
వొక జాముర్రాత్రి
చమురు తాగే
ఎర్రతోక పిట్ట
అకస్మాత్
ఎగిరిపోక తప్పదు
శూన్యంలోకి
ఇంతే–
చివరికేం మిగలదు

ప్రతి వుదయం
వొక వాగ్దానం
వెక్కిరింపు!
ప్రతి వుదయం
వొక సరికొత్త
సప్తకట్ల సవారి!
చివరికేం మిగలదా?
కాదు!

చివరికి మళ్లీ
అనేక యుగాల్లో రూపాల్లో
పుడుతో నశిస్తో
మిగులుతాం
ఎక్కడో
ఏ కొండ పంచనో
గడ్డిపూల గుంపులో నించుని
సృష్టి వైచిత్రికి
తలలూపుతో
మిగులుతాం

ఏ చీమల బారులోనో
హడావుడిగ నడిచి వెడుతో
నరజీవుల వికృత చేతలకి
నివ్వెరపోతో
మిగులుతాం

చివరికి
మళ్లీ
నిరంతరం!

## డి) గాయం నుంచి గాయానికి

**– వాడ్రేవు చిన వీరభద్రుడు**

బిస్మిల్లాఖాన్ బిస్మిల్లాఖాన్ లానే షెహనాయీ విన్పిస్తుంటాడు
వాకిట్లో భోగన్ విల్లై తీగె బోగన్ విల్లై పువ్వులే పూస్తుంటుంది.

నన్ను మాత్రమే నేను పోల్చుకోలేక పోతుంటాను
శయన సమయానికి నా దినచర్య నెమరు వేసుకున్నపుడు
నా రూప శకలాలు చెల్లా చెదురయి ఆందోళన పడతాను
ఆశించినట్లుగా నా పాత్రని పోషించిన క్షణాలు కూడా
నా పరాజయపు చిహ్నాల్ని కప్పిపుచ్చలేకపోతాయి
భావించుకున్న నా స్వీయోజ్జ్వలత్వమంతా
నా అసాఫల్యం ముందు వెలవెల బోతుంది
ఒప్పుకోలేని నా అపరిపూర్ణత
అర్ధరాత్రి ఎప్పుడో కలల్లో వికృతంగా గుచ్చుకొంటుంది.

**2**

కాళ్ళు కాళ్ల పరిధిలో చేతులు చేతుల పరిధిలో
సకలావయవాలూ తమస్థానాల్లో నిల్చి జీవితాన్ని నడుపుతాయి
ఎవరో ఒక ముగ్ధపరిమళ భరితమయిన రోజాపువ్వుని
ఈ యంత్రం దగ్గర పరాకుగా మర్చిపోతారు
అప్పుడు నా లోంచి విచిత్రమయిన పురుగు అపువ్వుని స్పృశిస్తుంది
నా మలిన స్పర్శ నాకు తెలియకనా? అయినా!
ఒంటినుంచి జిడ్డు కారుతోన్నా,
నా నేత్రాల్లో తేజస్సిదీ అని చూపడం మానను
మాసిపోయిన గుడ్డలమీద అలంకారాలు కప్పి
అతిథుల్ని చిరునవ్వుతో ఆహ్వానించడం మానను
పరచుకొన్న శూన్యాన్ని అరచేతుల్తో మూసేసి.
అబ్బే మరేంలేదు అని సర్ది చెప్పడం మానను,
కాని వేరుపురుగులాగా స్వయంకృతాపరాధం
మూలాన్ని శిథిలం చేస్తూ ఉంటుంది

పువ్వుల శాలువా కింద దేహం
రుగ్మతతో క్షీణిస్తూంటుంది.
ఇలా ప్రపంచం మీదకు విసిరిన ప్రశ్నార్థకాలు
ఎవరూ చూడకుండా తిరిగివచ్చి నన్నే నాటుకున్నపుడు
ఇక ఆరోపించే స్వేచ్ఛని కూడా కోల్పోతాను.

**3**

పాపం లాంటి చీకట్లోనో, దానికి ఆవల్నో
ఒక కాంతి బిందువుని వూహిస్తాను.
ఆ ప్రకాశలేశం ఎదుట నా జీవితమంటే ఇదీ అని
ఆశాభంగాల జాబితా ఆశగా ఉంచుతాను
నా గాయాలకు ఎవరు పూచీ పడతారు?
ఏ వ్యాధుల్నో వాటిల్లో వూహించి ఎవళ్ళకి వాళ్ళు తప్పుకు పోగా
మానని
గాయంనుంచి మరో గాయానికి అపరాధం అల్లుకొంటుంది.
ఎన్ని గాయాలు కలిస్తే ఒక జీవితం.

**4**

తీరాల మధ్య గోదావరి గోదావరి లానే ప్రవహిస్తుంది
ఒడ్డున పకీర్లు పకీర్లలానే ఉంటారు.
అలా నాకు నిత్యం తారసపడే కంఠాల్లో, దేహాల్లో ఏమార్పూ వుండదు
వాటి మధ్య నడవాల్సినపుడల్లా
సంగిరితనంతో సిగ్గుతో ఒంకర్లుపోయే గొంతుతో
బలంగా స్వచ్ఛంగా ఉక్కులాంటి ఒక్కమాటయినా పలకాలని ఉంటుంది
అపహాస్యాల మధ్య అవహేళనల మధ్య
అవనతమవుతున్న నా ఆత్మని
ధైర్యంగా నిలపాలని వుంటుంది.
ఎవడి నేత్రాల్లో అశ్రువుల్ని చూపినా
ఆత్మదానం చేసి మరీ పోరాడాలని ఉంటుంది
కాని నిరపరాధులకు మాత్రమే
ఆశోపహతులైనపుడు కన్నీరు పెట్టుకునే అర్హత ఉందని తెలిసి

దూరంగా మౌనంగా కించిదసూయతో నిలబడిపోతాను
మంచులాగ నా మీద నా జాలి
నా హృదయాన్ని మంట పెట్టిస్తుంటే
ఏడవలేక, ఎదురు తిరగలేక
వెర్రిగా ఒక నవ్వు నవ్వుతాను, నిస్సహాయంగా,
కాని, బిస్మిల్లాఖాన్ బిస్మిల్లాకాన్ లానే షెహనాయీ విన్పిస్తుంటాడు.

(1986 మార్చిలో ప్రచురింపబడిన 'నిర్వికల్ప సంగీతం' అనే కవితాసంపుటి నుండి)

# సాహిత్య విమర్శ

## 1. నన్నయ గారి 'సాహిత్య సూత్ర' వృత్తి

నన్నయగారు తెలుగులో కావ్యరచనకు ఉద్యమించే నాటికే భారతీయులందరికీ ఉమ్మడి సొమ్మయిన సంస్కృతంలో సాహిత్య విమర్శ పరిణత స్థాయికి చేరుకొంది. సుదీర్ఘంగానూ, సునిశితంగానూ సాగిన ఆ సాహిత్య విమర్శ మార్గాన అనేక కావ్యసిద్ధాంతాలు వచ్చినయి. వాటి నన్నింటినీ సమన్వయపరచి ఆనందవర్ధన, అభినవగుప్తులు సాహిత్య విమర్శ సంప్రదాయానికి ఒక సువ్యవస్థ కలిగించారు. కుంతక, క్షేమేంద్రులు సాగించిన వివేచన, పరమార్థత, ఆ విమర్శ సంప్రదాయాన్నే పరిపుష్టం చేసింది. కాగా, ఈ దేశంలోని ఏ భాషా కవికయినా అత్యంతావశ్యకమయిన ఈ సాహిత్య విమర్శ సంప్రదాయం యొక్క అంతస్తత్త్వావగాహన నన్నయగారికి వారసత్వంగా లభించింది. తన నాటికే కావ్యరచనా మార్గంలో ప్రవేశించిన ఇరుగు పొరుగు భాషలు – తమిళ కన్నడ భాషల్లో సాగిన కావ్య ధోరణుల స్వరూప – స్వభావాలను గూడా అధ్యయనం చేశారాయన. మరి, ఇదంతా తెలుగులో మొట్టమొదటి సారిగా ఒక మహాకావ్యాన్ని అవతరింపజేయటానికి ఉద్యమించిన నన్నయగారికి కావ్యసంబంధి విషయ వివేచనలో తన దృక్పథాన్ని నిరూపించటానికి సమకూరిన వెన్ను బలం.

నన్నయగారు 'లోకజ్ఞులు'. కవి లోక వృత్తి నుంచి కావ్యాన్ని నిష్పన్నం చేస్తాడు. ఆ కావ్యం లోకాన్ని ఆకర్షించి, ఆకట్టుకొంటుంది; లోకానికి ప్రయోజనకరంగా, శ్రేయస్సంపాదకంగా నిలువరించుకొంటుంది. ఈ మౌలికాంశాలను గూర్చి సరయిన, స్పష్టమయిన అవగాహన నన్నయగారికి ఉంది. కాగా, కావ్య సంప్రదాయాన్ని, వివిధ కావ్య స్వరూప – స్వభావాలను అధ్యయనం చేసి, సరయిన ధోరణిలో అర్థం చేసుకొని, తన నిశిత వివేచన ద్వారా నిష్పన్నమయిన మౌలికాంశాలను నన్నయగారు సూత్రీకరించారు. తాను అవతరింపజేస్తున్న మహాభారతానికి సమకూర్చిన అవతారికలో ఇమిడేట్టుగా సాహిత్య విమర్శకు సంబంధించి ఆయన ప్రతిపాదించిన అంశాలే

నన్నయగారి సాహిత్య సూత్రాలు. ఆ సూత్రాల వృత్తి – అంటే, అవి ప్రవర్తించిన తీరు వ్యాఖ్యానించుకోవలసి ఉంది.

నన్నయగారి సాహిత్య సూత్రాల్లో మొట్టమొదటిది – ప్రసన్న కథా కలి తార్థయుక్తి. దాన్ని అందుకొని వచ్చినవి 'అక్షర రమ్యత', నానారుచిరార్థసూక్తి నిధి అన్నవి. ఆ తరువాతివి కథా స్వరూపం, కవి స్వరూప – స్వభావాలు, కావ్య ప్రయోజనానికి సంబంధించినవి. సంక్షిప్తంగానూ, సంశ్లిష్టంగానూ ఉన్న ఈ సాహిత్య సూత్రాలనూ, వాటి ప్రవృత్తినీ విశదంగా వ్యాఖ్యానించుకొన్నప్పుడే, యుక్తి యుక్తంగా అవగాహన చేసుకొన్నప్పుడే నన్నయగారు వెలయించిన సాహిత్య విమర్శలోని మౌలికతా, ఆధునికతా సువ్యక్తమవుతాయి. అంతే కాదు, భారతీయ సాహిత్య విమర్శ సంప్రదాయానికి తెలుగువారి సంప్రదానం కూడా స్పష్టపడుతుంది.

**ప్రసన్న కథా కలితార్థయుక్తి**

'సారమతీంగవీంద్రులు.... లో నారసి మేలు నా దగిన 'ప్రసన్న కథా' కలితార్థయుక్తి నన్నయగారు ప్రతిపాదించిన కావ్య విమర్శాంశాలకు సంబంధించిన మొదటి సూత్రం. కథ ఆధార చక్రంగా ప్రవర్తించే కావ్యాలను ఉద్దేశించిన సూత్రమిది. ఈ సూత్రంపై ఇప్పటి దాకా సాగిన వివేచన తక్కువేమీ కాదు. అయితే, అనేకమంది విమర్శకులు ఈ సూత్రాన్ని స్థూలంగానే తప్ప, నిశితంగా పరిశీలించి సరయిన సమన్వయం సాధించినట్లు కన్పించదు. ఆ సూత్రంలోని కొన్ని పదాలు కలిగించిన కొన్ని స్ఫురణలతో సూత్ర తాత్పర్యాన్ని ఉజ్జాయింపుగా భావించిన తీరే ఎక్కువగా కన్పిస్తుంది. 'ప్రసన్న కథా కలితార్థయుక్తి' అంటే కథ సాక్షాత్కరించునట్లు చేయు శిల్పనైపుణి అని కట్టమంచి రామలింగా రెడ్డి గారు భావించారు. కథ సాక్షాత్కరించట మనటంలో నాటకీయత అనేది ఆయన ఆలోచనలో మెదిలిందనిపిస్తుంది. మరి.

కథా గమనమునకు క్లిష్టతగాని, వక్రతగాని, అతి సంకుచితత్వముగాని, అతి విస్తృతిగాని కలుగ కుండ ప్రసన్నముగ, నిర్వక్రముగ, ఆనతి విస్తారముగ (నన్నయ) కథ నడుపగలడు. ఈప్రజ్ఞనే... 'సారమతింగవీంద్రులు ప్రసన్న కథా కలితార్థయుక్తి/ లోనారసిమేలు నాన్' అని ప్రతిజ్ఞగా పేర్కొని, దానిని సార్థకము చేసినాడు. ఈ కథా ప్రసన్నతతో బాటు ఆయన రచనలో చూడవలసిన రెండవ యంశము అర్థయుక్తి. అని పింగళి లక్ష్మీకాంతంగారి వివరణ. రెడ్డిగారు 'కథ' సాక్షాత్కరించట మంటే, పింగళి వారు కథా గమనం ప్రసన్నం కావటమన్నారు. మరొకటి 'ప్రసన్న కథ' అన్న

సూత్రంలోని పదబంధం 'కథ ప్రసన్నత' గా మారింది. అదట్లా ఉంచి, ప్రసన్న కథ, అర్థయుక్తి అనేవి రెండు భిన్నాంశాలుగా ఆయన భావించటం గమనించవలసిన అంశం. అంతేకాదు, ప్రసన్న కథ, అర్థయుక్తి – ఈ రెండింటి నడుమ సూత్రంలో ఉన్న 'కలిత' పదాన్ని పట్టించుకోక పోవటం గమనించ వలసిన మరొక ప్రధానాంశం. నన్నయగారు కథను క్లిష్టత మొదలయినవి లేకుండా నడుపగలడన్న నిర్ణయం ప్రసన్న కథకు వ్యాఖ్యానంగా భావించవలసి ఉంది. ఇదిట్లా ఉండగా, నన్నయ ఉత్తమ జాతి కథకుడు, కథను చక్కగా నిర్వహించగలవాడు... వంటి అభిప్రాయాలు సామాన్య ధోరణికి చెందినవే తప్ప నన్నయగారి ఆ సూత్రాన్ని ఒక పద్ధతిలో అనుశీలించి భావించినవి కావు. నిజానికి, సూత్రంలోని ఏ ఒక్క పదాన్ని కూడా వదులటానికి వీల్లేదు. అన్ని పదాలను సార్థకంగా సమన్వయించి ఏకవాక్యత సాధించవలసి ఉంటుంది. మరి, నన్నయగారిని విశిష్టంగా అనుశీలించిన విశ్వనాథ సత్యనారాయణ గారు సూత్రంలోని పదాలన్నింటినీ సమాకలనం చేసి

'ప్రసన్నమయిన కథతో గూడుకొని యున్న యర్థముల యోజన' అని ఆ సూత్రానికి అర్థం చెప్పారు. ఈ అర్థాన్నే వివరిస్తూ,

అచటనున్న యర్థములను చక్కగా పరిశీలించినచో కథ పాఠకునకు ప్రసన్న మగును. అచటనున్న యర్థములను సరిగా యోజించవలయును.

అన్నారు. స్థూలంగా చూస్తే చెప్పిన అర్థానికీ చేసిన వివరణకూ కొంత తేడా ఉన్నట్లు కన్పిస్తుంది. 'ప్రసన్నమయిన కథ' ఉన్నది. దానితోగూడి కొన్ని అర్థాలున్నవి. ఆ అర్థాలను యోజించుట – అంటే కూర్చుకొనటం, సమన్వయించుకొనటం అని గదా, సూత్రార్థం! ఈ విధంగా అర్థం చెప్పటాన్ని బట్టి చూస్తే 'అచట సున్న యర్థములను' సరిగా యోజించటం వల్ల కథ ప్రసన్నమయితుందన్న తాత్పర్యం రావటం కష్టం. అర్థ పరిశీలనం కథ ప్రసన్న కావటానికి హేతువుగా వివరణలో చెప్పబడింది. కాని, మొదటనే కథ ప్రసన్నమయి ఉంటుందన్నట్లు సూత్రానికి అర్థం చెప్పబడింది. అదట్లా ఉంచి, 'ప్రసన్నకథను కథా ప్రసన్నత'గా సత్యనారాయణగారు కూడా భావించారు. ఆయన 'కథా ప్రసన్నత'ను వ్యాఖ్యానిస్తూ...

కథా ప్రసన్నతయననేమో తెలిసికొనుటకు మున్ను ప్రసన్న శబ్దార్థము తెలిసికొనవలయును. 'దేవీ ప్రసన్నత' – ఇట్టి శబ్దములలో భగవంతుడు ప్రసన్నుడయినాడు మొదలగు చోట్ల 'భగవంతుడు ప్రసన్నడగుట' యనగా నెట్టిది? ఉపాసనా స్వరూపము

తెలిసి నిశ్చలబుద్ధితో పరమేశ్వరుని ధ్యానము చేసినచో భగవంతుడు ప్రసన్నుడగును. కావ్యమందు ప్రసాదమను నొక గుణమున్నది. ప్రసాద గుణమనగా నర్థవ్యక్తి యని యొక మతము. ఈ యర్థ వ్యక్తియెట్లు కలుగును? శబ్దార్థముల సుపరిజ్ఞానము, సంప్రదాయాభిజ్ఞతయు నున్నచో నది కలుగును. భిన్న శబ్దారముల, వాక్యార్థముల స్పష్ట పరిజ్ఞానము చేత నర్థ ప్రసన్నత కలిగినట్లు కథా గత భిన్నాంశముల పరిజ్ఞానము చేత కథా ప్రసన్నత కలుగును. అన్నారు. నిజానికి, 'కథా ప్రసన్నత' అన్న పదబంధం నన్నయగారి సూత్రంలో లేదు. 'ప్రసన్న' పదాన్ని 'కథా' పదంతో అన్వయించటంతో 'ప్రసన్న కథ' అన్న పదబంధం రూపొందింది. కాగా, ప్రసన్నమయ్యేది కథ కాబట్టి, కథ ప్రసన్నం కావటం అన్న తాత్పర్యంతో 'కథా ప్రసన్నత' అనే పదబంధం ఈ వివేచనల్లో రూపుదిద్దుకొంది. మరి. ఈ 'కథ' ప్రసన్నం కావటంలో అర్థయుక్తి హేతువు కాకుండా పోతున్నది. పింగళివారు గూడా 'అర్థయుక్తి'ని భిన్నాంశంగా విడదీయటం వల్ల ఆయన భావనలోనూ దీనికి హేతుత్వం లేదు. అయితే, ప్రసన్న కథ, అర్థయుక్తి – ఈ రెండింటి నడుమ ఉన్న 'కలిత' పదం ఆ రెండూ భిన్నాంశాలు కావనీ, సమన్వయం పొంది రూపొందవలసిన ఒకే అంశమనీ గుర్తుచేస్తున్నది. కాగా, ఈ అన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఆ సూత్రానికి అర్థసమన్వయం సాధించవలసిఉంది.

నిజానికి, 'ప్రసన్న' పదాన్ని 'కథా' పదంతో అన్వయించటం వల్ల ఇన్నిన్ని రకాలుగా చెప్పవలసి వచ్చింది. ప్రసన్న పదాన్ని కథాపదంతో కాక, 'యుక్తి'తో అన్వయిస్తే మొత్తం సూత్రానికి అర్థ సమన్వయం కుదురుతుంది. అప్పుడు ఆ సూత్రానికి అర్థం ఇట్లా ఉంటుంది.

కథయందు కలితమయిన – అంటే, నిబద్ధమయిన / నిక్షిప్తమయిన అర్థం లేదా అర్థాల యొక్క యుక్తి – అంటే, అమరిక ప్రసన్నం కావటం 'ప్రసన్నకథా కలితార్థయుక్తి'.

ఒక విధంగా సత్యనారాయణగారు భావించిన తీరు ఇదే కాని, 'కథా ప్రసన్నత' మధ్యలో రావటంతో కొంత గందరగోళం ఏర్పడింది.

కథ అనేది కేవలం కొందరు వ్యక్తుల స్థితిగతులను చెప్పటానికి మాత్రమే ఉద్దేశించ బడేది కాదు. వాటిని చెప్పటం ద్వారా పాఠకునికి కొన్ని విషయాలను, అంశాలను సువ్యక్తం చేయటం ప్రధానం. ఈ అంశాలు లేదా విషయాలు, లేదా అర్థాలు ఆ కథలోనే ఇమిడి ఉంటాయి. ఆ కథలో ఆయా అర్థాల పొసగుదల పాఠకుడికి

ప్రసన్నం కాకపోతే కథ చెప్పిన ప్రయోజనం ఏమీ ఉండదు. అందువల్ల ఇది – కథా కలితార్థయుక్తి యొక్క ప్రసన్నత. కథా కథనానికి ప్రాణం. నన్నయగారు కథ చెప్పటంలో ఈ ప్రాణం ఉంది. కాబట్టే నన్నయ ఉత్తమ జాతి కథకుడు మొదలయిన అభిప్రాయాలకు పునాది ఏర్పడింది. కాగా, 'కథాకథనం'లో 'కలితార్థయుక్తి' ప్రసన్నం కావటానికి ప్రాధాన్యమిస్తూ నన్నయ గారు 'ప్రసన్న కథా కలితార్థయుక్తి' అని సూత్రీకరించారు.

ఇదందా కేవలం శబ్దాలను పట్టుకొని మనకు తోచించేదో చెప్పటం కాదు. ఈ చెప్పింది నన్నయగారు భావించిందే. భావించిందే అనటానికి ప్రమాణమేమిటి? ఇదే విషయాన్ని నన్నయగారే మరో చోట ఇంతకన్నా స్పష్టంగా వేరే మాటలతో చెప్పి ఉంటే, అది ప్రమాణమే గదా! ఆ ప్రమాణమిది.

రాజ రాజ నరేంద్రుడు భారతాన్ని రచించ వలసిందిగా అర్థిస్తూ నన్నయ గారితో అన్న మాటలుగా ఉన్న ఈ కింది పద్యం సుప్రసిద్ధమే

జన నుత కృష్ణ ద్వైపా
యన ముని వృషభాభిహిత మహా భారత బ
ద్ధ నిరూపితార్థ మేర్పడఁ
దెనుఁగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్ (భార.ఆది.1-16)

వ్యాసుడు చెప్పిన భారతంలో బద్ధమూ, నిరూపితమూ అయిన అర్థం ఏదో, అది ఏర్పడు విధంగా తెలుగులో భారతం రచింపబడాలన్నది రాజ రాజ నరేంద్రుడు వాంఛించిన ప్రధాన ప్రయోజనం. ఈ వాంఛను బట్టి భారత కలితార్థ యుక్తి ప్రసన్నం కావటమన్నది నన్నయగారు భారతాన్ని రచించటానికి ఉద్యమించటంలో ప్రాధాన్యం పొందుతున్నది. నన్నయగారు ప్రస్తుత సూత్రంలో 'భారత' పదాన్ని కాక 'కథా' పదాన్ని చేర్చారు. కథ భూమికగా గల కావ్యాలన్నింటికీ వర్తించేటంత విస్తతిని ఈ కథా పదం సంపాదించి పెట్టింది. కాగా, ఈ పద్యం 'ప్రసన్న కథా కలితార్థయుక్తి' సూత్రార్థాన్ని ఈ విధంగా ప్రసన్నం చేస్తున్నది.

'మహాభారత బద్ధ' మంటే కథా కలితమనటమే. నిరూపితార్థమే సూత్రంలోని అర్థయుక్తి ఏర్పడుట అంటే ప్రసన్నం కావటం. కథాకలితమయిన అర్థం లేదా అర్థాలున్నవి. అవి నిరూపితం కావటమే అవి అమరటం. నిరూపితం కానంతవరకు ఆ అర్థస్వరూపమేమిటో, దాని పొసగుదల ఎట్లో, వ్యక్తం కాదు. ఈ విధంగా మొదట జననుత... పద్యంలో విషయం వివరించి, ఆ తరువాత దాన్ని కథా ప్రధానమయిన

సర్వ కావ్యాలకూ అనువర్తించేట్టుగా 'ప్రసన్న కథా కలితార్థయుక్తి' అని నన్నయగారు సూత్రీకరించారు. ఈ విధంగా ఆ సూత్రం కథా కలితార్థాల అమరికను ప్రసన్నం చేయటమనే అంశాన్ని ప్రతిపాదిస్తున్నదనటం నన్నయగారి తాత్పర్యాన్ని అవగతం చేసుకోవటమే.

నిజానికీ, ఈ అర్థయుక్తి యొక్క ప్రసన్నతే కథా ప్రసన్నత. కథ ప్రసన్నం కావటమంటే కథా కలితార్థాలు, వాటి పొసగుదల ప్రసన్నం కావటమే. అర్థ ప్రసన్నతకు భిన్నంగా కథా ప్రసన్నత అనే దానికి ఉనికిలేదు. చెప్పబడుతున్న కథ తెలుస్తూనే ఉంటుంది కాని, ఆ తెలియటం నిజమైన తెలియటం కాదు. కథా కలితమయిన అర్థయుక్తి ప్రసన్నం కావటమే అసలయిన తెలియటం. వివరించటంలో, విచారించటంలో అర్థప్రసన్నత, కథా ప్రసన్నత అంటూ రెండంశాలు ఉన్నట్టు అనిపించవచ్చు. కథా ప్రసన్నతకు అర్థ ప్రసన్నత హేతువుగా కూడ అనిపించవచ్చు. కాని, పరమార్థత, అక్కడ రెండు లేవు; కథా గతమయిన అర్థాలు ప్రసన్నం కావటమనేది ఒక్కటే ఉంది. సత్యనారాయణగారు నన్నయ గారి భారతంలోని కొన్ని ఉపాఖ్యానాలను, కొన్ని ప్రధాన కథాఘట్టాలను అనుశీలించిన విధానం ఈ అంశాన్నే స్పష్టపరుస్తుంది. మరి, కథా గతమయిన అర్థాలెట్లా ప్రసన్న మవుతాయి?

మహాకవి యొక్క కావ్యంలోని కొన్ని శబ్దాలు కథా మర్మాన్ని భేదించేవిగా ఉంటాయి. అని సత్యనారాయణగారన్నారు. కథా మర్మం భేదించట మంటే కథాగతార్థం కథా గతార్థాన్ని ప్రసన్నం చేసుకోవటమే. కథార్థాన్ని ప్రసన్నం చేయటం కోసం మహాకవులు కొన్ని పదాలను పదబంధాలను సూచన ప్రాయంగా ప్రయోగిస్తుంటారు. మరికొన్ని పద్ధతులను గూడా ఉపయోగించవచ్చు. మరి ఈ కీలకాంశఆలను గుర్తించటంలో పాఠకుడికి కావ్య సంప్రదాయాభిజ్ఞత, గాఢమయిన కావ్యాను శీలనం సహకరిస్తాయి. నన్నయగారి భారతంలోని ఋశ్యశృంగుని కథను అనుశీలించి చివరకు – నన్నయగారీ కథలో (ప్రసన్నము) చేసిన మహార్థమిది. ఋశ్యశృంగుని (కథ) తీసికొని యౌవన వికార స్వరూపము నిర్ణయించెను. ఈ మహార్థము ప్రసన్నమగు చున్నది. అంటూ సత్యనారాయణగారు కథా గతమయిన అర్థం ప్రసన్నం కావటాన్ని ప్రధానీకరించారు. ఆ మహార్థ ప్రసన్నతే ఋశ్యశృంగ కథా ప్రసన్నత అని తాత్పర్యం. అది లేకపోతే ఇది లేదు. 'అచట నున్న యర్థములను చక్కగా పరిశీలించినచో కథ పాఠకునకు ప్రసన్నమగునని' ఆయన అనటంలో తాత్పర్యమిదే. కాగా కథా కలితార్థయుక్తి ప్రసన్నతనే కథా ప్రసన్నతగా ఆయన వ్యవహరించారు.

ఈ సందర్భంలోనే మరొక అంశం గమనించవలసి ఉంది.

**కవితార్థ**

'ప్రసన్న కథా కలితార్థయుక్తి' అన్న దానికి 'ప్రసన్న కథా కవితార్థయుక్తి' అనే పాఠాంతరం ఒకటి కన్పిస్తున్నది. మొదటి పాఠంలో 'కలిత' అనీ, ఈ పాఠాంతరంలో 'కవిత' అనీ ఉండటమే ఈ రెండింటిలో భేదం. నిజానికీ, మారింది ఒకే ఒక అక్షరం – 'లి'. మరి, 'లి' అన్నది 'వి'గా మారిందా, లేదా, ఇది అదిగా మారిందా అనేది వెంటనే చెప్పటం కష్టంగాని, మొత్తం సూత్రంలో ఈ మార్పు వివాదానికి కారణమై పోయింది. అయితే 'వి'కార యుతమయిన పాఠానికి అర్థం సరిగా సమన్వయం కావటం లేదు. సమన్వయం కుదిరించేందుకు ప్రయత్నాలూ ఆగలేదు.

కథా కవితలోని యర్థము యోజనను ప్రసన్నముగా – ప్రసాదగుణ సహితముగా నిర్వహించుట.

అవి వేదాల తిరువేంగళాచార్యులుగారు ఈ పాఠాంతరానికి అర్థం చెప్పారు. ఇక్కడ ఒక అంశం గమనించవలసి ఉంది. అర్థం కవితకు సంబంధించిందయితే కథా పదం అనవసరం; కథకు సంబంధించిందయితే కవితా పదం అనవసరం. ఇదిట్లా ఉంచి; ఈ చెప్పిన అర్థాన్నే వివరిస్తూ –

భారత కథను కవిత నల్లుటలో అందలి విషయములన్నింటిని రసవంతముగా – ఏయే చోటుల నేయే రసముచితమో అది చక్కగా వెంటనే వ్యక్తమై రంజిలునట్లు చేయు రచన అన్నారు వేదాల వారు. (అందలి విషయములంటే కథలోని విషయములన్న మాట) ఈ వివరణలోని రస విషయం పైన చెప్పిన అర్థాన్ని అనుసరించి లేదు. ప్రసన్నమంటే ప్రసాదగుణ సహితమని, ప్రసాదగుణం సర్వరససమర్పకం కావటం వల్ల ఇక్కడ రస ప్రస్తావన వచ్చింది. దివాకర్ల వేంకటావధానిగారు కూడా ప్రసన్న కథ లంటే – ప్రసాదగణం సర్వరస సమర్పకం కావటం చేత నానా రస మయములైన కథలు అని భావించారు. సర్వరస సమర్పకమంటే అన్ని రసాల ఆవిష్కరణకూ అనుకూల మని తాత్పర్యం; కాని ప్రసన్నపదం వల్ల స్ఫురిస్తున్నదనుకోబడుతున్న ప్రసాదగుణ మనేది సర్వరససమర్పకమయిన రచనా విధానానికి సంబంధించింది. కథా విషయంలో ప్రసాదగుణాన్ని ఎవరూ చెప్పలేదు. నిజానికి ఆ గుణం శబ్దార్థముల 'యకాలుష్యము' నకు సంబంధించిందే తప్ప కథకు సంబంధించింది కాదు. ఒక వేళ, ప్రసాదగుణాన్ని కథకు ఎవరూ చెప్పకున్నా గూడా, కథ కన్వయిస్తే అవధానిగారే

చెప్పినట్లు – ఏవైన కథలను రచించునప్పుడు ప్రధాన కథతో వానికిగల సంబంధమును, అందు వానికి గల స్థానమును వివరించుచు... నిన్నంత మాత్రమున నందలి తత్త్వమును స్ఫురింపజేయుట కావచ్చు. కాని, ఇదంతా అర్థయుక్తి యొక్క ప్రసన్నతకే అనుగుణంగా ఉంది కాని రస ప్రస్తావనకు కాదు. కాగా, ప్రసన్న పదాన్ని ఆశ్రయించి రస ప్రస్తావన సుదూరమయిన క్లిష్టకల్పన; నన్నయగారి అక్లిష్ట రీతికి అనుగుణం కాదు.

ఇదిట్లా ఉండగా; ఈ రెండవ పాఠాన్ని బట్టి; నన్నయగారు 'కథా కవిత' అనే ఒక కవితా భేదాన్ని ప్రతి పాదించారనీ, దీన్ని అనుసరిస్తూ అనంతర కాలాన నన్నెచోడుడు ఈ కథా కవితనే వస్తుకవితగా ప్రతిపాదించినట్లు తిరువేంగళాచార్యులు గారూ, పాటిబండ మాధవశర్మగారూ నిర్ణయించటానికి ప్రయత్నం చేశారు. నిజానికి, కథా కవిత అనేది ఇటీవలి కాలంలో రూపుకట్టిన భావన. అదట్లా ఉండగా; నిజానికి, నన్నెచోడుడుగూడ వస్తుకవితను కథా కవిత అనే తాత్పర్యంతో ప్రయోగించలేదు. ఆయన వస్తు కవితను ప్రస్తావించిన తీరు గమనిస్తే ఈ అంశం స్పష్టపడుతుంది. ఆ తీరిది.

**వస్తు కవిత**

నన్నెచోడుడు – వస్తు కావ్యము, వస్తు కవిత, వస్తు కవి అని మూడు పదబంధాలను ప్రయోగించాడు. ఈ మూడూ వస్తు పదం మీద ఆధారపడి ఏర్పడ్డవే. మొత్తం మీద వీటి తాత్పర్యం ఒకటే. రాజశేఖరుడనే గొప్ప ఆలంకారికుడు తన కావ్య మీమాంస (అధ్యా.5)లో శాస్త్రకవి, కావ్యకవి, రచనాకవి... అంటూ కవుల భేదాలను, లక్షణాలనూ వివరించాడు. ఆ ధోరణిలోనే నన్నెచోడుడు గూడ వస్తు కవిని ప్రతిపాదించి ఉండవచ్చు. వస్తుకవిని బట్టి వస్తు కవిత, వస్తుకావ్యం అనే పదబంధాలు నిష్పన్నమయినయి. వీటి స్వరూప – స్వభావాల అవగాహనకు వస్తు పదం కీలకం. ఆ పదానికి చోడుడు భావించిన అర్థ తాత్పర్యాల మీద వస్తుకవి / కవిత / కావ్యాల స్వరూప – స్వభావాలాధారపడి ఉన్నాయి. చోడుడు కావ్యం రచిస్తున్నాడు కాబట్టి, శాస్త్ర కర్త వలె లక్షణం చెప్పటానికి వీల్లేదు. అందువల్ల, ఆయన ఆ పదాన్నీ, పద బంధాలనూ ఉపయోగించిన తీరులోనుంచి లక్షణం సంపాదించవలసి ఉంటుంది.

కావ్యశాస్త్రంలో 'వస్తు' పదానికి చాలా ప్రచారముంది. దాని అర్థాన్ని గూర్చి విమర్శకుల్లో భిన్నాభిప్రాయాలున్నయి – అంటే, వేరు వేరర్థాల్లో ఈ పదప్రయోగం

కన్పిస్తున్నదన్నమాట. భరతుడి నాట్యశాస్త్రంలో ప్రబంధానికి ప్రఖ్యాత వస్తువు యొక్క ఆవశ్యకత చెప్పబడిందన్న ఆనందవర్ధనుడు... వస్తు – నాయక – రసములను బట్టి రూపకాలు భేదిస్తాయి అన్న ధనంజయుడు... ఇట్లాగే మరికొందరు వస్తుపదానికి కథ అనే అర్థాన్ని ఉద్దేశించారు. ఈ ప్రయోగాల నాశ్రయించి తిరువేంగళాచార్యులు గారు, మాధవశర్మగారు మొదలయిన వారు వస్తు కవిత అంటే కథా కవిత (వస్తు కావ్యము – కథా కావ్యం; వస్తు కవి – కథా కవి) అని నిర్ధారించారు. వారి దృష్ట్యా నన్నయగారు ప్రయోగించారనుకోబడుతున్న కథా కవిత ఈ నిర్ధారణకు ప్రమాణం. మరి, నన్నయగారు స్పష్ట ప్రతిపత్తితో కథా కవిత అని అంటే, పాక్షికంగా కథా పరమయిన వస్తు పదాన్ని చోడుడు ప్రయోగించవలసిన అవసరమే వచ్చింది? దీనికి తిరువేంగళాచార్యులుగారి సమాధానమిది. వస్తు పదానికి తెలుగులో బంగారమని, సంస్కృతంలో కథ అనీ వాడుక ఉంది. ఈ ఉభయార్థ స్ఫూర్తి కోసం చోడుడు ఈ పదాన్ని ఎన్నుకొన్నాడు. 'బంగారమెట్లు అలంకారములుగా మన యభిరుచులకు దగినట్లు రచింప వీలగునో, అట్లే కథయుగనుకను గూడ, కథ బంగారమే. ఈ రెండు రకముల విశేషములను జోడించుట వస్తు పదముననే వీలగును గాని కథా పదమున వీలులేదు, కనుక వస్తు కవిత యని వాడినాడు.

నన్నయగారు 'కథా కవిత'ను ప్రతిపాదించారా లేదా అనే విషయం అట్లా ఉండగా; వస్తు పదానికి కథా పరమయిన ప్రయోగం పాక్షికం. అదీ అట్లా ఉంచి; చోడుడు తన కావ్యావతారికలో కథ అని చెప్పవలసి వచ్చిన ఏ సందర్భంలో గూడా కథా పరంగా వస్తు పదాన్ని ప్రయోగించలేదు. దివ్య కథారంభంబున కభిముఖుండనై (కుమార సంభవం; 1-44); దివ్య కథా సూత్రం బెట్టి దనిన (1-67) ఇత్యాదిగా సర్వత్ర కథా పదాన్నే ప్రయోగించాడు. మరి, కావ్య విమర్శ సంప్రదాయంలో వస్తు పదానికి కథా పరంగా ప్రయోగం ఉన్నప్పటికీ – వస్తు నిర్దేశము, వస్తుధ్వని మొదలయిన చోట్ల దానికి భిన్న రీతిలో ప్రయోగం ఉంది. కావ్యాధిలో ఆశీ, ర్నమస్క్రియా, వస్తు నిర్దేశాల్లో ఏదో ఒకటి ఉండాలనటం సుప్రసిద్ధం. ఇక్కడ వస్తు నిర్దేశం అంటే ఏమిటి? మేఘ సందేశ కావ్యధిలో యక్షుని గిరి నివాసరూప వస్తువు నిర్దేశింపబడిందని మల్లినాథ సూరి వ్యాఖ్య. నివసించట మన్నదే ఇక్కడ వస్తు పదం ఉద్దేశిస్తున్నది. అది కథ కాదు. నిజానికి మేఘ సందేశం మొత్తంలో మాత్రం కథ ఏమున్నది? మరి, వస్తుధ్వని అన్నప్పుడు విధి నిషేధాద్యనేక ప్రకారాలు వస్తు శబ్దంచే చెప్పబడుతున్నవని అభినవ గుప్తుడన్నాడు. విధి, నిషేధాదులు 'వస్తు'వులు. ఒక విధంగా గమనిస్తే రసాలంకార

భిన్నమయినవన్నీ వస్తు పదానికి విషయాలే. కాగా, వస్తు పద ప్రయోగంలో ఈ అర్థవైవిధ్యాన్నీ, చోడుడు ఆ పదాన్ని వేరు వేరు చోట్ల ప్రయోగించిన తీరునూ పూర్వాపరసందర్భాలనూ బట్టి చోడుని వస్తు కవితా స్వరూపస్వభావాలు నిర్ణయించవలసి ఉంటుంది.

చోడుని కావ్యావతారికలో పూర్వ కవిస్తుతి ఉంది. అందులో ఆరుగురు సంస్కృత కవుల్ని చోడుడు స్మరించాడు. ఆ ఆరుగురిలో వాల్మీకి, భారవి, ఉద్భటులను, స్మరించటంలో వస్తు కావ్య, వస్తు కవితా పద బంధాలను ప్రయోగించాడు. ప్రస్తుత వివేచనకు ఉపకరించేవి భారవి, ఉద్భటునికి సంబంధించిన పద్యాలు,

భారవియు వస్తు కవితను
భారవియును బరగిరుదయ పర్వత శిఖరా
గ్రారోహణేంద్రకిలన
గారోహణ వర్ణనల జనారాధితులై (కుమార, 1-20)

కాంతియందు సూర్యుడు (భా; భాన్ రవి), ఉదయ పర్వత శిఖరాగ్రారోహణ చేత జనారాధితుడు; ఆ సమయంలో అర్ఘ్య ప్రదానాదులతో జనం రవిని ఆరాధిస్తుంది. ఇక, వస్తుకవితయందు భారవి (కిరాతార్జునీయ కావ్యకర్త) ఇంద్రకీల నగారోహణ వర్ణనచేత జనారాధితుడు. ఆయన వర్ణనాశక్తి జనారాధనీయమయిందని తాత్పర్యం. సూర్య సామ్య విషయం అట్లా ఉండగా; ఇంద్రకీల నగారోహణకు వస్తు కవితకు సంబంధమేమిటి? (అర్జునుడు ఇంద్రకీల పర్వతాన్ని ఎక్కినప్పటి) వర్ణన వస్తు కవిత అవుతుందా? వస్తు కవితలో వర్ణన ఉంటుందనా? లేక, వర్ణనే వస్తు కవిత అనా? భారవిని గూర్చిన పద్యమిట్లా ఉండగా, ఉద్భటుని గూర్చిన పద్యమిది.

క్రమమున నుద్భటుఁడు కవి
త్వము మెఱయఁ గుమార సంభవమ్ము నలంకా
రముగూడ వస్తుమయకా
వ్యముగా హరులీలఁ జెప్పిహరుమెప్పించెన్ (1-21)

ఉద్భటుడు కుమార సంభవ కావ్యాన్ని వస్తుమయ కావ్యముగాన్ – వస్తుమయ కావ్యమయ్యేట్టుగా రచించాడు. మరి, అది వస్తుమయ మెట్లయింది? 'అలంకారము గూడన్' – అలంకారం చేరగా అని సమాధానం. కుమార సంభవంలోని కథ 'హరులీల' కాని, దాని వల్ల కుమార సంభవం వస్తు కావ్యం కాలేదు. అలంకారం కూడితే వస్తు కావ్యమయింది. అట్లా కాకపోతే, ఇక్కడ అలంకార ప్రస్తావన సంగత పడదు. కాగా,

ఒక కావ్యం 'వస్తుమయ కావ్యం' కావటానికి లేదా, కవిత వస్తు కవిత కావటానికి లేదా, కవిత వస్తు కవిత కావటానికి ఉద్భటుని స్మరణ నెపంగా అలంకారం, భారవి స్మరణ నెపంగా వర్ణన హేతువులుగా నన్నెచోడుడు చెబుతున్నాడనేది స్పష్టం. అంటే, వస్తు పదం ఇక్కడ వర్ణనాలంకారాలను చెబుతున్నది. అయితే, ఈ రెండింటిని మాత్రమే చెబుతుందా? కాదు. వస్తు పదం చెప్పేవి ఇంకా ఉన్నాయి. మరికొంత ముందుకు సాగి చోడుడు వస్తు కావ్య స్వరూపాన్ని సమగ్రంగా వ్యక్తీకరించాడు. ఆ వ్యక్తీకరించిన పద్యమిది.

మృదురీతి సూకు లింపొదవింప, మేలిల్లు
భావము లెలమి ప్రీత్యావహముగ;
మెఱుఁగులఁగన్నులు మిఱుమిట్లు వోపంగఁ;
గాంతి సూధాసూతి కాంతి కెనయ;
వర్ణన లెల్లచో వర్ణన కెక్కంగ;
రసములు దళుకొత్తి రాలువార
దేశి మార్గంబులు దేశీయములుగా, న
లంకారములు దానలంకరింప
నాదరించి, విని, పదర్థాతి శయమున
బుధులు నెమ్మనమున నిధులు నిలుప
వలవదే సమస్త వస్తు కవీశ్వర
రచిత రుచిర కావ్య రత్న వీధి (1-36)

ఇక్కడ వస్తు కవీశ్వర రచిత రుచిర కావ్యమంటే, అది వస్తు కావ్యమే. కావ్యమొక రత్నవీధి. ఆ వీధిలోని వస్తువులు రత్నాలు. (అది రత్న వీధి గదా) వీధి స్థానీయమయిన కావ్యంలో రత్న స్థానీయమయిన వస్తువు లేమిటి? కావ్యంలో వస్తువులు మృదురీతి, సూక్తులు... మొదలయినవి. ఈ మృదురీతి మొదలయిన వాటిలో కథ లేకపోవటం గుర్తించదగిన అంశం. అంటే వస్తుకావ్యం కోసం కావలసిన 'వస్తు'వుల్లో కథ చేరదని చోడుని తాత్పర్యం. అందుకో 'కథ' అని చెప్పవలసి వచ్చిన ఏ సందర్భంలోనూ వస్తు పదం చోడుడు ఉపయోగించలేదు. అంటే కథను వస్తువనటం అతనికి అభిమతం కాదు. ఇందులో అస్పష్టత లేదు; అయోమయం లేదు, ఇది ఊహ కాదు. వాస్తవమున్నది. కాగా, ఈ పద్యంలో చెప్పబడ్డ వివిధాంశాలను బట్టి చూస్తే వస్తు కావ్య పదబంధం లోని వస్తు పదం ఏదో ఒక దానికని గాక అనేకాంశాలకు బోధకమని స్పష్ట పడుతున్నది.

ఈ విషయాన్ని విబుధ 'వర్గాన్ని' స్మరిస్తూ చోడుడే స్పష్ట పరిచాడు.

గుఱుతెఱిఁగి వస్తు చయమున

కొఱగెడు నా దీపవర్తి యును బోలె, నిజ

మ్మెఱిఁగి కృతి వస్తు సమితికి

వఱలఁగ మది నెఱుఁగు విబుధ వర్గముఁ దలఁతున్ (1-26)

ఇక్కడ వస్తుచయం వస్తు సమితి కీలక పదాలు. దీప వర్తి వస్తుచయమున కొఱగుతుంది. విబుధ వర్గం కృతిలో వస్తు సమితి నెఱుగును. వస్తు సమితి ఏమిటో మృదురీతి... పద్యంలో చెప్పబడింది. చయము, సమితి – రెండూ సమూహార్థకాలే. కాని, సమూహంగా కూడిన వస్తువుల పరస్పరమైన ఆనుగుణ్యం, అన్యూనాతిరిక్తమయిన ఉపస్థితిని సమితి పదం స్ఫురింప జేస్తుంది. కృతి – అంటే కావ్యంలో వఱలెడు వస్తువులకు ఈ విధమయిన ఆనుగుణ్యం, ఉపస్థితి తప్పనిసరి. ఎఱుగు వారు విబుధులు. మృదురీతి... పద్యంలో గూడా బుధుల ప్రస్తావన 'సమస్త' పద ప్రయోగం గుర్తింప దగినవి.

ఈ విధంగా వస్తు పదం వస్తు సమితి ద్యోతకం కాగా, ఆ సమితి మృదురీతి... పద్యంలో చెప్పబడింది కాగా, అందులో కథ లేకపోవటం, కథ అని చెప్పవలసి వచ్చినప్పుడల్లా వస్తు పదాన్ని గాక కథా పదాన్నే ప్రయోగించటం – వీటన్నింటినీ సమన్వయించుకొంటే; వస్తు కావ్యం, వస్తు కవిత అంటే ఏమిటో తెలుస్తుంది. వర్ణ నాలంకారాదులతో సమృద్ధమయిన కావ్యమే వస్తు కావ్యమని తాత్పర్యం. రాజశేఖరుడు కావ్య కవులను – రచన, శబ్ద, అర్థ, అలంకార, ఉక్తి, రస, మార్గ, శాస్త్రార్థ కవులని ఎనిమిది విధాలుగా గుర్తించాడు. (కావ్యమీమాంస, అధ్యా.-5) మృదురీతి... పద్యాన్ని జాగ్రత్తగా గమనిస్తే దాదాపుగా ఈ అంశాలన్నీ అందులో ఉన్నట్టు గుర్తించటం కష్టమేమీ కాదు. రీతి, సూక్తి భాష, గుణ (కాంతి కావ్యగుణాల్లో ఒకటి. ఇది గుణాలకు ఉప లక్షణం), వర్ణనా, రస, దేశి మార్గ, అలంకార, సదర్థాతిశయం – ఇవి నన్నెచోడుడు చెప్పినవి. ఒక్కొక్క అంశానికి ఒక్కొక్క కవిగా రాజశేఖరుడు గుర్తిస్తూనే ఈ ఎనిమిదంశాలలో రెండు మూడు మాత్రమే ఉన్న కవి కవీయసుడు (–చిన్నవాడు – చివరివాడు), అయిదు గలవాడు మధ్యముడు, అన్నీ కలవాడు మహాకవి అని నిర్ణయించాడు. చోడుడు తన 'మహాకవి ముఖ్యుడ'నని (1-51) చెప్పుకొన్నాడు. అందువల్ల ఈ అంశాలన్నింటనీ కావ్యానికి కావలసిన వస్తువులుగా, వీటన్నింటికి ఆధార చక్రం కథగా భావించి, కేవలంగా కథ ఉండి ప్రయోజనం లేదనీ, ఆ కథలో

ఈ వస్తువులన్నీ ఇమిడి సమితిగా ఉండాలని నిర్ణయించుకొని, ఆ వస్తువులకు ప్రాధాన్యం వస్తున్నది కాబట్టి కావ్యం వస్తు కావ్యమని, వస్తు కావ్య నిర్మాత వస్తుకవి అని వినూత్నంగా ప్రతిపాదించాడు. ఈ యీ వస్తువుల వల్ల కథ రమణీయ మవుతుందని చోడుడు... వర్ణనాష్టాదశమున్, పరిపూర్ణంబై; దశ ప్రాణంబుల సప్రాణంబై, నవరస భావ భరితంబై, షట్ త్రింశదలంకారాలంకృతంబై రమణీయంబైన దివ్య కథారంభంబున కఖముఖుండనై... అంటూ స్పష్టంగానే చెప్పాడు. అంతే కాదు;... అస్మదనూన ప్రతి భార్ణవో దీర్ణ రుచిర వస్తు విస్తారితోత్తమ కావ్య రత్న భూషణంబు... (1-56) అంటూ, ఈ వస్తువులన్నీ రుచిర మైనవనీ, వాటితో విస్తారితమై రత్న విస్తారతమయిన భూషణం లాగా కావ్యం ఉత్తమ మవుతుందనీ, ఈ వస్తువులన్నీ తన ప్రతిభా సముద్రంలో నుంచి ఉదీర్ణమయినవనీ అన్నాడు. వీటన్నింటినీ సమన్వయించు కొని చూస్తే చోడుడు ప్రతిపాదించిన వస్తు కవిత తిరువేంగళాచార్యులు గారూ, మాధవశర్మగారూ భావించినట్లు కథా కవిత కాదని స్పష్టపడుతుంది. కాగా, ఇటు నుంచి అటుగా వస్తు కవితను బట్టి ప్రసన్న... సూత్రంలో కథా కవితను సన్నయగారు భావించాలని చెప్పటానికి ఏ విధంగానూ ఆస్కారం లేదు. అందువల్ల, ఆ సూత్రంలో కవితకు బదులు కవిత ఉందనటానికి అవకాశమూ లేదు.

**ప్రసన్న + కథా; ప్రసన్న + కవితా**

ఇదిట్లా కాగా, '-కవితా-' పాఠాన్ని సమర్థిస్తూ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు మరోదారి తొక్కారు. ఆయన ఆ సూత్రాన్ని భావించిన తీరిది.

ప్రసన్న + కథా; ప్రసన్న + కవితా + అర్థయుక్తి అని పదవిభాగం చేసి, ప్రసన్నమైన కథయొక్కయు, ప్రసన్నమైన కవితయొక్కయు ప్రయోజనముతో కూడియుండుట అని యర్థము చెప్పవచ్చును.

ఇక్కడ ప్రసన్న పదాన్ని కథకూ, కవితకూ విడి విడిగా అన్వయించటం, అర్థ పదానికి ప్రయోజన మని అర్థం చెప్పటం ప్రధానంగా గమనించవలసిన అంశాలు. అయితే, మొదట గుర్తించవలసిన విషయం - ఇక్కడ అర్థ పదం ప్రయోజనార్థకం కాదని. 'నిరూపితార్థము' 'అమితాఖ్యానక శాఖలంబొలిచి వేదార్థమలచ్ఛాయమై...' (ఆది. 1-66) మొదలయిన నన్నయగారి ప్రయోగాలు; వ్యాసమునీంద్రు సారకరుణాతిశయంబున భారతార్థ ముద్భాసితమైనయట్టి నుత భాగ్యనకున్ (స్వర్గా. 1-92) వంటి తిక్కన గారి ప్రయోగాలు, వ్యాసముని ప్రణీత పరమార్థము... (నృసింహపురాణం, 1) వంటిఎఱ్ఱనగారి ప్రయోగాలూ, సదర్థాతిశయమున... అనే

నన్నెచోదుడి ప్రయోగం నన్నయగారి సూత్రంలోని అర్థ పదం ప్రయోజనార్థకం కాదనటానికి ప్రమాణాలు. కాగా, సూత్రంలోని అర్థ పదం విషయ / అంశ పరమేగాని ప్రయోజనవసరం కాదు. ఇక; – 'భారత కథలు గహనమైనవి. వానిలోని అనవసరములైన వివరములును, పునరుక్తులను పాఠకులకు విసుగు వేసటలు కల్పించును. వానిని పాఠకుని ఆభిముఖ్యమునకై ప్రసన్నములు చేయవలయును. భారత కవిత యందును పై లక్షణములున్నవి; అనౌచిత్యములున్నవి. వానినన్నింటిని తొలగించి స్ఫుటమైన కవితను సాక్షాత్కరింపజేయులెను. అదియే ప్రసన్న కథ; అదియే ప్రసన్న కవిత, అని ఆ సూత్రానికి చెప్పిన అర్థానికిచ్చిన వివరణ. ఈ వివరణ వ్యాసభారతం మీద అధిక్షేపాలనే తప్ప నన్నయగారి తాత్పర్యాన్ని తెలుపదు. నన్నయగారి మీద మనకు అభిమానం గాఢంగానే ఉండవచ్చు కాని అది వ్యాసుని విషయంలో అపచారం, అన్యాయం చేయటానికి ప్రోత్సహించగూడదు. ఇంతకూ నన్నయగారు వ్యాస భారతంతో పోల్చుకోవటానికి ప్రసన్న కథా కలితార్థయుక్తి మొదలయినవి చెప్పలేదు. పోల్చుకోవటం ఆయనకూ సమ్మతం కాదు. 'అమలిన తారకా సముదయంబుల... (ఆది. 1-19) పద్యాన్ని స్మరణకు ఈ సందర్భంలో తెచ్చుకొంటే మంచిది. విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై పరగుచుండ జేసె భారతంబు (ఆది. 1-30) అన్నారు నన్నయగారు. ఇట్లా అన్న నన్నయగారు వ్యాస భారతంలో అనౌచిత్యాలున్నాయని అనుకొన్నారనటానికి ఆస్కారమే లేదు. వ్యాస భారతాన్ని నన్నయాదులు సంస్కరించారనీ, మెరుగులు పెట్టారనీ – వంటివి కేవలం ఉత్సాహ పూరితమయిన ఆలోచనలు, నిజానికి, అవిచారిత రమణీయ మయినవి మాత్రమే. 'విద్వజ్జనంబుల యనుగ్రహంబునంజేసి, నా నేర్చు విధంబున నిక్కావ్యంబు రచియించెద' (1-20) అన్నారు నన్నయగారు. 'వ్యాస మునీంద్రు సార కరుణాతిశయంబున భారతార్థ ముద్భాసితమైన' విధంగా తిక్కనగారు రచించారు. వ్యాసముని ప్రణీత పరమార్థము తెల్లము 'చేసే విధంగా ఎఱ్ఱనగారి రచన సాగింది' కాగా, నన్నయగారు ఆయా సూత్రాలను కావ్య విషయంలో తన దృష్పథాన్ని వ్యక్తీకరించేందుకూ, అవి కావ్య సామాన్యంగా అన్వయించటానికి ప్రయోజకరంగా ఉద్దేశించారే తప్ప వ్యాస భారతంతో పోటీ పడి, అందులో అనౌచిత్యాదులున్నవనీ, వాటిని సంస్కరిస్తున్నాననీ చెప్పటానికి కాదు. ఈ అంశాన్ని మరచిపోతే ఆ సూత్రాలను గూర్చి సరయిన అవగాహన కలిగే అవకాశాన్ని కోల్పోవలసి వస్తుంది.

ఇదిట్లా ఉండగా; కథను సాఫీగా చెప్పటం, కవితను స్ఫుటీకరించటమనేవే ప్రధానమయితే జక్కన కన్న మహాకవి ఉండడు. అదట్లా ఉంచి, ప్రసన్న కథ, ప్రసన్న కవితల ప్రయోజనమేమిటో – తమ ధోరణిలోనైనా సరే, ఇక్కడ చెప్పబడలేదు. దీనివల్ల ఈ సూత్ర విచారణకు సమగ్రత కొరవడుతున్నది. మరొక ప్రధానాంశం; ప్రసన్న పదాన్ని కథతో, కవితతో గూడా అన్వయింపజేయటం క్లిష్టమయిన తీరు. గమనించవలసిన మరొక అంశమేమంటే 'అక్షర రమ్యత, నానా రుచిరార్థసూక్తినిధి' అనే వాటిని కవితాపరంగా, జగద్ధితత్వాన్ని ప్రయోజనపరంగా చెప్పబోతున్న నన్నయగారు ఈ సూత్రంలో కవితా విషయాన్నీ, అందునా అయోమయంగా, అసమన్వితంగా చెప్పారనటానికి ఆస్కారం లేదు. ఇక; నన్నయగారికి పూర్వుడయిన కన్నడ కవి పంపన 'లలిత పదం ప్రసన్న కవితా గుణ'... మనగా, నన్నయగారు దాన్నే అనుసరించి 'ప్రసన్న' అని చెప్పివారనటం ఏ మాత్రమూ సరిగాదు. పదాలు లలితంగా ఉండాలనీ, కవితాగుణమైన ప్రసన్నత ఉండాలని పంపన భావించాడు. నన్నయగారి భావన, పంపన భావన ఒకటిగాదు. ఈ సూత్రం వరకే పరిమితమయి చూసినా కూడా పూర్తిగా భిన్నమయినవి. సన్నయగారి 'కథా' పదం ఈ అంశాన్ని స్పష్ట పరుస్తుంది. ఇద్దరి ఆలోచనలూ, ధోరణులు కలువవు. కాగా, నన్నయగారిక్కడ కథా విషయాన్నే తప్ప కవితా విషయాన్ని ప్రస్తావించనే లేదు. ఈ విధంగా అన్ని అంశాలనూ అన్ని కోణాల నుంచి పరిశీలించి సమన్వయ పరచుకుంటే, ఆ సూత్రానికి కవిత పదం వల్లనే సుగమత్వమూ, సార్థకతా కలుగుతాయి తప్ప కవితా పదం వల్ల కలుగవు. అందుకనే ఈ పాఠాంతరానికి అర్థం పొసగించటానికి మూడు నాలుగు విధాలుగా ప్రయత్నించి, ఏదీ సరిగా కుదురక, చివరకు

కవితా పదముతో గూడిన పాఠమునకు దూరానేయమయిన యర్థమే కాని. సహజమయిన యర్థము విశదమగుట లేదు. అందుకే ప్రసన్న కథా కలితార్థయుక్తియను పాఠమే గ్రహించుట యుక్తముగా నుండును. అన్న నిర్ణయానికి అవధానిగారు వచ్చారు.కలిత పాఠంలోనే అన్వయానికి ఔచిత్యం ఉంది కాబట్టే చిన్నయసూరి, గిడుగు రామమూర్తి మొదలయిన వారు కలిత పదయుక్త పాఠాన్నే ప్రమాణీకరించారు. లభ్యమయ్యే తాళపత్ర ప్రతులు ఎక్కువ వాటిలో ఉండటం ఒక్కటే పాఠశుద్ధికి సర్వత్ర ప్రమాణ మనుకోవటం గ్రంథ పరిష్కార మార్గాన కేవలంగా అమాయకత్వమే అవుతుంది. ప్రయోక్త అభిప్రాయానికి అనుగుణమయినప్పుడే దానికి ప్రామాణ్యం.

నిజానికి, నన్నయగారు సాగించిన వివేచనలోని మౌలికత కలిత పాఠం ద్వారానే వ్యక్తమవుతుంది. నాటికే కాదు; ఈనాటికీ, కావ్యంలో కథ చెప్పటమెట్లా? అన్నది ఎవరూ విచారించినట్లు లేదు. విచారించి చెప్పింది నన్నయ గారొక్కరే. కథ చెప్పటంలో – అది పూర్వ కథ అయితే, ఆ కథలోని అర్థాలూ; ఆ కథ స్వీయం, లేదా ఉత్పాద్యం / కల్పితం అయితే, ఆ కథలో తాము నిక్షేపించామనుకొన్న అర్థాలూ, వాటి పొసగుదల పాఠకులకు ప్రసన్నమయ్యేట్లుండ వలసి ఉంటుంది. ఇది నన్నయగారి ప్రతిపాదన; భారతీయ సాహిత్య విమర్శ సంప్రదాయానికి తెలుగు వారి సంప్రదానం. కథాకథన శిల్ప మన్నది దీన్నుంచి ఉదయించి, విస్తరించింది. భారత కథ చెప్పిన రౌమహర్షణిని నన్నయగారు 'కథా కథన దక్షుడు' (ఆది. 1-29) అని పరిచయం చేశారు. ఈ 'కథా కథన దక్షత' కథా గత వివిధ వస్తువులను / విషయాలను / అర్థాలను పాఠకుడికి ప్రసన్నం చేస్తుంది. కాగా

ప్రసన్న కథా కలితార్థయుక్తి అన్నది నన్నయగారి గాఢమయిన సాహిత్య వివేచనలో నిష్పన్నమయి, కావ్యానికి సంబంధించి కథా పరమయిన మౌలిక దృష్పథాన్ని వ్యక్తం చేస్తున్న సూత్రం.

**అక్షర రమ్యత**

కథా విషయాన్ని ప్రతిపాదించిన మొదటి సూత్రాన్ని అనుసరించి వచ్చింది రెండవ సూత్రమయిన అక్షర రమ్యత. కథా ప్రధానాలు కాని కావ్యాలకు గూడా అనువర్తించటానికి అనువుగా ఈ అంశం విడిగా సూత్రీకరింపబడింది. అక్షరాల యొక్క రమ్యత, అక్షరమయిన రమ్యత అని రెండు విధాలుగా కూడా దర్శించవలసి ఉన్న సూత్రమిది. ఇది ఉత్తర పదార్థ ప్రాధాన్యం గల సమాసం. అంటే, రమ్యతకు ప్రాధాన్య మన్న మాట. కావ్యంలో ఆద్యంతంగా వ్యాపించి ఉండవలసిన ప్రధానాంశంగా నన్నయగారు రమ్యతను ఈ సూత్రం ద్వారా ప్రతిపాదించారు.

ధూళిపాళ శ్రీరామమూర్తి గారి మాటల్లో ఈ 'అక్షర రమ్యత అనేది శబ్ద గతాక్షరగతమయినది. ఆ యక్షరములను ధ్వని ఆశ్రయించినది. దానిని గ్రహించు నేర్పు శ్రవణేంద్రియ గతమై యుండును. సంగీత సాహిత్యాల్లో అక్షర రమ్యతను గూర్చి విచారిస్తూ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు – 'వాద వ్యక్తికి సహాయంగా వచ్చే భాష అసంయుక్త పరుష సరళమయంగా ఉంటేనే గాన కళ మెరుస్తుంది అనటంలో భాషలో హల్లుల అసంయుక్తత్వం అక్షర రమ్యతగా సూచింపబడుతున్నది. ఈ

అసంయుక్తత్వం కర్ణపేయమయిన వాదం యొక్క అనుస్యూతికి మూలం. ఈ దృష్టితోనే; 'పౌరుష్య విరహితమయి, గాంభీర్య కారణమయిన శబ్ద ప్రయోగం' అక్షర రమ్యత అని భావించిన పింగళి లక్ష్మీకాంతంగారు దాన్ని శబ్ద జటిలత కు వ్యాపింప జేశారు. ఈ జటిలతను ఉద్దేశించే కావచ్చు – అవధానిగారు అక్షర రమ్యతను శయ్యగా భావించారు. 'పదాల యొక్క పరమమయిన అన్యోన్యమైత్రియే శయ్య' అని విద్యానాథుని నిర్వచనం. విద్యానాథుడు తెలుగువాడు. నన్నయగారికి అర్వాచీనుడు. విస్తృతంగా పఠన పాఠనాల్లో ఉన్న సంస్కృతాలంకారిక గ్రంథం ప్రతాపరుద్రయశోభూషణం (సామాన్యంగా 'ప్రతాపరుద్రీయం' అని వ్యవహారం) రచించినాడు. ఆయన ప్రతిపాదించింది ఈ శయ్య. దీన్ని ఆశ్రయించే ఏ శబ్దముల తరువాత యే శబ్దములను వాడిన, శ్రుతి సుభగముగా నుండునో గ్రహించి దాని నట్లుచితరీతి వాడుచుండ వలయును. అట్లు పొందిక గల పదములను వాడుటకే 'శయ్య' యని పేరు అదే అక్షర రమ్యత. అని అవధానిగుర నిర్ధారించారు. విద్యానాథుడు శ్రుతి సుభగతా విషయం చెప్పలేదు. అయినా, పదాల అన్యోన్య పరమమైత్రి వల్ల ఈ సుభగత్వం కలుగుతూనే ఉంటుందనుకోవచ్చు. అయితే, ఈ శ్రుతి సుభగత్వమనేది కేవలం మృదులాక్షరాల వల్ల కలిగేదని కాక, భావోద్దీపకతా శక్తివల్ల కలిగేదని గుర్తు పెట్టుకోవటం అవసరం. ఇదిట్లా ఉంచి, ఈ పైన చెప్పిన అంశాలే కాక పద సంఘటనా రూపమయిన రీతి. వర్ణ సంఘటనా రూపమైన వృత్తి, పదముల అన్యోన్యమైత్రీ రూపమైన శయ్య. పద పరివృత్త్యసహ్యతా రూపమైన పాకము – ఈ సర్వమును అక్షర రమ్యత. అని పాటిబండ మాధవ శర్మగారి తాత్పర్యం.

క్రమంగా పర్యాలోచిస్తే అక్షర రమ్యత అంటే, అక్షరాలను గ్రథనం చేయటంలోని నేర్పువల్ల నిష్పన్నమయ్యే రమణీయత. సర్వ వాక్ సమాజం అక్షరమయం. అక్షరాలు క్రమంగా పదాలై, వాక్యాలై, మహావాక్యాలు – అంటే, కావ్యాలూ, మహాకావ్యాలై సాహిత్య ప్రపంచాన్ని సహృదయులయిన పాఠకుల అనుభవానికి తీసుకు వస్తాయి; అందిస్తాయి. ఈ విధంగా అక్షర గతంగా బీజభూతమై ఉన్న రమ్యత మహా కావ్యం దాకా విస్తరించి అక్కడ విశ్వరూపం పొందుతుంది; – తన శక్తి స్వరూపాలను సమగ్రంగా సాక్షాత్కరింపజేస్తుంది. 'ఏ శబ్దము తరువాత నే శబ్దమును వాడిన శ్రుతి సుభగముగా నుండు' ననేది, నిజానికి, శబ్దాల నుంచి కాక, అవి రూపొందటానికి మూలమయిన అక్షరాల దగ్గరి నుంచి గమనింపదగింది. శ్రుతి సుభగత్వమన్నది సంకుచిత తాత్పర్యాన్ని కలిగిస్తుంది. కేవలం అది చెవికి పరిమితమనీ అనిపిస్తుంది.

రమ్యత అనేది చాలా విస్తృతం. అది హృదయానికి వ్యాపిస్తుంది. శ్రుతి సుభగత్వ మన్నది లేకుండా కూడా రమ్యత సాధించటానికి వీలుంటుందిగాని, ఇది లేకుండా అది సాధ్యం కాదు. స్థూలంగా చూస్తే ఏకార్థకాలనిపించే పదాలనేకంగా ఉండవచ్చు. కాని, వీటిలో ఎట్లాంటి అక్షరాల కూర్పుతో ఏర్పడే పదం రమ్యతను సంపాదించగల దనేది ప్రయోక్త తెలుసుకోవలసిన అంశం. ఆ తెలియటం ఆయన ప్రతిభను బట్టి, ఆ నిష్పత్తిలో ఉంటుంది. అక్షరాల కూర్పు అర్థాన్ని సంపాదిస్తుంది. అర్థ ప్రసన్నత రసాభివ్యక్తికి మూలం. కాగా, పరమార్థత, అక్షర రమ్యత రసాభివ్యక్తిలో పర్యవసిస్తుంది. రసానికి అనుగుణత్వాన్ని అనుసరించి అక్షరాల కూర్పును గురించి పూర్వులు వివేచన చేయకపోలేదు కాని, అది స్థూలం ఆ విధమయిన వివేచన ఎంత చేసినా గూడా దానికి పాక్షికత్వం లేకుండా పోదు. ఎందుకంటే – ఆ వివేచనను అనుసరించి అక్షరాలు కూర్చిన / ప్రయోగించిన ప్రతి సందర్భంలోనూ కలుగ వలసిన ప్రయోజనం తప్పకుండా కలుగుతందనిగాని; దానికి భిన్నమయిన కూర్పు / ప్రయోగం వల్ల కలుగనే కలుగదని గాని నిర్ణయించటానికి అవకాశం లేదు. ఇందుకు ఉదాహరణలు వివిధ కావ్యాల్లో చూసుకోవచ్చు. నిజానికి రమ్యం కావటం, కాకపోవటం అనేది అక్షరాలకు సహజ లక్షణం కాదు. కాని, ప్రయోక్త ప్రతిభననుసరించి ఆయా అక్షరాలు ఆయా సందర్భాల్లో, సన్నివేశాల్లో తను కలయిక ద్వారా రమ్యతను వ్యక్తీకరిస్తూ ఉంటాయి; అర్థ విశేషాలను స్ఫురింపజేస్తుంటాయి. అందువల్ల ఫలానా అక్షరాల ఫలానా విధమయిన కూర్పే సర్వత్రా రమ్యతను సంపాదిస్తుందని కచ్చితంగా నిర్ధారణ చేయటానికి వీల్లేదు. అవధానిగారు స్పష్టీకరించినట్లు కేవలం మృదులాక్షర ఘటితములైన పదములచే మాత్రమే రమ్యత ఏర్పడునని తలపరాదు. అది పదములందు సరళతా పారుష్యములపై కంటె రసానుగుణత్వము పై నెక్కువగా నాధారపడియుండును.

మరొకటి. కావ్యాలన్నీ రస ప్రధానాలు కావు. వర్ణనాది ప్రధానాలయిన కావ్యాలు గూడా అనేకం. ఆయా కావ్యాల్లో ఈ విధమయిన ఘట్టాలు కూడా ఉండవచ్చు. అట్లాంటి వాటిల్లో గూడ కవి అక్షర రమ్యతను సాధిస్తాడు. ఈ విధంగా రస – రసేతర ప్రధాన కావ్యాలు / కవితలన్నింటికీ రమ్యత అభివ్యాప్త మవుతుంది. అందువల్లనే అన్నింటికీ మౌలికమయిన అక్షరాలను గ్రహించి రమ్యతను ప్రతిపాదించిన నన్నయగారు కావ్యం మొత్తానికి నిరుపపదమయిన – అంటే, ఏ విశేషణమూ లేని రమ్యతను, అదే అర్థంగల రుచిర, హృద్య, రంజన, రోచన, రమణీయాది పదాలను

ఉపయోగించి రమ్యత యొక్క అనవధికత్వాన్ని, అంతులేని / హద్దులు లేని లక్షణాన్ని సూచించారు. భారతంలోని పర్వానుక్రమణికలోని సర్వ సంగ్రహంలో వివిధ సర్వగత విషయాలను చెప్పే పద్యాల్లోనూ, కొన్ని కొన్ని ఆశ్వాసాంత పద్యాల్లోనూ రమ్యములు మొదలయిన పదాలను విరివిగా ప్రయోగించి ఈ అంశాన్ని సమర్థించారు. కాబట్టి, ఒక విధంగా కావ్య రమణీయత అంతా అక్షర రమ్యతగా నన్నయగారు సూత్రీకరించారు. కావ్యం ఏదో ఒకటి రెండు చోట్ల అని కాక, కావ్యంలో ఆద్యంతంగా అభివ్యాపించ వలసినది కావటం వల్ల ఈ అక్షర రమ్యత నిజానికి, అక్షరమయిన – అంటే, క్షరం కానట్టి రమ్యత. మరి. ఈ వివేచన అంతా అక్కడక్కడి పొడి పొడి మాటలను బట్టి చేసింది కాదు; మూడవ సూత్రమయిన 'నానారుచిరార్థసూక్తి నిధి' అన్నది ఈ విశ్లేషణనంతటినీ సమర్థిస్తున్నది.

**నానారుచిరార్థ సూక్తి నిధి**

'నానారుచిరార్థ సూక్తి నిధి' అనే దాన్ని నన్నయగారు తమకు విశేషణంగా ఉపయోగించారు. తమ బిరుదుగా చెప్పు కొన్నారని సత్యనారాయణగారన్నారు. అదట్లాగే అనిపిస్తుంది. కాని, నిజానికి, అది కావ్య సిద్ధాంత ప్రతిపాదకమయిన సూత్రం. నన్నయగారు 'నానారుచిరార్థ సూక్తి నిధి' కావటం ఆయన కావ్యం వల్ల స్పష్ట పడుతూనే ఉంది. ఆ కావ్యం – నిధి కావటమే అందుకు కారణం. కాబట్టి, కావ్యం కూడా నానా రుచిరార్థ సూక్తి నిధి కావలసి ఉంటుందని తాత్పర్యం. మొదటి రెండు సూత్రాల ద్వారా ప్రతిపాదించిన అంశాలను నన్నయగారు ఈ సూత్రంలో ఒక విధంగా సంపుటీకరిస్తున్నారు.

'నానా రుచిరార్థ సూక్తి నిధి' అంటే–అనేక విధాలయిన, రుచిరాలయిన అర్థాలను ప్రతిపాదించే సూక్తులకు కావ్యం నిధి కావాలని అర్థం. మరి, సూక్తులంటే ఏమిటి? దైనందిన జీవితంలో ఉదాహరించుకోవటానికి వివిధ సందర్భాలకు సరిపోయే యోగ్యమయిన 'సుభాషితా'లని సామాన్యంగా అర్థం చెప్పబడుతున్నది. 'నన్నయగారి సూక్తులు జగత్ ప్రసిద్ధము' లని సత్యనారాయణగారనటంలోని తాత్పర్యమిదే. ఈ తాత్పర్యధోరణిలోనే

సూక్తులనగా సుభాషితాలనియే గాక సామెతలు, నానుడులు, జాతీయములు (పదగతములు–వాక్యగతములు), నీతిబోధక వాక్యములు మున్నగునవి యన్నిగూడునని విశాలమైన యర్థమున గ్రహించవచ్చును.

అని అవధానిగారంటే; భారతం లోకాగమన్యాయై కాంత గృహంబు (ఆది. 3-11) అని నన్నయగా రన్నారు. కాబట్టి ఆ విధమయిన న్యాయ ప్రతి పాదక వాక్యాలు సూక్తులని, వాటిని నన్నయ రుచిరార్థవంతములుగా తీర్చుటకు యత్నించె నని మాధవశర్మగారి అభిప్రాయం. మరి, ఈ ధోరణిలోనే హనుమచ్ఛాస్త్రిగారు -

రుచిరార్థమను మాటను కవితా పరముగా గ్రహించుటలో వినిగమకము లేదు. అది ప్రసన్న కవితార్థ యుక్తి అను మాటతో గతార్థ మగుచున్నది. కాగా, రుచిరార్థమనగా ఉజ్జ్వలమైన ధర్మ నీతి బోధనమనియు, సూక్తి యనగా అనుభవ పరిపాకములో గ్రహించిన జీవన సత్యములకు చెందిన లోకోక్తులనియు గ్రహించుట మేలు అని భావించారు. ఈ విధమయిన అభిప్రాయాలకు ఉపబలకంగా నన్నయగారి రచనలోని అనేక వాక్యాలు, పద్యాలు, పద్యభాగాలు లోకోక్తులుగా, సుభాషితాలుగా, నానుడులుగా దేశంలో ప్రసిద్ధంగా వ్యాపించినయి. అవన్నీ అంతగా ప్రసిద్ధమయిన వంటే, అది నన్నయగారి పరమమయిన లోకజ్ఞతకు ఒక నిదర్శనం. కాని, ఈ సూత్రం కేవలం నన్నయగారి రచనకు మాత్రమే పరిమితం కాదు; ఒక సూక్తులకు మాత్రమే పరిమితం కాదు. దాని పరిధి చాలా విస్తృతమయింది. రుచిరార్థమను మాటను కవితా పరముగా గ్రహించుటలో వినిగమకము లేదనుటానికీ వీలులేదు. నిజానికి రుచిరార్థమనగా ఉజ్జ్వల మయిన నీతి బోధన మనటానికి మాత్రం వినిగమక మేమిటి? సూక్తి కావచ్చునా? కాని, సూక్తికి ఈ సందర్భానికి అనుగుణ మయిన వేరే అర్థం ఉంది. ప్రసన్న కవితార్థ విషయం ఇదివరకే మొదటి సూత్రం సందర్భంగా చర్చించబడింది. కాగా, రుచిరార్థాన్ని కవితా పరంగా గ్రహించటానికి నన్నయగారికి పూర్వుడయిన గొప్ప ఆలంకారికుడు దండి, అనంతర కాలంవాడయిన జగన్నాథ పండితరాయలు చెప్పిన అంశాలు వినిగమకం. మొదటి సూత్రంలో ఉండటానికే వీలులేని - కవితా - పదంవల్ల ఇది గతార్థమనటానికి అసలు వీలు కలిగించదు. 'సూక్తి' పదానికున్న వ్యావహారిక బలం వల్ల సుభాషితం అని ప్రస్తుతం భావించటం సామాన్యధోరణి.

నన్నయగారికెంతో అరాచీనుడూ, తెలుగువాడూ, సుప్రసిద్ధాలంకారికుడూ, ప్రామాణికుడూ అయిన జగన్నాథ పండితరాయలు (ఈయనా, నన్నయగారూ ఒకే ప్రాంతానికి చెందినవారు కావటం కూడా ఇక్కడ గుర్తు చేసుకోవచ్చు. పండితరాయలది గోదావరీ మండలంలోని ముంగండ. నన్నయగారిది రాజమహేంద్రవరం.) తనకన్న పూర్వాలంకారికులు చేసిన కావ్య నిర్వచనాలను చర్చా పూర్వకంగా నిరాకరించి సమగ్రంగా తాను చేసిన కావ్య నిర్వచనం నన్నయగారి 'రుచిరార్థ సూక్తికి అనువాదమా?' అనిపిస్తుంది. ఈ అంశాన్ని శ్రీ రామమూర్తిగారీ విధంగా వివరించారు.

రుచిరార్థమనగా రమణీయార్థమని యర్థముగదా! ప్రతిపాదకత్వమన్నది శబ్దార్థములకు గల సంబంధము. రుచిరార్థ సూక్తియనగా రమణీయార్థ ప్రతిపాదక శబ్దము.

నన్నయగారు ఇక్కడి సూత్రాల్లో రుచిర, రమ్యపదాలూ, ఇతరత్ర గూడా రుచిర, రోచన, రంజన, రమణీయాది పదాలను ప్రయోగించిన అంశం గుర్తుచేసుకోవచ్చు. రమణీయార్థ ప్రతి పాదక శబ్దః కావ్యమ్' అనే తన కావ్య నిర్వచనంలో జగన్నాథుడు శబ్ద పదాన్ని ఉపయోగించాడు. నన్నయగారి నిర్వచనంలో సూక్తి పదముందు. సు + ఉక్తి = సూక్తి. ఉక్తి, శబ్దం – ఈ రెండూ స్థూలంగా సమానార్థకాలుగానే కన్పించవచ్చు గాని, వాటి మధ్యలో కొంత భేదముంది. ఉక్తి అంటే చెప్పబడినది అని అర్థం. చెప్పేవాడు ఉద్దేశించిన అర్థం గూడ గమనింపదగినదన్న స్ఫూర్తి ఉక్తి పదం వల్ల కలుగుతుంది. అందువల్లనే కావచ్చు శ్రీరామమూర్తిగారు ఉక్తి యనగా శబ్దార్థముల సమాహారమని యర్థము చేసుకోవలెనన్నారు. కాని, ఇట్లా అర్థం చేసుకొంటే రుచిరోక్త అంటే చాలు; అర్థపదం అనవసరం. కాని, సూత్రంలో అర్థ పదముంది. కాబట్టి ఉక్తి అంటే కేవలం శబ్దం అని మాత్రమే చెప్పవలసి ఉంటుంది. జగన్నాథుడు గూడ ఈ అంశాన్నే బలపరిచాడు. అయితే, కేవలంగా ఉక్తి అని ఊరుకోకుండా సూక్తి అనటం నన్నయగారి విశేషం. అర్థం రుచిరం కావలసిన విధంగానే ఉక్తి కూడా సూక్తి కావాలని ఆయన నిర్ణయం. అర్థంలో రుచిరత్వముండటమే కాక, ఆ అర్థాన్ని ప్రతిపాదించే ఉక్తిలో గూడా సుష్ఠుత్వం ఉండటం అవసరం. లేకపోతే సమతౌల్యం కుదరదు. కాగా, రుచిరమయిన అర్థాన్ని ప్రతిపాదించే సుష్ఠువయిన ఉక్తి కావ్యమని తాత్పర్యం. ఉక్తి విశేషం కావ్యమన్న రాజశేఖరుడి నిర్వచనం ఇక్కడ గుర్తుకొస్తుంది. ఉక్తి విశేషమే సూక్తి. నన్నయగారు కలిగించిన ప్రేరణతోనే కావచ్చు; ఎఱ్ఱనగారి చతురోక్తి, మధురోక్తి, మధురోక్తి (నృసిం. 1-17,21) అని వ్యాఖ్యానించారనిపిస్తుంది. రామ రాజభూషణుడు 'ఉక్తిమయ ప్రపంచ' (వసు. 1-8) మనటం గూడా ఈ సందర్భంలో గుర్తుకు రానే వస్తుంది. ఇట్లా ఉక్తిశీలురైన చాలామంది కవులను గమనించవచ్చు.

ఈ 'రుచిరార్థ సూక్తి' కి ముందు నానా అనీ, చివరలో నిధి అని నన్నయగారు చేర్చటం మరో విశేషం. ఉక్తి, లేదా శబ్దం –ఇవి ఏకత్వ బోధకమైనవి. సూత్రంలో ఉక్తి సమానగతంగా ఉంది కాబట్టి దానికి బహువచనార్థం కూడా చెప్పుకోవచ్చు. కాని, పండితరాయల వద్ద ఏకవచనమమని స్పష్టమే. అయితే, ఒకే శబ్దం కావ్యమని ఎవరూ అనుకోరు. ఇక్కడ శబ్దం శబ్ద సమాజానికంతటికీ ఉపలక్షణం. సాహిత్య

దర్పణ కర్త అయిన విశ్వనాథుడు వాక్యం రసాత్మకం కావ్యమ్ అని చేసిన కావ్య నిర్వచనాన్ని ఉదాహరిస్తూ ఆధునికంగా – రసాత్మకమయిన ఒక్క వాక్యమయినా సరే కావ్యమవుతుందని పలుచోట్ల వ్యాఖ్యానించటం కేవలం అవిచార మూలం. అక్కడ వాక్యమన్నది ఉపలక్షణమే తప్ప కేవలం ఏకవచన బోధకం కాదు. జగన్నాథుని శబ్దమూ అంతే. 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ కావ్యమ్' (కావ్యాదర్శం) అని దండి కావ్య నిర్వచనం. ఇక్కడ స్పష్టంగా పదావళి అని పద సమూహం వ్యక్తం చేయబడింది. నన్నయగారి 'రుచిరార్థా'నికి దండి 'ఇష్టార్థం' ప్రేరకం కావచ్చు. కాగా, సూక్తి బహుత్వం, శబ్ద బహుత్వమే కావ్యం. కాని, నన్నయగారు ఇంతటితో ఆగటం లేదు. ఆయన స్పష్టమయిన వైవిధ్యాన్ని గూడా ఉద్దేశిస్తున్నారు. నానా అనేది సమూహత్వాన్ని సూచించట మట్లా ఉంచి, ప్రధానంగా వైవిధ్యాన్ని సూచిస్తుంది. కాగా; నానా విధాలయిన రుచిరార్థ ప్రతి పాదకాలయిన సూక్తులకు కావ్యం నిధి కావాలని నన్నయగారి నిర్ణయం. కావ్యం ఆద్యంతం ఈ విధమయిన సూక్తులమయం కావలసి ఉంటుంది కాబట్టి నానా–రుచిరార్థ సూక్తి నిధి కావ్యమని ఆయన నిష్కర్ష. ఈ సూత్రాల సందర్భంగా 'కావ్య' పదం కనిపించకపోవచ్చు. ఈ సూత్రాలు కావ్య సూత్రాలు కావటానకి అదేమీ బాధకం కాదు. 'భారతం' నెపంగా ఈ విషయాలను చెప్పటం వల్ల ఇవన్నీ కావ్య విషయాలేనన్నది స్పష్టమే.

ఇక్కడ మరొక అంశం గమనించవలసి ఉంది. అర్థం కావ్య వస్తువు. కావ్యవస్తువు ఏదో అర్థం విషయం కానే అవుతుంది. కాగా, ఉక్తి కావ్యరూపం. ఈ వస్తు – రూపాలు కావ్యంలో సమతౌల్యంతో ఉండటం అవసరం. ఈనాడు మనం అనుకొంటున్న రూపవాదం, వస్తువాదం వంటివాటికి అవకాశం కలుగనీయని విధంగా అర్థఉక్తి పదాలకు రుచిర, సు అనే విశేషణాలను చేర్చటం ద్వారా నన్నయగారు కావ్యం వస్తు – రూపాల సమ్యక్ సమన్వయంగా అన్యూనాతిరిక్తంగా కలిసి ఉండాలని సూచిస్తున్నారు. నన్నయగారి ఈ సూత్రం దగ్గర కూడా – జగన్నాథ పండితరాయలు తన కావ్య నిర్వచనాన్ని నిరూపించటానికి పూర్వులు చెప్పిన వాటిని గురించి చేసిన చర్చనంతా చేసి చూసుకొంటే నన్నయగారి విచారణలోని మౌలికత ఉజ్జ్వలంగా స్పష్టపడుతుంది. ఆయన చేసిన ఈ విచారమంతా పరమ వివేక సౌరభ విభాసితము (ఆది. 1–24) అని ఆయన ముదం బొనరంగొనియాడిన సత్సభాంతరము లందు ఆమోదం పొందింది; నన్నయగారు నిర్దేశించిన ఈ కావ్య విచార మార్గం

సువ్యవస్థితమయింది; అనంతర విమర్శకులకు, కవులకూ ఆదరణీయమయింది. కాగా, సత్యనారాయణగారన్నట్లు

ఈ మార్గమునే నాలుగు వందల యేండ్ల తరువాత జగన్నాథ పండితరాయలు రసగంగాధరమునందు ప్రపంచించినాడు. అటు కాశ్మీర, మిటు వేంగీదేశము అలంకార శాస్త్రమునకు రెండు సూర్యోదయ పర్వతముల వలెనున్నవి. అభినవగుప్తుడు కాశ్మీర దేశ విద్వన్మార్గమును ప్రపంచింపగా, జగన్నాథపండితుడు వేంగీదేశ విద్వత్పరిష న్మార్గమును ప్రపంచించినాడు. రమణీయర్థ ప్రతిపాదక శబ్దః కావ్యం అన్న జగన్నాథుని సూత్రము జగన్నాథుని కల్పన కాదు; వేంగీ పరిషత్తుల నిశ్చితాభిప్రాయము.

ఈ అభిప్రాయానికి తన మౌలిక వివేచన ద్వారా మొదటి సారిగా రూపకల్పన చేసి సమగ్రతను సంపాదించింది నన్నయగారు.

**కథా లక్షణ నిరూపణ**

భారత కథా ప్రస్తావనలో ఇమిడి పోయేట్లుగా నన్నయగారు చేసిన కథా స్వరూప – స్వభావాల నిరూపణం మొదటి సూత్రానికి అనువృత్తిగా గమనించవలసి ఉంటుంది. నా వలన నెక్కథ వినవలతురు? (ఆది. 1-29) అని రౌమహర్షిణి శౌనకాది మునుల నడిగినప్పుడు వారిట్లా అన్నారని నన్నయగారు ఈ కింది పద్యం రాశారు.

ఏయది హృద్య, మపూర్వం
బేయది యేద్దాని వినిన వెఱుక సమగ్రం
బై యుండు, నఘ నిబర్హణ
మేయది – యక్కరయ వినగ నిష్టము మాకున్. (ఆది. 1-30)

ఇక్కడ శౌనకాది మునులు సహృదయులైన శ్రోతల / పాటకుల స్థానంలో ఉండటాన్ని గమనించటం అవసరం. సహృదయుల వైపు నుండి వివేచన సాగుతున్నదని తాత్పర్యం. తమకు ఫలానా కథ ఇష్టమని వారు చెప్పలేదు. ఏ కథ చెప్పినా, దాని స్వభావం ఎట్లా ఉండాలనేది, దాని లక్షణా లేమిటనేది మాత్రం వారు చెప్పారు. నిజానికి ఈ చెప్పింది నన్నయగారే. కథా స్వభావానికి సంబంధించి నాలుగంశాలను ఆయన ఒక క్రమంలో చెప్పారు.

1. హృద్యత; 2. అపూర్వత; 3. ఎరుక సమగ్రంగా కలిగించటం; 4. అఘ నిబర్హాణత. ఇవి క్రమంగా అనుశీలించవలిసిన అంశాలు.

మొదటి లక్షణం: కథ హృద్యం కావటం, రెండవది: అపూర్వం కావటం. ఈ రెండింటికి పరస్పర సంబంధం ఉన్నట్లు కన్పిస్తుంది. ప్రస్తుతానికి హృద్య విషయం

అట్లా ఉంచి, అపూర్వమంటే ఏమిటి? భారత సందర్భాన్ని బట్టి చూస్తే శౌన కాది మునులడిగినప్పుడు ఆ కాలానికి భారత కథ అపూర్వమైతే కావచ్చునేమో గాని, నన్నయగారి నాటికది అక్షరాలా అపూర్వం కాదు. కాబట్టి, నన్నయగారి నాటి బారత శ్రోతలకు / పాఠకులకు అది అంతకు ముందు తెలిసిన కథే. మూలానికి అనువాద ప్రాయంగా రాయబడింది కాదీ కథా లక్షణాల పద్యం. మూలంలో ఈ కథా విషయ ప్రస్తావన లేనే లేదు. ఇది కేవలం నన్నయగారి వివేచన నుంచి నిష్పన్నమయిన నిర్ణయంగా ప్రవర్తించిన పద్యం. మరి; నన్నయగారిట్లా కథ అపూర్వం కావాలనటంలో ఆయన తాత్పర్యమేమిటి?

అపూర్వత్వమనేది రెండు విధాలుగా ఉంటుంది. ఒక విధం. అంతకు ముందు లేకుండా, కొత్తగా కల్పితమైనదైతే ఆ కథలో అపూర్వత్వం ఒక విధమయింది. అంతకు ముందు లేని, లేదా వినని కథ అయితే, కథలో ముందేమి జరుగుతుందో తెలుసుకోవాలన్న ఉత్సుకతను శ్రోతలో / పాఠకుడిలో ఈ అపూర్వత్వం రెచ్చగొడుతుంది. ఒకసారి విన్న / చదివిన తరువాత ఇక ఆ అపూర్వత్వం ఉండదు. కాగా, ఇది కాలం మీదా, ముందేమి జరుగుతుందని తెలియని తనం మీదా ఆధారపడిన అపూర్వత. కథకు దాని ఉత్పాద్యత్వాన్ని బట్టి సాధారణంగా ఇది కలుగుతున్నది. మరి, కథ ఉత్పాద్య / కల్పితమయినప్పుడే అపూర్వత్వముంటుందనుకొంటే, అతి విచిత్ర కవి పరంపరా వాహిని అయిన సంసారం (ప్రపంచం)లో కాళిదాసాదులయిన ఏ నలుగురయిదుగురో మహాకవులుగా పరిగణింపబడుతున్నారని ఆనందవర్ధనుడు ప్రస్తావించిన కాళిదాసాదులు అపూర్వ కథా రచనా దక్షులు కారనే చెప్పవలసి ఉంటుంది. వారు తమతమ కావ్యాల్లో నిర్వహించిన కథలన్నీ ఇదివరకటివే. దండి మాటల్లో చెప్పితే అవన్నీ 'ఇతిహాస కథోద్భూత' మయినవే. ప్రసిద్ధములే, కాగా అవి అపూర్వాలు కావు; వాటిలో అపూర్వత్వం లేదు. ఈ విధమయిన అపూర్వ తాత్పర్యంతోనే రామలింగారెడ్డిగారు – మొత్తము మీద (కవిత్రయము వారు) భాషాంతరీకర్తలే గాని అపూర్వ సృష్టిక్రియా నిపుణులు కారు అని అన్నారు. అంతే కాదు, అది కవులు భాషాంతరీకరణము చేసిన వారు కావున, నపూర్వ రచనా సామర్థ్యము వీరికున్నదో లేదో తెలియదు. అనగా, వీరి కుపజ్ఞ ఏ మాత్రమున్నదనుట వివాదాంశమే! అని సందేహించే దాకా వెళ్ళారు. అపూర్వ సృష్టి క్రియ, అపూర్వ రచనా సామర్థ్యం అంటే నూతన కథా కల్పన మని రెడ్డి గారి తాత్పర్యం. నూతన కథా కల్పన కారణంగానే పింగళి సూరనను ఆయన అంతగా అభిమానించి పైకెత్తారు. రెడ్డిగారు ప్రధానంగా ఉత్పాద్య కథాభిమాని. ఆయన ఉద్దేశించిన అపూర్వత్వం ఆ విధమయింది.

అపూర్వత్వం మరొక విధంగా కూడా ఉంటుంది. నిజానికి, పూర్వం ఉన్నదే అయినా, కవి యొక్క ప్రతిభా విశేషం చేత, కథా కథన విధానం వల్ల, నిర్వహణ విధానాన్ని బట్టి, భంగీ వైచిత్రిని పురస్కరించుకొని, లోకజ్ఞత లోని గాఢత్వం ద్వారా – ఇంకా అనేక విధాలుగా కథలో అపూర్వత్వం నిష్పన్నమయితుంది. ఒక భావం పూర్వం వ్యక్తీకరింపబడిందే అయినా, దాన్నే మళ్లీ వ్యక్తీకరించటంలో కొత్తదనం కలుగుతుందంటూ ఆనందవర్ధనుడు

కృతే వర కథాలాపే, కుమార్యః పులకోద్గమైః

సూచయన్తి స్పృహమంత, ర్లజ్జయావనతాననాః

(వరుడిని గూర్తి సంభాషణలు సాగుతూ ఉంటే సిగ్గుతో మోములు వంచిన కన్యలు తమ కోరికను పులకోద్గమంతో సూచిస్తున్నారు) అనే శ్లోకం అంతకు ముందే ఉన్నా గూడా, అందులోని భావాన్నే –

ఏవం వాదిని దేవర్షౌ, పార్శ్వే పితు రథోముఖీ

లీలా కమల పత్రాణి, గణయామాస పార్వతీ.

(దేవర్షి అయిన నారదుడిట్లా మాట్లాడుతూ ఉండగా తండ్రి పక్కనున్న పార్వతి మొగం వంచుకొని (చేతిలోని) లీలా కమల పత్రాలను లెక్క పెట్టసాగింది) అని కాళిదాసు (కుమార సంభవంలో) వ్యంజించిన విధం అర్థశక్త్యుద్భావాసురణ రూప వ్యంగ్యానికి కవి ప్రౌఢోక్తి నిర్మిత శరీరత్వం చేత నవ్యత్వం కలిగింది. అని వివరించాడు. ఇక్కడ లజ్జా భావ వ్యక్తీకరణంలో వ్యంగ్యముఖంగా నవత్వం సిద్ధించిందని తాత్పర్యం. కథా విషయంలోనూ ఇంతే. ఒక కథ ఉన్నది. ఆ కథలో ఒక అంశాన్ని కేంద్ర బిందువుగా చేసుకొని ఆ కథ ప్రవర్తిస్తుంది. ఆ కేంద్ర బిందువును మార్చితే ఆ కథే కొత్త కథగా ప్రవర్తిస్తుంది. అందుకే, ఒకే కథను అనేకమంది ప్రతిభావంతులు గ్రహించి రచించినా గూడా, వీటిని చదివి పాఠకులు నూత్నానుభవాన్ని పొందగలుగుతున్నారు. అంటే, అవన్నీ అపూర్వాలే. ఒక రసాన్ని వ్యంజించే కథను మరొక రసాన్ని వ్యంజించే విధంగా నిర్వహించటం ప్రబంధ వక్రత అవుతుందని కుంతకు డన్న గొప్ప ఆలంకారికుడు వక్రోక్తి జీవితంలో చేసిన నిర్ణయం. నిజానికి ఈ విధమయిన అపూర్వత్వం స్థిరాంశం. ఈ సందర్భంలో శ్రీశ్రీ అభిప్రాయం గమనింపదగింది.

వినోదానికి చదువుకునే డిటెక్టివ్ నవలకీ అభిజ్ఞాన శాకుంతలానికి భేదం ఎక్కడుంది? మాట వరసకి ఒక మంచి డిటెక్టివ్ నవల తీసుకొందాం. కొనదాకా కుతూహలం సన్నగిల్లకుండా, హంతకుడెవరో ఆఖరిదాకా బయట పెట్టకుండా చక్కని

కథా నిర్వహణం గల డిటెక్టివ్ నవల ఉందనుకోండి. కొన దాకా చదివి హంతకుడెవరో తెలుసుకున్నప్పటి ఆ దృశ్యాన్ని అనుభవించామనుకుందాం. కాని, హంతకుడెవరో తెలిసి పోయిం తరువాత మళ్లీ మనమా నవల జోలికిపోము. అదివ్వగల ఆశ్చర్యం ఒక్కసారి మాత్రమే. కాని, మహా కావ్యాలు అలా కాదు. శకుంతల కథ మనకు తెలుసు, దుష్యంతుని ప్రవర్తన మనకు తెలుసు. అయినా మళ్లీ శాకుంతలం మనల్ని ఆకర్షిస్తుంది. ఎన్నిసార్లు చదివితే అన్ని మార్లు ఒక ఆశ్చర్యం కలుగుతుంది. ఒక క్రొత్త విశేషం గోచరిస్తుంది. ఏ దైతే అనుక్షణ నవీనమైన ఆశ్చర్యం మనకి కలుగజేస్తుందో అదే సౌందర్యం.

(ఇక్కడ సౌందర్యమన్నది 'రస' మన్న తాత్పర్యంతో శ్రీశ్రీవాడారు.) అందువల్ల కథలో ఔత్సుక్యం కలిగించటం కోసమయిన అపూర్వత్వం కన్నా, ఎప్పటికప్పుడు ఎన్నిసార్లు విన్నా, చదివినా కొత్త విశేషాలను స్ఫురింపజేస్తూ సౌందర్యానుభూతిని కలిగించే లక్షణమే కథకు వాస్తవమయిన అపూర్వత్వం. కాగా, ఇదంతా కథ చెప్పే నేర్పు మీద ఆధారపడి ఉంటుంది. రౌమహర్షణిని కథా కథన దక్షుడనటం ఇందుకే. అపూర్వతకు ప్రసన్న కథా కలితార్థ యుక్తిత్వంతో బాటు దాన్ని అనుసరించే కథా కథన దక్షత కూడా అవసరం. ఈ విధంగా నన్నయగారు ఈ అపూర్వతను ప్రధానంగా, మొదటి విధాన్ని గౌణంగా భావించారు.

ఈ అపూర్వత్వం హృద్యతను కలిగించటంలో ఒక ప్రధాన హేతువు. ఇదట్లా ఉంచి; హృద్యత కథలోని 'హిత' లక్షణంతో ప్రధానంగా ముడి పడి ఉంటుంది. హితమూ మనోహరమూ అయిన హక్తు దుర్లభ మంటారుగాని, నిజానికి, హితం కాని మనోహరత్వం / హృద్యత్వం యథార్థమైన మనోహరత్వం హృద్యత్వం కాదు. సహిత మయినప్పుడే హృద్యత. కాగా, హృద్యత్వం ఈ విధంగా కథకు సంపాదింప బడుతుంది. తరువాత అంశాలు ఇందుకు ఉపబలకం.

కథ ఎఱుక సమగ్రంగా కలిగించేది కావాలనటం మూడవ అంశం. మరి, ఈ ఎఱుక జ్ఞానం దేనికి సంబంధించింది? లోకం, వ్యక్తి – ఈ ఉభయులకూ సంబంధించింది. లోకజ్ఞత నుంచి నిష్పన్నమయిన కథ శ్రోతకు / పాఠకుడికి లోక వృత్తానికి సంబంధించిన ఎఱుకను కలిగించ వలసే ఉంటుంది. అనంతర కాలంలో మమ్మటుడన్న గొప్ప ఆలంకారికుడు కావ్య ప్రయోజనాల్లో పేర్కొన్న (లోక) వ్యవహారనేతృత్వం ఇక్కడ గుర్తుకు వస్తుంది. ఇది ఎఱుకకు సంబంధించిన ఒక పార్శ్వం. రెండవది తాను (వ్యక్తి). తనను గూర్చిన ఎఱుక – స్వస్వరూప జ్ఞానం; ఆత్మజ్ఞానం. ఈ రెండు విధాల సమిష్టి సూత్రమే సమగ్రమయిన ఎఱుక. కాగా, ఈ

ఉభయ సమిష్టి జ్ఞానం కలిగించటం ద్వారా జీవితంలో సమగ్రతను సాధించేందుకు శ్రోతను / పాఠకుడిని అభిముఖం చేసే లక్షణం కథలో ఉండాలని తాత్పర్యం.

నాల్గవది అఘ నిబర్హణత్వం, పాపాన్ని నిరోధించటం; పాపాన్ని నశింపజేయటం. ఈ లక్షణం కథలో ఉండవలసింది. మరి, పాపాన్ని కథ ఎట్లా నిబర్హణం చేస్తుంది? పాపం, పుణ్యం, అనేవి కర్మను బట్టి; ఆ కర్మ చేసేది వ్యక్తి. పరోపకారం పుణ్యాయ పాపాయ పరపీడనమ్' అనేది సుప్రసిద్ధమయిన సుభాషితం. పరపీడన పరాయణ మయిన కర్మ – అదెంతటిదయినా, ఎట్లాంటి దయినా, పాప హేతువు. ఈ కర్మను నిరోధింపగలిగితే పాపం నిరుద్ధమయితుంది, నశిస్తుంది. అంటే – వ్యక్తిని పాప హేతువయిన కర్మ నుంచి – పరపీడన పరాయణత్వం నుంచి నిరోధించేట్టు కథ ఉండాలని తాత్పర్యం. అప్పుడా కథ అఘ నిబ్హరణ లక్షణ వంతమయితుంది. కాగా, కథ వ్యక్తికి ధర్మ ప్రవృత్తి ప్రేరకం కావాలని పరమార్థం.

ఈ విధమయిన నాలుగు లక్షణాలు గల కథను కావ్యానికి సమ కూర్చుకోవాలని నన్నయగారి తాత్పర్యం. ఈ లక్షణాలు కేవలం భారత కథకవి కాదు; కావ్య కథకు. అందుకనే, నన్నయగారు ఈ లక్షణాలను కావ్య కథా సామాన్యంగానే నిర్దేశించారు. తప్ప కేవలం భారత కథ కవి ప్రత్యేకించలేదు. కథ ఏదయినా కావచ్చుగాని, దానికి ఉండవలసిన లక్షణాలు మాత్రమివి.

భారతీయ సాహిత్య విమర్శ సంప్రదాయ మార్గంలో కథను గూర్చి ఆలోచించింది. ముగ్గురు మాత్రమే. తొలి ఇద్దరు భామహుడు, దండి. ఒక విధంగా భరతుడి తరువాత సాహిత్య వివేచనకు ఒక నిశ్చిత మార్గాన్ని సూచించింది వీరే. ఇద్దరూ గొప్ప ఆలంకారికులు. చివర నన్నయగారు. మొదటి ఇద్దరు భావిక(త్వ)ంఅనేది ప్రబంధ (కావ్య) విషయగుణంగా ప్రతిపాదించారు. కావ్యంలో కథకు సంబంధించినదది. దాన్ని గూర్చి వారిద్దరూ చెప్పిన అంశాలను కలగలుపుకొని మొత్తంగా చూస్తే ఎనిమిది. అవి–

1. కథ ఋజువుగా సాగిపోవటం.
2. కథలో చిత్రో దాత్తాద్భుతార్థత్వం ఉండటం.
3. కథాంశాలు పరస్పరం ఉపకారంగా కూర్చబడటం.
4. వ్యర్థ విశేషణాలు వదిలి వేయటం.
5. స్థానం (సందర్భం) బట్టి వర్ణనలు చేయటం.

6. వస్తువు గంభీరమయిందే అయినా, శబ్దాల అనాకులత్వంతో ఉక్తిక్రమ బలంతో సువ్యక్తం కావటం.

7. భూత భవిష్యదర్థాలు ప్రత్యక్షంగా దర్శింపబడేట్లు చిత్రించటం.

8. ప్రబంధాల (కావ్యాల)లో కథంతా కవి యొక్క అభిప్రాయానుకూలంగా సాగటం.

పై అంశాలలో కొన్నింటిని కొంచెం వివరించు కోవలసిన ఉంది. రెండవ అంశంలో 'చిత్రో దాత్తాద్భుతార్థత్వం' అని ఉంది. కథలోని 'అర్థం' అంటే విషయం చిత్రంగా ఆకర్షకంగా ఉండటం మొదటి అంశం. అయితే చిత్రంగా ఉండటం కోసం ఏవేవో గిరికీలు తిరుగటం కాక, ఉదాత్తరీతిలో ఉండటం అవసరం. చివరి అద్భుతమనేది రసాన్ని సూచిస్తుంది. మూడవ అంశం కథలోని వివిధ సంఘటనలను, సన్నివేశాలను ఒక దాన్నుంచి ఒకటి సహజంగా ఆవిష్కరించబడ్డట్టు అనిపించేట్టుగా కూర్చటం – అనే కథా నిర్మాణాన్ని సూచిస్తుంది. నాల్గవ, అయిదవ అంశాలు కవి యొక్క భాషా శక్తి వర్ణనా శక్తి దురుపయోగం కావద్దని, కథ చెప్పటానికి, వ్యక్తీకరణకి ఎంత అవసరమో అంతే ఉండాలని సూచిస్తున్నాయి. ఆరవదీ ఏడవదీ నాటకీయతను సూచస్తున్నాయనిపిస్తుంది. అనాకులత్వం అంటే శబ్దాల అన్వయ విషయంలో చికాకు కలిగించకుండా ఉండటం. అంటే, సులభంగా అర్థమయ్యేట్లు ఉండటం, వినగానే అర్థం తెలిసేట్లుగా ఉండటం అనవచ్చు. దృశ్యానికీ ఈ స్థితి అవసరం. ఉక్తి – మాట, మాటల క్రమ బలం అంటే, మాట మీద మాట పెంచుతూ ఉక్తి ప్రత్యుక్తి రూపంగా ఉండటం. ఈ రెండంశాలూ గంభీరమయిన వస్తువును సులభంగా శ్రోత / పాఠకుడు గ్రహించటానికి సహకరిస్తాయి. భూత కాలానికీ, భవిష్యత్కాలానికీ కూడా సంబంధించిన లేదా, చెప్పిన / చెప్పబోయే అంశాలు శ్రోత / పాఠకులకు కళ్లకు గట్టినట్లు అనిపించటం – ఇదీ నాటకీయతకు సంబంధించిందే. చివరిది చాలా ప్రధానమయింది. కథను చెప్పటంలో కవి ఏ అంశాన్ని వ్యక్తీకరించ టానికి అనుకూల పద్ధతిలో ఉండటం. ఈ ఎనిమిదంశాల్లో రెండవదీ, చివరిదీ తప్ప మిగిలినవన్నీ కథా నిర్మాణానికీ, కథా కథనానికీ సంబంధించినవి. చివరిది కవి తన అభిప్రాయానికి అనుకూలంగా కథను రూపొందించుకోవాలనటం. ఇది కూడా ఒక విధంగా కథను నిర్మించుకోవటానికి సంబంధించిందే. రెండవది మాత్రం కథా స్వభావానికి సంబంధించింది. కథ వినటంలో ఉత్సుకత కలిగించటంలో ఈ అంశం ప్రాధాన్యం

పొందుతుంది. ఈ అంశాలనూ, నన్నయ గారు కథను గూర్చి చెప్పిన అంశాలను – ప్రసన్న కథా కలితార్థయుక్తుతో బాటు కలుపుకొని చూస్తే నన్నయగారు చెప్పిన అంశాల ప్రామాణికత, నిశ్చితత్వం సామాజిక హిత దృష్టి స్పష్టపడుతాయి. కథను గూర్తి ఆయన చెప్పిన నాలుగంశాల్లో మొదటి రెండు కథ వైపు శ్రోతను / పాఠకుడిని ఆకర్షించటానికి తరువాతి రెండంశాలు శ్రోత / పాఠకుడిలో ఎదుగుదలను, ప్రవృత్తిని ఉద్దీపింప చేయటానికి సంబంధించినవి. కథా విషయంలో కీలకమయిన, ప్రాణ ప్రదమయిన అంశాలను నిర్ణయించి వ్యక్తీకరించిన తీరు లోని ఆధునికత స్పష్టపడుతుంది. దీని పయిన్నే ఆయన చెప్పిన కావ్య ప్రయోజనం ఆధారపడింది.

**కావ్య ప్రయోజనం : జగద్ధితం**

నన్నయగారు సాగించిన కావ్య విచారంలో ఒక విధంగా చివరిది కావ్య ప్రయోజనం. జగద్ధితం కావ్య ప్రయోజనమని ఆయన నిర్ణయం. తాను జగద్ధితంబుగన్ మహాభారత సంహితా రచన బంధురుడయినట్లు ఆయన ప్రకటించారు.

నన్నయగారికి పూర్వం అనేకమంది కావ్య మర్మజ్ఞులు కావ్య ప్రయోజనాలను రకరకాలుగా పేర్కొన్నారు. బుద్ధి వివర్ధనం, లోకోపదేశం, యశస్సు, హితం మొదలయిన వాటిని నాట్య శాస్త్ర కర్త భరతుడు; ధర్మార్థ కామ మోక్షాల విషయంలో, కళల విషయంలో విచక్షణ (దృక్పథం), కీర్తి, ప్రీతి అని కావ్యాలంకార కర్త భామహుడు; ప్రజలకువ్యుత్పత్తి (పరిజ్ఞానం) అని కావ్యాదర్శ కర్త దండి, అర్థం, అనర్థ ఉపశమనం అని కావ్యాలంకార కర్త రుద్రటుడు; (భామహుని గ్రంథాన్ని భామహాలంకారం అనీ, రుద్రటుని గ్రంథాన్ని రుద్రటాలంకారం అనీ స్పష్టత కోసం వ్యవహరిస్తూండటం ప్రసిద్ధం); ప్రీతి, కీర్తికి కారణాలయిన దృష్ట అదృష్టార్థాలని కావ్యాలంకార సూత్ర కర్త వామనుడు; ప్రీతి అని లోచన (ఆనందవర్ధనుడి ధ్వన్యాలోకానికి వ్యాఖ్య) వ్యాఖ్యాత అభినవ గుప్తుడు … ఇట్లా చాలామంది చాలా రకాలుగా భావించారు. ఈ భావించిన వాటిలో సమానాంశాలు గూడా అనేకం. ఈ అన్నింటినీ సంకలనం చేసి కొంటూనే, వీటన్నిటి కన్నా విలక్షణంగానూ, ఒక్క మాటగా నన్నయగారు చెప్పింది సమగ్రంగానూ కన్పిస్తుంది.

నన్నయగారు తాను ఉద్దేశించిన కావ్య ప్రయోజనాన్ని మరొక రకంగా గూడా సువ్యక్తం చేశారు. వ్యాసుని గూర్తిన ప్రస్తావన గమనించదగింది. … పరాశరాత్మజుండు విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై పరగుచుండఁ జెసె భారతంబు (1–32)

అంటారాయన. పరాశరాత్మజుడయిన వ్యాసుడు విష్ణు సన్నిభుండు అంటే, విష్ణువు వంటివాడు; విష్ణువంతటివాడు. విష్ణువు సర్వ వ్యాపకుడు. విష్ణు శబ్దానికి విశ్వ వ్యాపకత్వమని వ్యుత్పత్త్యర్థం. అంతేకాకుండా, విష్ణువు స్థితి కారకుడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు క్రమంగా సృష్టి, స్థితి, లయ కారకులు. కాగా, విష్ణువుకు సర్వ వ్యాపకత్వం, లోక స్థితి కారకత్వం ప్రసిద్ధం. కవి కూడా తన లోకజ్ఞత, భావనా శక్తి, జ్ఞాన విజ్ఞాన సంపత్తి మొదలయినవి కారణంగా విశ్వవ్యాపకుడు. సృష్టి చరాచర జీవ జంతువుల వస్తువుల వృత్తి ప్రవృత్తులు; లోకం – వీటి రహస్యాలను ఆకళింపు చేసుకొన్నవాడు. లోక ప్రవృత్తిని ఉదాత్తీకరించే ప్రయత్నంలో తన సర్వశక్తులను ధారపోసేవాడు. విశ్వ సుస్థితి. విశ్వ శ్రేయస్సు కవికి ధ్యేయాలు; లక్ష్యాలు. అందుకే నన్నయగారు వ్యాసుని గూర్చి ప్రస్తావించిన దాదాపు ప్రతి సందర్భంలోనూ విష్ణుప్రస్తావన జతపరుస్తూ ఉంటారు. వ్యాసుడు విష్ణువు యొక్క అవతారమనే విషయం అట్లా ఉంచి, ఇక్కడ ప్రధానంగా ఆయన భారత సంహిత రచన బంధురుడు. నిజానికి వ్యాసుడు త్రిమూర్తుల అంశాత్మకుడుగా కూడా గౌరవం పొందాడు.

అచతుర్వదనో బ్రహ్మ, ద్విబాహు రపరో హరిః
అఫాల లోచన శ్శంభుః, భగవాన్ బాదరాయణః

(భగవంతుడు (పూజ్యుడు) అయిన బాదరాయణుడు – వ్యాసుడు నాలుగు మొగాల రూపం లేని బ్రహ్మ; రెండు బాహులు గల అపర విష్ణువు; నొసటకన్ను లేని శివుడు) – ఇది ఈ దేశంలో సుప్రసిద్దమయిన వ్యాసస్తుతి. ఇక్కడ మరొక విషయం గుర్తించవలసి ఉంది. నన్నయగారు త్రిమూర్తుల క్రియాకలాపాలను మూడింటినీ ఏకముఖంగా సమన్వయించి వారందరూ స్థితి కారకులే నంటూ భారతాన్ని ఆరంభించారు.

శ్రీ వాణీ గిరిజా శ్చిరాయ దదతో వక్షోముఖాంగేషు యే
లోకానాం స్థితి మావహంత్య విహతాం స్త్రీపుంసయోగోద్భవామ్
తే వేదత్రయ మూర్తయ స్త్రీ పురుషా స్సంపూజితా వ స్సురైః
భూయాసుః పురుషోత్తమాంబుజభవ శ్రీ కంధరా శ్రేయసే.

ఇది ఆయన భారతారంభంలో రచించిన పద్యం. స్త్రీ పుంసయోగం వల్ల ఉదయించింది లోకం. సృష్టి లేకపోతే లోకానికి ఉనికి లేదు. దాని ప్రసక్తి లేదు. నిత్య సంసరణ (ప్రవాహ) శీలమయిన సంసారం – లోకం యొక్క ప్రవాహ శీలాన్ని

రక్షించటం స్థితి నిరూపకం. ఆ ప్రవాహశీలాన్ని అదుపులో ఉంచటం లయ లక్షణం. ఈ మూడూ పరమార్థతః స్థితి దృక్పథం కలవే. అందుకే ప్రసిద్ధంగా స్థితి కారకుడయిన విష్ణువుతో – పురుషోత్తమునితో త్రిమూర్తుల క్రమాన్ని నన్నయగారు ఆరంభించి సర్వమూ దానికి అభిముఖంగా ఉండాలని సూచించారు. అందుకే త్రిమూర్తుల లక్షణాల సమిష్టి రూపమయిన వ్యాసుని విష్ణువుగా ప్రధానీకరించారు. విష్ణు లక్షణ లక్షితుడయిన కవిగా –

భారత భారతీ శుభగభస్తి చయంబులఁ జేసి ఘోరసం
సార వికార సంతమన జాల విజృంభము వాపి, సూరిచే
తో రుచిరాబ్జ బోధన రతుండగు దివ్య బరాశరాత్మజాం
భోరుహ మిత్రుఁ గొల్చి ముని పూజితు భూరి యశో విరాజితున్ (1–32)

అని ఆ ధ్యేయాన్ని స్పష్టం చేశారు. ఈ సంసారంలో వికృతుల వల్ల కలిగే అజ్ఞానాన్ని, దాని వ్యాప్తిని తొలగించటం కవి లక్ష్యం. కవి హక్కులు శుభంకరమయిన సూర్యకిరణాలు. కవి సూర్యుడు. సూర్యుడు గూడా త్రిమూర్తుల రూపమని ప్రసిద్ధి. అదట్లా ఉంచి సూర్యుడికి 'మిత్రు' దని పర్యాయనామం. కవి కూడా లోకానికి మిత్రుడు. ఈ విధంగా కవి బాధ్యతనూ, ఆ కవి కావ్యం ద్వారా సాధించవలసిన ప్రయోజనాన్నీ నన్నయగారు జగద్ధితంగా నిరూపించారు. మరి, జగత్తుకు 'హితం ఏమిటి'? – ఇదిక్కడ చర్చా విషయం కాదు. ఏది హితమయితే దాన్ని కావ్యం సాధించవలసి ఉంటుంది. ఈ హితమనేది కవి సంస్కారాన్ని బట్టి, తాత్విక దర్శనాన్ని బట్టి స్పష్టపడుతుంది. కాగా, కావ్యప్రయోజనం జగద్ధితం కావాలన్నదే ఇక్కడ విస్తృత ప్రాతిపదికపైన నన్నయగారు ప్రతిపాదించారు.

**కవి యోగ్యత:**

బాధ్యతాయుతంగా కావ్యరచన చేసి, యథార్థమయిన కావ్య ప్రయోజనాన్ని సాధించవలసిన కవి యోగ్యత లేమిటి? నన్నయగారు ఈ అంశాలను గూర్చి కూడా గాఢంగా విచారించారు. ఈ విచారణ ఫలితాలను తన మీద ప్రయోగించి, చూసుకొని – 'తన కుల బ్రాహ్మణు నను రక్తు...' (ఆది. 1–9) అనే పద్యంలో ప్రకటించారు. ఇక్కడ ఒక చమత్కారమయిన అంశం గమనించవలసి ఉంది. నన్నయగారు తన భారత సంహితకు అవతారిక ఉత్తమ పురుషలో కాక ప్రథమ పురుషలో నిర్వహించారు. అందువల్ల నన్నయ పరంగా చెప్పబడిన అంశాలన్నీ కవిపరంగా భావించటానికి

అవకాశం కలుగుతున్నది. ఆ పద్యంలో కేవలం వ్యక్తిగా నన్నయగారిని పరిచయం చేసే అంశాలూ, కవిగా వ్యాపక దృష్టితో గమనింపవలసిన అంశాలూ కలగలిపి చెప్పబడినాయి. ప్రత్యేక వ్యక్తికి కవి సామాన్యానికీ వర్తించే అంశాలు అవి స్ఫురింపజేయటం కోసం ఇట్లా కలగలిపినట్లు గుర్తింవచ్చు. కాగా; కవిగా నన్నయగారికీ, కవి సామాన్యానికీ వర్తించే అంశాలను ఒక చోటికి తీసుకువస్తే – అవి ఎనిమిది:

1. విపుల శబ్ద శాసనత్వం, 2. బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతత్వం; 3. సద్వినుతావదాత చరితత్వం; 4. లోకజ్ఞత; 5. ఉభయ భాషా కావ్య రచనాభి శోభితత్వం; 6. సత్ ప్రతిభాభి యోగ్యత; 7. నిత్య సత్య వచనత్వం; 8. సుజనత్వం.

పద్యంలో ఉన్న వరుస ప్రకారం ఉన్న ఈ ఎనిమిదింటిలో అయిదింటిని (1,2,3,4,5,6) ఒక వర్గంగానూ, మూడింటిని (3,7,8) ఒక వర్గంగానూ విభజించి పరిశీలించు కోవటం సౌకర్యంగా ఉంటుంది. స్థూలంగా చూస్తే 1,2,4 అంశాలను వ్యుత్పత్తి అనీ, 5 పది అభ్యాస మనీ చెప్పవచ్చు. ఆరవది ప్రతిభగా స్పష్టంగానే ఉంది. అంటే, కవికి ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసాలను నన్నయగారు ప్రతి పాదిస్తున్నారని సులభంగానే గుర్తించవచ్చు. అయితే, ఆయన కొన్ని అంశాలను ప్రధానీకరించి ప్రత్యేకంగా నిర్దేశిస్తున్నారనేది ప్రధానంగా గుర్తించవలసి ఉంది. కావ్యం రచించటానికి ఉత్సహించే వ్యక్తి (కవి) మొట్టమొదట సంపాదించవలసింది భాషపై అధికారం. అతి పరిమితమయిన పరిధుల్లో పని గడుపుకొనే కవిత/ కావ్యానికి అని కాదుగాని, ఒక మహాకావ్య రచనకు విస్తృతంగా భాషపై అధికారం అవసరం. అది కవి స్వాధీనంలో ఉండటం అవసరం. అయితే, ఇంత మాత్రంతో సరిపోదు; తనకు వారసత్వంగా, సాంప్రదాయికంగా లభించిన విజ్ఞానంపై ఆసక్తి, నిష్ఠ, దాని పరిజ్ఞానం తప్పనిసరిగా అవసరం. ఇదంతా సరిగా అవగాహన అయినప్పుడే కవి శ్రోత / పాఠకుల ఎఱుకను సమగ్రం చేసే అవకాశం లభిస్తుంది. ఇతిహాసాలు పురాణ ప్రభేదాలన్నాడు రాజశేఖరుడు. కాగా పురాణేతిహాస విజ్ఞానం కవికి అతిముఖ్యమయింది. వీటిలో అపారంగా మానవలోక జీవితం ఉంది. అయితే, కేవలంగా గ్రంథ విషయ పరిజ్ఞానం మాత్రమే సరిపోదు. తాను స్వయంగా లోకాన్ని పరిశీలించటం వల్ల కలిగిన లోకజ్ఞత లోక స్వరూప స్వభావాల, వివిధ ప్రవృత్తుల, స్థితి – గతులకు సంబంధించిన విజ్ఞత అవసరం. ఈ లోకజ్ఞత గ్రంథాలనుంచి లభించిన పరిజ్ఞానానికి వాస్తవికమయిన ఉపయోగ లక్షణాన్ని సంపాదిస్తుంది. అంతేకాదు; ఈ లోకజ్ఞత అనుభవానికి మూలం.

అనుభవ రాహిత్యం గ్రంథ గత బహువిషయ పరిజ్ఞానాన్ని ఉపయోగకరంగా వినియోగించటానికి సామర్థ్యం కలిగించదు. కాగా, ఈ లోకజ్ఞత అనుభవానికి మూలం. అనుభవ రాహిత్యం గ్రంథ గత బహువిషయ పరిజ్ఞానాన్ని ఉపయోకరంగా వినియోగించటానికి సామర్థ్యం కలిగించదు. కాగా, ఈ లోకజ్ఞత అనుభవాన్ని పండించి, తనకు లభించిన పూర్వాధునిక విజ్ఞాన సంపత్తికి సమన్వయ పూర్వకంగా, లోకహితకరంగా కావ్యంలో వినియోగించటానికి ఉపకరిస్తుంది. కావ్యగతంగా భిన్న భిన్న సన్నివేశాల, ఘట్టాల, సందర్భాల, వ్యక్తుల – ఇంకా అనేకానేకాంశాల చిత్రణ సమర్ధవంతంగా, ప్రభావకారిగా, ఆహ్లాదకరంగా, ప్రయోజనవంతంగా సాగేట్టుగా సహకరిస్తుంది. శ్రోత / పాఠకుల ఇష్టానిష్టాలను, హిత – అహితాలను నిరూపించుకొని ముందుకు సాగటంలో తోడ్పడుతుంది. మరి, ఇదంతా ఉండగా, 'రచనాశక్తి' లేకపోతే ప్రయోజనం లేదు. ఇన్నింటినీ సమన్వయించి ప్రదర్శించటానికి ఈ శక్తి ముఖ్యం. ఉభయ భాషా కావ్యాల – సంస్కృతాంధ్ర భాషా కావ్యాల రచనా శక్తితో రచనాభ్యాసం వల్ల రాటు తేలిన శక్తితో కావ్యరచనకు వీలు కలుగుతుంది. మరి, కావ్యాన్ని 'వినూత్నంగా' నిష్పన్నం చేసేది ప్రతిభ. ఇది కేవలంగా కాక, సత్ ప్రతిభ కావాలని నన్నయగారి నిర్ణయం. ప్రతిభ కవికున్న ఒక గొప్ప శక్తి. ఇది ఎట్లా ప్రసరించినా ప్రసరించవచ్చు. అసమార్గంగా పెడదారిలో ప్రసరిస్తే కావ్యం ప్రయోజనవంతం కాక పోవటమే కాక అపకారకం కూడా అయితుంది. శ్రోత / పాఠకులను అధికంగా ప్రభావితం చేయగల కావ్యంగా వ్యక్తమయ్యే ఈ ప్రతిభ వక్రంగా ప్రవర్తించి అపచైతన్య (తప్పుడు అవగాహనకు) కారణమయి, అనర్థం కూడా కలిగించే ప్రమాదం ఉంది. అందువల్ల నన్నయగారు కేవలం ప్రతిభ అనకుండా సన్మార్గ ప్రవృత్తిగల ప్రతిభ సత్ ప్రతిభను మాత్రమే ఉద్దేశించి, సల్లక్షణాన్ని ప్రధానీకరించారు.

ఈ సల్లక్షణం కవి వ్యక్తిత్వంలో వ్యాపించి ఉండేది. అందువల్ల ఈ అంశాన్ని భూమికగా పెట్టుకుని రెండవ వర్గంలోని అంశాలను గమనించవలసి ఉంటుంది. ఈ వర్గంలోని మొదటి అంశం సద్వినుతావదాత చరితత్వం; రెండవది నిత్య సత్యవచనత్వం; మూడవది సుజనత్వం. ఈ మూడూ సామాజికంగానూ, వైయక్తికం గానూ ప్రతి వ్యక్తిలోనూ ఉండవలసిన అంశాలు. అయినా, శ్రోత / పాఠకులను ప్రభావితులను చేసే ఉన్న స్థాయికి చెందిన కవిలో తప్పనిసరిగా ఉండవలసినవి. మంచి వారి మెప్పుదలకు యోగ్యంగా స్వచ్ఛమయిన చరిత (వ్యక్తిత్వం; జీవన విధానం) కవికి కావాల్సిన మొదటి అంశం. 'నే నెట్లాంటి వాడనయితేనేం? నా వైయక్తిక

జీవితం ఎట్లాంటిదయితేనేం? నా కవిత్వం మాత్రం ఉత్తమమయింది; నా కంటే గొప్పది. కవికంటే గొప్పది ఆయన కావ్యం / కవిత / రచన వంటి భ్రాంతి మయమయిన ఆలోచనా ధోరణి నన్నయగారికి అంగీకార్యం కాదు. కవిలో లేని ఉత్తమత్వం కావ్యంలో ఎట్లా వస్తుంది? రాదని, వస్తుంది / వచ్చింది అనిపించేది ఆభాస మాత్రమేననీ, వస్తుందనుకోవటం భ్రమ మాత్రమేననీ నన్నయగారి తాత్పర్యం. అందుకే కవి చరిత్ర – వ్యక్తిత్వాన్ని గూర్తి ఆయన అంత గట్టిగా చెప్పటం. జీవితంలో సత్య నిష్ఠ, సత్యవచనత్వం లేని కవి కావ్యం ద్వారా భ్రమ ప్రమాదాలను మాత్రమే కలిగించగలడు. సుజనత్వం లేని కవికి లోక హిత దృష్టి ఉండే అవకాశమే లేదు. అందువల్ల ఈ మూడంశాలకు నన్నయగారు కవి వ్యక్తిత్వపరంగా ప్రాధాన్యమిచ్చారు. కవి జీవితంతో పాఠకులకు / శ్రోతలకు పరిచయం ఉన్నప్పుడే కవి వ్యక్తిత్వాన్ని గూర్చి చెప్పిన ఈ అంశాలను పాఠకుడు / శ్రోత అంచనా వేసుకొనటానికి వీలుంటుంది గాని, పరిచయం ఉండే అవకాశం లేనప్పుడు వీటి స్థితి ఏమిటి? అప్పుడు పాఠకుడు / శ్రోతల ముందుండేది కావ్యమే గదా! కావ్యాన్ని బట్టి కవిని అంచనా వేసుకోవచ్చు గదా! – అనిపించవచ్చు. పాఠకుడు / శ్రోత అంచనా వేసుకొనటం గురించి కాదు నన్నయ గారీ అంశాలను చెప్పింది; కావ్యం నిష్పన్నం కావటం గురించి. అట్లాంటి వ్యక్తిత్వం గల కవి వల్లనే జగద్ధిత ప్రయోజన కరమయిన కావ్యం నిష్పన్నమయితుంది. 'నానృషిః కురుతే కావ్యం' అన్న సూక్తి ఇట్లాంటి కవుల్ని మాత్రమే ఉద్దేశించింది. 'నా విష్ణుః పృథివీ పతిః' అంటే, ప్రతి రాజూ విష్ణువే అని చెప్పటం ఎట్లాంటి పెడర్థమో, ప్రతి కవీ ఋషి అనటం గూడా అట్లాంటిదే. నన్నయగారు చెప్పనవన్నీ ఋషి లక్షణాలు. నిజానికి అచ్చంగా 'ఋషి' కావటానికి ఇంకా చాలా అంశాలు కావలసి ఉండవచ్చుగాని, కవి కావటానికి మాత్రం ఈ లక్షణాలు తప్పని సరి అని తాత్పర్యం. అంటే; 'కవి' కావటమనేది అంత సులభం కాదన్నమాట. 'మందః కవి యశః ప్రార్థీ' (కవి యశస్సు కోరుతున్న నేను మందుడిని) అని కాళిదాసంతటి వాడన్నాడు. అది ఆయన వినయాన్ని సూచిస్తుందనుకోవటం కేవలం అమాయకత్వమే. వాల్మీకి, వ్యాసుల ముందు నిలిచి కాళిదాసన్నది, నిజానికి, యథార్థం. కవి అచ్చంగా ఋషి కాదు. వాల్మీకి, వ్యాసుడు మొదట ఋషులు; ఆ తరువాత కవులు. కవి ఋషి లక్షణాలు కొన్ని కలవాడు. నన్నయగారిలో ఈ లక్షణాలున్నయి. ఆయన తనను గూర్తి తెలిపిన వాడు – స్వస్వరూప పరిజ్ఞానం కలవాడు. కవులకు ఆ లక్షణాలను ఆయన ఉద్దేశించారు. ఆయన్ను గూర్చి

'ఋషి వంటి నన్నయ...' అని సత్యనారాయణ గారనటంలో తాత్పర్యం ఇదే. ఋషి వంటి కవి 'వి నిర్మించి'న కావ్యమే ప్రయోజన కరమయితుంది.

**ఉప సంహృతి**

ఇప్పుడు గమనించవలసిన అంశమేమిటంటే – అలనాడు నన్నయగారు సాగించిన కావ్య వివేచనాంశాలు – కథ, కథాకథనం, కథా కథనం సాగవలసిన తీరు, రమ్యత, వస్తు రూపాల సమతౌల్యం, హితం మొదలయిన అంశాలు మళ్లీ ఈ ఆధునిక కాలంలో ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ మార్గాన విస్తృతంగా వివేచన విషయాలు కావటం. రామలింగారెడ్డి, దువ్వూరి రామిరెడ్డి, రాయప్రోలు, విశ్వనాథ, శ్రీశ్రీ వంటి విమర్శకులు సాగించిన ఆధునిక విమర్శను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టపడుతుంది. కాగా, నన్నయగారు 'పరమ వివేక సౌరభ విభాసితం'గా వెలయించిన సూత్ర రూప సాహిత్య వివేచన, ఆయన నాటికే కాదు; ఈనాటికి గూడా మౌలిక మయింది. అంతేకాదు, భారతీయ సాహిత్య విమర్శ సంప్రదాయ మార్గంలో విరియించిన చక్కని చిక్కని మణికాంతి. ఇది నన్నయగారి సాహిత్య వివేచనా వైలక్షణ్యం.

# 2. తిక్కన గారి ఉభయ కావ్యప్రౌఢి పాటించు శిల్పం

భారతీయ సాహిత్య విమర్శ సంప్రదాయ మార్గాన కావ్య వివేచన సాగించిన తిక్కనగారు ప్రతిపాదించు అనేకాంశాల్లో 'ఉభయ కావ్యప్రౌఢి పాటించు శిల్పం' ప్రత్యేకంగా గమనించదగింది. ఉత్తర రామాయణ కావ్యావతారికలో తన కావ్య 'వినిర్మాణ' సామర్థ్యాన్ని గురించి విశేషంగా ప్రస్తావిస్తూ –

అమలో దాత్త మనీష నే నుభయ కావ్య ప్రౌఢి పాటించి శి
ల్పమునం బారగుఁడన్, గళా విదుఁడ .... 1-13

నని చెప్పుకొన్నారాయన. ఈ 'ఉభయ కావ్యప్రౌఢి పాటించు శిల్పం' తన పరంగా చెప్పుకొన్నట్లున్నా, అది శిల్పం కాబట్టి, అది ఆయన వివేచనా రీతినీ, ఆయన కావ్య దృక్పథాన్నీ వ్యక్తీకరిస్తుంది. కాగా. 'ఉభయ కావ్యప్రౌఢి పాటించు శిల్పం' అన్నదానిలో మూడంశాలను ఆయన చేర్చారు. ఒకటి ఉభయ కావ్యం; రెండు ప్రౌఢి; మూడు శిల్పం. ఈ మూడింటి స్వరూప స్వభావాలను మొదట విడివిడిగా స్పష్టపరచుకొంటే; వాటి సమన్వయం, తిక్కన గారి తాత్పర్యం చివరకు సులభంగానే అర్థమవుతుంది.

**ఉభయ కావ్య విచారం**

మొదట స్పష్టం కావలసింది 'ఉభయ కావ్య' స్వరూప స్వభావాలు. దీన్ని గురించి ఆలోచించబోయేప్పటి కల్లా తిక్కనగారి 'ఉభయ కవిమిత్ర' బిరుదం గుర్తుకు రాకమానదు. 'ఉభయ కవి' కీ 'ఉభయ కావ్యా'నికీ సంబంధం ఉండి ఉంటుందని పించటంలో అసహజత్వం కూడా ఏమీ లేదు. తిక్కనగారి ఈ బిరుదాన్ని మొదటిసారిగా మనకు పరిచయం చేసింది కేతన. ఆయన తన 'దశకుమార చరిత్ర' కావ్యాన్ని తిక్కన గారికి అంకితం చేశాడు. ఆ కావ్యావతారికలో కేవలం ఈ బిరుదాన్ని ప్రస్తావించి ఊరుకోలేదు; ఆ బిరుదానికి అర్థం చెబుతున్నాడా, నిర్వచిస్తున్నాడానిపించేట్టు –

అభిమతుఁడు మనుమ భూవిభు
సభఁ దెనుఁగున సంస్కృతమునఁ జతురుండై తా
నుభయ కవి మిత్ర నామము
త్రిభువనముల నెగడ మంత్రి తిక్కఁడు దాల్చెన్. 1-92

అంటాడాయన. తిక్కన గారు తెలుగు లోనూ, సంస్కృతంలోనూ 'చతుర'డయి 'ఉభయ కవి మిత్రు'డని పేరు పొందారుట. చాతుర్య విషయంలో భాషా ప్రసక్తే తప్ప కవితా ప్రసక్తి లేకపోవటం ఇక్కడ గుర్తించవలసిన అంశం. మరి; వచ్చిన పేరేమో ఉభయ 'కవి' మిత్రుడని. బిరుదుకీ, అందుకు చెప్పిన కారణానికీ పొసగుదల సరిగా ఉన్నట్టు కన్పించదు. అయినా పొసగింపు ఉన్నట్లే భావించి 'ఉభయ కవు'లంటే – తెలుగు – సంస్కృత భాషా ప్రస్తావన పైన ఉండటం బట్టి – తెలుగు-సంస్కృత కవులనీ, ఆయన ఉభయ (రెండు) 'భాష'ల్లో చతురుడు కావటం వల్ల ఈ ఉభయ కవులకూ మిత్రుడనీ కొందరు విమర్శకుల తాత్పర్యం. ఇట్లాంటి తాత్పర్యం సంపాదించుకొన్న తరువాత 'ఉభయ కావ్య' మంటే తెలుగు – సంస్కృత కావ్యాలని అర్థం చెప్పటం సులభమే. ఈ తాత్పర్యాన్ని బలపరుస్తున్నాడా అన్నట్టు కేతన తిక్కన గారిని గూర్చి – 'లలిత నానా కావ్యములు చెప్పు నుభయ భాషల యందు ననుట ప్రశంస త్రోవ...' (1-93) అన్నాడు. దీనితో ఉభయకవి / ఉభయ కావ్యాలు అంటే తెలుగు – సంస్కృత కవులు / కావ్యాలు అని నిర్ధారించటం మరింత సులభమయి పోయింది. ఇంకా మరి కొంత ముందు వెనుకలుగా గమనిస్తే అనేకమంది కవులు ఉభయ భాషలను ప్రస్తావించారని తెలుస్తుంది. 'భాషింతు నన్నయ భట్టు మార్గంబున నుభయ వాక్ ప్రౌఢి నొక్కొక్కమాటు' (కాశీఖండం, 1-13) అని శ్రీనాథుడన్నాడు. నన్నయ గారు తాను 'ఉభయ భాషా కావ్య రచనాభిశోభితుఁడ' (భార. ఆది. 1-9) నని అనటం నుంచి శ్రీనాథుడి 'ఉభయ వాక్ ప్రౌఢి' నిష్పన్నమయింది. 'ఉభయ భాషా కవిత్వ ప్రయోగ కుశలుడ' (హర విలాసం, 1-18) నని కూడా శ్రీనాథుడన్నాడు. జక్కన గూడా – 'స్వాభావిక నవ కవితా ప్రాభవముల నుభయ భాషఁ బ్రౌఢిమఁ జెప్పన్ తాను 'చతురుఁడు'నన్నాడు. ఇక్కడ 'చతురుడు' ప్రౌఢి(మ) కూడా ఉన్నవి. ఉభయ భాషలంటే తెలుగు – సంస్కృత భాషలని రూఢికెక్కిన ప్రసిద్ధ విషయం. ఈ అన్నింటి సహాయ సహకారాలతో 'ఉభయ కవి / కావ్యాలు' తెలుగు – సంస్కృతకవి / కావ్యాలని నిశ్చయింపబడుతున్నది'. కాని – ఇక్కడ ప్రధానంగా గుర్తించవలసిన విషయం ఒకటున్నది. నన్నయాదులు ఈ సందర్భంలో సర్వత్రా 'ఉభయ' పదంతో 'భాష', లేదా భాషార్థక మయిన మరొక పదాన్నో తప్పక చేర్చటం వల్ల మాత్రమే ఉభయ 'భాష' లన్న అర్థం నిర్ధారితమవుతున్నది. కాని, 'ఉభయ కవి, ఉభయ కావ్యా'లన్న సందర్భాల్లో ఉభయం భాషలు మాత్రమే నని చెప్పటానికి నిర్ధారకమయిన పదమేదీ లేదు. నిజానికి, 'ఉభయ' పదానికి రెండు (లేదా జంట) అని మాత్రమే అర్థం. ఆ రెండు ఏమిటన్నది దాని తరువాత ఉన్న పదం తెలుపుతుంది. 'భాషా'

పదం తరువాత ఉంటేనే రెండు 'భాషల'న్న అర్థం వస్తుంది. అది లేకపోతే కేలంగా 'ఉభయ' పదం తనంతట తానుగా 'రెండు భాషలు' అని అర్థం ఇయ్యటానికి సమర్థం కాదు. అందువల్ల ఇక్కడి ఉభయ పదానికి 'ఉభయ భాష'లని అర్థం చెప్పటం కుదరదు. కాగా, మరో విధంగా దాన్ని గూర్చి ఆలోచించవలసి ఉంటుంది.

తిక్కనగారికి నేరుగా శిష్యుడయి, ఆయన అడుగుజాడల్లో ముందుకు పోవటానికి అన్ని విధాలా ప్రయత్నం చేసి, అంతో ఇంతో సాఫల్యం పొందిన మారన తిక్కన గారిని 'ఉభయ కవిత్వ తత్త్వ విభవోజ్జ్వలుఁడు (మార్కండేయ పురాణం, 1-10) అని ప్రశంసించాడు. తిక్కన గారిని గూర్చి కాకున్నా తన తండ్రిని గూర్తి ఎఱ్ఱనగారు '...అప్రతి మాద్భుతోభయ కవిత్వ ప్రౌఢ శబ్దార్థ యోగాజ్ఞా సిద్ధిఘనుండు...' (నృసింహ పురాణం, 1-25) అని ప్రశంసించారు. ఈ ఇద్దరూ 'ఉభయ కవిత్వ' మన్నారే తప్ప 'ఉభయ భాషా కవిత్వ' మనలేదు. కవిత్వ తత్త్వ మనేది సంస్కృత భాషకొకటీ, తెలుగు భాష కొకటి అని వేరే వేరే ఉండదు. అందువల్ల భాషా భేద ప్రసక్తికి ఇక్కడ ఆస్కారమే లేదు. కవిత్వ తత్త్వమొక్కటే. అందుకనే తిక్కన గారు – 'సకల బ్రహ్మ ప్రార్థనంబు సేసి, తత్ ప్రసాదాసాదిత కవిత్వ తత్త్వ నిరతిశయాను భావానంద భరితాంతః కరణుండ...' (భార. విరాట, 1-2) నన్నారే తప్ప 'ఉభయ కవిత్వ తత్త్వ' మనో, తెలుగు కవిత్వ తత్త్వమనో అనలేదు. అయితే, మారన – ఎఱ్ఱనలు 'ఉభయ కవిత్వ (తత్త్వ)' మనటంలో తాత్పర్యమేమిటనేది కూడా ఒక ప్రశ్న. అయితే, 'ఉభయ కవి / కావ్య' స్వరూప స్వభావాలు స్పష్టపడితే ఈ ప్రశ్నకూ సమాధానం దొరుకుతుంది.

ఇక్కడ భాషాప్రసక్తి కుదురక పోవటం వల్ల మరికొందరు విమర్శకులు నన్నెచోడుణ్ని ఆశ్రయించి, ఆయన ప్రస్తావించిన 'మార్గ-దేశి' భేదాలను బట్టి 'ఉభయ కవి, ఉభయ కావ్యాలు' అంటే మార్గ – దేశి కవులు, మార్గ – దేశి కావ్యాలు అని భావించారు. కాని, ఇదీ కుదిరేట్టు కన్పించదు. చోడుడు నాలుగు రకాలుగా కవులను పేర్కొన్నాడు. పురాణ కవులు, ఉత్తమ మార్గ సత్కవీశ్వరులు, దేశి సత్కవులు, వస్తు కవీశ్వరులు. (కుమార సంభవం, 1-23,34). మరి, ఈ నాలుగు విధఆలయిన కవుల్లో 'ఉభయ కవులు'గా ఏ రెండు విధాల కవులను గ్రహించాలనేది ఏనాటికీ తేలదు. ఆయన మార్గ – దేశి భేదాలు చెప్పి 'మార్గ కవులు, దేశి కవుల'ను మాత్రమే పేర్కొని ఉంటే అది ఒక విధంగా బాగుండేది. కాని, నాలుగు విధాలను పేర్కొనటం ఇబ్బంది కలిగిస్తుంది. పురాణ-వస్తు భేదాలు కూడా ఉండగా కేవలం మార్గ – దేశి భేదాలనే ప్రధానీకరించటంలో ఔచిత్యం లేదు. మార్గ-దేశి భేదాలు ఒక విధమయిన

వనుకొంటే, పురాణ – వస్తు భేదాలు మరొక విధమయినవి. అది కూడా అట్లా ఉంచి కావ్య విషయంలో – 'దేశి మార్గములు దేశీయములుగా...' (1–36) రచించాలని నన్నెచోడుడంటున్నాడు. కాబట్టి, ఇక్కడ రెండు లేవు; ఉన్న దొకటే; అది దేశీయ రచన. ఇవన్నీ అట్లా ఉంచి; మార్గ – దేశి భేదాలను గూర్చి నన్నెచోడుని తాత్పర్యమేమిటో ఈ నాటికీ స్పష్టంగా నిర్ణయం కావలసిందిగానే మిగిలి ఉన్నది. మరొకటి ఉత్తర రామాయణావతారికలో – వళిప్రాసలను పులిమి పుచ్చుట, తెలుగు–సంస్కృతాలకు సంబంధించి లింగ – వచనాలను భేదింప చేయటం, 'జాత్యము' కాకపోతే తాను ఉపయోగించననటం మొదలయినవన్నీ నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథులనే దృష్టిలో పెట్టుకొని తిక్కనగారు స్పష్టం చేశారన్నది అందరూ అంగీకరిస్తున్న విషయమే. అంతే గాక, తిక్కన గారు గానీ, సూరన, ఎఱ్ఱనలు గానీ, కేతన గానీ ఈ మార్గ– దేశి విషయాన్ని సూచన ప్రాయంగా నైనా ఎక్కడ గూడా ప్రస్తావించ లేదు. అందుకని, ప్రస్తుతానికి, మార్గ – దేశి భేదాలను ఆశ్రయించటం గానీ, వాటిని అన్వయించటానికి చేసేప్రయత్నంగానీ ఫలప్రదం కాదు. కాబట్టి మరోవిధంగా ఆలోచించవలసే ఉంది.

మరో విధమయిన ఆలోచనలో నిష్పన్నమయిన మరొక ప్రతిపాదన దృశ్య – శ్రవ్య కావ్య భేదాలను ప్రస్తుతానికి ఉపయోగించుకోవాలనేది. తిక్కన గారి కావ్యాల్లో 'నాటకీయత' ఉన్నదనేది ఈ ప్రతిపాదనకు మూలం. 'సంవాదం' వంటి ఒకటి రెండు; లేదా, రెండో మూడో అంశాల వల్ల 'నాటకీయత' కావ్యంలో స్ఫురిస్తుంది. 'నాటకీయత' కారణంగా దృశ్య కావ్య లక్షణం. శ్రవ్య కావ్య లక్షణం ఎట్లాగూ ఉండనే ఉంది. కాగా, దృశ్య – శ్రవ్య కావ్యాల లక్షణ సమన్వయం గలది 'ఉభయకావ్య' మయితుంది. ఒక విధంగా ఇది బాగానే ఉన్నట్టు అనిపిస్తుంది. కాని; ఇక్కడ ఒకటి రెండంశాలను గమనించవలసి ఉంది. తిక్కన గాని కావ్య రచనను గూర్చి. ఆ తీరును గూర్చి అనేక విషయాలను ప్రస్తావించిన కేతన ఎక్కడ గూడా ఈ దృశ్య – శ్రవ్య ప్రస్తావన చేసి ఉండలేదు. తిక్కన గారిని 'మయూర సన్నిభ మహాకవి' (1–6); 'అధరీకృత మయూరుఁడు' (1–88) అని శ్రవ్య కావ్యమయిన 'సూర్యశత' కాన్ని రచించిన మయూరుడితో పోలిక తెచ్చాడే తప్ప. ఏ దృశ్యకావ్యకవితో గూడా పోలిక తేలేదు. ఆ 'సూర్యశతకం' వర్ణనా ప్రధానమైన ముక్తక కావ్యం. అందులో నాటకీయతకు అవకాశమే. లేదు. తిక్కనగారు 'అవు'నన్నచో 'భాణోచ్ఛిష్టం జగత్త్రయ' మన్న పల్కు సఫలమయినద'ని (1–90) గూడా కేతన అన్నాడు. మరి, ఆ బాణుని కాదంబరి గద్య కావ్యం. తిక్కనగారు 'పద్యాది త్రివిధ కావ్య పారీణు' (1–100) దని చెప్పాడు

కేతన. త్రివిధ కావ్యాలు: పద్యకావ్యం; గద్య కావ్యం; పద్య–గద్య మిశ్రిత చంపూ కావ్యం. ఈ మూడింటిలో ఏదీ దృశ్య కావ్యం కాదు. తిక్కనగారు కూడా తన కావ్యాల్లో ఎక్కడ గూడా దృశ్య – శ్రవ్య కావ్య ప్రస్తావనైనా చేయలేదు. పైగా 'కావ్యం' శ్రవ్య కావ్యమనటంలో ఎవరికీ విప్రతిపత్తి లేదు. కాగా, ఈ అన్నింటిని బట్టి ఇక్కడ ఉభయ కవి / కావ్యాలకు దృశ్య – శ్రవ్య కవి / కావ్యాలని చెప్పటానికి ఆస్కారం లేదు; ఉపపత్తీ లేదు. కాగా, ఈ విధమయిన 'ఊహ'ల నట్లా ఉంచి, భారతీయ సాహిత్య విమర్శ సంప్రదాయంలో ప్రస్తుత సమస్యకు పరిష్కారం కోసం చూడవలసి ఉంది.

**ఉభయ కవి : ఉభయ కావ్యం**

భారతీయ సాహిత్య విమర్శ మార్గంలో 'కావ్య మీమాంస' చేసిన రాజశేఖరుడు సుప్రసిద్ధుడు. ఆయన తన 'కావ్యమీమాంస'లో కవులను మూడు విధాలుగా వర్గీకరించాడు. ఒకటి శాస్త్రకవి వర్గం; రెండు : కావ్య కవి వర్గం; మూడు ఉభయ కవి వర్గం. మొదటి రెండు వర్గాల్లో ఉపవర్గాలను పేర్కొన్నాడు. శాస్త్ర కవి వర్గంలో మూడు ఉపవర్గాలు: ఒకటి: కేవలంగా శాస్త్రాలు రచించేవారు; రెండు: శాస్త్రంలో కావ్య సంవిధఆనం చేసేవారు; మూడు : కావ్యాల్లో శాస్త్రార్థాన్ని నిబంధించేవారు. ఇక కావ్య కవి వర్గంలో – రచన, శబ్ద, అర్థ, అలంకార, ఉక్తి, రస, మార్గ, శాస్త్రార్థ భేదంతో ఎనిమిది ఉపవర్గాలు. వీళ్లల్లో శబ్ద కవులు నామ, ఆఖ్యాత, ఉభయ భేదాలతో మూడు విధాలు కాగా; అలంకార కవులు శబ్దాలంకార, అర్థాలంకార భేదంతో రెండు రకాలు. ఈ వర్గాలు, లేదా విధాలు అని చెప్పేవన్నీ, నిజానికి, ఆయా కవుల లక్షణాలు; లేదా, గుణాలు. కావ్య కవుల విషయంగా చెప్పిన ఎనిమిదింటిలో రెండు మూడు గలవాడు కనీయసుడు (చిన్నవాడు = చివరివాడు); అయిదు ఉన్నవాడు మధ్యముడు; అన్నీ కలవాడు మహాకవి. ఇది రాజశేఖరుని నిర్ణయం. ఈ వర్గీకరణలో కొంత చర్చనీయత ఉంటే ఉండవచ్చుగాని, నిశితమయిన పరిశీలన ఇందులో ఉందనేది గుర్తించదగిన అంశం. కాగా; ఈ విధమయిన వర్గీకరణంగల శాస్త్ర – కావ్య కవుల మొత్తం పద్నాలుగు గుణాల సమ్యక్ సమన్వయం, సహ ప్రవృత్తి గలది 'ఉభయ కవి' వర్గం. ఈ సమన్వయం కారణంగా ఉభయ కవుల్లో మళ్లీ అంతర్భేదాలకు అవకాశం లేదు. రెండు వర్గాల మొత్తం గుణాలు గాక ఆ వర్గం గుణాలు కొన్ని ఈ వర్గం గుణాలు కొన్ని – అంటూ విభేదించటం రాజశేఖరుడి అభిమతం కాదు. దీనివల్ల 'ఉభయకవి'త్వంలో 'లోపం' ఏర్పడుతుందని ఆయన తాత్పర్యం కావచ్చు. కాగా; ప్రధాన వర్గీకరణాన్ని బట్టి శాస్త్ర కవులు, కావ్యకవులు, ఉభయకవులు – ఈ ముగ్గురిలో

ఉత్తరోత్తరులు (మొదటి వారికంటె రెండవ వారు, వారికంటే తరువాతి వారు; అంటే, శాస్త్ర కవులకన్నా కావ్యకవులు, వారికన్నా ఉభయకవులు అని తాత్పర్యం) శ్రేష్ఠులు అన్నాడు శ్యామదేవుడు. కాని, ఈ అభిప్రాయాన్ని రాజశేఖరుడు నిరాకరించాడు. ఎవరికి వారుగా మొదటి ఇద్దరూ సమానులే. తుల్యులే అని ఆయన అభిప్రాయం. ఎందుకంటే, ఈ ఇద్దరిలో ఒకరు చేసే పని మరొకరు చేయలేరు. రాజహంస వెన్నెలను తాగజాలదు; చకోరం నీర – క్షీరాలను వేరు చేయజాలదు. అయితే, ఉభయ కవి మాత్రం ఆ ఇద్దరి కన్నా శ్రేష్ఠుడని రాజశేఖరుడి నిర్ధారణ. ఎందుకంటే – ఉభయ కవి ఉభయత్ర ప్రవీణుడు; ఆ ఇద్దరి గుణాలన్నీ ఈయనలో చక్కగా సమన్వయం పొందుతాయి; అందుని. ఉభయకవి మిగిలిన ఇద్దరి కన్నా శ్రేష్ఠుడనటంలో శ్యామదేవుడితో రాజశేఖరుడికి పేచీ లేదు. కాని శాస్త్ర కవికన్నా కావ్యకవి గొప్ప అంటే మాత్రం ఆయన అంగీకరించడు.

రాజశేఖరుని ఈ నిశిత పరిశీలనా, నిర్ణయాలు తిక్కనగారు ప్రస్తావించిన, కేతన చెప్పిన ఉభయ కావ్య, ఉభయ కవి పదబంధాల అర్థాన్ని స్పష్టపరుస్తున్నాయి. రాజశేఖరుడు నిర్ణయించిన 'ఉభయ కవి' తిక్కనగారి బిరుదులో కెక్కాడు. కాగా; 'ఉభయకవి మిత్రు'డంటే, ఉభయ కవులకు (ఉభయ కవి + లు = ఉభయకవులు; వారికి –) మిత్రుడని అర్థం. శాస్త్రాలన్నీ సంస్కృత భాషలో ఉన్నాయి. ఆ శాస్త్రాల సమ్యగవగాహనకు సంస్కృతంలో 'చతురుడు' కావటం అవసరం. మరి, కావ్యం రచించేది తెలుగులో. అందుకని తెలుగులో చతురుడు కావటం తప్పనిసరి. ఈ 'చాతుర్యం' నిరూపితం కావలసింది సభలో. అందుకని, కేతన 'మనుమ భూవిభు సభఁదెనుఁగున సంస్కృతమునఁ జతురుండై' అని అన్నాడు. ఆ సభలో ఆయన – తిక్కన గారి చాతుర్యం నిర్ధారితమయి 'చతురుడ'ని ఆయనను అందరూ అంగీకరించారు. ఆ సభ మనుమ భూవిభునిది. మనుమ సిద్ధ కేవలం భూవిభుడు – రాజు కాదు; ఆయన శౌర్యాది విషయాలట్లా ఉండగా వాటితో బాటు తిక్కనగారు ఆ 'జనరంజకు'డయిన రాజును గూర్చి – వివిధ విద్యా పరిశ్రమనేది; కళా ప్వారుడు; పాండిత్య సుభగుడు; వివేక సౌరభ స్ఫురిత విచారుడు; కవిలోక వనవసంతుడు... ఇత్యాదిగా వివరించారు. ఇట్లాంటి రాజు సభలో ఎందరెందరో కవి పండితులు వివిధ సందర్భాల్లో సమావేశం కావటం సాధారణమే. అట్లాంటి సభ(ల)లో తిక్కనగారు 'చతురు'డని నిర్ధారణ అయింది. నన్నయగారి నాడు గూడ ఇట్లాంటి విషయాలు సభ(ల)లో నిర్ధారిత మయ్యేవి. అందుకే ఆయన 'పరమ వివేక సౌరభ విభాసితము'

లయిన సభలను కొనియాడారు. తిక్కనగారి నాడు అట్లాంటి సభలు – రాజ సభల కన్నా భిన్నంగా – ఉన్నట్లు దాఖలాలు కన్పించవు. కాని, వివిధ విద్యా పరిశ్రమనేది, వివేక సౌరభ స్ఫురిత విచారుడు, కళాస్ఫారుడు; పాండిత్య సుభగుడయిన రాజు 'సభ' అట్లాంటి సభ కాదనటానికి ఆధారమేమీ లేదు. కేతన ఈ సందర్భంలో తప్ప సభను పేర్కొన్న మరో సందర్భమేమీ లేదు. అదట్లా ఉంచి, కేతన తన కావ్యావతారికలో, ఆశ్వాసాద్యంత పద్యాల్లోనూ తిక్కన గారికి గల శాస్త్ర విషయ – కావ్య రచనా విషయ శక్తి సామర్థ్యాలను రకరకాలుగా ప్రస్తావించాడు, ప్రశంసించాడు. ఇదిట్లా ఉండగా, తిక్కనగారికి ఉభయకవిమిత్రుడన్న బిరుదు మిక్కిలి ప్రియమయిందిగా కన్పిస్తుంది. ఎట్లా అంటే, శ్రీమదుభయ కవి మిత్ర–అంటూ తన ఉత్తరరామాయణ, భారతాశ్వాసాంత గద్యల్లో ఆ బిరుదును ప్రత్యేకంగా, ముమ్మొదట మక్కువగా ఉపయోగించుకొన్నారు. రాజశేఖరుడు చెప్పిన ఉభయ కవి కాకపోతే అదేమంత గొప్ప బిరుదని! ఎన్నెన్ని అర్థాలు ఊహించినా 'అంత' గొప్పది కాదు. కాగా, తిక్కనగారు గానీ, కేతనగానీ ఉద్దేశించింది రాజశేఖరుడి నిర్ణయాన్నే. వాళ్లు చెప్పిన అంశాలన్నీ ఆ అభిప్రాయానికే సంగతపడుతున్నవి.

ఉభయ కవి అంటే ఎవరో తెలిసిం తరువాత ఉభయ కావ్యమంటే ఏమిటో స్పష్ట పడుతూనే ఉంది – ఉభయ కవి రచించే కావ్యం ఉభయ కావ్యం. మరొక విధంగా చెప్పితే – శాస్త్రనయ (విధాన) కావ్యనయ (విధాన) సమ్యక్ సమ్మేళన రూపమయిన కావ్యం ఉభయ కావ్యం. 'భారతం ఉభయ కావ్య'మనేది స్పష్టమే 'ధర్మతత్త్వజ్ఞులు ధర్మ శాస్త్రంబని, ఆధ్యాత్మ విదులు వేదాంతమనియు...' భారతాన్ని ప్రశంసిస్తున్నారని నన్నయగారన్నారు (భార.ఆది.1-32). భారత స్వరూప స్వభావ వివరణగా నన్నయగారు పై పద్యంలో చెప్పిన ఏడంశాల్లో మొదటివాడు – ధర్మ, వేదాంత, నీతులు. శాస్త్రత్వానికీ, తరువాతి నాలుగు – మహాకావ్య, లక్ష్య సంగ్రహ, ఇతిహాస, పురాణాలు కావ్యత్వానికీ సంబంధించినవి. ఈ నాలుగింటి లోనూ మొదటి రెండు కావ్య స్వరూప నిర్ణయానికీ, చివరి రెండు కావ్య వస్తువుకూ సంబంధించినవి. ఇదిట్లా ఉండగా భారతీయ సాహిత్య విమర్శలో మూర్ధన్యుడయిన ఆనందవర్ధనుడు – 'శాస్త్ర విధానంగా తృష్ణాక్షయ, సుఖపరిపోషణ లక్షణం; కావ్య విధానంగా శాంత రసం మహాభారతంలో ప్రధానాంశాలుగా వివక్షింప బడ్డాయని నిర్ణయం' అన్నాడు. కాగా, శాస్త్ర – కావ్య విధానాల సమన్వయం ద్వారా భారతం ఉభయ కావ్యమవుతున్నది. ఆనందవర్ధనుడు నిర్ధారించిన తీరు ఉభయ కావ్య లక్షణాన్ని సమర్థిస్తున్నది. తిక్కన

గారు గూడా వేదములకు; నిఖిలస్మృతి / వాదములకు; బహుపురాణ వర్గంబులకున్ / వాదైన చోటులను దా / మూదల ధర్మార్థ కామ మోక్షస్థితికిన్ (భాత. విరా. 1-4) అనటంలో భారతం శాస్త్రంగా పరమ ప్రమాణ మని ఆయన తాత్పర్యంగా స్పష్టపడుతుంది. అట్లాగే, కావ్యరసం, కావ్య కవిత్వం ఇత్యాదిగా భారత 'కావ్య'త్వాన్ని ఆయన స్పష్టం చేశారు. కాగా, భారతం 'ఉభయ కావ్యం'. అయితే -

**రామాయణం : ఉభయ కావ్యత్వం**

భారతం ఉభయ కావ్యం కావటం సరేగాని, తిక్కనగారు ఈ ఉభయ కావ్య ప్రస్తావన చేసింది ఉత్తర రామాయనంలో గదా! మరి, అది ఉభయ కావ్యమా? నిజమే; కాని, తిక్కనగారు రచించింది కేవలం ఉత్తరకాండ మాత్రమే. అంటే, రామాయణం మొత్తం మీద ఇది ఏడోవంతు. అయితే, మొత్తంగా రామాయణానికి శాస్త్ర ప్రామాణ్యం సుప్రసిద్ధమే. అనేకమయిన ధర్మనాలు. శాస్త్రీయాంశాలూ అందులో వ్యాఖ్యానింప బడ్డాయనేది సుప్రసిద్ధమే. దీర్ఘ శరణాగతి శాస్త్రంగా కూడా అది ప్రసిద్ధం. ఇక, ఆది కావ్యమన్నది వేరే చెప్పనవసరం లేదు. కాగా, రామాయణం ఉభయ కావ్యం. ఈ అంశాన్నే స్ఫురింపజేస్తున్నారా అన్నట్టు విశ్వనాథ సత్యనారాయణగారు 'రామాయణ కల్పవృక్షం' గురించి రాసిన పద్యం ఈ సందర్భంలో గుర్తుకొస్తుంది. ఆ పద్యమిది:

ఎదకుఁ బురాంధ్ర సంస్కృత కవీశ్వర భారతి దీప్తి కల్గినన్
సదమల బుద్ధికిన్ సకల శాస్త్ర రహస్య వివేక మబ్బినన్
మదికి ననన్య కల్పనల మక్కువ కల్గిన, విశ్వనాథ శా
రద సకలార్థదాయిని సురద్రువు రామ కథన్ భజింపుమీ.

అయితే, ఏ అజ్ఞాత కారణం వల్లనో గాని, రామాయణాన్ని పూర్తిగా రచించే అవకాశం కలుగక పోవటం వల్ల తిక్కనగారికున్న ఆ ఉభయకావ్య రచనా శక్తి భారత రచనలో సాఫల్యం పొందింది. తిక్కనగారు, నిజానికి, భారతాన్ని గూడ సమగ్రంగా రచించలేదు. కాని, భారతం మొత్తంలో ఆరింట అయిదువంతులు ఆయన రచించిందే. మొదటి ఒక్క వంతు మాత్రమే నన్నయ-ఎఱ్ఱనల రచన. నిజానికి, భారతం యొక్క ఉభయ కావ్యత్వం సమగ్రత్వాన్ని సంపాదించుకొన్నది తిక్కనగారి భాగంలోనే. అదట్లా ఉంచి, ఉభయ కావ్య... అంటూ చెప్పబడిన అంశం కవి శక్తిని వ్యక్తీకరించేదని ప్రధానంగా గుర్తించవలసి ఉంటుంది. కాగా, ఇన్నిన్ని అంశాలను సమన్వయించు కొన్నప్పుడు రాజశేఖరుని విశ్లేషణానుసారంగానే ఉభయకవి, ఉభయ కావ్య

పదబంధాలకు ప్రస్తుత సందర్భంలో సరయిన సమన్వయం, సార్థకం కలుగుతుంది. తిక్కనగారికి పూర్వ సత్కవీంద్ర మార్గము మనమున నెల కొన్నట్టుగానే (ఉ.రా. 1-10) పూర్వాలంకారిక విమర్శ మార్గం కూడా నెలకొనిందనేది ఉత్తర రామాయణావతారికను గమనిస్తే స్పష్టపడుతుంది. అందువల్ల రాజశేఖరాభిప్రాయం ఆయనకు తెలియ దనటానికి ఆస్కారం లేదు. అదట్లా ఉంచి, ఈ ఉభయ కావ్య తాత్పర్యం, భావన తిక్కనగారి దగ్గరనే ఆగిపోలేదు. మరికొందరు దీన్ని స్వీకరించి ముందుకు సాగారు. మారన, ఎఱ్ఱనలు ఉభయ కవిత్వ తత్త్వ మనటంలో ఈ విషయం స్ఫురిస్తూనే ఉంది. ఉభయకవి - ఉభయ కావ్యం, ఉభయ కవిత్వం: అన్నింటి మౌలిక తాత్పర్యం ఒకటే. ఈ ఇద్దరిట్లా ఉండగా; పోతనగారు తాను ఉభయ కావ్య కరణ దక్షుడ (భాగ. ప్రథమ 1-13) నంటూ, అచ్చంగా తిక్కన గారిని గుర్తు చేశారు. అయితే, భాగవతం ఉభయ కావ్యమా?

**భాగవతం : ఉభయ కావ్యత్వం**

భాగవతం ఉభయ కావ్యం అవునా, కాదా అనే దట్లా ఉంచి; అసలు కది కావ్యమయినా అవుతుందా అనేది ఒక ప్రశ్నే. ఎందుకంటే భాగవతం పురాణ మాయె. భాగవత పురాణ ఫల రసా స్వాదన... (భాగ. ప్ర. 1-37) మని పోతనగారే అన్నారాయె. ఈ పద్యానికి మూలమయిన నిగమ కల్పతరోర్గళిత... మన్న శ్లోకంలో పురాణ ప్రసక్తి లేనే లేదు. లేకున్నా గూడా పోతనగారే కావాలన్నట్టుగా కొత్తగా పురాణ మని చేర్చారు. మరి, పురాణం కావ్యమవుతుందా? నిజానికి, పురాణం గూడా కావ్యవర్గంలోదే. ఈ విషయంలో పోతనగారు రాజశేఖరుడితో విభేదించారు.

రాజశేఖరుడు వాఙ్మయాన్నంతటినీ శాస్త్ర - కావ్య భేదంతో రెండు వర్గాలుగా విభజించాడు. శాస్త్ర కవి, కావ్యకవి అన్న కవుల వర్గీకరణకు మూలం ఈ వాఙ్మయ వర్గీకరణ. శాస్త్రాన్ని అపౌరుషేయం, పౌరుషేయం అంటూ రెండు విధాలుగా విభజించాడు. ఋగ్వజురాది వేదాలు; ఇతిహాస, గాంధర్వాద్యుప వేదాలు, వేదాంగాలయిన శిక్షా వ్యాకరణాదులు - ఈ మొదలయినవన్నీ అపౌరుషేయాలు. పురాణం, అన్వీక్షణకి, మీమాంస మొదలయినవన్నీ పౌరుషేయాలు. ఈ సందర్భంలో గమనించవలసిన కీలకాంశం ఒకటుంది. ఇతిహాసాన్ని ఉపవేదాల్లో చేర్చిన రాజశేఖరుడు పురాణ ప్రభేదమే ఇతిహాసమని కొందరంటారు అన్నాడు. అని, పురాణేతిహాసాల లక్షణాలు గూడా అక్కడ వివరించాడు. నిజానికీ, నిశితంగా గమనిస్తే కొందరు అనే - ఇతిహాసం పురాణ ప్రభేదనమనటంలోనే ఔచిత్యం, సామంజస్యం

కన్పిస్తుంది. పురాణేతిహాసాల లక్షణాలను గమనిస్తే ఈ అంశం స్పష్టపడుతుంది. రాజశేఖరుడు చెప్పిన పురాణ లక్షణమిది:

సర్గః ప్రతి సంహారః, కల్పో, మన్వంతరాణి, వంశ విధిః
జగతో యత్ర నిబద్ధం, తద్విజ్ఞేయం పురాణమితి.

పురాణానికి సర్గ (సృష్టి) మొదలయిన అయిదంశాలను చెప్పటం లక్షణం. కాగా, చివరి వంశనిధికి సంబంధించింది ఇతిహాసం. అందువల్ల ఇతిహాసం పురాణ ప్రభేదం కావటమే సమంజసం. మరొకటి; ఇతిహాసాన్ని పరక్రియ, పురాకల్పమని రాజశేఖరుడు రెండు విధాలుగా విభజించాడు. ఇతిహాసం ఏకనాయకాశ్రయ మయితే పరక్రియ; బహునాయకాశ్రయమయితే పురాకల్పం. రామాయణ, మహాభారతాలను వరుసగా ఈ రెండు తరహాలకూ ఉదాహరించాడు. ఈ రెండింటిలోనూ వంశవిధి సమానమే. వంశాను చరితం కూడా తోడవుతుంది. వంశవర్ణనలో, ఆ వంశీయుల్లో ఒక్కరికి మాత్రమే ప్రాధాన్యం, నాయకత్వం స్పష్టపడితే – అది పరక్రియ... పరక్రియ అంటే, అనేకమంది ఉండగా వాళ్లల్లో ఒక్కరినే శ్రేష్ఠుడిని చేయటం. ఇట్లా కాక, ఆయా సందర్భాలను బట్టి అనేకమందికి ప్రాధాన్యం, నాయకత్వం స్పష్టపడితే – అది పురాకల్పం. పురా కల్ప మంటే పూర్వం, ప్రాచీనం వంటిది అని అర్థం. పురాణం వంటి దని తాత్పర్యం. పురాణం వంటిదే కాని, పురాణం కాదు. అతి ప్రాచీన కాలాన్నుంచి సాగిన అనేకాంశాలను – పురాణం వివరిస్తుంది. పురాణానికి చెప్పిన అంశాల్లో వంశ విధి నుంచి వెనుకకు గమనిస్తే పూర్వ పూర్వంగా ప్రాచీనాంశాలు పురాణంలో ఉంటవి. అందువల్ల అది పురాణమయింది. ఇతిహాసం పురాకల్పమయింది. వర్గీకరణ విధాన క్రమంలో చెప్పదలిస్తే – పురాణ ప్రభేదం పురా కల్పమనీ, దాని ప్రభేదం పరప్రక్రియ అని చెప్పటం ఉచితంగా ఉంటుంది. పురాణానికి దగ్గరిది పురా కల్పమే. ఇదిట్లా ఉంచి, భారతీయ చరిత్ర నిర్మాణంలో పురాణేతిహాసాలు ఎంతో సహకరిస్తూ ప్రామాణ్యాన్ని పొందటం ఇక్కడ గమనించవలసిన అనుషంగికాంశం.

రాజశేఖరుని ఈ విశ్లేషణలో మిగతా విషయాల నట్లా ఉంచి; పురాణాన్నీ, దాని ప్రభేదమయిన ఇతిహాసాన్ని ఆయన శాస్త్ర వర్గంలో చేర్చటం మాత్రం అనేకమంది ఆలంకారికులు అంగీకరించినట్లు కన్పించదు. ఆనందవర్ధనాదులు కావ్య భావనతోనే వివేచన సాగించారు. ఆనందవర్ధనుడు రామాయణ మహాభారతాల్లో రస విషయాన్ని విస్తృతంగా చర్చించి, ఈ నాటికీ కాదనేందుకు వీల్లేనంత విధంగా నిర్ణయాలు చేశాడు. రామాయణ మహాభారతాల్లో కరుణ – శాంతాలు అంగిరసాలని పూర్వులు నిరూపించారు అన్నాడు కుంతకుడు – అంటే, వీటికి కావ్యత్వాన్ని అంగీకరించి,

వాటికి సంబంధించిన రస చర్చలు, నిర్ణయాలూ ఆనాటికే సుప్రసిద్ధమన్న మాట. కాగా, పోతనగారు పురాణం కావ్య వర్గంలో చేరింది గానే భావించారు. అంతేకాదు; 'ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీయుర్విన్ బురాణావళుల్ తెనుఁగుం జేయుచు...' అంటూ భారత, రామాయణేతిహాసాలను ఆయన పురాణాలుగానే భావించారు. పురాణ ప్రభేదాలను పురాణాలనటంలో విప్రతి పత్తి ఉండనక్కరలేదు. అందుకే భాగవత పురాణ ఫలరసా స్వాదన... అంటూ పురాణ పద ప్రయోగానికి వెనుకాడలేదు. హరినామస్తుతి సేయు కావ్యము... (భాగ. ప్ర. 1-96) అంటూ, భాగవతం కావ్యమని స్పష్టంగానే చెప్పారు. ఇదిట్లా ఉండగా -

నిగమ కల్పతరోర్గలితం ఫలం; శుక ముఖాదమృత ద్రవ సంయుతమ్;
పిబత భాగవతం రస మూలయం; ముహురహెూ రసికా భువి భావుకా.

అన్న సంస్కృత భాగవత పద్యంలో రస, రసిక, భావుక పదప్రయోగం భాగవతానికి కావ్యత్వాన్ని నిర్ధారిస్తూనే ఉంది. పోతనగారు కూడా 'భాగవత పురాణ ఫల రసా స్వాదన పదవి గనుదు రసిక భావ విదులు' అన్నారు. కాగా, పురాణేతిహాస ప్రబంధ రూప కాదులన్నీ విస్తృతమయిన కావ్య పరిధిలోనే. అయితే, ఆయా ప్రక్రియల స్వరూప స్వభావ ప్రయోజనాలను బట్టి రస స్ఫూర్తి, రస నిర్వహణల్లో తేడా, వైవిధ్యం రానే వస్తుంది.

మరి, భాగవతం ఒక కావ్య ప్రక్రియ అవుతూనే, శాస్త్రంగా కూడా ప్రవర్తిస్తున్నది. స్కాంద, పాద్మ పురాణాల్లోని భాగవత మహాత్మ్యాల్లో భాగవతం శాస్త్రమని రకరకాలుగా చాలాసార్లు చెప్పబడింది. 'శ్రీమద్భాగవతం శాస్త్రం కలౌకీరేణ భాషితమ్' అన్న స్కాందోక్తి సుప్రసిద్ధం. భాగవతాన్ని శుక శాస్త్ర మనటంతో బాటు శుకశాస్త్ర కథ అని కూడా పద్మపురాణం విరివిగా వ్యవహరించింది. 'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్నది ప్రసిద్ధమయిన సూక్తి. ఒకడు విద్యావంతుడు (పండితుడు) అనేది భాగవతం పరీక్షకు పెట్టి నిర్ణయించ వలసి ఉంటుందని తాత్పర్యం. కాగా, శాస్త్రత్వ - కావ్యత్వాలు భాగవతంలో సమన్వయం పొందినట్టు అతి ప్రాచీన కాలం నుంచీ భావించ బడుతున్నది. శాస్త్రాల్లో కథ ఉండదు; రస ప్రసక్తి ఉండదు. శాస్త్రంలో రస సంపద విచ్ఛిన్న మవుతుందని రాజశేఖరుడన్నాడు. రసం, ప్రధానంగా కథను ఆశ్రయించుకొని సాఫల్యం పొందుతుంది. శుక శాస్త్ర కథ అయిన భాగవతం; నిగమ కల్ప తరుగళిత ఫల ప్రాయమయిన కావ్యంగా ఆస్వాద్యమయిన భాగవతం, నిజానికి, ఉభయ కావ్యం. శాస్త్ర విధానంతో మోక్ష పురుషార్థాన్నీ, కావ్య విధానంతో శాంతరసాన్నీ భారతం నిర్వహించిందన్న ఆనందవర్ధనుడి నిర్ణయం భాగవతానికి గూడా వర్తిస్తుంది. అయితే,

శాంత స్థానంలో భక్తి, భక్తి రసమవుతుందా, కాదా అనేది వేరే చర్చ. భక్తి శాంతంలోనే అంతర్భవిస్తుందా, లేదా అనేది గూడా అంతే. కాగా, భాగవతం ఉభయ కావ్యం; పోతనగారు ఉభయ కావ్య కరణ దక్షుడు. ఈ విధంగా తిక్కనగారి ఉభయకావ్య భావన పోతనగారి దాకా ప్రవర్తించింది. కాని, శ్రీనాథాదు లెవ్వరూ దీన్ని భావించలేదు; ప్రస్తావించనూ లేదు. భాగవతం తరువాత ఉభయ కావ్యాలు కన్పించక పోవటం గమనించవచ్చు. కాగా, ఉభయ కావ్యమన్నప్రతి సందర్భంలోనూ రాజశేఖరుని నిర్ణయం ఋజు పద్ధతిలో అన్వయిస్తూ ఉండగా, ఈ విషయంలో ఆయన చెప్పింది కావ్య మార్గాన తిరు మంత్రమే. తిరుమంత్రం కావటంలో అనౌచిత్యం ఏమీ లేదు.

**ప్రౌఢి**

ఇక, రెండవ అంశం : ప్రౌఢి

కొన్ని పదాలు సామాన్యంగా లోక వ్యవహారంలోనూ, శాస్త్ర వ్యవహారంలోనూ ఉపయోగించబడటంలో అసాధారణత్వమేమీ లేదు. అయితే, అట్లాంటి చాలా పదాల వ్యావహారికార్థ తాత్పర్యాలూ, శాస్త్రీయార్థ తాత్పర్యాలూ భేదిస్తూ ఉండటం గూడా గమనించవచ్చు. ఆయా పదాలు ప్రయోగింపబడిన సందర్భాలను బట్టి – అటు శాస్త్రంలోనూ, ఇటు సామాన్య వ్యవహారంలోనూ – అక్కడ గ్రహించవలసింది సామాన్యార్థమా? శాస్త్రీయార్థమా? – నిర్ణయించుకోవలసి ఉంటుంది. ప్రౌఢి అట్లా నిర్ణయించుకొనవలసిన పదాల్లో ఒకటి. ప్రస్తుతం కావ్య శాస్త్ర సందర్భం కాబట్టి ప్రౌఢిని కావ్య శాస్త్రీయ పద్ధతిలో గమనించవలసి ఉంటుంది.

కావ్య శాస్త్రీయంగా ప్రౌఢి అనేది ఒక కావ్యగుణం. భారతీయ సాహిత్య విమర్శలో కావ్యగుణ వివేచన విస్తృతంగా సాగింది. కావ్యగుణాలు ఎన్ని? అని ఏవేవి? అన్నది రక రకాల చర్చలకు దారి తీసింది. ఆ చర్చల విషయం ప్రస్తుతానికి అవసరం కాదు. కాగా, భారతీయ సాహిత్య విమర్శ మార్గాన ప్రముఖుడయిన భోజుడు తన సరస్వతీ కంఠాభరణంలో కావ్యగుణాలు ఇరవై నాలుగని గుర్తించాడు. ఈ గుణాలు ఇరువై నాలుగు గూడా శబ్ద గుణాలు గానూ, అర్థగుణాలు గానూ – అంటే, ఉభయ విధంగా ప్రవర్తిస్తాయి. ఈ ఇరవైనాలుగింటిలో ప్రౌఢి ఒకటి. ఇది శబ్ద గుణం గానూ, అర్థగుణంగానూ – రెండు విధాలుగా ఉంటుందన్న మాట. ఈ రెండు విధాల ప్రౌఢిని భోజుడు ఈ కింది విధంగా వివరించాడు.

ప్రౌఢి: శబ్దగుణం – ఉక్తి యొక్క ప్రౌఢ పరిపాకాన్ని ప్రౌఢి అంటారు. (ఈ వివరణలోని ప్రౌఢ శబ్దానికి సామాన్యవ్యవహారార్థమే.)

ప్రౌఢి: అర్థగుణం – కావ్యంలో వివక్షితార్థ (చెప్పదలచిన అర్థం యొక్క) నిర్వహణను 'ప్రౌఢి' అంటారు.

శబ్దగుణమయిన ప్రౌఢిని సోదాహరణంగా వివరిస్తూ భోజుడు నారి కేరీ (కొబ్బరి), మృద్వీకా (ద్రాక్ష), సహకార (మామిడి) పాకములు 'ప్రౌఢి' అన్నాడు. పదగుంఫనం లోని నిష్కంపత్వం, ఉన్న పదాలను తీసేసి వేరే (సమానార్థక) పదాలను చేర్చటానికి వీలు కలిగించకుండా (అట్లా మారిస్తే మౌలికత మారిపోతుంది) ఉండే పదాల కూర్పు 'పాక' మంటారని రాజశేఖరుడన్నాడు. ఈ పదాల కూర్పులో వైవిధ్యం ఉంటుంది. ఈ వైవిధ్యం అర్థావగాహనకు కలిగించే సౌలభ్యం లోనూ భేదం కలిగిస్తుంది. కలిగించే ఆస్వాదం తీరులోనూ తేడా తెస్తుంది. ఈ దృష్టితో 'నారికేళ (ర)' మొదలయిన పేర్లతో 'పాకం'లోని వైవిధ్యం, రకరకాల పదాల కూర్పు విధానాలు విమర్శకులు గుర్తించారు. అందరికన్నా నిశితంగా పదాల కూర్పులోని తరహాలను విశ్లేషించిన రాజశేఖరుడు తొమ్మిది రకాల 'పాక' భేదాలను గుర్తించాడు. ఈ తొమ్మిదింటినీ మూడేసి చొప్పున మూడు వర్గాలుగా విభజించి వాటి స్వరూప స్వభావాలు; స్వీకార్య – అస్వీకార్యత్వాలూ చెప్పాడు. ఆ తీరిది:

**I**

1. పిచుమంద పాకం: ఆద్యంతాల్లోనూ ఆస్వాదువుగా ఉంటుంది.
2. బిదర(రీ) పాకం : ఆదిలో ఆస్వాదువుగానూ, పరిణామంలో మధ్యమంగానూ ఉంటుంది.
3. మృద్వీకా పాకం : ఆదిలో ఆస్వాదువుగానూ పరిణామంలో స్వాదువుగానూ ఉంటుంది.

**II**

1. వార్తాక పాకం : ఆదిలో మధ్యమంగానూ, చివరకు ఆస్వాదువుగానూ ఉంటుంది.
2. తింతిడీక పాకం : ఆద్యంతాల్లోనూ మధ్యమంగా ఉంటుంది.
3. సహకార పాకం : ఆదిలో మధ్యంగానూ అంతంలో స్వాదువుగానూ ఉంటుంది.

**III**

1. క్రముక పాకం : ఆదిలో ఉత్తమంగానూ, అంతంలో ఆస్వాదువుగాను ఉంటుంది.
2. త్రపుస పాకం : ఆదిలో ఉత్తమంగానూ అంతంలో మధ్యమంగానూ ఉంటుంది.
3. నారికేర పాకం: ఆద్యంతాల్లోనూ స్వాదువుగా ఉంటుంది.

(పిచుమంద = నేము; బదర = రేగు; మృద్వీకా = ద్రాక్ష; వార్తాక = నంగ; తింతిడీక = చింత; సహకార = మామిడి; క్రముక = భాగాలు / వక్కలు; త్రపుస = చేదుదోస; నారికేర = కొబ్బరి) పదాల కూర్పు కలిగించే స్వాదుత్వం దృష్ట్యా ఈ పాక నిర్ణయం చేశాడు రాజశేఖరుడు. ఈ మూడు వర్గాల్లోనూ మొదటివి (పిచుమంద, వార్తాక, క్రముక) త్యాజ్యాలనీ, నడిమిని (బదర, తింతిడీక, త్రపుస) మధ్యరకమనీ, చివరివి (మృద్వీక, సహకార, నారికేర) ఉత్తమ మయినవనీ ఆయన తాత్పర్యం. ఇవన్నీ చెప్పి, ఏ విధమయిన వ్యవస్థలేని – అనగా అనవస్థిత మయినది కపిత్థ (వెలగ) పాకమన్నాడు. ఇదీ వాంఛనీయం కాదు. పాకాలకు పేర్లకోసం ఆయా ఫలాల (పండ్ల)ను గ్రహించటం; వాటి ఆస్వాదాన్ని గూర్చి రకరకాలుగా చెప్పటం నిర్వివాదాంశమేమీ కాదుగాని, పాక విధాలను నిశితంగా పరిశీలించే తరహా మాత్రం ఇక్కడ గుర్తింప దగిన ప్రధానాంశం. ఈ పాకాలను గుర్తించటంలో, వాటి స్వాదుత్వాన్ని నిర్ణయించటంలో చాలా ఇబ్బందులున్నవనేది రాజశేఖరుడు గుర్తించక పోలేదు. రాజశేఖరుడి భార్య అవంతి సుందరి. ఆమె కూడా గొప్ప సాహిత్య విమర్శకురాలు. ఆమె గ్రంథం ఏదీ రచించలేదు. కాని, రాజశేఖరుడు తన కావ్యమీమాంసలో దాదాపు ప్రతి విషయంలోనూ ఆమె అభిప్రాయాలను సగౌరవంగా చెప్పాడు. ఆ అభిప్రాయాలన్నీ అవంతి సుందరి ఆలోచనా నైశిత్యాన్ని పరిస్ఫుటం చేస్తాయి. పాక విషయంలో ఆమె ఇట్లా అందింట – పదాల పరివృత్తి విముఖత్వం (పదాల మార్పును సహించలేని కూర్పు విధానం) అశక్తి మాత్రమే తప్ప పాకం కాదు. ఎందుకంటే మహాకవుల రచనలో ఒకే విషయం అనేక విధాలుగా చెప్పటం – పదాలను కూర్చటం, అది పరిపక్వస్థాయికి చెందటం కన్పిస్తోంది గదా! కాబట్టి; గుణాలంకార రీతి యుక్తి శబ్దార్థాల కూర్పు – ఏ విధమయిందయినా సరే, రసజ్ఞులకు ఆహ్లాదం కలిగిస్తేనే అది వాక్య పాకంగా నేను గుర్తిస్తాను అని, అందువల్ల సహృదయాహ్లాదకమయిన కూర్పే పాకమని చివరకు రాజశేఖరుడు తేల్చాడు. ఈ సహృదయాహ్లాదకత్వం దృష్టితోనే ఆయన పాక వైవిధ్యాన్ని గుర్తించాడు. ఫలానా ఫలానా కూర్పులు ఉత్తమమని అన్నాడు. రాజశేఖరుడు ఉత్తమ మైనవని చెప్పిన నారికేర, మృద్వీకా, సహకార పాకాలనే భోజుడు ప్రౌఢి విషయంగా చెప్పటం గమనించదగిన అంశం. తెలుగువారిలో శ్రీనాథుడు నారికేళ పాకాన్ని మాత్రమే 'ప్రౌఢి' గా భావించినట్లు కన్పిస్తుంది. శ్రీహర్షుడు నైషధ కావ్యాన్ని 'ప్రౌఢ వాక్పాటవం'తో రచించాడనీ, ...నారికేళ ఫలపాకమునంజనియైన భట్టహర్షుని కవితా నిగుంభనము... అనీ (శృం. వై. 1-17) శ్రీనాథుడన్నాడు. రాజశేఖరుడు,

భోజుడు – ఉత్తమ మయినవిగా భావించిన మూడింటిలో కేవలం ఒకదాన్ని – నారికేళ పాకాన్ని మాత్రమే శ్రీనాథుడు 'ప్రౌఢి'గా భావించటం ఆయన అభిరుచికి సూచనగానే గ్రహించవలసి ఉంటుంది. శ్రీనాథుడి కంటె పూర్వం, లేదా మరి కొందరు కవులు ద్రాక్షా, సహకార పాకాలను గూడా ప్రౌఢిగా భావించి ఉండవచ్చు. ప్రౌఢాంచిత శబ్ద సారులు... (నృసిం. 1-13) అని ఎఱ్ఱన గారనటంలో ఆ అభిప్రాయం ఉండి ఉండ వచ్చు. అందుకే, ప్రౌఢి అనేది నారికేళ పాకం వల్లనే సిద్ధిస్తుందని నిర్ధారిస్తున్నాడా అన్నట్టు శ్రీనాథుడు ఆ విధంగా చెప్పి ఉండవచ్చు. 'ప్రౌఢాంచిత శబ్ద సార...' అన్న ఎఱ్ఱనగారు, 'ఉభయవాక్ ప్రౌఢి' అన్న శ్రీనాథుడు , 'ఉభయ భాషఁ బ్రౌఢిమఁ జెప్పన్' అన్న జక్కన... ఇట్లాగే మరికొందరు శబ్ద, భాషా, వాక్ వంటి పదాల ప్రయోగం ద్వారా శబ్దగుణమయిన 'ప్రౌఢి'నే లక్షించినట్లు కన్పిస్తుంది.

ఇక, అర్థగుణమయిన ప్రౌఢిని సోదాహరణంగా వివరిస్తూ భోజుడు 'ప్రభూత మయిన అర్థాన్ని రక రకాలయిన వాక్యాలతో ప్రతిపాదించటం ద్వారా వివక్షితార్థాన్ని నిర్వహించుట' అన్నాడు. అంటే, చెప్పదలచిన అర్థాన్ని (విషయాన్ని) అనేక విధాలుగా వ్యక్తీకరించటం అర్థగత ప్రౌఢి. ఈ అర్థగత ప్రౌఢి అభినవగుప్తుని అభిప్రాయంలో మరింత విస్తృతిని సంపాదించింది. ఆయన దృష్ట్యా కావ్యార్థమయిన రస నిర్వహణ 'ప్రౌఢి'.

లక్షణాలు లేని కథ నీరసమయిపోతుంది. ఆ కారణంగా ఆ కావ్యం 'ప్రౌఢ' కావ్యమన్న వ్యవహారానికి తగదు. అంటారాయన. (భరతుడు నాట్యశాస్త్రంలో 'లక్షణా'లని కొన్ని అంశాలు ప్రతిపాదించాడు. ఒక విధంగా ఇవి 'గుణా'ల వంటివే. అనంతరకాలాన ఈ లక్షణాల్లో కొన్ని 'గుణా'లుగా, మరికొన్ని 'అలంకారాలు' గా గుర్తింపబడినవి) కావ్యకళాప్రౌఢిఁ గల్పింతు ద్విపద (పండితారాధ్య చరిత్ర, దీక్షా ప్రకరణం) అని పాల్కురికి సోమనాథుడనటంలోనూ ఈ విస్తృతిని గుర్తు పట్టవచ్చు. కాగా, ఇంత విస్తృతి పొందిన అర్థగత ప్రౌఢి; దానికి శరీర ప్రాయమయిన శబ్దగత ప్రౌఢి – ఈ రెండూ పరస్పరం సమన్వయం పొందినప్పుడే 'ప్రౌఢి' సమగ్రంగా సాధింపబడినట్లవుతుంది. తిక్కనగారు ఉద్దేశించిన ప్రౌఢి' ఇది.

**శిల్పం**

ఇక, మూడవదీ, చివరదీ అయిన అంశం – 'శిల్పం'.

కావ్య విచార మార్గాన తెలుగువారికి మొదటి సారిగా 'శిల్ప' పరిచయం కలిగించింది తిక్కనగారు. శిలాకర్మలో ప్రసిద్ధమయిన పదం 'శిల్పం'. ఉద్దేశించిన

రూపం వ్యక్తమయ్యే విధంగా, భావం స్ఫురించేట్లుగా శిలను చెక్కటం, లేదా చెక్కబడిన శిలారూపం అన్న తాత్పర్యంతో ప్రసిద్ధంగా శిల్ప పదం వ్యవహారంలో ఉన్నది. నిజానికి శిలా–శిల్ప పదాలకు అవినాభావ సంబంధమేమీ లేదు. శబ్ద శాస్త్రాన్ని బట్టి గమనిస్తే – శీల ధాతువు నుంచి 'శిల్ప' పదం నిష్పన్నమయింది. 'శీల' ధాతువుకు అభ్యాసం, సమాధి అని రెండర్థాలు. శిల్పికి అభ్యాసం బాహ్య ప్రయత్నం కాగా, సమాధి ఆంతర ప్రయత్నం. సమాధి అంటే మనస్సు యొక్క అతిశయత మయిన (సామాన్య స్థాయికి మించి ఎంతగానో ఎదిగిన) ఏకాగ్ర భావనాస్థితి. కాగా, శీల ధాత్వర్థాన్ని బట్టి శిల్పం రెండు విధాలు. ఒకటి: అభ్యాసరూపం; రెండు : సమాధి రూపం. మొదటి దాన్ని కౌశలమనీ, రెండవదాన్ని నైపుణమనీ అనవచ్చు. శిల్పమంటే కౌశలమని ఉణాది సూత్రాల్లో చెప్పబడింది. 'కుశలుడు' అంటే దర్భలు కోసేవాడని యౌగికార్థం. దర్భలు ఒక విధమయిన గడ్డి పరకలు. వైదిక కార్యకలాపాల్లో వీటి అవసరం పడుతుంటుంది. ఈ గడ్డి పరకల అంచులు పదునుగా ఉంటాయి. వాటిని పట్టుకొని కోసేప్పుడు లాగినట్టయి పట్టుకొన్న చేయి చీరుకుపోగల అవకాశం అధికం. కాబట్టి, ఆ విధంగా కోసుకుపోకుండా వాటిని కోయటమనేది అభ్యాసం వల్ల కలిగే నేర్పు. కోయటంలో చేయి చీరుకొని పోకుండా ఉండటం ఒక విధంగా 'క్షేమ'మే గదా!

అందువల్ల కుశలమంటే 'క్షేమ'మని వ్యవహారంలో కెక్కిన సామాన్యార్థం. కాగా, అభ్యాసం వల్ల కలిగే 'నేర్పు' కౌశలమని అసలర్థం. 'పనులు చేయటంలో సుఖసంప్రయోగ చాతుర్యం కౌశల' మన్నాడు శారదాతనయుడు. ఈ అనటంలోని తాత్పర్యమిదే. దేన్నయినా కష్టం లేకుండా సుఖంగా ప్రయోగించగల నేర్పు, చతురత అభ్యాసం వల్లనే కలుగుతుంది. ఇక; ద్రవ్య, గుణ, క్రియాదులకు సంబంధించి హేయ–ఉపాదాన (త్యాజ్య – గ్రాహ్య) విషయంలో 'సూక్ష్మార్థ వ్యాప్తి నిరతమయిన ధీవ్యాపారం' నైపుణమన్నాడు శారదా తనయుడు. కాగా 'శిల్ప' మనేది బాహ్య ప్రయత్నమయిన అభ్యాసం ద్వారా సంక్రమించిన క్రియాకరణంలోని నేర్పు; ఆంతరిక ప్రయత్నమయిన (సమాధి) ధీ వ్యాపారం (బౌద్ధికమయిన పని) – ఈ రెండు విధాలుగా ప్రవర్తిస్తుంది. ఈ రెండింటి సరయిన సమన్వయమే 'శిల్ప' సమగ్రతను సాధిస్తుంది. ఇదిట్లా కాగా–

కౌశల, నైపుణ్యాలను విడి విడిగా నిర్వహించిన శారదాతనయుడు ప్రత్యేకంగా 'శిల్ప' నిర్వచనంగూడా చేశాడు. ఒకే పదార్థానికి వాఙ్మనః కర్మలతో నానారూప ప్రకల్పనం 'శిల్ప' మంటాడాయన. ఇక్కడ వాక్ మనః కర్మలనటంలో బహి రంతర వ్యాపారాల సమన్వయం భావించబడిందని స్పష్టపడుతూనే ఉంది. అంటే, కౌశల – నైపుణ సమన్వయం శిల్పమని స్పష్టం. అయితే, వాగ్ వ్యాపారమనటంవల్ల ఈ శిల్ప

నిర్వచనం సాహిత్యానికే పరిమితంగా ఉద్దేశించబడింది. శిలా శిల్పాదులయిన ఇతర కళల విషయంలో గూడా ఈ అంతర్ – బహిర్ వ్యాపారాల (పనుల) సమన్వయం అవసరమే. శిల్ప శాస్త్రంలో శిల్ప పదానికి యోగం – సాధనం అని అర్థాలు ప్రసిద్ధం. ఒక విషయాన్ని మనో వ్యాపారంతో బింబింప జేసుకొని దానితో ఐక్యమందటం 'యోగం' కాగా, ఆ బింబాన్ని సాధనా పరిపక్వమయిన కాయిక (శారీరక) వ్యాపారం ద్వారా శిలలో మలవటం – ఇది శిల్ప కర్మ. అయితే, సాహిత్యేతర కళల్లో వాగ్ వ్యాపారానికి ప్రసక్తి లేదు. కాగా, శారదాతనయుడి 'శిల్ప' నిర్వచనం కేవలం సాహిత్యానికి మాత్రమే పరిమితమయింది. ఈ విధంగా పరినిశ్చితమయిన 'శిల్పా'న్ని తిక్కనగారు సాహిత్య విమర్శ మార్గంలో తెలుగువారికి పరిచయం చేశారు.

ఇక్కడ గమనించవలసిన అంశం ఒకటి ఉంది. ఈ మూడంశాలూ – ఉభయ కావ్యం, ప్రౌఢి, శిల్పం అనేవి రెండంశాల సమన్వయాన్ని వ్యక్తీకరిస్తున్నవి. శాస్త్రనయ – కావ్యనయ సమన్వయం ఉభయ కావ్యం; శబ్దగత – అర్థగత గుణ సమన్విత రూపం ప్రౌఢి; బహిర్ – అంతర్ వ్యాపారాల; లేదా, అభ్యాస – సమాధుల; లేదా కౌశల – నైపుణ్యాల సమన్విత రూపం శిల్పం. ఈ విధంగా ద్వంద్వ లక్షణం గలవాటిని సమన్వయించి ఏకీకరించటం తిక్కన గారి మౌలిక లక్షణం. ఆయన 'హరిహరకథ' విషయంగూడా ఇదే అంశాన్ని స్పష్టపరుస్తుంది. కాగా –

**సమన్వయం**

ఇప్పుడు ఈ మూడంశాల స్వరూప స్వభావాల సరయిన అవగాహనతో ఉభయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పము అంటే ఏమిటో సులభంగానే స్పష్ట పడుతున్నది. శాస్త్ర–కావ్యనయ (విధాన)ములు ఏకకృతమయిన ఉభయ కావ్యం ఉత్తమ ప్రయోజన వంతమవుతుంది. ఆ కావ్యం ప్రౌఢి గుణవంతం కాబట్టి, తత్కావ్యగతమయిన మహార్థం బహుముఖంగా స్వాదు పరీపాకంతో రసాత్మకమవుతుంది. పఠించే ప్రతి సారీ సహృదయుడికి వినూత్నమయిన అనుభూతిని, వివేక చైతన్యాన్ని కలిగిస్తుంది. అప్పుడే ఆ విధమయిన కావ్యానికి సాఫల్యం. ఈ విధమయిన కావ్యానికి ఆ విధమయిన గుణం అవినాభావంగా ఉండవలసిందే. అందుకే 'ఉభయ కావ్య ప్రౌఢి' అని ఆ కావ్య గుణాలను సమసింప జేసి తిక్కన గారీ అంశాన్ని స్ఫురింపజేస్తున్నారు. ఇట్లాంటి ఉభయ కావ్య 'ప్రౌఢిని' పాటించి – ఆదరించి, అమలు పరచేది శిల్పం. అభ్యాస – సమాధిమంతంగా ఏకీభావం పొందిన 'శిల్పం' లేకుండా ఉభయ కావ్యప్రౌఢిని సాధించటం అసాధ్యం. ఉదాత్తంగా ఉద్దేశింపబడిన ఆ కావ్యానికి సాఫల్యం సంపాదించే

గుణాన్ని పాటించే శిల్పం ఉన్నత లక్ష్యంగల కవికి అత్యవసరం. గుణం కావ్యానికి సంబంధించింది. శిల్పం కవికి సంబంధించింది. సమాధి – అభ్యాసాల నుంచి శిల్పం నిష్పన్నమవుతున్నది. అందుకనే, ఉద్దేశించిన ప్రయోజనాన్ని నిర్వహించే ఈ 'శిల్పమునన్ బారగుడన్' అని తిక్కనగారు తన పరంగా – అంటే, కవిపరంగా ప్రతిపాదించారు. 'శిల్ప' పదాన్ని 'ప్రౌఢి'ని మాదిరిగా సమాసంలో చేర్చక వ్యస్తంగా – విడిగా చూపించటం ఈ అంశాన్ని స్ఫురింపజేస్తున్నది.

ఈ అంతటికీ – అంటే, ఉభయ కావ్య ప్రౌఢి పాటించే శిల్పంలో పారంగతత్వానికి మూలమయింది అమలమూ, ఉదాత్తమూ అయిన ప్రతిభ. ఇక్కడ తిక్కనగారు ప్రతిభకు పర్యాయ పదంగా 'మనీషా'పదాన్ని ప్రయోగించారు. ఈ మనిష స్వచ్ఛమూ, ఉదాత్తమూ కావాలన్నారు. నన్నయగారు చెప్పిన 'సత్ ప్రతిభ'ను తిక్కనగారిక్కడ వివరించినట్లు కన్పిస్తుంది. ఈ సందర్భంలోనే తిక్కన గారు తాను 'కళావిదుడ'ననీ అన్నారు. అంటే, కవికి కళా నేతృత్వాన్ని ఆయన నిర్దేశిస్తున్నారన్నమాట. కళ అంటే ఆత్మాభివ్యక్తి రూపమయిన రచనా ప్రక్రియ. కళలు అరవై నాలుగని ప్రసిద్ధి. వీటిలో కొన్ని దైనందిన జీవన వ్యవహారంలో బతుకుదలకు నేరుగా ఉపయోగించేవి. వీటిని వృత్తి కళలు, లేదా ఉపయోగి కళలు అనవచ్చు. మరికొన్ని వినోద కళలు. మరికొన్ని లలిత కళలు. ఈ అన్నింటిలోనూ ప్రయోక్తల ఆత్మాభివ్యక్తి తరతమ భేదాలతో ఉండనే ఉంటుంది. కాని, లలితకళలలో అది సమగ్రంగా వ్యక్తమవుతుంది. ఈ విధంగా ఆత్మాభివ్యక్తమయ మయిన కళ సౌందర్యమయమయి ఆనందాన్ని కలిగిస్తున్నది. ఇట్టి కళలను గూర్చిన సమగ్రమయిన అభిజ్ఞ 'కళానిత్త్వం'. ఇది కవి అనే వానికి అవసరం. ఈ అభిజ్ఞ సాహిత్యాన్ని ఉద్దీపింపజేస్తుంది. అందుకనే కవిపరంగా ఈ అంశాన్ని తిక్కనగారిక్కడ ప్రస్తావించారు. కేతన తిక్కనగారిని 'కావ్య కళాజని భూమి' అని గౌరవించాడు. అసలు కావ్యాన్ని 'కళ'గా గుర్తించిన మొదటి తెలుగు కవి పాల్కురికి సోమనాథుడు. 'కావ్యకళ' అన్నాడాయన. కళావిదుడు కావ్య కళా రహస్యవేత్త. కాగా, కళావిదుడు అమలోదాత్త మనీష హేతువుగా ఉభయ కావ్య ప్రౌఢిని పాటించే శిల్పంలో పారంగతుడు కావాలనీ, అప్పుడు నిష్పన్నమయిన కావ్యం ఉదాత్త జీవన ప్రయోజనాన్ని సాధిస్తుందని తిక్కనగారి తాత్పర్యం.

కావ్యాన్ని గూర్చి తిక్కన గారి దృక్పథమిది.

# 3. ఎఱ్ఱా ప్రెగడ

“భారతకావ్యహార మొక భాగము నన్నయభట్టొనర్చె ము
క్తారమణీయవాక్యములఁ దక్కినభాగము సోమయాజి సొం
పార నొనర్చె రెండుగలయన్ శివదాసుఁడు మధ్యనాయక
శ్రీ రచియించె శారద ధరింప గవిత్రయ కీర్తి మించగన్.”

ఆంధ్రమహాభారత కావ్యహారమున కారణ్యపర్వశేష రచనావిశేషము చేత మధ్య నాయక శ్రీని గల్పించిన కీర్తిని దక్కించుకొని నన్నయ తిక్కనలతో సమానముగ నాంధ్రజాతి కారాధ్యుఁడైన కవి యెఱ్ఱాప్రెగడ. కవిత్రయమునందీతఁ డొకరుఁడై వెలసినాఁడు.

ఈతఁ డాపస్తంబసూత్రుఁడు. శ్రీ వత్సగోత్రుఁడు అప్రతిమాద్భుతోభయ కవిత్వప్రౌఢ శబ్దార్థయోగాజ్ఞాసిద్ధిఘనుఁడైన సూరనార్యుఁడీతని తండ్రి. తల్లి పోతమాంబిక. కంసారిచరణమధుకరపతి యనియు, సారవిమలయశుఁడనియుఁ గీర్తింపఁబడిన యెఱపోతసూరి యితని తాత. ప్రజ్ఞాపవిత్రుఁడూర్జిత చరిత్రుఁడైన బొల్లన యితని తాత తండ్రి. వెలనాటిచోడునివలన మిగుల మన్ననలను గన్న భీమన మంత్రి యితని తాతతాత. ఇది వీరి వంశక్రమము. ఇంతటి ప్రఖ్యాతిఁ బొంది నియమ నిష్ఠాగరిష్టులై, రాజవాల్లభ్యశ్రీవిలసితు లైనవారి వంగడమున జనించిన ఎఱ్ఱాప్రెగడ గురుభజనపరాయణుఁడు. సరస బహుపురాణ ధర్మశాస్త్రకథావిస్తరవేది, వినయోదయ భరితుఁడగుటలో నాశ్చర్యము లేదు.

ఎఱ్ఱాప్రెగడ కృతకావ్యపీఠికలను బురస్కరించుకొని చూడగా నీతని వంశీయులలో నందఱును గవులు మహాకవులుగనే గోచరించుచున్నారు. కాని ఎఱ్ఱాప్రెగడ తాత, తండ్రులు వ్రాసిన గ్రంథము లెన్నియో? అని యెయ్యవియో? ఏభాషయం దున్నవో? ఎవరి కంకితములో? మున్నగు విషయము లెవ్వియుఁ దెలియవచ్చుట లేదు. అయ్యును వీరి వంశ మాదినుండియు విద్వద్వంశ మని మాత్రము గ్రహింపవీలగుచున్నది.

విప్రనారాయణ చరిత్ర కర్తయైన చెదలువాడమల్లన పూర్వకవిస్తుతి సందర్భమునం దెఱ్ఱాప్రెగడ దన వంశకర్తగాఁ బేర్కొనినాఁడు మల్లన రచనలను బురస్కరించుకొని

చూడగా నెఱ్ఱన చెదలువాడ నిలయుఁ డనియు నిఁక నాతని యింటి పేరు 'చెదలువాడ' యనియుఁ; దెలియుచున్నది. కాని చెదలువాడ యనునది యెఱ్ఱాప్రెగడ పూర్వులకు గృహనామముగ నున్నట్లెక్కడను నాధారములు గానవచ్చుట లేదు. కాని యెఱ్ఱాప్రెగడ చెదలువాడయందుఁ గొంతకాలము నివసించుట చేసి యాతని కాలము నుండియో లేక యాతని తరువాతనో చెదలువాడ యనునది వీరి వంశీయులకు గృహనామముగ స్థిరపడి యుండవచ్చును. ఏలయన సాధారణముగా నొక వంశీయు లందఱొకేస్థానమం దుండవలయు నను నియమము లేదు. మీఁదు మిక్కిలి వారి వారి జీవికలను బురస్కరించుకొని వారువా రాయా ప్రదేశములందు నివాస మేర్పఱచుకొని స్థిరపడు చుండుటయు కలదు. ఇట్లు వేఱు వేఱు దేశములందు స్థిరపడినవారు వారిలో ప్రసిద్ధుఁడైన పురుషునే తమ వంశమునకు మూలపురుషునిగాఁ గొనియాడు చుండుటయుఁ గలదు. ఆ విధముగనే యెఱ్ఱన కాలమునాఁటికి వెలనాటిచోడుని వలన సత్కారము నంది యాప్రాంతమందు నివసించుచున్న భీమన వంశకర్తగా గణుతింపఁ బడుచుండగా మల్లన కాలమునాఁటి కావంశీయులలో మిగుల వాసి కెక్కి చెదలువాడ నగ్రహారముగా బడసిన యెఱ్ఱాప్రెగడ వంశకర్తయై వెలసినాఁడు.

యెఱ్ఱాప్రెగడ పూర్వులకు చెదలువాడ యనునది గృహనామముగా నున్నట్లుకాని యాగ్రామమందు వారు నివసించినట్లుగాగాని యాధారములు గానవచ్చుటలేదు. తన పూర్వులను ప్రస్తుతించిన యెఱ్ఱన సయితము నృసింహ పురాణమునందుఁ దనతాత యెఱపోతసూరినిగూర్చి వ్రాయుచు "వేగినాటఁ గరావర్తి వృత్తిమంతుఁ డని వ్రాసినాఁడే కాని చెదలువాడను నామమాత్రమునకేని యెచ్చటను సూచింపలేదు. కావున నతని తాతలు వేగినాట నేదోయొక గ్రామమునందున్నట్లు గానవచ్చుచున్నది. నృసింహపురాణ మందలి కరావర్తి (వర్తి) నాధారముగాఁ గొని కొందఱు విమర్శకు లీకరావర్తి యనున దొక గ్రామనామ మనియు నదియే యెఱ్ఱాప్రెగడ పూర్వులకు నివాసమనియుఁ జెప్పుచుండ మఱి కొందఱు వేఁగినాట కరాప(వ)ర్తి యనుగ్రామము లేనేలేదనియు, కాకరపర్తి, రాపర్తి యని తత్సదృశనామములు గల గ్రామములుండ దానినే లేఖకుఁడు కారావర్తియని తప్పుగా వ్రాసియుండుననియు నభిప్రాయపడినాడు.[1] ఈ సూచనను బురస్కరించుకొని శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు "కరావర్తికిబదులు కాకరవర్తియని వ్రాసినను తేటగీతిపద్యమున గణభంగముండదు" అని చెప్పి యిది లేఖకుని ప్రమాదము

1. మల్లంపల్లి సోమశేఖరశర్మ – రెడ్డిరాజ్యచరిత్రము, పుట. 496

గాదని వ్యక్తపఱిచినారు.[2] కరావర్తిని గ్రామనామముగ స్వీకరించి యీ కరావర్తియను గ్రామము నేఁడు కరవది యనుపేర 'అమ్మనబ్రోలు' నకుఁ బ్రక్కనున్న గ్రామ మగునని శ్రీ వేదాల తిరువేంగళాచార్యులు తమ వ్యాసమునందుఁ బేర్కొనినారు.[3] కాని యీ పదము 'కరాపర్తి' యా లేక 'కరావర్తి'యా యను సందేహమును పండితులు వెలిబుచ్చుచున్నారు. 'కరావర్తి'గ స్వీకరించినవారు కరము = పన్ను, కరావర్తివృత్తి = పన్నులను వసూలు చేయునట్టియుద్యోగ మని యర్థము సెప్పి యెఱ్ఱాప్రెగడ పూర్వులు పాకనాటిలో tax collectors వంటి వృత్తిని కలిగియుండి రని నిర్ణయించుచున్నారు. దాదాపుగ నిట్టి నిర్ణయమునే కావించుచు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు సూచించినారు.[4]

కరాపర్తి వృత్తిమంతులనఁగాఁ బన్నులను గ్రహించు నేఁటి గ్రామాధికారి లేక గ్రామకరణము వంటి వృత్తిమంతులని గ్రహించుటయే సమంజసమై కానవచ్చుచున్నది.

'వృత్తి' యనఁగాఁ బూర్వము ధర్మప్రభువులు బహుశ్రుతులైన పండితులకు, శాస్త్రవేత్తలైన సద్బ్రాహ్మణులకు, మహాకవుల కాయాపుణ్యకాలములందొక గ్రామమును సర్వభోగములతో నొసఁగ వారందు వృత్తి కల్పనము గావించి నివసించుట యని చెప్పుట సంప్రదాయము. కొందఱీ సంప్రదాయముననుసరించియే నృసింహపురాణము నందు గానవచ్చు సీసపద్యములోని 'వేఁగినాటఁ గరాపర్తి వృత్తిమంతుఁడ'ను వాక్యమున కర్థనిర్ణయము గావింపవలయుననుచున్నారు. వీరి వాదము ననుసరించి 'వృత్తి' యను పదము నాయర్థము నందే గ్రహించినను కరావర్తి వృత్తిమంతుఁ డను వాక్యమునందలి విభక్తిని బురస్కరించుకొని యెఱపోతనూరి వేఁగినాటిలోని కరావర్తి యనుగ్రామము నందు వృత్తిగలవాఁ డనునర్థమును గ్రహించి చెప్పవలనుపడకున్నది. కావున నిది 'కరావర్తివృత్తి' యను నొక వృత్తివిశేషమై యుండనోవు ననియే చెప్పవలనుపడుచున్నది.

ఇఁక నారణ్యపర్వశేషమునందలి యాశ్వాసాంతపద్యమునందుఁ గానవచ్చు. "...పాకనాటిలో నీలకంఠేశ్వరస్థానమై యెసకమెసఁగు గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు ధన్యుఁడు ధర్మైకతత్పరాత్ము."[5] అను సీస పద్యమును బురస్కరించు కొని యెఱ్ఱాప్రెగడ గుడ్లూరునివాసియైనట్లు గానవచ్చుచున్నది. కాని కొందరఱీసీస పద్యమే ప్రక్షిప్తమని త్రోసివేయుచున్నారు. విమర్శకు లూహించినట్లుగానే యీసీస పద్యము

2. నృ. పు., పీఠిక, పుట. 1
3. మహాభారతోపన్యాసములు
4. పరిశోధన – (ఫిబ్రవరి – మార్చి, 1956)
5. ఆ.మ.భా., ఆ.ప. ఆ.7-469

ప్రక్షిప్తమైన గావచ్చు. కాని పద్యము ప్రక్షిప్తమైనప్పటికి దీని నిందు దూర్చినవారు మాత్రమెఱ్ఱాప్రెగడను గూర్తి సమగ్రముగా నెఱిఁగినవారే యాతని యభిమానులే యై యుందురనుటలో సందేహము లేదు. కావున నీగ్రంథరచనా సందర్భముననో లేక యంతకుపూర్వమో కాక తనకు మల్లారెడ్డి ప్రాపకము లభింపక మునుపో యతఁడీ గ్రామమందు నివశించియుండెననుట మాత్రము యథార్థ్యము. ఈ గుడ్లూరు నీలకంఠేశ్వరస్థాన మనువిషయము భారతారణ్యపర్వ శేషాంతమందలి సీస పద్యమే కాక యజ్ఞాతనామధేయుఁ డైనకవి చాటు వొక్కటీవిషయమునే చెప్పుచున్నది.[6] ఈ చాటువునే యుదాహరించి శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు 'నీలకంఠేశ్వర స్తుతి పద్యముకూడ ఎఱ్ఱన నీలకంఠేశ్వర భక్తుఁడనియు, ఆతఁడాదేవునికి నెలవైన గుడ్లూరు గ్రామమునఁ గొంతకాలము నివసించె ననియు సూచించుచున్నది" అని యభిప్రాయ పడినారు.[7]

ఇంతవఱకు లభించిన యాధారములను బురస్కరించుకొని చూడగా నెఱ్ఱన మఱియు నాతని పూర్వులకు నివాసస్థానములుగా మూఁడు ప్రదేశములు గానవచ్చు చున్నవి.

1. వేఁగినాటియం దొక గ్రామము. 2. గుడ్లూరు, 3. చెదలువాడ. ఇందు మొదటి రెండు గ్రామములందు ఎఱ్ఱన పూర్వీకులుకూడ నివసించి యుందురు. కాని చెదల్వాడమాత్ర మెఱ్ఱనకాలముననే యాతనికి నివాసస్థానము కాగా నాతనికి మఱియు నాతని తరువాతి వారకలకాపేరు గృహనామమై స్థిరపడినదని చెప్పవచ్చును. ఏలయన నెఱ్ఱాప్రెగడ, మల్లనచే నభిమానింపఁబడిన కవి. మల్లారెడ్డి ప్రేరణమువలననే ఎఱ్ఱన రామాయణమును వ్రాసి ప్రోలయ వేమారెడ్డి కంకితము గావించినాఁడు. మల్లారెడ్డి యన్ననో, చెదలువాడయందొక దేవాలయమును గట్టించి యందు రామలక్ష్మణ విగ్రహములను ప్రతిష్ఠ గావింపఁజేసినాఁడు. బహుశః యీ సందర్భముననే మల్లారెడ్డి చెదలువాడను ఎఱ్ఱాప్రెగడకు నగ్రహారముగా బహూకరించి యుండవచ్చును. కావున నాఁటి నుండియే యాగ్రామము ఎఱ్ఱనకు మఱియు నాతని వంశీయులకు నివాసస్థానమైనది. కావున ప్రసిద్ధుఁడైన మహాకవి యీ చెదలువాడ నగ్రహారముగాఁ బడయుటచేత నతనికిని నాతని తరువాతి వారలకును గృహనామముగా సంకేతింపఁ బడి మనుమఁడు మల్లయకాలమునాఁటి కాపేరు స్థిరపడిన దని చెప్పవచ్చును.

6. 'నిను సేవించినఁ గల్గు మానవులకున్ వీటీపథూటీఘటీ' – వేలూరి శివరామశాస్త్రి, హరివంశము – పీఠిక

7. నృ.పు.ఆ. 1,12,13.

**ఎఱ్ఱాప్రెగడ శీలము - గురువు**

ఎఱ్ఱాప్రెగడ సరసబహుపురాణధర్మికథావిస్తరవేది. సకల భాషా కవిత్వ విశారదుఁడు. ఆతులానుభావభవ్యుఁడు. ప్రబంధరచనా ప్రావీణ్యము సహజపరిణత సిద్ధంబై వెలసినవాఁ డయ్యు గురుభజన పరాయణుఁడు. మీఁదు మిక్కిలి వినయోదయ భరితుఁడు. ఎఱ్ఱన కేవలము నృసింహపురాణమందే కాక హరివంశమందు సయితము ప్రోలయ వేమారెడ్డి "సాధుసమ్మతుఁడవు. నిత్య సౌమ్యమతివి, భవ్యుఁడవు గాన నీ మీఁదఁ బరగఁ బక్షమేను గలిగి యుండుదు నెప్పు డెఱ్ఱనార్య"[8] యని యితనితోఁ బలికినట్లుగా రచించి సౌశీల్యాదులం దీకవికిఁ గల యభినివేశమును బ్రకటించినాఁడు. ఆ విధముగనే యత్యంతశక్తివంతమైన కవితాప్రౌఢి కలిగియుఁ దానతివినయముతో "కతిపయాక్షర పరిగ్రహజనితంబైన నైసర్గికచాపలంబుకతంబున, మించినవేడ్క వీనులకుమిక్కుటమై మధువృష్టిఁగ్రమ్మ రాయంచలు కూయఁ గ్రౌంచమును నావలఁ గూయఁ గడంగుభంగి" దానును గావ్యశయ్య గీలించిన కీర్తిసంగసుఖలీలకు కాంక్షచేసి కావ్యరచనోన్ముఖుఁడైనట్లు రచించుట యాతని వినయసౌశీల్యమునకు బతాకవంటిదిగ భావింపవచ్చును.

ఈతఁడు పూజిత ధూర్జటిచరణాంబుజుఁడై గిరిశభక్తిరసతత్పరభావము గలవాఁడు. అయ్యును గోవిందగుణాదరసంభృతసౌమనస్యధన్యుఁడు.[9] ఈతఁ డిట్టివాఁ డనుటకు విష్ణుధర్మ ప్రశంసాపవిత్రములైన హరివంశ, నృసింహావతార కథా ప్రబంధముల నిర్మాణమే తార్కాణము. కావ్యరచన మన నితఁడొక యీశ్వరాను శాసనమువలె భావించి దాని నత్యంత భక్తి తత్పరమతియై తీర్చుచుండెడివాఁడనుట కుదాహరణముగా 'ఉత్సాహంబు మిగులం చిత్తంబును వాగ్వృత్తంబును నుత్తమ శ్లోకసంకీర్తన రచనాయత్తంబులగు చుండ నత్యుదాత్త భక్తి ప్రయుక్తోల్లాసభాసితుండనై' యని నృసింహపురాణమునందు రచించిన వాక్యమును బేర్కొనవచ్చును.[10]

ఆద్యులైన నన్నయ తిక్కనాదులు చూపిన త్రోవ పావనంబని యెంచిన యీతఁడు హరివలెనె కావ్యప్రయోజనమును గూర్చి యాలోచించినాఁడు. మధురోక్తిగుంభన మనీషులు మెచ్చునట్లుగ రచింప నఖిలేప్సితపుణ్యఫలోదయోన్నతులు చేకూరునని భావించినాఁడు.[11]

---

8. హరి.వం. ఆ.1-38
9. నృ.పు.ఆ.1-12,13
10. నృ.పు.ఆ.1-21 & 29
11. నృ.పు.ఆ.1-21.

సాధుజనసమ్మతుఁడైనయెఱ్ఱన సంయమీశ్వరుఁడైనశంకరస్వామియం దధికభక్తి ప్రపత్తులు గలవాఁడు. ఈతఁడు సత్సంప్రదాయానుసారియై కావ్యారంభములందు లాంఛనప్రాయముగా గురుస్తుతి నొనరించుటయే కాక యాశ్వాసాంతగద్యలందు సయితము "ఇది శంకరస్వామి సంయమీశ్వర చరణసరోరుహధ్యానానంద సౌందర్యధుర్య శ్రీ సూర్యసుకవిమిత్రసంభవ శంభుదానలక్షణాభిధేయ యెఱ్ఱయనామధేయ ప్రణీతంబైన" అని శంకరస్వామిని ప్రధానముగాఁ బేర్కొనుచు గద్యను ముగించి వారియెడ తనకుఁ గల యమేయమైన గురుభక్తిని ప్రదర్శించినాఁడు. అంతేకాక ఎఱ్ఱన వీరిని స్మరించి నప్పుడెల్ల మునీంద్రుఁ డనియు, కామక్రోధముల క్రందువాపినట్టివాఁ డనియుఁ దుదిదాకిన యున్నతి గన్నవాఁ డనియు, భక్తవత్సలుఁ డనియుఁ బేర్కొనుట చూడ నీతఁడొక సామాన్యుఁడైన విద్యాగురువువలె కాక యొక మహామహిమానుభావుని వలెను, ఒక మహాతపస్వివలెను గోచరించుచున్నాఁడు. బహుశః యీ శంకరస్వామి ఎఱ్ఱనకు దీక్షాగురువై యుండనోవు.

**బిరుదులు:** ఎఱ్ఱాప్రెగడకుఁ గల బిరుదులలోఁ బ్రధానముగాఁ బేర్కొనదగినవి రెండు బిరుదులు. అందొకటి ప్రబంధపరమేశ్వరుఁ డనునది. రెండవది శంభుదాసుఁ డనునది. ఇందు రెండవదియైన శంభుదాసుఁ డనుబిరుదము లక్షణాభిధేయమని యెఱ్ఱనయే తెల్లము గావించినాఁడు లక్షణాభిధేయ మనఁగా నొకానొక వ్యక్తికి నొకానొక గుణవిశేషముచేత నొసఁగబడిన మారుపేరుగ మనము గుర్తింపవచ్చును. ఇచట ఎఱ్ఱనకుఁ గల శివభక్తి విశేషముచేత జనులాతనిని శంభుదాసుఁడని యని యుందురు రానురా నదియే యాతని రెండవపేరుగా మారినది. ఇఁక లక్షణ యనుశబ్దమున కమరకోశమందువలెనె సంస్కృతాంగ్ల నిఘంటువులలో expressing, indicating indirectly, a mark, a sign, a symbol, named అనునర్థములు గానవచ్చుచున్నవి. కావున యెఱ్ఱనయు భక్తిభావవినమ్రుఁడై జనులాతనిని శంభుదాసుఁ డని పిలిచిన మారుపేరునే కొండంతలుగా భావించి గ్రంథములందు సయిత ముపయోగించుకొనినాఁడు. దీనివలన సమకాలికులు, సగోత్రీకులైన యితర యెఱ్ఱయల నుండి యితనిని వేఱు గావించుటకు నాస్కారము చిక్కినది.

**ప్రబంధపరమేశ్వరుడు:** ప్రబంధ పరమేశ్వరుఁ డనునది యాతనికి బిరుద నామము. ప్రస్తుత ముపలభ్యము లగుచున్న యెఱ్ఱనకృతములైన మూఁడు గ్రంథములలో కేవలమొక నృసింహపురాణమునందే యీ బిరుదుగానవచ్చుచున్నది. నృసింహ పురాణములో గ్రంథావతారికాసంధర్భమున దన తాతయైన ఎఱపోతసూరి "ఎన్నికమైఁ

బ్రబంధపరమేశుఁ డనంగ నరణ్యపర్వశేషోన్న యమంధ్రభాష సుజనోత్సవమొప్పఁగ నిర్వహించితా”[12] అని పలికినట్లు వ్రాయుటచే నీ ప్రబంధ పరమేశ్వర బిరుద మీతనికి నృసింహపురాణ రచనకుఁ బూర్వమే యున్నట్లు తెలియుచున్నది. అయినచో నెఱ్ఱన రచించిన గ్రంథములో నేది ప్రబంధ మను యాలోచన పొడయుచున్నది. కావున ప్రబంధ మనఁగా నేమి? ఈ శబ్దము నెవ్వరెట్లుపయోగించిరో యెఱుఁగవలయును.

ఈ ప్రబంధ శబ్దము నేఁటిదృష్టియందు కాక సాధారణముగా కావ్యదృష్టితో నుపయుక్తమైనది. ఆంధ్రభాషయందు తిక్కనామాత్యుఁడు తొలుత “రచనా కౌతుకమున మనములరఁగ నీ ప్రబంధమండలి కధినాథునిగా నే పురుషుఁ బేర్కొనువాఁడ” ననియు ‘నీ దృశంబులగు ప్రబంధంబులు దేవసన్నిధిం బ్రశంసించుటయు నొక్క యరాధన విశేషం బనియు రచించి ప్రబంధ మనఁగా కావ్యమనియే సూచించినాఁడు[13] ఆ విధముగా నెఱ్ఱయ సయితము నృసింహపురాణ మును రసవత్కావ్యమనియు ప్రబంధ మనియుఁబేర్కొనుటయేకాక “ఇట్లు మహా ప్రబంధకల్పనాకుతూహలాయత్తచిత్తుండనై”[14] యనియు కావున ప్రబంధరచనా ప్రావీణ్యము నీకు సహజపరిణతసిద్ధంబనియు నిఁక హరివంశమునందు ‘జగదర్చితంబగు ప్రబంధంబు నిర్మింప నుపక్రమించితి’[15] ననియు వ్రాసినాఁడు. కావున నెఱ్ఱాప్రెగడకుఁబూర్వమునను మఱియు నాతని తరువాతి కాలము నందును నీపదము కావ్యపరముగనే యుపయోగింపఁబడినట్లు తెలియుచున్నది.

సాధారణముగఁ బ్రబంధమనఁగ నష్టాదశవర్ణనములు గలిగి రాయల యుగము నందు వెలసిన సాహిత్యమునకే యాపేరు చెల్లుచున్నట్లు కాక ప్రకృష్టమైన బంధము కలిగిన యేకావ్యమునైన నాపేరుతోఁ బిలువచ్చునని యెఱిఁగితిమి. ఇంతేకాక “ప్రబంధ మంటే విశేషార్థమేమీ లేదు. రామాయణ భారతాదులు కూడా ప్రబంధాలేను.” అని చెప్పుచునందు కుదాహరణముగ ధ్వన్యాలోకము నుండియు, కావ్యప్రకాశము నుండియు నాయావాక్యముల నుద్ధరించినారు శ్రీ వేదాల తిరువేంగళాచార్యులు.

ఈ ప్రబంధశబ్దము కేవలము కావ్యమునకే కాక నాటకమునకుఁ గూడ చెల్లుచున్నట్లుగ కాళిదాసకృత మాళవికాగ్నిమిత్రమునందాధారములు గానవచ్చుచున్నవి.

సంస్కృతాంగ్ల నిఘంటువుల ననుసరించి ప్రబంధశబ్దార్థమును బరిశీలింపఁగా a bound, a tie, uninteruptedness, or succession, continuance, a continuity,

12. నృ.పు.ఆ.1-17
13. ఆ.మ.భా.వి.ప.ఆ.1.8-31.
14. నృ.పు.ఆ.1. 14-20
15. హరి. పూ. భా.ఆ.1-44.

or connected narrative, or discourse, a work of imagination, a feigned story founded on substratum of fact, plan, scheme అను నర్థములందుపయుక్తమగుచున్నట్లు గానవచ్చుచున్నది.

పై యర్థములను బురస్కరించుకొని చూడగా అష్టాదశవర్ణనలు కలిగి రాయలకాలమందలి రచనలఁ బోలిన కావ్యమే ప్రబంధముకాక యవిచ్ఛిన్నముగ విషయము లన్నియు నొకచోటఁగల గ్రంథము, మఱియు సంబంధముతెగని కథా సూత్రముగల గ్రంథమునుగూడ ప్రబంధమనఁ జెల్లునని తెలియుచున్నది. కావున పై యర్థములను బురస్కరించుకొని యే గ్రంథ రచనమువలన ఎఱ్ఱాప్రెగడ ప్రబంధ పరమేశ్వరుఁ డాయెనో విచారింపవలయును. ప్రబంధ ధోరణిని భారతారణ్యపర్వ శేషమును చమత్కార బంధురముగ రచించుటచేతఁ బ్రబంధపరమేశ్వరుఁ డను బిరుదనామము గలిగిన దని కవుల చరిత్రలో శ్రీ వీరేశలింగము పంతులుగారు పేర్కొనినారు.

"పురాణరచనలో సయితము వర్ణనాప్రాధాన్యమును నెలకొల్పిన మొదటి కవి యీతఁడే. వర్ణనాత్మకము, ఆధునికమును అగు శైలిలో నృసింహపురాణ మనెడి ఒక ప్రబంధమునే రచించి రాఁబోవు ప్రబంధమహావృక్షమునకు బీజమును నాటిన యుగకర్త. ఈ విధముగఁ ప్రబంధకవిత్వ స్థాపనాచార్యుఁడు గనుకనే ఎఱ్ఱాప్రెగడ ప్రబంధపరమేశ్వరుఁడను సార్థకనామమును దాల్చెను." అని శ్రీ పింగళి లక్ష్మీకాంతము గారు గౌతమవ్యాసములలోఁ బ్రకటించినారు. ఈ విధముగఁ బెద్దలు రచించిన యభిప్రాయముల నాధారముగ చూచినచో కేవలము ప్రబంధలక్షణానుగుణములైన చ్ఛాయ లెఱ్ఱిన రచనయందుండుట చేతనే యాయన కాబిరుదము వచ్చినట్లు తెలియుచున్నది. కాని యే గ్రంథము ప్రబంధలక్షణములు గలది యను విషయము నందు మాత్ర మేక వాక్యత కుదరలేదు.

ఎఱ్ఱాప్రెగడ మొదట రామాయణమును రచించి ప్రోలయ వేమారెడ్డికిఁ గృతి నిచ్చినాఁడు. దాని తరువాత హరివంశమును రచించి యారెడ్డి ప్రభువునకే కృతి నిచ్చినాడు.

ఈ హరివంశ గ్రంథము సకలార్థ సాధకమైన భారతమునకు శేషగ్రంథము. హరివంశపారాయణముచేతగాఁని భారతపారాయణము పరిసమాప్తి నొంది విశేషఫలదాయ కాదు. అంతియకాక 'ఏతతపర్వశతంపూర్వం వ్యాసేనోక్తం మహర్షిణా' అని సంస్కృత భారతమునందును, 'పర్వశతంబులు గలిగి' యని తెలుఁగు భారతము నందును గన్పడుటచే హరివంశమును భారత భాగముగనే గ్రహించి ఖిల పర్వముగఁ

బేర్కొనినారు. భారతమునందు తిక్కన నాల్గవదియైన విరాటపర్వము నుండి పదునేను పర్వములు రచించినాఁడు. హరివంశమునం దెఱ్ఱాప్రెగడకుఁ బ్రబంధ పరమేశ్వరుఁడను బిరుదము కానరాదు. కావున రామాయణము వలన నీతని కీ బిరుదము రాలేదని స్పష్టమైనది. భారతమున తిక్కన రచింపకవిడిచిన ఖిలభాగ హరివంశము పూర్తి గావించినను నన్నయకృతమగు నారణ్యపర్వము పూర్తిగాక వెలతిగా నుండుటచేత భారతము నకు సమగ్రమైన స్వరూపము రాలేదు. అందుకై యెఱ్ఱాప్రెగడ నిస్వార్థబుద్ధితో జగద్ధితియై యీ శేషభాగమును రచించి నన్నయరచనగనే పూర్తిగావించి భారతభాగము లన్నింటి నొక్కచోఁ గూర్పఁగలిగినాఁడు నాఁటినుండియే భారత మంతయు నవిచ్ఛిన్నముగా నొక్కచోఁ జేరి సమగ్రస్వరూపముతో భాసించినది. ఇట్ల ష్టాదశపర్వము లొక్కచోఁ గలియ భారతమొక మహాప్రబంధము కాగా దానికి పరమేశ్వరుని వంటివాఁ డెఱ్ఱన యైనాఁడు. కావున నెఱ్ఱాప్రెగడకుఁ బ్రబంధపరమేశ్వరుఁ డనుబిరుదము 'అరణ్యపర్వశేషరచనముచే సిద్ధించినమాట సత్యమే. కాని యాబిరుదము అరణ్యపర్వమునందు ప్రబంధ లక్షణానుగుణములైన ఛాయ లుండుట మాత్రము చేత కాక కొఱవడిన భారత భాగమును పూరించి దాని నొక సంపూర్ణ ప్రబంధముగాఁ గల్పించుటచేతనే సిద్ధించినదని చెప్పవచ్చును.

**ఎఱ్ఱాప్రెగడ కాలము:** ఎఱ్ఱాప్రెగడ కాలమును నిర్ణయించుట కాతఁడు రచించిన గ్రంథములే ప్రబలములైనయాధారములు. అందుఁ బ్రధానముగఁ బేర్కొనఁ దగినవి హరివంశము, నృసింహపురాణము.

నృసింహపురాణమునం దెఱ్ఱాప్రెగడ పీఠికలోఁ గవివంశాది విశేషముల నెఱిఁగించు సందర్భమున తన తాతతాతయైన యెఱపోతసూరి వెలనాటి చోడునివలన మన్ననల నందిన భీమనమంత్రి యని పేర్కొనినాఁడు.[16] ఎఱ్ఱన తాతకుఁ దాతయైన భీమన మంత్రిని గౌరవించిన వెలనాటి చోడుని కాలమును బురస్కరించుకొని దాదాపుగ నెఱ్ఱనకాలమును నిర్ణయింపవచ్చును. నృసింహపురాణమందలి పద్యము నాధారముగా గొని శ్రీ వీరేశలింగము పంతులుగారు "వెలనాటి చోడుఁడు క్రీ.శ. 1156 మొదలు క్రీ.శ' 1163వ సంవత్సరము వఱకును బరిపాలించిన వాఁడని నిర్ణయించి యప్పుడు సన్మానమును బొందిన భీమన మన యెఱ్ఱన తాతకుఁ దాత కావున వీరిరువురి మధ్యనున్న మూఁడు తరములకుఁ దరమునకు నలువది సంవత్సరములు చొప్పునఁ బరిగణించినపుడు ఎఱ్ఱన జననకాలము క్రీ.శ.1316 కాఁగా చోడునిచేత సన్మానములఁ

16. నృ.పు.ఆ.1.15.

బొందు నాఁటికే భీమన నలువది వత్సరముల ప్రాయము గలిగియుండ నాతనికిఁ గుమారునికి నరువది వత్సరముల యంతరము లెక్కించుట భావ్యము కాదని మఱొక యిరువది సంవత్సరముల తగ్గించి ఎఱ్ఱాప్రెగడ జననకాలమును క్రీ.శ. 1296 అని నిర్ణయించిరి.

ఆంధ్ర కవితరంగిణికారులు పై కాలనిర్ణయమునకుఁ ప్రధానభూతుఁడైన వెలనాటిచోడుని కాలము నంగీకరింపక 'వెలనాటి చోడు లిరువురున్నారు. మొదటియాతఁడు క్రీ.శ. 1138 వఱకు నున్నవాఁడు. రెండవయాతఁడు క్రీ.శ. 1117-80 ల నడుమ రాజ్యము చేసినవాఁడు' అని వ్రాసి "భీమన మంత్రిని గౌరవించిన రాజు మొదటియాతఁడని శ్రీ వీరేశలింగం పంతులుగారభిప్రాయపడిరి. రెండవ చోడుఁడుని నాయభిప్రాయము" అని వెలనాటి చోడుని వలన భీమన సత్కృతుల నందినకాలమును క్రీ.శ. 1175గ నిర్ణయించుచుఁ దరమునకు ముప్పదిమూఁడు సంవత్సరములుగ లెక్కించుచు ఎఱ్ఱాప్రెగడ జనన కాలము క్రీ.శ' 1280 తలంపవలసి యుండు" నని వ్రాసినారు.

పై లెక్క ననుసరించి చూడ మఱియైదు సంవత్సరములు కలుపవలసి వచ్చును. సాధారణముగ నిదమిత్థమని కాలనిర్ణయమును జేయలేనిచోటఁ దరమునకు ముప్పది సంవత్సరము లనికాని లేదా మూఁడు తరములకు నూరు సంవత్సరములనికాని స్వీకరించి లెక్కించు టుచితము. ఈ పరిగణనము నందు సాధారణముగ వచ్చు మన యాచారమును బుర్సరించుకొని యిరువదియైదు సంవత్సరములకే యొకరు తండ్రియగు చుండఁబై పరిగణనము తప్పని యాక్షేపణము చూపినను చూపవచ్చును, కాని కేవలము మనకు ప్రసక్తులైయున్న పురుషులందఱు మొదటి సంతానమై యుండవలయునను నిర్ణయము లేదు. అట్టిచో నన్నదమ్ములు ముప్వురు నల్వురున్నవారి యంతరము కొన్ని యెడల పదివఱకు మఱికొన్ని యెడల నిరువదివఱకుఁ గూడ పోవుట వింతకాదు. కావున నీరెంటికి మధ్య తరమునకు 30-35 సంవత్సరములని గ్రహించుటయే యుత్తమమైనది. ఈ నిర్ణయయే పాశ్చాత్యులును బాటించుచున్నారు.[17]

---

17.(a) "In reconing historiecally by generations the word is taken to mean the interval of time between the birth of the parents and that of their children usually completed at thirty years of three generations to a centuary." - James. H.H.Murray.

(b) "Thus the word is also used of the age or persons of a generation usually taken as about thirty years or three generations to a centuary." - Encyclopaedia - Britanica.

వెలనాటిచోడు లిరువురు గలరు. మొదటి వెలనాటి చోడుఁడు క్రీ.శ. 1108-1132 వఱకు రాజ్యమేలినట్టి కుశోత్తుంగచోడుఁడని నామాంతరము పొందిన చాళుక్యచోడ చక్రవర్తియైనవాని దత్తపుత్రుఁడను ఖ్యాతినిబొందినవాఁడు. ఈతని కుమారుఁడు గొంకరాజు. ఈతని కాలముననే యాధిపత్య ముత్తరమున మహేంద్రగిరి నుండి దక్షిణమునఁ బాకనాటి వఱకును సాగెను. ఈతని కుమారుఁడే రెండవ వెలనాటి చోడుఁడు. ఈతఁడే మన యెఱ్ఱాప్రెగడ తాతకుఁ దాతయైన భీమనమంత్రిని గౌరవించినాఁడు. ఇతని కాలము క్రీ.శ. 1163-80. ఈ కాలమందు ప్రౌఢ వయస్కుఁడగు భీమనకు మూఁడు తరములు తరువాతి వాఁడైన ఎఱ్ఱన దాదాపు క్రీ.శ. 1280-85 నడుమ జన్మించి యుండవచ్చును. ఇఁక నెఱ్ఱాప్రెగడ రామాయణ హరివంశములను రచించి యాశ్రిత చింతామణియై మధ్యాంధ్రదేశమును ధర్మాను బద్ధముగఁ బరిపాలించిన ప్రోలయ వేమారెడ్డి కంకిత మిచ్చెను. ఈ ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ. 1325 నుండి 1353 వఱకుఁ బరిపాలించినట్లు చారిత్రకు లందఱు ఏకగ్రీవముగా నంగీకరించిన విషయము. కావున నీ ప్రభువు పరిపాలనా కాలమునందు కృతుల రచించి మన్ననల నందిన యెఱ్ఱాప్రెగడ 12వ శతాబ్ది చివరి భాగమున ననఁగా క్రీ.శ. 1280-85ల నడుమ జన్మించి క్రీ.శ. 1355 వఱకు జీవించె నని చెప్పవచ్చును.

**ఎఱ్ఱాప్రెగడ గంథములు:** రామాయణము, హరివంశము ఆరణ్యపర్వశేషము, నృసింహపురాణము.

ఈ నాలుగు గ్రంథములు దాదాపు విష్ణుపారమ్యప్రతిబోధకములే. శివ పదాబ్జ సంతతధ్యానసంసక్తచిత్తుఁడై శంభుదాసుఁడనఁ బరగియు గోవింద గుణాదర సంభృత సౌమనస్యధన్యత[18] కీ గ్రంథములే ప్రబల సాక్ష్యములు.

ఎఱ్ఱాప్రెగడ కృతము లగు నాలుగు గ్రంథములలో రామాయణము దక్క తక్కిన మూఁడు గ్రంథము లిప్పుడుపలభ్యము లగుచున్నవి. లభించుచున్న గ్రంథాధారములను బురస్కరించుకొని చూడగా హరివంశమందు రామాయణ ప్రశంసయు, నృసింహ పురాణమునందు భారతారణ్యపర్వశేషోన్నయ ప్రశంసయు గానవచ్చుచున్నది. కావున హరివంశమునకుఁ బూర్వము రామాయణమున, నృసింహపురాణమునకుఁ బూర్వము భారతారణ్యపర్వశేషమును రచించినట్లు వ్యక్తమగుచున్నది. కాని నృసింహపురాణ హరివంశములందేగ్రంథము తొలుత రచించెనను విషయము కుదురుక పండితులలో నేఁటికి వివాదములు పొడసూపుచున్నవి.

18. నృ.పు.ఆ.1.18.

సాధారణముగ కవి చరిత్రకారులు, విమర్శకులు కవుల గ్రంథముల పౌర్వాపర్యమును నిర్ణయించుటకు వారి గ్రంథములందుఁ గానవచ్చు పీఠికల నాధారముగఁ గొని నిర్ణయము గావించుచుందురు. అయ్యవియే యెట్టిన గ్రంథముల విషయమునను నిర్ణయమునకుఁ దోడ్పడుచున్నవి. కాని నిగూఢ గుణశీలి, వినయోదిత భరితుఁడు, ఉక్తివై చిత్ర్యోపేతుఁడు కీర్తికాముఁడైన ఎఱ్ఱాప్రెగడ గ్రంథములందుఁ గానవచ్చు నవతారికలు గూడ విచిత్రాన్వయ శోభితము లగుటచే విషయ నిర్ణయ మంత సులభమై కానచ్చుట లేదు. ఇరుపక్షములవారును నీతని యవతారికల నాధారముగఁ గొనియే తమ తమ యభిప్రాయముల కనుగుణముగ నెఱ్ఱాప్రెగడ గ్రంథముల పౌర్వాపర్యనిర్ణయ మొసఁగినారు. ఎఱ్ఱాప్రెగడ గ్రంథముల పౌర్వాపర్యమును బురస్కరించుకొని యభిప్రాయముల వెల్వరించినవారిలో శ్రీయుతులు కందుకూరి వీరేశలింగము పంతులు, శేషాద్రిరమణ కవులు, పింగళి లక్ష్మీకాంతము, వేదాల తిరువేంగళాచారి, దివాకర్ల వేంకటావధాని, చాగంటి శేషయ్యగారలు ముఖ్యులు.

ఎఱ్ఱాప్రెగడ గ్రంథములందు హరివంశము మొదటను నృసింహపురాణము తరువాతను రచించె నని చెప్పువా రొసఁగు హేతువులుగా శ్రీ చాగంటి శేషయ్యగారు పేర్కొనిన విధానము.

1. "గ్రంథ రచనకుఁ బ్రారంభమున నీతఁడు నన్నయకు విఘ్నము కలిగించి నట్టియు, విఘ్నము గలుగు నను భయముచేత తిక్కన విడిచిపెట్టెనని ప్రజలనుకొను నట్టియు నారణ్య[19] పర్వశేషము నెన్నుకొని యుండఁడు.

2. హరివంశము వంటి యుత్తమ ప్రబంధమును రచించిన పిమ్మట ప్రబంధ పరమేశ్వరుఁ డను పేరువచ్చును కాని ఆరణ్యపర్వశేషమును బూరించినంత మాత్రమున నట్టిపేరు వచ్చె నని తలంచుట సమంజసము కాదు. అందు చేతనే హరివంశమునఁ బ్రబంధపరమేశ్వరుఁడ నని కవి చెప్పుకొనలేదు. నృసింహపురాణమున నట్లు చెప్పుకొని యున్నాఁడు.

3. కవి తన యౌవనమున రాజుల నాశ్రయించి కృతులిచ్చి తిక్కన శ్రీనాథాదుల వలెనే వృద్ధాప్యమున భగవంతుఁ డైన నారసింహునకుఁ గృతి నిచ్చెను."

ఈ పైఁ జూపిన కారణములను బురస్కరించుకొని శ్రీ శేషయ్యగారు "ఈ కారణములను బట్టి నృసింహపురాణమును గట్టకడపట రచించె ననెడి యూహ సత్య మనియే తోఁచునుగాని నృసింహపురాణమందలి యవతారికలోని గద్యపద్యములను

19. ఆం.కవి. త. భా. 4. పు.63.

జదివినచో నాయూహ నిలువఁజాలదు. వాని నీ క్రింద నిచ్చుచున్నాడను అని నృసింహపురాణమందలి "ఖతివయాక్షర పరిగ్రహ జనింత బైన నైసర్గిక చాపలంబు కతంబున" అను వచనమును దాని తరువాతిది యగు పద్యమును[20] బేర్కొని "పై గద్యపద్యములను బరిశీలనాబుద్ధితోఁ జదివిన యెడల నెఱ్ఱయకుఁ గావ్యరచన కది ప్రథమ ప్రయత్న మనియు నదివఱకారణ్యపర్వశేషమును బూరించి యున్నను, అదియొక స్వతంత్ర గ్రంథము కాక అన్యకవి రచితమైన మహాగ్రంథములోఁ గొంత భాగము మాత్రమే యగుటచేతను నందు వేఱుగనవతారికనుగాని గద్యనుగాని రచింపక నన్నయ మహాకవి రచించినట్లే చెప్పియుండుటచేతను దానినొక గ్రంథముగా నెఱ్ఱాప్రెగడ యెంచుకొనిన నృసింహపురాణమునే తన ప్రథమకావ్యముగ నెంచి నూతన రచన కారంభించు కవులు సామాన్యముగఁ జూపెడి వినమ్రతను సూచించు. 'రాయంచలు గూయఁ గ్రౌంచమును నావలఁ గూయఁ గడంగు భంగి' నిత్యాది వాక్యముల నిందు వ్రాసెననియు, రామాయణమును హరివంశమును, ఆరణ్యపర్వశేషమును నదివఱకే రచించియున్న యెడల నృసింహపురాణమునం దిట్టి ప్రథమ ప్రయత్న సూచక వాక్యములను వ్రాసియుండఁ డనియుఁ దోఁపక మానదు.' అనియు నిఁక విక్రమార్క చరిత్రమును రచించిన జక్కయకవి యెఱ్ఱాప్రెగడను నుతించుచు వ్రాసిన పద్యములో నరణ్య పర్వశేష నృసింహ పురాణ రామాయణములను వరుసగఁ బేర్కొనియుండుట ప్రబల సాక్ష్యము కాకపోయినను గొంతవఱ కీయూహను (అనఁగా మొదట నరణ్యపర్వశేషము నృసింహపురాణము, పిదప రామాయణ హరివంశములను వరుసలో నెఱ్ఱన గ్రంథరచన గావించెననుట) బలపఱచుచున్నది." అని మఱియొక హేతువును జూపిరి. ఎఱ్ఱాప్రెగడ నృసింహపురాణ, హరివంశాది గ్రంథములకు పీఠికను[21] వ్రాసిన శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు ఉన్నత సంస్కృతాది చతురోక్తి పంబుల (పథంబులఁ) గావ్యకర్తవై' అనుదానిలోని కావ్యము రామాయణమేనని దాని పిదపనే ఆరణ్యపర్వశేష నృసింహ పురాణములఁ జెప్పి ననియు, వేమయ కోరఁగా తొల్లిరచించిన రామాయణము కృతియిచ్చి భారతమునకు ఖిలమగు హరివంశమునకుఁ బూనుకొనెనని చెప్పవలెను.

---

20. "మించిన వేడ్క వీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మ రా
    యంచలు గూయఁ గ్రౌంచమును నావలఁ గూయ గడంగు భంగిఁ బ్రౌ
    ఢాంచిత శబ్దసారులు మహాకవు లాద్యులు కావ్యశయ్యఁ గీ
    లించిన కీర్తి సంగ సుఖలీలకు నేనును గాంక్ష చేసితిన్. (నృ.పు.ఆ.1)

21. ఆంధ్ర కవితరంగిణి, సం.4, పుటట63-65.

మఱియు ఈ చతురోక్తి పథంబులు సంస్కృతములో ఆదికావ్యములని ఎఱ్ఱయ ఉద్దేశించెనేని రామాయణ హరివంశములు చెప్పిన పిదపనే ఆరణ్యపర్వశేషమును నృసింహపురాణమును జెప్పె నని అనవలయును. అనియు మఱియు నృసింహ పురాణము రామాయణమునుగాని హరివంశమును గాని పేర్కొనదు. హరివంశము నృసింహపురాణమునుగాని ఆరణ్యపర్వశేషమునుగాని ఉగ్గడింపదు. కావున వీని పౌర్యాపర్యము తెలిసికొనుటకు వీలు లేదు. ఇఁక రచనా ప్రౌఢిలో ఆరణ్యపర్వశేష నృసింహ పురాణములకు హరివంశము లొచ్చుగాన రామాయణ హరివంశముల రచన మొట్టమొదటి దని కొందఱందురు. విరాటమును ఆనుశాసనిక పర్వమును ఉదాహరణముగాఁజూపి రచనాప్రౌఢికి ఆద్యప్రయత్నమునే కారణముగాఁజెప్పి కొందఱు వెనుకటి వాదము నియ్యకొనరు. ఇతని కవితారచన హరివంశముననే విశ్రాంత మయినదని కొందఱందురు. ఎఱ్ఱయ దేనిని చెప్పి ప్రబంధపరమేశ్వరుఁ డాయెనో అట్టి ఆరణ్యపర్వశేషమునే సారహీనముగాఁ గొందఱు తలఁచిరి. 'భిన్నరుచిర్హిలోకః' ఎవరి లక్ష్య కేంద్రము వారిదే[22] యని చెప్పి వీరుసయిత మేనిర్ణయమును గావింపకయే వదిలినారు.

శ్రీ వేదాల తిరువేంగళాచార్యులు ఎఱ్ఱనగ్రంథముల పౌర్యాపర్యముల నిర్ణయించుచు ఉన్నత సంస్కృతాది చతురోక్తి పదంబుల' అను పద్యమునే పేర్కొని 'ఈ పద్యమును బట్టి మొదట నొక కావ్యమును తరువాత నృసింహ పురాణమును రచించెనని తెలియుచున్నది. తదనంతరమున హరివంశమును బట్టి 'బంధు రష్టాదశ పర్వ నిర్వహణ సంభావితం బగు మహాభారతంబు హరివంశ పూరంబగునట్లుగఁ గ్రమవ్యాఖ్యాన మొనరించె'నని తెల్లమగును. అని వ్రాయుటయే కాక ఎఱ్ఱాప్రెగడ హరివంశములో నెఱ్ఱన తా నింతవఱకే రచించిన రామాయణమును పేర్కొని నృసింహ పురాణమును గూర్తి తలపెట్టకుండుటను గూర్చి "ఆ సందర్భము వేఱు, ఎట్లనఁగ నృసింహపురాణమను పురాణ గ్రంథమును రచింపఁ జేయఁబోవునపు డాగ్రంథమును రచించుట కతనికిఁ గల యర్హత నిరూపణీయము కనుకనే యదివరలో ఈ పురాణము వంటి ప్రాక్తన కథా సందర్భముగల రామాయణ భారతములను దప్పక ప్రశంసింపవలసి యున్నది.[23] అని వ్రాసినారు. వీరి ననుసరించి ఎఱ్ఱాప్రెగడ గ్రంథముల క్రమము

22. హరి. పీఠిక, పు. viii & xx.

23. భారతోపన్యాసములు.

(1) రామాయణము (2) ఆరణ్యపర్వశేషము (3) నృసింహ పురాణము (4) హరి వంశముగాఁ గానవచ్చుచున్నది.

శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు నృసింహపురాణమందున్న 'మించిన వేడ్క వీనులకు మిక్కుటమై' యను పద్యమును బురస్కరించుకొని 'ఈ చెప్పుకనుట కేవల వినయమునే కాక కవితా ప్రారంభదశను గూడ సూచించు చున్న దనుచు నభిప్రాయ పడుచు నింకను" (నన్నయ తిక్కనలు) వారు పాండితీకవితాపాథోదులు తనది పాండిత్యమును కాదు, కవిత్వమును గాదు, కతిపయాక్షర పరిగ్రహజనితమైన చాపలము. రామాయణ హరివంశములు రచించిన పిమ్మటనే తా నారణ్యపర్వ గద్యలోఁ దనపేరు చెప్పుకొనుటకు జంకియుండఁ డనియు నా విషయమున కారణాంతరములచే నట్లొనర్చినను నృసింహ పురాణమునందు పై విధమున స్వసామర్థ్య లోపసూచకముగా నత్యంత నమ్రతను బ్రదర్శించియుండఁ డనియు నా యభిప్రాయము. నృసింహపురాణ రచనాకాలమునాఁటి కతనికి మల్లారెడ్డి యొక్కయు తద్వారా వేమారెడ్డి యొక్కయు ప్రాపు లభించియుండకపోవుటచే నతఁడాకావ్యమును తన తాత ప్రేరణచేత రచించిన కతమున దాన నతనికి ప్రియదైవతమును స్వామియు నైన అహోబల నరసింహస్వామి కంకితము చేసియుండును. అందుచే నతఁడు రామాయణ హరివంశములకు ముందే ఆరణ్యపర్వశేష నృసింహపురాణముల వరుసగా రచించియుండెననుట యుచితముగాఁ గనుపించును." అని తమ యభిప్రాయముల నొసఁగినారు.

శ్రీ నోరి నరసింహశాస్త్రిగారు ఎఱ్ఱాప్రెగడ గ్రంథములను గూర్చి వ్రాయచు "1. ఆరణ్యపర్వశేషము. 2. శ్రీ నరసింహావతారము, 3. రామాయణము. 4.హరివంశము. వీనిని ప్రాయికముగ నెఱ్ఱాప్రెగడ యొక దాని తరువాత నొకటి వ్రాసియుండును" అని యూహించినారు.

ఈ విధముగ రామాయణ హరివంశముల కన్న మున్నుగ భారతారణ్య పర్వశేష నృసింహపురాణములను ఎఱ్ఱన రచించెనని చెప్పు పెద్దలు చూపు హేతువులలో నొకటి విక్రమార్క చరిత్రమునందు జక్కన పేర్కొనిన ఎఱ్ఱాప్రెగడ గ్రంథముల క్రమము. దీనిని ప్రబలమైన యాధారముగా గ్రహింతురేని యింతకన్న విశ్వసనీయమై తోపట్టునది యాతని వంశీయుఁడు మనుమడునైన మల్లన చెప్పిన క్రమము ననుసరింపవలసి వచ్చును. అక్రమము ననుసరించి యారణ్యపర్వశేష, రామాయణ, నృసింహ పురాణములను చివర హరివంశమును రచించినట్లు తెలియవచ్చును. కావున యాగ్రంథములందలి పూర్వకవి స్తుతి సందర్భములను బురస్కరించుకొని గ్రంథ

క్రమమును నిర్ణయించుటకు వీలులేదు. ఏలయన కవు లాయా పూర్వమహాకవుల స్తుతించునప్పుడు వారి గ్రంథములఁ బేర్కొందురేకాని వాని నన్నింటి నామపూర్వమును బురస్కరించుకొనియే చెప్పవలయు నను నియమము లేదు. ఒక వేళ గ్రంథకర్త పూర్వకవిస్తుతిక్రమము, మఱియు నా పూర్వక వికృత గ్రంథక్రమము కాకతాళీయముగఁ గలసిన కలువవచ్చునేమోకాని అట్లే చెప్పవలయు నను నియమము మాత్రము లేదు. కావున అనియత విషయము లాధారముగా నీ వివాదమును పరిష్కరించుట సమంజసము కాదు.

ఇంతవఱకే రచితమైన గ్రంథములఁ గూర్చి నృసింహపురాణమునందుఁ బేర్కొని హరివంశమందు నృసింహపురాణ ప్రసక్తిఁ గొనిరాకుండుటకుఁ గల కారణము 'అర్హతా నిరూపణ'మని శ్రీ తిరువేంగళాచార్యులు సూచించినారు. ఈ సూచన యంత సమంజసముగా లేదు. ఏలయన నింతవఱకే రామాయణము రచించి వేమభూపాలున కంకితమిచ్చి నన్నయకృతారంభకావ్యమును తాను స్వీకరించి తద్రచనయగా నారణ్య పర్వశేషమును బూరించి ప్రబంధ పరమేశ్వరుఁడని పేరుగాంచిన మహాకవికి ఇప్పుడు క్రొత్తగా నృసింహపురాణ రచనా సందర్భమునందు 'అర్హతా నిరూపణ' మేల గావలసి వచ్చెనో ఎఱుఁగ రాదు. మీఁదు మిక్కిలి యీ గ్రంథరచనమునకై యహమహమికతో బూనిన కవి మఱియొక్కడు లేదు. ప్రభువులెవ్వరీ గ్రంథమును రచించుటకు సమర్థులు గలరా యనుచు సభాస్థానమున బ్రశ్నింపలేదు. ఇఁక నట్టియెడ భగవదంకిత మైన గ్రంథప్రారంభమున తన సామర్థ్య నిరూపణ మనావశ్యకము. ఆయెబో ఇంతటి పరీక్షకు నిలచిన గ్రంథప్రశంస హరివంశమునం దేల చేయలేదు. రామాయణమును మాత్రము పేర్కొని తక్కిన గ్రంథముల చెప్పక యేల విడువవలెనో తెలియదు. కావున నెఱ్ఱన మొదట రామాయణమును వ్రాసి యా విషయమును హరివంశమందు చెప్పి, తరువాత నారణ్యపర్వశేష భాగమును నన్నయ పేరుననే పూరించినాఁడు. తాను నృసింహ పురాణమును రచించినప్పుడింత వఱకే ప్రసిద్ధుఁడైన చారిత్రక పురుషున కంకితమై జగమెఱిగిన గ్రంథముల గూర్చి "ఉన్నత సంస్కృతాది చతురోక్తి పదంబుల కావ్యకర్తనై" యని సాముదాయికముగఁ జెప్పి నన్నయ రచనగా పూరించిన యరణ్య శేషభాగమును గూర్చి లోకజ్ఞుఁడైన ఎఱ్ఱన కంఠోక్తిగాఁ బేర్కొనినాఁడు. కావున ఎఱ్ఱాప్రెగడ చివరి గ్రంథమైన నృసింహపురాణమునందు తానింతవఱకు రచించిన రచనల నన్నింటిని క్రమము దప్పకయే సూచించినాఁడు. అందుచే నెఱ్ఱన మొదట రామాయణ హరి వంశములను దఱువాత నారణ్యపర్వశేష నృసింహ పురాణములను రచించెనని చెప్పవలనుపడును.

రెండవది, నృసింహపురాణమందలి 'కతిపయాక్షరపరిగ్రహ జనితంబైన నైసర్గిక చాపలంబు' మఱియు 'మించిన వేడ్క' యను గద్యపద్యములు ఎఱ్ఱాప్రెగడ కావ్యరచనకు ప్రథమ ప్రయత్నముగాఁ గానవచ్చుట. ఈవాదమునే అనుసరించి నృసింహపురాణమునే మొదటి గ్రంథముగా స్వీకరించుటకు వీలులేదు. ఏలయన కవి యింతవఱకే 'ఉన్నత సంస్కృతాది చతురోక్తి పథంబులఁ గావ్యకర్తయై యెన్నికమైఁ బ్రబంధపరమేశుఁ డనంగ నరణ్యపర్వశేషోన్నయ' మొనర్చినాఁడు. కావున నిన్ని గ్రంథములు వ్రాసి యింత ప్రఖ్యాతి గాంచి యా విషయమును గ్రంథమునందు బాహాటముగా చాటుకొనునట్టి ప్రగల్భునకది తొలి ప్రయత్నముగాఁ గానవచ్చుట లేదు. కాని ఎఱ్ఱయ వినయశీల సంపద యట్టిది. ఈ విషయమునుగూర్చియే తాత ఎఱపోతసూరి "సరస బహుపురాణ ధర్మశాస్త్ర కథావిస్తరవేదిని, వినయోదయ భరితుఁడవు" అని ప్రశంసించినాఁడు.[24] కావున ఈ గద్యపద్యములఁ బురస్కరించుకొనిచూడ నివి నృసింహపురాణ మాకవి ప్రథమ ప్రయత్న సూచకములుగాఁ గాక పరిణత మనస్కుఁడైన కవియొక్క వినయోదయ భరితమైన వినమ్రభావ సూచకములని గ్రహించుటయే లెస్స. ఇట్లుగారచించుటలు తిక్కనాదులయెడ విజ్ఞులు పరిశీలించియే యుందురు. కావునఁ గవిత్రయమునం దొకరుఁడైన యెఱ్ఱాప్రెగడ సయితమాతని చరమకృతియం దత్యంత వినయమును గనఁబఱచుచు గ్రంథమునందవతారిక రచించుటయే కాక యన్నింట దృష్టిని బొందిన ఎఱ్ఱన యా గ్రంథమును భగవదంకితమే కావించినాఁడు.

శ్రీ నోరి నరసింహశాస్త్రిగారు "ఈశ్వరప్రణిపాతముతోఁ గూడిన విజ్ఞాన యోగమునం దభినివేశము కలిగిన సమాధిని నిమీలితేక్షణుండనై క్షణంబున్న" అని చెప్పుకున్న వాక్య మప్రయత్నముగా వచ్చిన సత్యవాక్య మని కవి యాధ్యాత్మికోన్నతిని పొగడినారు. నిజముగా శ్రీ శాస్త్రిగారన్నట్లావిషయమంతటిదే. కాని మఱి యంతటి యాత్మోన్నతిఁ గన్న మహాకవి కారచనము బాల్యరచనమై యుండదుకదా?

ఇంతవఱకే యొక మహాకవి రచింపఁగా కొఱవడిన భాగము పూరించి, రెండవ గ్రంథరచనాకాలమునాఁటికి ఈశ్వర ప్రణిపాతముతోఁ గూడిన విజ్ఞాన యోగమునం దభినివేశముగలిగి తన గ్రంథమును భగవదంకితము గావించి మహామహిమానుభావుఁ డైన యొకకవి తిరిగి రాజాశ్రయమును కాంక్షించి యాతని కోరికమై గ్రంథముల

24. నృ.పు.ఆ.1-19.

రచించి కృతుల నొసంగఁడు. కావున నెఱ్ఱాప్రెగడ రామాయణ హరివంశము తరువాతనే నృసింహపురాణ మొనరించెనని చెప్పవచ్చును.

**ఎఱ్ఱాప్రెగడ గ్రంథములు**

1. భారతారణ్యపర్వశేషము, 2. రామాయణము, 3. హరివంశము, 4. నృసింహ పురాణము లను నాలుగు గ్రంథములే కాక కవిసర్పగారుడ మను మఱియొక లక్షణ గ్రంథమును వ్రాసినట్లు కస్తూరి రంగకవికృతమగు ఆనందరంగరాట్ఛందమునం దుద్ధరించిన పద్యములవలన దెలియుచున్నది. కాని మదరాసు, తంజావూరులలోనున్న తాళపత్రప్రతులలో నెఱ్ఱనపేరు కానరాకుండుటయు నిఁక కవిసర్పగారుడ మనుపేర లభించుచున్న రెండు గ్రంథములలో నొకటి బసవన కృతమగును, రెండవది పట్టాభిరామకవి కృతముగను గానవచ్చుచున్నవి యని శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు పేర్కొనినారు.[25] కావున ప్రత్యక్షముగా గ్రంథము లభించి యందాధారములు గానుపించువఱ కీగ్రంథము ఎఱ్ఱనకృతమో కాదో నిర్ణయ మొసఁగుటకు వీలులేదు.

భారతారణ్యపర్వము – అష్టాదశపర్వ సంభృతమైన వ్యాసరచిత మహా భారతమునందు ఆరణ్యపర్వము మూఁడవది. ఈ పర్వమునందు 1. ఆరణ్య పర్వ, 2. కర్మీరవధపర్వ, 3. అర్జునాభిగమన పర్వ, 4. కైరాత పర్వ, 5. ఇంద్రలోకాభిగమన పర్వ, 6. నలోపాఖ్యాన పర్వ, 7. తీర్థయాత్రా పర్వ, 8. జటాసురవధ పర్వ, 9. యక్ష యుద్ధ పర్వ, 10. నివాతకవచ యుద్ధ పర్వ, 11. అజగర పర్వ, 12. మార్కండేయ సమాస్యా పర్వ, 13. ద్రౌపదీ సత్యభామ సంవాద పర్వ, 14. ఘోషయాత్రా పర్వ, 15. మృగస్వప్నోద్భవ పర్వ, 16. వ్రీహిద్రౌణిక పర్వ, 17. ద్రౌపదీహరణ పర్వ, 18. జయద్రథ విమోక్షణ పర్వ, 19. రామోపాఖ్యాన పర్వ, 20. పతివ్రతామాహాత్మ్య పర్వ, 21. కుండలాహరణ పర్వ, 22. అరణేయపర్వములను నిరువదిరెండుపపర్వములున్నవి ఈ భాగమంతయు 315 అధ్యాయములందు విభక్తమై 11,847 శ్లోకములు కలిగియున్నది.

వాగనుశాసనుఁడైన నన్నయభట్టారకుఁడీవ్యాసకృత మహాభారతమునం దాదిదొడంగి తెనుఁగు సేయుచు నారణ్యపర్వమునందు అజగరోపాఖ్యానము పూర్తిగావించి మార్కండేయ సమాస్యాపర్వమునందుఁ గానవచ్చు వర్ష, శరదృతు వర్ణనములో దాదాపు 10, 11 శ్లోకముల వఱకున్న భావమును దెనుఁగొనరించి,

25. నృ.పు.పీఠిక, పుట–6.

యేకారణమననో యాపివేసినట్లగపడుచున్నది. ఆరణ్యపర్వము మొదటినుండి శరద్వర్ణనము వఱకుఁగల సంస్కృతభారత శ్లోక సంఖ్యను గణింపఁగా 7,038 అని లెక్కకు వచ్చినది. మూలగ్రంథమందలి 7,034 శ్లోకములు గల అరణ్యపర్వభాగమును నన్నయ 1,293 పద్యగద్యములలో రచించినాఁడు. ఈ సంఖ్యకు ఆశ్వాసాంత గద్యపద్యములు 6 చేర్చినచో 1,298 యగుచున్నది.

ఈ విధముగాఁ గానవచ్చుచున్న మూలభారతారణ్యపర్వశ్లోక సంఖ్యను నన్నయకృత యాంధ్రమహాభారత గద్యపద్యసంఖ్యను బోల్చి చూడగా 6 1/2 మూలశ్లోకముల కొక తెలుఁగు పద్యము రచించెనని తెలియుచున్నది. ఈ పరిగణనమును బట్టి నన్నయ తెలుగు సేతయంతయు మూలగ్రంథమును 6.5.1 లెక్కలోఁ దెనుఁగుసేసెనని చెప్పలేము. ఆతఁడు మూలముననువదింపక పరిహరించిన భాగములు, విపులీకరించిన భాగము లెన్నియో కలవు. ఈ విషయము విజ్ఞులెఱిఁగిం/ య యున్నారు.

**ఎఱ్ఱాప్రెగడ–ఆరణ్యపర్వశేషము:–** ఆంధ్రమహాభారతమునం దారణ్య పర్వము నాల్గవ ఆశ్వాసము 142వ పద్యము తరువాత ముద్రితప్రతులందన్నిటను ఇక్కడనుండి యెఱ్ఱాప్రెగడ కవిత్వము అను సూచన గానవచ్చుచున్నది. కాని మూఁడవ ఆశ్వాసము 1143వ పద్యమునుండి ఏడవ ఆశ్వాసము చివరవఱకున్న భాగములో నెఱ్ఱన పే రెచ్చటను గానరాదు. మీఁదు మిక్కిలి యాశ్వాసాంత గద్య సయితము నన్నయ భట్టారకుఁడు రచించినట్లుగనే ముగింపఁబడినది. ఆరణ్యపర్వము సప్తమాశ్వాసాంతము నందు మాత్రము రెండు పద్యములు (ఒకటి సీసము, మఱొకటి కందము) ఆరణ్యపర్వ శేషమును ధీరవిచారుఁడైన యెఱ్ఱనార్యుఁడు గవీంద్రకర్ణపుటపేయముగాఁ బూరించి నట్లుగా వ్యక్తము సేయుచున్నవి.[26] విమర్శకులు గొందఱీపద్యములను బ్రక్షిప్తములను వారును గలరు. ఇంతేకాక నన్నయభట్టు తరువాత భారతాంధ్రీకరణము నకుఁ బూనుకొని పదునేను పర్వములు పూర్తిచేసిన తిక్కయజ్వసయితము, మూఁడవది యైన ఆరణ్యపర్వము శేషభాగమునుండి కాక ఊర్జితకథోపేతమైన చతుర్థము విరాట పర్వము నుండియే తెలుఁగు సేతకుఁ బూనుకొనినాఁడు. ఆతండంతటితోఁ బోఁక విరాట పర్వారంభమున...

"ఆదరణీయ సార వివిధార్థగతి స్ఫురణంబుగల్గి య
ష్టాదశపర్వ నిర్వహణ సంభృతమై పెనుపొందియుండ నం

26. ఆ.మ.భా.ఆ.ప.ఆ.7.169,170.

దాదిఁ దొడంగి మూఁడు కృతులాంధ్రకవిత్వ విశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్.[27]

అని రచించినాఁడు. ఈ రచనను బురస్కరించుకొని ఆరణ్యపర్వ మంతయు నన్నయచేతనే రచింపఁబడిన దని పాఠకులూహించుట కవకాశము చిక్కినది.

తిక్కనామాత్యుఁడే కాక కాకునూర్యప్పకవి యనునాతఁడు అప్పకవీయమునందు గ్రంథ ప్రభావ సందర్భమున

తే॥ ఆంధ్రశబ్దచింతామణి వ్యాకరణము,
ముందు రచియించి తత్సూత్రముల దెనుంగు
బాసచేఁ జెప్పె నన్నయభట్టు దొల్లి,
పర్వములు మూఁడు శ్రీమహాభారతమున.[28]

అనియు మఱియు

క॥ ఆ మూఁడు పర్వములలో
సామాన్యుఁడు నుడుపు తెఱఁగు లరసికొని కృతుల్
దాము రచించిరి తిక్కను
ధీమణి మొదలైన తొంటి తెనుఁగు కవీంద్రుల్.[29]

అని రచించిన పద్యములుసయితము నన్నయభట్టారకుఁడే ఆరణ్యపర్వము పూర్తిగా రచించియుండె ననుటకు నాధారములైనవి. కావుననే ఎఱ్ఱన ఆరణ్య శేషము రచించెనా లేదా యను వాదోపవాదములాంధ్రపండితమండలియందుఁ పొడసూపినవి. భారతారణ్యపర్వమంతయు నన్నయభట్టు కవిత్వముగనే యా గ్రంథమునందే యాధారముండుటయుఁ దరువాతి మహాకవి మఱియు లక్షణ కర్తలు నన్నయభట్టు మూఁడు పర్వములు రచించెనని వ్రాయుటయుఁ జూడ నిజమున కెఱ్ఱన ఆరణ్యపర్వ శేషమును రచియింపలేదని నిర్ధరీకరించి యా యారణ్యపర్వమందు యెఱ్ఱనకృతమని దెలియఁజేయు పద్యమును బ్రక్షిప్తమని సులభముగా నిరాకరించి యుందుము కాని యందుకు బాధకముగా నెఱ్ఱనకృతమైన నృసింహపురాణమునందు కవియే స్వయముగా "ఎన్నికమైఁ బ్రబంధపరమేశుఁ డనంగ నరణ్యపర్వశేషోన్నయ మంధ్రభాష సుజనోత్సవ మొప్పగ నిర్వహించితి"[30] యని రచించిన పద్యము గానవచ్చుచున్నది. ఎఱ్ఱాప్రెగడయే

27. ఆ.మ.భా.ఆ.ప.ఆ.1.6
28. అప్ప. క. పీ.43.
29. అప్ప.క. పీ.47.
30. నృ.పు.ఆ.1.

కాక చదలువాడ మల్లన యనునాతఁడు విప్రనారాయణ చరిత్రలో –

"ప్రతిభతో నారణ్యపర్వశేషముఁ జెప్పెఁ
గవులకుఁ జెవుల పండువులుగాగ"

అని యెఱ్ఱాప్రెగడ ఆరణ్య పర్వశేషమును జెప్పినట్లు ధృవపఱిచినాఁడు. మఱియు జక్కన యనునాతఁడు విక్రమార్కచరిత్రము నందు –

ఉ॥ ఈత్రయిఁ దాఁ బ్రబంధపరమేశ్వరుఁడై విరచించె శబ్దవై
చిత్రి నరణ్యపర్వమునశేషము, శ్రీనరసింహరాయ చా
రిత్రములున్ బుధవ్రత గరిష్ఠత నెఱ్ఱయ శంభుదాసుఁ డా
చిత్రకవిత్వవాగ్విభవజృంభితుఁ గొల్చెద భక్తియుక్తితోన్.[31]

అని శబ్దవైచిత్రీయముతో నెఱ్ఱన ఆరణ్యపర్వశేషమును రచించెనని వాక్రుచ్చినాఁడు. బలవత్తరమైన యీ యాధారములను బురస్కరించుకొని యెఱ్ఱాప్రెగడ భారతారణ్యపర్వశేషమును రచింపలేదని త్రోసివేయుటకు వీలులేదు. కావున నెఱ్ఱాప్రెగడ కారణ్యపర్వశేషరచనానంగయశము నియ్యనొల్లని విమర్శకులు గొందఱు, ఎఱ్ఱన ఆరణ్యపర్వశేషమును రచింపలేదు. నిజమున కాతఁడట్లు రచించియుండిన మహానుభావుఁడైన తిక్కనసోమయాజి మఱియుఁ గాకు సూర్యప్పకవ్యాదులు మూఁడు పర్వములని చెప్పియుండరు కదా! కావున నన్నయభట్టారకుఁడు మూఁడు పర్వములు బూర్తిగాఁ దెనిగించియుండఁ గ్రిమిదష్టమువలననో మఱి యేకారణమువలననో శిథిలముకాగా నాశిథిలబాగమందెఱ్ఱన కొన్ని చోట్ల అక్షరములనో, పదములనో, వాక్యములనో, పద్యములనో వ్రాసి పూరించెను. అందుకే యెఱ్ఱాప్రెగడ గావించినది ఆరణ్యపర్వశేషభాగమం దాయా పద్యముల పూరణము మాత్రమే కాని పూర్తి శేషభాగ రచనము గాదని వాదించుచున్నారు.[32]

ఇఁక నృసింహపురాణమందలి ఆరణ్యపర్వశేష సంబంధములైన 'శేష', 'ఉన్నయ' శబ్దములను గూర్చి 'శేష' శబ్దమునకు మిగిలిన దను నర్థము సరియైనదే

31. విక్ర.చ.ఆ.1-14.

32. వేదాల తిరువేంగళాచారి, మహాభారతోపన్యాసములు. పుట.99 "అయితే నన్నయగ్రంథములలో కొన్ని యటనట శిథిలములైనవి. కొన్ని యసలే పోయినవి. కొన్ని యెడల కొంత కథాభాగమే నశించినది. తిరిగి యట్లు రచింపవలసిన యావశ్యకతయే కలిగినది. ఇట్లున్న యన్ని రకముల శిథిలాంశములను గూడ నన్నయకవితారీతి యటనట కొలదిగా మహాకవి ఎఱ్ఱనకు దోచినది. కన్పడినది. అట నిట్లు "తద్రచనయకాన్" ఇట్లు నన్నయరచన యగు నని యెన్నిక చేసి యతఁ డాశేషమును బూరించినాఁడు.

యైనను పోcగా మిగిలినదనియో, లభింపcగా మిగిలినదనియో యని యర్థము చెప్పవలెననియు మఱియు 'ఉన్నయ' మను శబ్దమునకు ఉద్దారణమను నర్థము చెప్పి నూతిలోని జలము నుద్ధరించినట్లు ఎఱ్ఱయ యరణ్యపర్వములోని శిథిలభాగముల నుద్ధరించెనని శ్రీ వీరరాజు పంతులుగారు వ్రాసియున్నారు.[33]

'శేష' మనcగా మిగిలినది యని సామాన్యముగా, సూటిగా వెంటనే వచ్చునట్టి యర్థము. దానిని కాదని యంతకన్న విశేషార్థము సాధింపలవయు నని ప్రతిచోటను బ్రయత్నించుట వృథాశ్రమయే యగును. కావున నీ శేష శబ్దముచేత నెఱ్ఱన ఆరణ్యపర్వ శేషమును, అనcగా నన్నయభట్టారకుcడు రచియింపcగా మిగిలిన భాగమును రచించినట్లు విశదముగను సులభముగను నర్థమగుచున్నది. కావున నిచట వాద బలమునకై విపరీతముగా నూహించి నన్నయకృత ఆరణ్యపర్వమునకు శిథిలతను బలవదానీతము గావించి యాభాగములనెఱ్ఱయ పూరించెనని చెప్పుట యథార్థముగను గాదు. యుక్తి సహజమును గాదు. ఇcక రెండవది, 'ఉన్నయ' శబ్దమునకు 'ఉద్ధారణ' యను నర్థము సరియైనదే. ఇందు వైపరీత్య మేదియు లేదు. కాని యీ శబ్దమునందు నూతిలోని జలముల నుద్ధరించినట్లు యరణ్యపర్వములోని శిథిలభాగముల నుద్ధరించె ననియే చెప్పవలయునను నిర్ణయము లేదు. కావున నారసింహపురాణమునందుc గానవచ్చు "ఆరణ్యపర్వశేషోన్నయ మంధ్రభాష సుజనోత్సవ మొప్పcగ నిర్వహించితి" అను సీస పద్యపాదమును బురస్కరించుకొని నన్నయ వ్రాయcగా శేషించిన ఆరణ్యభాగము యొక్క యుద్ధరణము సుజనుల కుత్సవము గలుcగు నట్లు నిర్వహించె నని చెప్పవచ్చును.

ఇcక నీ యున్నయ శబ్దమునకు ఉన్నతి, ఉద్ధరణ, ప్రగతి, కాపాడుట, స్వేచ్ఛ, ఊహ యను నర్థములే కాక "coclusion" ముగింపు అను నర్థము కూడ నొసcగబడి యున్నది.[34] ఈ యర్థమును బురస్కరించుకొని నృసింహపురాణమునందెఱ్ఱనచేc

---

33. ఉన్నయ శతాబ్దమునకున్న అనేకార్థములో నొకటి యగు అర్థముउन्नि un-ni (ud-/ni) P.A. -nayati. ot lead up wards, to raise, erect, redeem, rescue, help, freedom, bringup. fill up a vessel by drawing (a fluid out of another vessel) అని యిచ్చిన దానినే గ్రహించినారు. ఈ యర్థము ఋగ్వేద సంబంధియైనది. ఆ భాగము Rv,ii,14,9;- A Sanskrit - English Dictionary, p.193. by Monier Monier Williams.

34. उन्नय as, m, the act of leading up, elevating, hoisting, conclusion, induction, inference Sah.; Kas. (S.E.D.P. 193)

బ్రాసస్థానమం దుపయుక్తమైన 'ఉన్నయ' పదము వ్యర్థపదము కాదు.[35] బహుశ్రుతులు, నానా పురాణ కథావిస్తరవేదులు, నానానేక శాస్త్రార్థవిదులైన మహానుభావులు ప్రాసస్థానమందు అలవోకగా వ్యర్థపదమువాడి రనుకటకంటె ప్రాజ్ఞుఁడైన యెఱ్ఱయ తాను భారతారణ్య పర్వశేషపూరణమును ఆంధ్రభాషయందు సుజనోత్సవ మొప్పగ నిర్వహించిన యాథార్థ్యము నుచితపదప్రయోగము చేత సూచించినాఁడు.

విద్వాంసులైన విమర్శకులు సయిత మీ పదమున కీయర్థము సులభముగా (సందర్భసహితమై) యర్థవ్యక్తినొసఁగుచున్నను గ్రహింపనొల్లక వేఱొక యర్థమును గ్రహించి వాదించుట కేవలము వారి వారి పాండిత్యములఁ బ్రకటించుటయే కాక వాదోపవాదములవలనఁ బ్రబలిన యహమహమిక యింకను సాహిత్యలోతుల నరసి యుత్తమమైన విమర్శనాత్మక సాహిత్యము వెలవరింపఁజేయు తలంపుచేత కాఁబోలు.

ఇఁక విచిత్ర వాగ్విభవ శ్రీయుతుఁడైన యెఱ్ఱన ఆరణ్యపర్వశేషభాగము నం దెచ్చటను తన పేరగ్గడింపకపోయినను, నన్నయయందుఁగల భక్తిమై దా నాశ్వాసాంత గద్యసయిత మామహాకవి రచనవలెనే ప్రభువునకే యంకితముగాఁ జెప్పినను, కావ్య ప్రారంభమునం దనఁగా (ఆరణ్య, ప.4-143 ప.) శరదృతువర్ణనావసరమున

"స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరివోయి నిరస్తనీరదా
వరణములై దళత్కమల వైభవ జృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతర హంస సారస మధువ్రత నిస్వనముల్ సెలంగఁగాఁ
గరమువెలింగె వాసర ముఖంబులు శారదవేళఁ జూడఁగన్."[36]

అను పద్యమునందున బ్రకృతమగు శరదృతువర్ణనావసరమునం దుపయుక్తమైనట్టి సూర్యవాచకమగు 'అరుణ' శబ్దమును నానార్థశక్తివలన ఎఱ్ఱనయని వ్యంగ్య మొనర్చుచుఁ దనపేరు సూచించినాఁడు. కావున అరణ్యపర్వమునందు నన్నయ రచనమునుండి వేఱుసేయుచు మహాకవి ఎఱ్ఱన పద్యాంశము లిచటినుండియే స్ఫురించుచున్న వనుచు నీ పద్య మొక ధ్వని ప్రధానమైన విశిష్టభావమును స్ఫురింపఁ జేయుచున్నది. అందుకే ఇక్కడినుండి ఎఱ్ఱాప్రెగడ కవిత్వమని తాళపత్ర ప్రతులందును, ముద్రిత ప్రతులందును గానవచ్చుచున్నది.

సంస్కృతారణ్యపర్వభాగమందున్న 11847 శ్లోకములలో నన్నయచే ననువదింపఁ బడిన 7034 శ్లోకములను దీయగా మిగిలిన శ్లోకసంఖ్య 4813.

35. ఆంధ్రకవితరంగిణి, పుట86. "ఈ 'యున్నయ' శబ్దము ప్రాస స్థానమందున్నది. ఎంతటి మహాకవి కైనను యతిప్రాసస్థానములయందు వ్యర్థపదములు పడుచుండుట సహజము"

36. ఆ.ప.ఆ.4-143.

మూల గ్రంథమందలి 4813 శ్లోకములకు, ఎఱ్ఱాప్రెగడ 1485 గద్యపద్యములను రచించినాఁడు. 1485 (14 ఆశ్వాసాంతములు) – 1499. సాముదాయికముగాఁ బరిశీలించినచో మూఁడుశ్లోకముల కొక పద్యమువంతున రచించినట్లు తెలియుచున్నది. అనఁగా నన్నయకన్న నీతఁడు మూలము నెక్కువగా ననుసరించి వ్రాసినట్లు స్థూలముగాఁ జెప్పవచ్చును.

ఎఱ్ఱాప్రెగడచే రచింపఁబడిన యరణ్యపర్వశేష మాతనికతులకీర్తి కారణమైనది. ఏలయన మహాభారతము నాంధ్రీకరింపఁ దలంపుఁగొని ప్రారంభించిన నన్నయకాని తిక్కనగాని యా గ్రంథమును సంపూర్ణముగావించి యాంధ్రావళికి నొసఁగలేక పోయినారు. అమ్మహాభారత భారతి యారణ్యమునందు కొఱవడినది. అట్టియెడ ధీరవిచారుఁడైన యెఱ్ఱాప్రెగడ స్వార్థరహితుఁడై నన్నయరచనగా నారణ్యపర్వశేషమును బూర్తిగావించి పూజ్యమూర్తియైన యాంధ్రమహాభారతలక్ష్మిని సర్వాంగసుందర మొనరించినాఁడు. ఇంతవఱకు లోకహితరతులై నన్నయ తిక్కనాదులు కావించిన మహాప్రయత్న మాంధ్రుల భాగ్యవశముచేత నారణ్యపర్వశేషరచనమువలన ఫలవంతమైనది. పదునెనిమిది భారత పర్వములవిచ్ఛిన్నముగా నాంధ్రమహాభారత రూపమున వెలసినవి. కావుననె యాంధ్రజాతి కంతటికిఁ బ్రధానదైవతములై మూర్తిత్రయసంజ్ఞతో సంభావింపఁబడుచున్న హరిహర హిరణ్యగర్భు లట్లుగా నీ నన్నయ ఎఱ్ఱన తిక్కనలు సంభావింపఁబడి కవిత్రయ మని పేర్కొనఁబడినారు. ఆంధ్ర మహాభారత మొక్క ప్రబంధముకాగా నా ప్రబంధ నిర్మాణమున నింతవఱకే హరి హిరణ్యగర్భుల స్థానమునందు స్థిరులైనవారు నన్నయ, తిక్కనలు. కడుమవడిన యారణ్యపర్వ శేషమును బూరించి శంభుదాసుఁడైన ఎఱ్ఱాప్రెగడ హరుని స్థానము నాక్రమించినాఁడు.

సంస్కృత మహాభారతములో శరద్వర్ణనము దాదాపు ఏడు శ్లోకములందున్నది. వర్షర్తువర్ణనము 9 శ్లోకములలో ముగింపఁబడిన తరువాత 10వ శ్లోకము నుండి 16 శ్లోకములవఱ కీ శరద్వర్ణనమున్నది.[37]

"క్రౌంచహంససమాకీర్ణా శరత్ ప్రముదితా భవత్।
రూఢకక్షవనప్రస్థా ప్రసన్న జలనిమ్నగా ॥ 10
విమలాకాశనక్షత్రా శరత్ తేషాం శివాభవత్ ।
మృగద్విజసమాకీర్ణా పాండవానాం మహాత్మనామ్ ॥ 11

37. మ.భా.మార్క.సమా.ప. ఆ. 182. 1–7 పు.1460 (గీతాప్రెస్ – ఘోరఖ్‌పూర్)

దృశ్యంతే శాంతరజనః క్షపాజలదశీతలాః ।
గ్రహనక్షత్ర సంఘైశ్చ సోమేన చ విరాచితాః ॥ 12
కుముదైః పుండరీకైశ్చ శీతవారిధరాః శివాః ।
నదీః పుష్కరిణీశ్చైవ దదృశుః సమలంకృతాః ॥ 13
ఆకాశ నీకాశ తటాం తీరవానీవార సంకులామ్ ।
బభూవ చరతాం హర్షః పుణ్యతీర్థాం సరస్వతీమ్ ॥ 14
తేవై ముముదిరే వీరాః ప్రసన్నసలిలాం శివామ్ ।
పశ్యంతో దృఢధన్వానః పరిపూర్ణాం సరస్వతీమ్ ॥ 15
తేషాం పుణ్యతమా రాత్రిః పర్వసంఘౌన్మ శారదీ ।
తత్రైవ వనతామాసీత్ కార్తికీ జనమేజయ ॥ 16

అని వర్ణింపఁ బడియున్న మూలశ్లోకములను దెనిఁగించుచు నన్నయ

ఉ॥ భూసతికిం దివంబునకుఁ బొల్పెసగంగశరత్సమాగమం
బాసకల ప్రమోదకరమై విలసిల్లె మహర్షిమండలో
పాసితరాజహంసగతి భాసిప్రసన్న సరస్వతీ కమ
ల్జాసనశోభితంబగుచు నబ్జజయానముతో సమానమై॥

ఉ॥ శారదరాత్రు లుజ్జ్వలలసత్తర తారకహారపంక్తులం
జారుతరంబు లయ్యె వికసన్నవకైరవ గంధబంధురో
దారసమీరసౌరభము తాల్చి సుధాంశువికీర్యమాణ క
ర్పూరపరాగ పాండురుచిపూరములం బరిపూరితంబులై॥[38]

అను పద్యములను రచించినాఁడు. నన్నయ కృతములైన రెండు పద్యములను బురస్కరించుకొని చూడగా మూలశ్లోకములభావము నంతటిని సాముదాయికముగా నొక్కచోఁ జేర్చి చెప్పినటులుగ శరత్సమాగమమువలని యానందమును మఱియు నా ఋతువుయొక్క ప్రధాన లక్షణములఁ జెప్పినాఁడు. ఈ పద్యముల తరువాతనే కానవచ్చుచున్న 'స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరి వోయి' యను పద్యములు మూలమునకు దాదాపు అనుకరణములై, అయ్యవి మఱియొక కవి రచితములని చెప్పకయే చెప్పుచున్నవి. ఇంతేకాక మూలము నందు శరత్తునకు ముందు వర్షర్తువును వర్ణించుచు

38. ఆం.మ.భా.ఆ.ప.ఆ.4. 141-142.

"ఛాదయంతో మహాఘోషాః ఖం దిశాశ్చ బలాహకాః
ప్రవర్షు ర్దివారాత్రమసితాః సతతం తదా॥" (మ.భా.మా.స.ప.అ.182.2)
అని ఉన్న శ్లోకము నాధారముగాఁ గొని యెఱ్ఱయ

శా॥ దానాంభః పటలంబునం బృథుపయోధారావలిందాల్చిగ
ర్జానిర్ఘోషము బృంహితచ్ఛలనఁ బ్రచ్ఛాదించి ప్రావృట్పయో
దానీకంబు శరద్భయంబున నిగూఢాకారతన్ డిగ్గె నాఁ
గా నొప్పారె మదోత్కటద్విరదసంఘంబుల్ వనాంతంబునన్.[39]

అను పద్యమును రచించినాఁడు. ఈ పద్యమందలి పై రెండు పాదములు దాదాపు సంస్కృత శ్లోకమున కనువాదమువంటివే. ఇఁక మిగిలిన రెండు పాదములను, శరత్తుయొక్క భయముచేఁ బయోదానీకంబు నిగూఢాకారతను దిగినట్లుగా ద్విరద సంఘములు వనాంతమున నొప్పారె నని చెప్పి దానిని శరద్వర్ణనముగా భాసింపఁ జేసినాడు.

39. ఆం.మ.భా.ఆ.ప.ఆ.4. 144.

# 4. నాచన సోమనాథుని నవీనత

నాచన సోమనాథుని ఉత్తర హరివంశానికి అవతారిక గానీ, పీఠికగానీ లేదు. తెలుగు సాహిత్య చరిత్రలో ఇది ఒక విచిత్రం. శతక, ఉదాహరణాదుల వంటివి తప్ప అవతారిక లేని ప్రాచీన కావ్యమేదీ తెలుగులో కన్పించదు. తెనాలి రామకృష్ణుని 'ఘటికాచల మాహాత్మ్య'నికి కూడా అవతారిక లేదు. కాని, దాన్ని అంకితం చేసుకొన్న ఖండోజి రాయడు తన ఆస్థానం లోని వేంకట గిరీంద్ర కవితో ఆ కావ్యానికి అవతారిక రాయించుకొన్నాడు. అయితే ఈ ఇద్దరి కాలాలు వేరు. కావ్యం రచించిందొకరు; దానికి అవతారిక రచించిందింకొకరు. ఇది కూడా తెలుగు సాహిత్య చరిత్రలో ఒక విచిత్రమయిన సన్నివేశమే. ఇంతకన్నా విచిత్రమయిన సన్నివేశం ఆధునిక కాలంలో ఒకటి జరిగింది. గురజాడ అప్పారావుగారు 'కన్యాశుల్కం' నాటకాన్ని ఆధునికంగా రాశారు. ఆ నాటకం – 'ఘనతవహించిన మహారాజా మీర్జా శ్రీ ఆనంద గజపతిరాజ్ మహారాజా సాహెబ్ మెహర్బాన్ ముష్ఫక్ కదర్దాన్ కరం ఫర్మాయీ మొఖలెసాన్, బాద్షాయె – కళింగ్, మనె సుల్తాన్ విజయనగరం బహుర్ జి.సి.ఐ.ఇ. గారికి' అంకితం చేయబడింది. కన్యాశుల్కం మొదటిసారి 1892 ఆగస్టు 13న ప్రదర్శన జరిగినప్పుడు – రాజావారి ప్రేరణ వల్ల కావచ్చు – ముదుంబై వరాహ నరసింహ స్వామివారు నాటకానికి నాందీ ప్రస్తావనలు సంస్కృతంలో రాశారు. తెలుగు నాటకానికి, నాటక రచయిత కాక మరొకరు నాందీ ప్రస్తావనలు రాయటం, అదీ సంస్కృతంలో రాయటం విచిత్ర సన్నివేశమేమరి. ఇదిట్లా ఉంచి; ఇంతకు ఉత్తర హరివంశం హరిహరనాథుడికి అంకితం; మరెవరితోటీ అవతారిక రాయించకుండానే ఆ దేవుడు ఆ కావ్యాన్ని అంకితం పుచ్చుకొన్నాడు. నిజానికి, దేవుడికి అవతారిక ఎందుకు? దేవుడి కక్కర లేకపోయినా కావ్యానికి కావాలి గదా! కాగా, ఉత్తర హరివంశానికి అవతారిక లేకపోవటమన్నది ప్రస్తుతాంశం. ఈ లేక పోవటానికి విమర్శకులు కారణాలను భావించక / ఊహించక పోలేదు. తెలుగు కావ్యాలకు అవతారిక ఉండటం సంప్రదాయ పరిపాటి కాబట్టి, సోమన తన కావ్యానికి అవతారిక రచించే ఉంటాడు. కాని, అది మన కీనాటికీ లభించటం లేదు. అందువల్ల అవతారిక లేదని కొందరి తాత్పర్యం. అవతారిక లేకుండా

కావ్యం రచించటం ఆనాటికి నవీనతా స్ఫోరకం. నవీన గుణ సనాథుదయిన సోమన అసలుకు అవతారికే రాయలేదు. అందువల్ల అవతారిక లేదని మరికొందరి అభిప్రాయం. సోమన అవతారికను అసలే రాయలేదనటానికి మరింత పటిష్ఠంగా కారణాలను గమనించ ఊహించవచ్చు. సోమనాథుడు తన కావ్యాన్ని భారత పరాంశంగా – భారతానికే సంబంధించిన చివరి భాగంగా భావించాడు. భారతానికి హరివంశం పరాంశమనేది ప్రసిద్ధమయిన విషయమే. కాగా, తిక్కన గారి భారత రచనకు తన రచన ఒక అనుస్యూతిగానే అనుకొన్నాడు. తాను గూడ హరిహరనాథుడికే అంకితం ఇచ్చాడు. అందుకని అవతారిక రాయలేదు. తిక్కనగారు రాజరాజనరేంద్రుడికి బదులు హరిహరనాథుడిని తన కృతి భర్తగా ఎన్నుకొన్నారు కాబట్టి – కృతిపతిత్వం మారటం వల్ల తిక్కన గారు విరాట పర్వాదిలో అవతారిక రచించారు. ఎఱ్ఱనగారు, నన్నయగారి మాదిరిగానే, రాజరాజనరేంద్రుడినే కృతిపతిగా భావించారు కాబట్టి తన ఆరణ్యపర్వ శేషభాగ రచనకు ప్రత్యేకంగా అవతారిక రాయలేదు. తన భాగాన్ని గూడా 'న్నయ రచనకా' భావించారు. అయితే, తిక్కన రచనకా అని అనకున్నా, సోమన తిక్కన రచనకు తన రచన అనుస్యూతి గానే భావించాడు. కాబట్టి అవతారిక రచించలేదు. ఎఱ్ఱనగారు ఆశ్వాసాంత గద్యలు కూడా నన్నయ గారివిగానే రాసి, తన విషయం ప్రత్యేకంగా ఒక సీస పద్యంలో చెప్పుకొన్నారు. సోమన తను గూర్తి చెప్పుకోలేదు గాని, గద్యలు మాత్రం తన పేరనే రాసుకొన్నాడు. ఎఱ్ఱన గారి హరివంశానికి కృతిపతి మారటం వల్ల ఆయన ప్రత్యేకంగా దానికి అవతారిక రాశారు. కాగా, ఈ మూడు రకాలయిన ఊహలలో మొదటిది చాలా సాఫీ అయిన ప్రమాదం లేని ఊహ. రెండో దానిలో పరివపటిని సోమన విచ్చిన్న పరచి కొత్తదనం ప్రదర్శించాడనటం మన ఉత్సాహం. మూడవ దానిలో ఆలోచన, యుక్తి యుక్తమయిన విధానం కన్పిస్తుంది. కాగా, ఏది ఏమయినా, సోమన ఉత్తర హరివంశానికి అవతారిక లేకపోవటం మాత్రం యథార్థం.

ఇంతకూ, ఈ అవతారికా విషయంలో ఇంత ఆలోచన ఎందుకు? ఎందుకంటె, ఆ అవతారికే ఉండి ఉండేట్టయితే. అందులో ఆయన కావ్య దృక్పథాన్ని వ్యక్తీకరించే అంశాలు స్పష్టంగా ఉండి ఉండేవన్న ఆశ / ఊహ. అది అట్లా ఉంచి; అవతారిక లేకున్నా గూడా, ఆశ్వాసాంత గద్యల్లో సోమన ప్రకటించుకొన్న బిరుదాలు ఆయన కావ్య దృక్పథానికి సూత్రప్రాయంగా ఉన్నాయని గుర్తించవచ్చు. గద్యల్లో ఆయన ప్రకటించుకొన్న బిరుదాలు మొత్తం అయిదు. వాటిలో 'సకల భాషా భూషణ' అన్నది

ఆయన బహు భాషా పాండిత్యాన్ని, 'సంపూర్ణ కీర్తి' అన్నది ఆయన ప్రశస్తి సమగ్రతను సూచిస్తున్నాయి. వాటితో వివాదపడి విచారించవలసిందేమీ లేదు. ప్రస్తుతానికి వాటి అవసరం గూడా లేదు. కాగా, మిగిలిన మూడు – 'సాహిత్య రసపోషణ, సంవిధాన చక్రవర్తి, నవీన గుణ సనాథ' అన్నవి ఆయన కావ్య దృక్పథాన్ని వ్యక్తీకరించే అంశాలు. వీటిని వివరంగా పరిశీలించుకోవలసి ఉంది.

**సాహిత్య రస పోషణ**

తెలుగు విమర్శ మార్గన తొలిసారిగా 'సాహిత్య' పదాన్ని ప్రవేశపెట్టిన గౌరవం నాచన సోమనాథునిది. పూర్వాలంకారికుల్లోనూ భారతీయ విమర్శ మార్గాన 'సాహిత్య' పదాన్ని మొదటి సారిగా వ్యక్తీకరించిన వాడు కావ్య మీమాంసా కర్త రాజశేఖరుడు కావచ్చునని పరిశోధకుల అభిప్రాయం. అన్వీక్షకీ, త్రయీ, వార్తా, దండనీతులనేవి నాలుగు విద్యలని కౌటిల్యుడు అభిప్రాయ పడ్డట్టుగా చెప్పి; 'సాహిత్యవిద్య' అయిదవది అని రాజశేఖరుడు తన అభిప్రాయం ప్రకటించాడు. ఈ 'సాహిత్య' మన్న దాన్ని – యథావత్ సహభావంతో శబ్దార్థాల ఉనికి 'సాహిత్య విద్య' అని నిర్వచించాడు. 'యథావత్ సహభావం' అంటే – సహభావ మంటే కలిసి ఉండే లక్షణం కాగా, ఏ విధంగా ఉంటే సరిగా ఉంటుందో ఆ విధంగా ఉండే సహభావం. ఈ విధమయిన సహభావంతో శబ్దార్థాలు కలసి మెలసి ఉండటమని తాత్పర్యం. రాజశేఖరుడికి కొంచెం తరువాతి వాడుగా భావించబడుతున్న రాజానక కుంతకుడు తన 'వక్రోక్తి జీవితం' లో 'యథావత్ సహభావా'న్ని వ్యాఖ్యానిస్తున్నట్లు 'సాహిత్య' మంటే ఏమిటో ఈ విధంగా వివరించాడు.

శోభా శాలిత కొరకు శబ్దార్థాల యొక్క ఒకానొక అన్యూనాతి రిక్త మనోహారిణి అయిన అవస్థితి (ఉనికి) సాహిత్యం. సహితముల యొక్క భావం సాహిత్యం. ఏదో ఒకానొక చేతన చమత్కారం కలిగించటంలో కారణంగా ఈ శబ్దార్థాల యొక్క ఉనికి విచిత్రమయిన విన్యాసభంగిమ మాత్రమే ఈ విన్యాస భంగి ఎట్లాంటిది? అన్యూనాతిరిక్త మనోహారిణి అయినది. శబ్దార్థాలు రెండింటిలో ఏ ఒక్క దానికి గూడా మరో దానికన్నా న్యూనత్వం / నికర్ష / తక్కువ దనంగానీ; అతిరిక్తత్వం / ఉత్కర్ష / గొప్పదనం గానీ ఉండదని తాత్పర్యం... శోభ అంటే సౌందర్యం. ఆ సౌందర్యాన్ని బట్టి పొగడదగింది – శోభాశాలి. దాని భావం – శోభాశాలిత్వం. ఆ శోభాశాలిత్వమే హృదయాహ్లాద హేతువు. దీని కోసమయి శబ్ద – అర్థాల యొక్క స్పర్థతా యుక్తమయిన (ఒక దానితో

ఒకటి పోటీ పడే విధంగా) అవస్థితి – పరస్పర సామ్య సుభగమయిన (ఒక దానితో ఒకటి సమంగా ఉండటం వల్ల కలిగే అందమయిన) ఉనికి / ఉండటం సాహిత్యం.

(అన్యూనాతిరిక్త మనోహారిణి – ఒకటి తక్కువ మరొకటి ఎక్కువ అనే అసమానత్వం లేకుండా ఒక దానితో ఒకటి పోటీ పడుతున్నట్టు ఉండటం ద్వారా మనోహరమయినదని తాత్పర్యం). కుంతకుని తరువాతి వాడయిన భోజుడు కూడా – 'కావ్యం శబ్దార్థాల సాహిత్యంగా చెప్పబడుతున్నది' అన్నాడు. ఈ 'సాహిత్య' పదం నిష్పన్నం కావటానికి మౌలిక మయిన ప్రేరణ కలిగించినవాడు భారతీయ కావ్యవివేచనకు ఆద్యుడన దగిన భామహుడు. ఆయన 'సహితములయిన శబ్దార్థాలు కావ్యమన్నాడు. సహితములయిన శబ్దార్థాలంటే, శబ్దార్థాలు కలిసి ఉండటం. నిజానికి శబ్దార్థాలు కలిసి కాకుండా విడిగా ఉంటాయా? ఉండవు. అట్లాంటప్పుడు భామహుడా విధంగా చెప్పటంలోని ఔచిత్యమేమిటి? కలిసి ఉండే వాటినే మళ్ళీ ప్రత్యేకంగా 'కలిసి ఉండే' అని చెప్తున్నాడంటే, కలిసి ఉండటంలోని ప్రత్యేకతను సూచిస్తున్నాడన్న మాట. ఈ సూచన నందుకొని రాజశేఖరుడు 'యథావత్సహభావ' మన్నాడు. కుంతకుడంతగా వ్యాఖ్యానించాడు. కాగా భామహుడు 'సహిత' మనటం లోని విశేషాన్ని బట్టి అనంతర కాలాన సాహిత్య పదం రూపొందింది. ఆ విధమయిన వివరణలు, విశేషాలు వ్యక్తమయినవి. కాగా, హితంతో కూడినది సహితం, దాని భావం సాహిత్యం' అంటూ చెప్పబడే అర్థం 'స్వారస్యం' మాత్రమే, శాస్త్రీయం కాదు. హితం కలిగించే ప్రతిదాన్నీ కావ్య పరమయిన 'సాహిత్యం' అనరు. అందుకే భోజుడు కావ్యం శబ్దార్థాల సాహిత్యంగా చెప్పబడుతున్నదన్నాడు. కాగా, ఈ 'సాహిత్య' స్వరూప స్వభావాలను విపులంగా చర్చించిన డాక్టర్ వి. రాఘవన్ – సాహిత్యమంటే శబ్దార్థాల యొక్క ఉత్తమమయిన సంబంధమని నిష్కర్షించారు. ఈ ఉత్తమ మయిన సంబంధమే / యథావత్సహభావమే / అన్యూనాతి రిక్తత్వ మనోహారిణి అయిన విధానమే కావ్యాన్ని 'కావ్యం'గా నిలబెడుతున్నది. ఈ కారణంగా కావ్య – సాహిత్య పదాలు పర్యాయ పదాలయినయి. మరొక విధంగా చూస్తే, కావ్యమన్నది కవి వైపు నుంచి (కవి కర్మ కావ్యం) రూపొందింది; 'సాహిత్య' మన్నది కావ్యం వైపు నుంచి (సహితములయిన శబ్దార్థాలు కావ్యం) రూపొందింది. కాగా, 'సాహిత్య' స్వరూప స్వభావాల అవగాహన సమగ్రంగా కల సోమనాథుడు 'సాహిత్య రసపోషణ' మనటం ద్వారా ఉద్దేశించిన విషయం ఏమిటన్నది ప్రస్తుతం విచారించవలసిన అంశం.

అనేకమంది విమర్శకులు సాహిత్యానికి సంబంధించిన ఈ విషయాన్ని పట్టించుకోకుండా, సాహిత్య పదాన్ని కావ్య పర్యాయ పదంగా మాత్రమే భావించి

సాహిత్య రస పోషణమంటే కావ్యంలో రసాన్ని పోషించట మన్న ధోరణిలో సాగిపోయారు. ఉత్తర హరివంశాన్ని విశేషంగా పరిశీలించిన డాక్టర్ యశోదా రెడ్డిగారు 'సాహిత్య రస పోషణ'మన్న దాన్ని కావ్య నిర్వచనంగా భావించారు –

కావ్యమనగా శబ్దార్థ యుగళమనియు, నా శబ్దార్థములు రెండు తుల్య ప్రాధాన్యముతో విచిత్రముగాఁ బొసఁగి రసవంతములయి యుండవలయు ననియు (సోమనాథుడు) కావ్య నిర్వచనము గావించునట్టుగా 'సాహిత్య రసపోషణ' అను పదమును ప్రయోగించినాడు. అని ఆమె తాత్పర్యం. మరి, అంతకు పూర్వం విశ్వనాథ సత్యనారాయణగారు 'సాహిత్య రసపోషణ' మన్నదాన్ని సాహిత్య పోషణము, రసపోషణము అని రెండూ రెండంశాలుగా గుర్తించారు.

సాహిత్య రస పోషణమనగా సాహిత్యము యొక్కయు, రసము యొక్కయు పోషణము గదా! సాహిత్యమనగా నిధి సహితముల యొక్క భావము సాహిత్యము. హితమనగా తత్కాలమం దనిష్టమై అనంతర కాలమం దిష్టాపత్తి హేతువు. అనగా పారలౌకిక విషయము. అందుచేత, పార లౌకిక విషయమనగా వేద వేదాంగములయందలి మహార్థములు. తత్ప్రతిపాదకమయినది సాహిత్యము. అట్లయినచో నాచన సోమన్నకు సాహిత్య (రస) పోషణ యన్న బిరుదు మహార్ధవంతము. అంటారాయన. సాహిత్య పోషణ విషయ మిట్లా కాగా– కథా దృష్టితో వ్రాయు కావ్యమున వస్తుగత శిల్పమధికము. దీనియందు గూడ రసాధానము లేకున్నచో కావ్యమునకు శోభ లేదు... రస సృష్టి చేయుటలో పలు మార్గములున్నవి. నాయికా నాయకులు, అనుభావ, సంచారి, సాత్త్వికములు వీని యొక్క పరిపుష్ట స్వరూపము ప్రపంచించి రసాధానము చేయుట సులభము... కాని, రసము ఒక్క సంచారి భావము చేతనే వ్యంజితము కావచ్చును... ఇది చాల కష్టమయినది. సంచారి సామర్థ్యము చేత విభావాదులన్నియు పొడగట్టి రస స్ఫూర్తి కలుగవలయును. కాగా, సోమనాథుడీ పద్ధతి మీద రసపోషణం కావించాడని సత్యనారాయణగారి వివరణ. 'సాహిత్యా'నికి సత్యనారాయణగారి వివరణ ఆలంకారిక స్థాయిని దాటి ఊర్ధ్వముఖంగా ప్రసరించింది. రస విషయం గూడ క్లిష్ట మార్గాన సాగింది.

తిక్కనగారు 'కావ్య రస' మన్నారు. దాన్నే సోమనాథుడు 'సాహిత్య రస'మన్నాడన్న అభిప్రాయం గూడ విమర్శకులలో ఉన్నది. నిజానికి భారతీయ సాహిత్య విమర్శ సంప్రదాయాన్ని గమనిస్తే కావ్య రసమని, రూపక రసమనీ, మరొక రసమనీ, ఇంకొక రసమనీ కావ్య భేదంతో రస భేదాన్ని భావించిన తీరు కన్పించదు. తొలినాళ్లలో

భరతుడు 'నాట్య శాస్త్రం'లో ప్రతిపాదించిన 'రసం' దృశ్యకావ్యాలకు మాత్రమే సంబంధించిందని భావింపబడినట్లు భామహాదుల్ని బట్టి అనిపిస్తుంది. కాని, ఆనంద వర్ధనాదులు రసం కేవలం దృశ్య విషయం మాత్రమే కాదనీ, అది శ్రవ్య కావ్య విషయం గూడా అని తమ విస్తృత వివేచన ద్వారా నిరూపించారు. కాగా, కావ్య రసం, రూపక రసం వంటి మాటలు ఆ నాడెక్కడా కన్పించవు. నిజానికి, తిక్కనగారు కావ్యం ద్వారా అనుభవానికి వచ్చే రసమన్న తాత్పర్యంతో కావ్య పదాన్ని కావ్య సామాన్య వాచకంగా ప్రయోగించారనుకోవటం సమంజసం. ఆయన 'కావ్య రస' ప్రస్తావన తీరు రసానుభవాన్ని ప్రస్తావించేదిగా ఉంది. కాని, సోమనాథుడు విమర్శ మార్గంలో ఈ అంశాలను ప్రస్తావిస్తున్నాడు. 'పోషణ' – కవి చేయవలసిన పని అనటం ఇందుకు ఉపబలకం.

నిజానికి సోమనాథుడు 'రసపోషణ' అంటే సరిపోయేది. 'రస' మనేది కావ్య / సాహిత్య విషయం మాత్రమే. ఇతరత్ర ఈ విధమయిన 'రస' ప్రసక్తి ఉండదు. కాగా, కావ్యంలో ఏయే అంశాలు ఏ విధంగా ఉండాలో ఆ విధంగా ఉన్నప్పుడే 'రసం' స్ఫురిస్తుంది, అనుభవంలోకి వస్తుంది. అది రసవత్కావ్య మవుతుంది. అందువల్ల, రసపోషణ మనంగానే, రసం పోషింపబడటానికి అవసరమయిన అంశాలు, అవసరమయిన విధంగా కావ్యంలో ఉండటమనే అంశం ఎట్లాగూ తెలుస్తూనే ఉంటుంది. శబ్దార్థ యుగళం రసవంతమయి ఉండటానికి ఆ రెండూ తుల్య ప్రాధాన్యంతో 'విచిత్రముగాఁబొసఁగి' ఉండటాన్ని కారణంగా చెప్పనవసరం లేదు. అది ఎట్లాగూ ఉండనే ఉంటుంది. కాని, రస పోషణకు అది మాత్రమే సరిపోదు. విభావానుభావాదుల నిర్వహణ రస పోషణకు ప్రధానాంశం. 'విచిత్రముగా బొసఁగి' ఉండే శబ్దార్థాలు ఈ నిర్వహణకు ఉపకారకమవుతాయి. కాబట్టి, ఈ పొసగుదలను మాత్రమే చెప్పి, దాన్నే రస హేతువుగా చెప్పటంలో సామంజస్యం అంతగా కన్పించదు. ఈ విధంగా గమనిస్తే సాహిత్య – రస పదాలను విడి విడిగా 'పోషణ' పదానికి అన్వయించటంలో సామంజస్యమూ, సార్థక్యమూ ఉన్నాయనిపిస్తుంది.

సాహిత్య పోషణం, రస పోషణం అని విడివిడిగా భావించటం వల్ల ప్రయోజనం అధికం. సాహిత్యమన్నది, సత్యనారాయణగారన్నట్లు, హితపదంపై, దాని విశేషార్థంపై ఆధారపడి పారలౌకిక విషయమనుకొన్నా గూడా, అది లౌకికం కాకుండానే పారలౌకికమయ్యే అవకాశం లేదు. లోకం లేకుండా పరలోకం లేదు. 'పరలోక' మన్న పదబంధమే ఈ అంశాన్ని సూచిస్తున్నది. నిజానికిక్కడ పారలౌకికత శబ్దార్థాలకు

సంబంధించింది కాదు; ఆ శబ్దార్థాలు ప్రతిపాదించే / వాటి ద్వారా వ్యక్తమయ్యే విషయానికి సంబంధించింది. కాగా, ఆలంకారికులు భావించింది శబ్దార్థాల యొక్క సరయిన అవస్థితి. ఆ విచారణ అంతా సోమనాథుని ఆలోచనా విధానానికి విరుద్ధమేమీ కాదు. ఆయన ఈ విషయం భావించి ఉండవచ్చు. ఉండకపోవచ్చు. కాని, భావించ లేదనుకోవటం కన్నా భావించాడని అనుకొని ముందుకు సాగి విచారించటం ప్రయోజనవంతం.

కావ్యం రస ప్రధానం. ఇది భారతీయ కావ్య విమర్శ సంప్రదాయంలో సోమనాథుడి కెంతో పూర్వమే సునిశ్చితమయిన విషయం. కాని, ఇక్కడ ఒక విషయం గమనించవలసి ఉంది. కావ్యం రస ప్రధానం కాబట్టి – 'రసాత్మకమయిన వాక్యం కావ్య' మంటూ విశ్వనాథుడు సాహిత్య దర్పణంలో కావ్య నిర్వచనం చేశాడు. కాని, దీన్ని జగన్నాథ పండితరాయలు అంగీకరించలేదు. రసాత్మకమయిన వాక్యం మాత్రమే కావ్యమనేట్టయితే, మహాకవి సంప్రదాయం 'ఆకులీభావం' పొందుతుందంటాడు పండితరాయలు. ఎందుకంటే 'జలప్రవాహ వేగ, పతనోత్పతన భ్రమణాదులను, కపి, బాలాది విలాసితాలనూ' – ఇట్లా ఇంకా ఎన్నింటినో మహాకవులు ఎందరెందరో విరివిగా వర్ణించారు. మరి, వీటిలో 'రసాత్మకత్వం' ఉండదు. ఏదో విధంగా ఇంట్లాంటి సందర్భాల్లోనూ రస స్పర్శను సాధించవచ్చు ననేట్టయితే, ఆవు కదుల్తున్నది, లేడి పరిగెత్తుతున్నది వంటి వాక్యాల్లో గూడా సాధించవచ్చునన్నాడు. అందువల్ల, విశ్వనాథుని కావ్య నిర్వచనం సరిగా లేదని 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దం కావ్య'మని తన కావ్య నిర్వచనాన్ని పండితరాయలు ప్రస్తుతీకరించాడు. ఇక్కడ ప్రస్తుతం గమనించవలసిన అంశం రస ప్రాధాన్యం గానీ, రస ప్రసక్తిగానీ లేని కావ్యాలు గూడా ఉండవచ్చునని. జగన్నాథ, విశ్వనాథుల కన్న సోమనాథుడు పూర్వుడు. ఈ విషయంలో సోమనాథుని ఆలోచన జగన్నాథుని ఆలోచనకు పూర్వపరంగా కన్పిస్తుంది. రస ప్రసక్తిలేని చోట ఆహ్లాదం దేనివల్ల కలుగుతుందనేది ఆయన విచారించాడు 'సాహిత్యం' – రాజశేఖర, కుంతకుల మార్గాన స్పష్టమయిన 'సాహిత్యం' వల్లనని నిర్ణయించుకొన్నాడు.

కావ్యాలు అనేక విధాలు. దృశ్య కావ్యాల్లో మాదిరిగానే శ్రవ్య కావ్యాల్లోనూ వైవిధ్యం అధికమే. దృశ్య కావ్యాల్లో వైవిధ్యం ఒక రీతిలో ఉంటే, శ్రవ్య కావ్యాల్లో వైవిధ్యం ఇంకో రీతిలో ఉంటుంది. ఈ కావ్యాల్లో ఒకే ఇతివృత్తం / కథ గలవి కొన్ని; ప్రధాన కథ, దానితో బాటు ఉప కథలు / ఉపాఖ్యానాలూ కొన్నిటిలో ఉంటాయి. అన్నీ ఉపకథలే కలవి కొన్ని ఉండవచ్చు; అంటే, వీటిలో ప్రధాన కథ అంటూ

ప్రత్యేకంగా ఉండదు; భోజరాజీయం వంటివి ఉదాహరించు కోవచ్చు. ఏక నాయకాశ్రయాలు, బహునాయకాశ్రయాలు... ఇట్లా అనేక విధంగా కావ్యాలున్నాయి. వీటి అన్నింటిలోనూ ఏదో 'కథ' అంటూ ఉంటుంది. అది అసలు లేని ఋతు సంహారం వంటి కావ్యాలు, శతకాదులు చాలా ఉన్నాయి. వీటిలో, వాటిలోనూ వర్ణనలూ, చిత్రణలూ, భావ / ఆత్మభావ ప్రకటనలూ... ఎన్నో ఉంటాయి. ఇన్నింటా 'రసాత్మకత' అంటే కుదురదు. ఇక్కడ 'రసం' కాదు; 'సాహిత్యం' ఆకర్షకమయింది. కాగా, ఒకే కావ్యంలోనూ ఆద్యంతం 'రసాత్మకత్వం' ఉండటానికి వీలులేదు. కాబట్టి; కవి కావ్య రచనా విధానంలో ఆయా సందర్భాలనూ, సన్నివేశాలనూ అనుసరించి సాహిత్య / రస పోషణ / నిర్వహణ చేయవలసి ఉంటుంది; చేస్తాడు. ఇట్లా కాక పోతే, కావ్యంలో అనేక భాగాలు పేలవంగా తయారయ్యే ప్రమాదం ఉంది. ఇదిట్లా ఉండగా, సాహిత్య పోషణ కావ్యంలో రసపోషణకు ఆటంకంగానీ, విరుగుడు కానీ కాదు. కవి ఔచిత్యవంతంగా ప్రవర్తించినప్పుడు సాహిత్య పోషణ రస పోషణకు ఉపస్కారకం / సహకారిగా ఉంటుంది. కాగా, రస ప్రసక్తి / ప్రాధాన్యం లేని చోట్ల స్వయం ప్రధానమయి, రస ప్రాధాన్య సందర్భాల్లో దానికి అంగంగా, దోహదకరంగానూ కావ్యాల్లో సాహిత్య పోషణ సాగుతుంది. అందువల్ల దాదాపు ప్రతి కావ్యంలోనూ సాహిత్య – రసపోషణ నాటి ఆనుకూల్యాన్నీ, అవసరాన్నీ, ఔచిత్యాన్నీ బట్టి నిర్వహించ బడుతుంది. కాబట్టి కావ్యం సాహిత్య రసపోషణ వంతమయినప్పుడు ఆది కావ్యంగా నిలువగలదని సోమనాథుని నిర్ణయం.

**సంవిధాన స్వరూపం**

సంవిధాన చక్రవర్తి – ఇది రెండవ అంశం

సాహిత్య రస పోషణ తరువాత వచ్చిన ఈ అంశం కథకు సంబంధించింది. కావటం సహజమే ననవచ్చు. నన్నయగారు కథా కలితమయిన అర్థం ప్రసన్నం కావాలన్నారు. కాని, ఈ కథార్థం ప్రసన్నం కావటమెట్లా? ప్రసన్నం కావటానికి అనుసరించవలసిన విధానాన్ని నన్నయగారు ఆయా కవుల ప్రతిభకు వదిలివేశారు తప్ప, ఫలానా అని చెప్పలేదు. తిక్కనగారు... కథార్థంబు ఘటిత పూర్వాపరమై / యలతి యలతి తునియలఁగా హల సంధించిన విధంబు నమరగ వలయున్ (ఉ.రా. 1–16) అన్నారు. ఇక్కడి 'పూర్వాపరఘటనము, కాహల సంధించుట' అన్నవి కథా వస్తు నిర్వహణను గూర్చి విచారించే సోమనాతునికి, లేదా సోమనాథుడు ఆలోచించేందుకు వ్యక్తావ్యక్త ప్రేరణ కలిగించి ఉంటాయి. ఆ ఆలోచనలో 'సంవిధానం'

సాక్షాత్కరించి ఉంటుంది. 'సాహిత్య' పదం వలెనే సంవిధాన పదాన్ని గూడా తొలిగా తెలుగులో ఆవిష్కరించిన గౌరవం సోమనాథునిదే. అయితే –

ఇంతకు; 'సంవిధాన'మంటే ఏమిటి? సంవిధాన మంటే కథలోని ఒక ఘట్టమని వేంకటావధానిగారు అభిప్రాయ పడ్డారు. సోమనాథుని సంవిధాన చక్రవర్తి'త్వానికి ఆయన వివరణ మిది –

ఏ కథ యయినను విభజించి చూచినచో అందు కొన్ని సంవిధానములు. లేక, సన్ని వేశములు కన్పించును. ఆ సన్నివేశముల నుచిత రీతినిఁ గలిపి కథ నడిపించుటలోనే కర్త యొక్క నేర్పు వ్యక్తమగును... నాచన సోమన ప్రతి కథలోను గొన్ని సన్నివేశములను గల్పించి తన సంవిధాన సంఘటన సామర్థ్యమును బ్రకటించి యున్నాడు. కథను విభజించటంలో ఏర్పడేవి కథా ఘట్టాలు. వాటిని 'సవిధానములు' అనటం కాదు గాని, ఘట్టాలనటంలోనే సామంజస్యం ఉంది. సంవిధాన, సంఘటనాలు భిన్నార్థకాలు గూడా కావు. అందువల్ల ఘట్టముల సంవిధానమనటమో, ఘట్టముల సంఘటనమో అనటం ఉద్దిష్టార్థానికి అనుకూలంగా ఉంటుంది. ఇదిట్లా ఉండగా –

సంవిధాన చక్రవర్తి యనగా నొక సంవిధానమున్నప్పుడు తానచట చక్రవర్తి వలె వ్రాయుము. అనగా, లోకోత్తరముగ వ్రాయుదుననియే గదా అతని యభిప్రాయము... ఊర్వశీ నరకాసురుల యొక్క యీ ఘట్టము నిజముగా గొప్ప సంవిధానము. అన్నారు విశ్వనాథ సత్యనారాయణగారు. ఇక్కడ 'సంవిధాన' మంటే కథా ఘట్టమని భావించినట్లే అన్పిస్తుంది. సంవిధానం, సంఘటనం, సన్నివేశం, ఘట్టం వంటి పదాలను, వాటి అర్థ తాత్పర్యాలను అవగతపరచు కోవటం ఈ సందర్భంలో అవసరం.

'సంవిధాన'మంటే 'కథా యోజన' మన్నాడు కుంతకుడు. అంతేకాదు; అది 'ప్రబంధా' (కావ్యా)నికి ప్రాణం వంటిదని నిష్కర్షించాడు. కథాయోజన మంటే, వివిధాంశాలతో, వివిధ ఘట్టాలతో కథను కూర్చటమని అర్థం. ఈ కూర్చటంలో కవికి కథా నిర్మాణ, నిర్వహణల్లో గల నేర్పు ప్రాధాన్యం వహిస్తుంది. ఏ కథ అయినా ఏదో ఒక అర్థాన్ని, అంశాన్ని వ్యక్తీకరించటానికే ఉద్దేశింపబడుతుంది. నన్నయగారు కథా కలితార్థమన్నదీ, తిక్కనగారు కథార్థమన్నదీ దీన్నే. మరి; ఆ అర్థం ప్రసన్నం కావటానికి అనువుగా అనేకాంశాలను – పద ప్రయోగం నుంచి వివిధ కథా ఘట్టాల వరకు అన్నింటినీ – (సం)యోజించవలసి ఉంటుంది. ఈ సంయోజనమే సంవిధానం. భవభూతి మహాకవి రచించిన 'ఉత్తర రామచరిత్ర'లో మూడవ అంకం చివర 'అహో;

సంవిధానకమ్' అని 'తమస' అంటుంది. ఇక్కడ వ్యాఖ్యాత వీర రాఘవాచార్యులు 'అహెూ సంవిధానకమితి; సంవిధానకం కథా సన్నివేశః' అని వ్యాఖ్యానించాడు. సన్నివేశం (-సం నివేసం) అంటే సరిగా నివేశింపజేయటం. కథాంశాలను సరిగా ఉద్దిష్ట ప్రయోజనాలను కూలంగా కూర్చటం సన్నివేశం. ఉత్తర రామ చరిత్రలో వివిధాంశాలు - కథాంశాలు ఎంత చక్కగా సన్నివేశ పరచబడ్డాయంటే -

ఏకో రసః కరుణ ఏవ నిమిత్త భేదాద్
బిన్నః పృథక్ పృథగి నాశ్రయతే వివర్తాన్
ఆవర్త బుద్బుద తరంగా మయాన్ వికారాన్
అంభోయథా సలిలమేవహి తత్సమస్తమ్

అన్న మహార్థాన్ని నిరూపించేందుకు అనువయిన విధంగా కూర్చబడ్డాయి. కాగా, కథలో వివిధ ఘట్టాలను, ఘట్టాలలో వివిధాంశాలను ఉద్దేశించి అర్థాన్ని ప్రసన్నం చేసే విధంగా, ఉచితంగా సమకూర్చటం సంవిధాన (క)ం; కథా సన్నివేశం. కాగా, 'సంవిధాన - సన్నివేశ' తాత్పర్యాలు సమానమే. సోమనాథునికి చాలా కాలం తరువాత పింగళి సూరన తన 'కళాపూర్ణోదయ' ప్రబంధం - 'అత్య పూర్వ కథా' సంవిధాన వైచిత్రీ మహనీయంబు' (1-16) అన్నాడు. తాను నిర్వహించిన కథా సంవిధాన వైచిత్రి అపూర్వం. ఆ కావ్యం ఆ అంశాన్ని నిరూపిస్తూనే ఉంది. కాగా, కథ ద్వారా ఉద్దిష్టార్థ - ప్రయోజనాల ప్రసన్నతకు వీలుగా వివిధాంశాలు, వాటి ఆవశ్యకత, నాటి క్రమం, అందులోనూ వాటి ప్రాధాన్య - అప్రాధాన్య పరిధులు మొదలయిన నన్నింటినీ సరిగా ఆలోచించి, కూర్చి సమగ్రీకరణ దృష్టితో నిర్వహించటం - 'సంవిధానం'. ఈ సంవిధానాన్ని సోమనాథుడు కథా కలితార్థ ప్రసన్నతా దృష్టితో ప్రతిపాదించాడు. నన్నయగారి తరువాత తిక్కనగారి ప్రేరణతో నన్నయగారి తాత్పర్యానికి పొడిగింపుగా ఈ 'సంవిధానం'లోచన చేసినవాడు సోమనాథుడే. కేవలం ఆలోచించటమే కాకుండా కావ్య విమర్శ మార్గంలో ప్రవేశపెట్టింది కూడా ఆయనే. ఆ తరువాత దీన్నందుకొన్నది పింగళి సూరన.

### సంవిధాన చక్రవర్తి కావ్యం

సంవిధానమనేది ఒకే కథకు సంబంధించిన వివిధాంశాల సంయోజనం మాత్రమే కాక వివిధ కథలను సంయోజించటం కూడ 'కథా యోజన'మే - సంవిధానమే అవుతుంది. కావ్యంలో ఒకే కథ విషయంగా సంవిధానం ఉన్నట్లే వివిధ కథల సంవిధానం కూడా ఉండవచ్చు. ఒకే కథ గల కావ్యానికి సంబంధించిన

సంవిధానం కన్న భిన్న కథలుగల కావ్యంలోని సంవిధానం మరింత క్లిష్టమయింది. ఇక్కడి సంవిధానం ఒక్కొక్క కథకు సంబంధించి ఎట్లాగూ ఉండేది; కాని వివిధ కథల సంవిధానం గూడ కావ్య పరమార్థానికి అనుగుణంగా నిర్వహించబడవలసి ఉంటుంది. భిన్న భిన్న కథలు ఒకే కావ్యంలో ఉన్నప్పుడు, వాటిలో ఒక్కొక్క కథలోని సంవిధానం; ఇట్లాంటి సంవిధానం గల వివిధ కథల సంవిధానం – ఈ మొత్తం ఏకోన్ముఖంగా సమన్వయించి సముచితంగా నిర్వహించటం సులభమేమీ కాదు. ఇట్లాంటి కావ్యాల్లో సంవిధానం రెండు అంచెలలో సాగుతూనే పరస్పరం పెనువేసుకుపోయి ఒకటిగానే సహృదయులకు అనుభవానికి వస్తుంది. ఈ విధమయిన సంవిధానం విచిత్రమయిన ప్రతిభకు సూచకం. ఈ వైచిత్రిని సూచించటానికే పింగళి సూరన 'కథా సంవిధాన వైచిత్రి' అన్నాడు. సోమనాథుడు తన ఉత్తర హరివంశంలో వివిధ కథల సంవిధానాన్ని లక్ష్య ప్రాయంగా ప్రదర్శించాడు. అయితే, ఈ సంవిధానం తీరు ఆయా కవులను బట్టి భేదిస్తూ ఉంటుందనటానికి కళా పూర్ణోదయం ఒక ఉదాహరణ.

కథల విషయంలో మరొక అంశం గూడా గుర్తించవలసి ఉన్నది. ఒక కథ ఉన్నది. ఆ కథ కల్పితం. దానిలోని ఆకర్షణ ప్రధానంగా కల్పనా లక్షణం వల్ల కలుగుతుంది. అట్లా కాక; ఒక కథ కల్పితం కాదు, అంతకు ముందే ఉన్నది. మళ్లీ చెప్పబడుతున్నది. అంటే, పునరుక్తమవుతున్న దన్న మాట. మరి, ఇట్లాంటి దానిలోని ఆకర్షణ లక్షణమేమిటి? ఎట్లాంటిది? దీనికి కుంతకుడు చెప్పిన సమాధానమిది.

కందలిత కామనీయకమయిన ఒకే కథను నిర్వహించునట్టి కవి కుంజరులచే నిబంధింప బడుచున్న అనేక ప్రబంధాలు ఏ విధంగానూ పరస్పరం సంవదించని ఒకానొక సహృదయ హృదయాహ్లాదకమయిన వక్రిమను సంపాదిస్తున్నవి. రామాభ్యుదయ, ఉదాత్త రాఘవ, వీరచరిత, బాల రామాయణ, కృత్యారావణ, మాయా పుష్ప కాది ప్రబంధాలు ఇట్లాంటివి.

రామాభ్యుదయాది (తెలుగులో 'రామాభ్యుదయం' కాదిది) కావ్యాలన్నింటిలోనూ ఉన్నది ఒకే కథ; అది రామకథ. ఈ వివిధ కవుల కావ్యాలన్నింటిలోనూ కథ ఒకటే అయినా గూడా ఏ కావ్యానికాకావ్యం ఒక దానితో మరొకటి ఏ విధంగానూ సంవదించని (పోలిక లేని) వక్రిమను సాధిస్తూ సహృదయ హృదయాల కాహ్లాదం కలిగిస్తున్నది. (ప్రస్తుతానికి వక్రిమ/వక్రత. అంటే సౌందర్యం అని మాత్రమే అనుకొంటే చాలు. నిజానికి వక్రత ఒక గొప్ప సాహిత్య సిద్ధాంతం) మరి, ఈ వక్రిమ ఎట్లా సాధింపబడుతున్నది? నిజానికి, సంవిధానంలోని వైచిత్రి వలన సాధింపబడుతున్నది.

కుంతకుడు 'ప్రబంధ వక్రత'లోని వివిధ రీతులను వివరిస్తూ ఈ ప్రస్తుత విషయం చెప్పాడు. కాగా, కుంతకుడు విశ్లేషించ లేదు గాని, ఆయన నిరూపించిన ఆరు విధాల 'వక్రత' లలో ప్రకరణ – ప్రబంధ వక్రతలకు నడుమ 'సంవిధాన వక్రత' అంటూ ఒక విధం ప్రత్యేకంగా ప్రతిపాదిస్తే బాగుండేదనిపిస్తుంది. సరి. ఆయన ప్రణాళిక ఆయనది. ప్రకరణ – ప్రబంద వక్రతలలో ఈ సంవిధాన విషయం అందర్భవించిదనుకోవచ్చుగాని, సంవిధానం వల్ల కలిగే వక్రిమ విశిష్టమయిందిగా గుర్తించవచ్చు. సోమనాథుడు ఈ సంవిధాన ప్రాధాన్యం గుర్తించాడు. దాదాపుగా ఏకకాలంలో హరివంశ రచన సాగుతున్నది. తాను (సోమన) ఒక వైపు. ఎఱ్ఱన ఒకవైపు, సోమనాథుడు సంవిధాన వైచిత్రి ద్వారా విశేషమయిన వక్రిమను సాధించాడు. సాధించాడు కాబట్టే ఏ కావ్యానికయినా అవసరమయిన సంవిధానాన్ని ప్రత్యేకాంశంగా కావ్య విమర్శ మార్గానికి తెచ్చాడు.

సోమనాథుడింతటితో ఆగకుండా మరో అడుగు ముందుకు సాగాడు. 'సంవిధా'నాన్ని ప్రతిపాదించటమే కాక, ఆ సంవిధానము యొక్క ప్రత్యేక లక్షణాన్ని సూచించటానికి ప్రయత్నించాడు గూడా. 'సంవిధాన' పదానికి 'చక్రవర్తి'ని జోడించటం ఈ ప్రయత్నాన్ని వ్యక్తీకరిస్తున్నది. 'సంవిధాన చక్రవర్తి' అనేది ఆయనకు బిరుదుగా ఉండటం వల్ల, సంవిధాన విషయంలో ఆయన చక్రవర్తి సార్వభౌముని వంటివాడు అని చెప్పటంలో 'హాయి' ఉండనే ఉన్నది. సత్యనారాయణగారన్నది గూడా బిరుదు దృష్టితోనే. అదట్లా ఉంచి; చక్రవర్తి సార్వభౌమ అనే రెండు పదాలున్నయి. ఈ రెండింటికి అర్థం ఒకటే ననవచ్చు. భూ చక్రం, లేదా భూమండలమందంతటా తన ఆజ్ఞారూపంగా తాను వర్తించువాడు 'చక్రవర్తి' కాగా; సర్వభూము(దేశా)లందు ఎవరి ఆజ్ఞ నిరాటంకంగా, ఎదురులేకుండా సాగుతుందో వాడు 'సార్వభౌముడు'. సోమనాథుని ఈ 'బిరుదు'లో చక్రవర్తి పదానికి బదులు సార్వభౌమ పదం చేరిస్తే ఏమవుతుంది? 'సంపూర్ణ కీర్తి' అనే మరొక బిరుదంతో అంత్యప్రాస తప్పుతుంది. అంతేనా? దానికి ప్రయోజనం అంత్య ప్రాస కుదురటమే అయితే అంతగా పట్టించుకోనక్కరలేదు. అసలు, ఇంతకూ ఈ ప్రశ్నా, ఈ సమాధానమేమిటి? సోమనాథుడు 'కావా'లని చక్రవర్తి పదం ఎన్నుకొంటే, దాన్ని కాదనటానికిగాని; ఎంత సమానార్థకమయినా, మరింత గొప్పదనం కలిగించే అర్థంగలదనుకొన్నా గూడా మరొక పదాన్ని మరొకరెవరో చేర్చటం గానీ ఎట్లా కుదురుతుంది? అందులో సామంజస్యమేమిటి? అట్లా అయితే, దేన్నయినా, ఎక్కడయినా, ఎవరయినా మార్చవచ్చు. అప్పుడది ఆయనది కాదు;

మార్చిన / చేర్చిన వారిదవుతుంది. కాబట్టి మార్చగూడదు. అవును. అది మార్చటానికి వీల్లేని పదం. అయితే; అది ఎందుకు పరివృత్త్యసహమో –మార్పును సహించదో, ఆ పదాన్నే ఎందుకు ఎన్నుకోవలసివచ్చి ఉంటుందో, దానివల్ల కలిగే విశేషమేమిటో –ఇట్లా మాత్రం విచారించవచ్చు.

సోమనాథుడు సాహిత్య, సంవిధాన పదాలను ప్రయోగించిన విధానాన్ని బట్టి ఆయనకు కుంతకుని ఆలోచనా విధానంతో గాఢమయిన పరిచయం, దాని మీద ఆదరమూ ఉన్నట్టు స్పష్టమే. కాగా, ఈ పరివేషంలో గమనిస్తే 'చక్రవర్తి' పదాన్ని ఎన్నుకోవటం లోని జాగ్రత్త స్పష్టపడుతుంది. కావ్య విషయంలో కుంతకుని దంతా 'వక్ర(తా)' (వక్రోక్తి) సిద్ధాంతం. కావ్య సౌందర్యానికి 'వక్రత' మాత్రమే మూలమనీ; మహా కవి ప్రబంధాలన్నింటా 'వక్రత' ఉన్నదనీ ఆయన నిరూపించాడు. ఈ వక్రత అనేక విధాలుగా కావ్యంలో వ్యక్తమవుతుంది. ఈ వక్రత ఆరు విధాలుగా ఉంటుందనీ, ఒక్కొక్క విధంలోనే మరికొన్ని రీతులున్నాయనీ వక్రతా వైవిధ్యాన్ని అక్షరం మొదలుకొని మహాకావ్య నిర్మాణం దాకా ఆయన ప్రపంచించాడు. రసాలంకార ధ్వన్యాదులను అన్నింటినీ సమావరించుకొన్న వక్రత యొక్క కావ్య విశ్వరూపాన్ని ఆయన దర్శించాడు. ఆయన 'దర్శనం' మీద బద్ధాదరుడయిన సోమనాథుడు మౌలికమయిన ఆ 'వక్ర' తను 'చక్ర' పదంతో ఇక్కడ సూచిస్తున్నాడు. వక్రతకు ఒక సందర్భంలో కుంతకుడు బాలేందు వక్రత్వంతో పోలిక చెప్పాడు. కుంతకుని ఈ బాలేందు వక్రత్వాన్నే అచ్చంగా స్వీకరించి, అనంతరకాలంలో శ్రీనాథుడు 'హరచూడాహరిణాంక వక్రత' అన్నాడు. బాలేందు సామ్యం కన్నా శ్రీనాథుడు చెప్పింది. విశిష్ట మనిపిస్తుంది. శివుని తలమీది చంద్రకళ పదహారవది. చంద్రుడి మిగిలిన పది హేను కళలకు వృద్ధి క్షయాలుంటాయి కాని, పదహారవ దానికి అట్లాంటి మార్పులు ఉండవు. కావ్యంలోని వక్రత శివుని తలమీద నెలవంక వంటిది. ఇప్పటికిదిట్లా ఉంచి; సోమనాథుడు సంవిధాన విషయంలో బాలేందు వక్రత్వాన్ని కాక చక్ర వక్రత్వాన్ని భావించాడు. వక్రతయొక్క ఒకానొక విధమయిన సమగ్రత్వం, సంపూర్ణత్వం 'చక్రత్వం'లో వ్యక్తమవుతుంది. కాగా, 'సంవిధాన చక్ర'మంటే చక్రం వంటి సంవిధానం – సమగ్ర వక్రతా మహితమయిన సంవిధానమని తాత్పర్యం.

'చక్ర' పదం సంవిధాన పద్ధతుల్లోని ఒక ప్రత్యేక పద్ధతిని సూచిస్తున్నది. సంవిధాన రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి ఋజు పద్ధతి; రెండు చక్ర పద్ధతి. 'సంవిధాన చక్ర'మన్నది ఈ చక్ర పద్ధతిని ఉద్దేశిస్తున్నది. స్థూలంగా ఈ పద్ధతుల స్వరూపమిది.

కథ ఎక్కడో ఒక చోట మొదలవుతుంది. ఆ కథ మొదలయిన అంశం ఆరంభ బిందువు; అట్లాగే కథ ముగుస్తుంది; ఆ ముగిసిన అంశం సమాపన బిందువు. ఈ రెండూ వేరు వేరంశాలు; వేరు వేరు బిందువులు – ఆరంభ సమాపన బింధువులు. ఈ రెండింటి మధ్య కథ సాగుతుంది. ఈ సాగుదల సామాన్యంగా ఋజు రేఖా పద్ధతిలో ఉంటుంది కాబట్టి ఈ విధమయిన సంవిధానాన్ని 'ఋజు సంవిధానమన' వచ్చు. ఉదాహరణకు 'వసుచరిత్ర' సాగిన విధానం చూద్దాము. వసురాజు ఉన్నాడు. రాజ్యపాలన సాగుతున్నది. ఒకసారి వసపాలకుల అభ్యర్థన ప్రకారం ఉద్యానవనాలకు వచ్చాడు. కోలాహల గిరిపై గిరికను చూచాడు. ఆమే అతన్ని చూసింది. ఇద్దరూ 'విరహం' పొందారు. ఇంద్రుడు రాయబారం చేశాడు. గిరికా వసురాజుల పెండ్లి అయింది. కథ పూర్తయింది. ఇక్కడ 'కథ'లో ఏ మలుపులూ లేవు; ఆటంకాలూ లేవు, అవరోధాలూ లేవు; ఆలోచనలూ మొదలయిన వేవీ లేదు. కమ్మెచ్చు తీసినట్టుగా, తీగె తీసినట్టుగా సాఫీగా సాగింది. ఇది ఋజు పద్ధతి సంవిధానం. ఇట్లా కాక, కథ ఎన్నో మలుపులు తిరుగుతూ ఆటంకాలూ, అవరోధాలూ ఎదుర్కొంటూ, ఇబ్బంది పడుతూ, అధిగమిస్తూ, ప్రయత్నిస్తూ సాగే సంవిధానం చక్ర సంవిధానం. కొద్దిలో ఉదాహరణకు అభిజ్ఞాన శాకుంతల కథ చూడవచ్చు. ఋష్యాశ్రమం దగ్గర కథ ఆరంభమవుతుంది. దుష్యంతుడు లేడిని కొట్టటానికి చేసిన ప్రయత్నం వైఖానసుని వల్ల సాగక పోవటం దగ్గరినుంచి ఆటంకాలు, అవరోధాలు ఆరంభం. శకుంతల క్షత్రియ కన్య కాదనే అనుమానం, దాని తొలగుబాటు, శకుంతలా దుష్యంతుల క్షత్రియ కన్యకాదనే అనుమానం, దాని తొలగుబాటు, శకుంతలా దుష్యంతుల గాంధర్వ వివాహ యత్నం, షరతులు, కణ్వుడంగీకరించడమో అనే భయం; దుష్యంతుడు శకుంతలను వదిలి వెళ్లటం; ఆ తరువాత దుర్వాసుని శాపం, అది శకుంతలకు తెలియకుండటం; శాపం పని చేయక పోవటానికి అవసరమైన ఉంగరం పోవటం; రాజు శకుంతలను నిరాకరించటం, ఆమెను శార్ఙ్ఙ రవాదులూ వదులటం, మేనక తన కూతురు శకుంతల మారీచాశ్రమానికి చేర్చటం, ఉంగరం రాజుకు లభించటం; రాజు స్వర్గానికి వెళ్ళి తిరిగి వస్తూ తోవలో మారీచాశ్రమం వద్ద ఆగటం, భరత దర్శనం, శకుంతలా దుష్యంతుల సమాగమం... ఇట్లా ఎన్నో ఆటంకాలు, అవరోధాలు, మలుపులు, ఉద్వేగ – అనుద్వేగాలు... ఇన్నింటి సమన్వయంగా సంవిధానం సాగింది. ఋష్యాశ్రమంతో ఆరంభమయిన కథ ఋష్యాశ్రమంతోనే పూర్తవుతుంది. అంటే, ఆరంభ – సమాపన బిందువులు రెండుగా అన్పిస్తున్నా గూడా దాదాపుగా ఒకటే

అనిపిస్తవి. 'చక్ర' సంవిధాన మన్నది ఇక్కడ స్పష్టంగా కన్పిస్తుంది. ఋజు సంవిధానం కంటే, చక్ర సంవిధానం క్లిష్టమయింది. కథకు 'కథా'త్వాన్ని సమగ్రంగా సంపాదిస్తుంది. సంవిధాన విషయంలో కవి శక్తికి చక్ర పద్ధతి ఒక పరీక్ష వంటిది. సరిగా దీన్ని నిర్వహిస్తే అమితంగా సహృదయ హృదయ హ్లాదకమవుతుంది. ఋజుసంవిధానంలో ఆహ్లాదక లక్షణం కథా సంవిధాన పరంగా కన్నా భిన్నంగా, ఇతరేతర రాంశాలకు సంబంధించి ఉండవచ్చు. కాగా; సోమనాథుడు ఛక్ర సంవిధానాన్ని కావ్యానకిట మరింతగా సౌందర్య సంపాదనం చేస్తుందని గుర్తించి ప్రతిపాదించాడు. ఇట్లా సంవిధాన చక్రంతో వర్తించేది కావ్యం. కాగా, ఆ కావ్యం 'సంవిధాన చక్రవర్తి'. ఇక్కడ చక్రవర్తి పదం సమష్టిగా సంవిధాన విషయంలో సోమనాథుని సంపూర్ణ కీర్తిని వ్యక్తికరిస్తూ; కావ్య పరంగా సంవిధాన స్వరూపాన్ని / విధానాన్ని ఉద్దేశిస్తున్నది. 'సార్వభౌమ' వంటి పదాలు ఇందుకు సమర్థం కావు. అందుకనే సోమనాథుడు ఆ పదాన్ని ఎన్నుకొన్నాడు.

**గుణ పరిగణనం**

సోమనాథుడు ప్రతిపాదించిన మూడవ – చివరి అంశం 'హీనవీన గుణ సనాథ'త్వం. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారన్నట్లుగా, ఇది 'అతని వ్యక్తికి గాక రచించిన కావ్యమునకే సంబంధించినదని చెప్పవలయును. అతడు తన నిత్యజీవన మందు ఎట్టి యెట్టి క్రొత్త గుణము లలవరించుకొనెనో మన మెఱుఁగము'. అయితే; కేవలంగా ఆయన కావ్యానికేగాక, కావ్య సామాన్యంగా వర్తించేట్టుగా సాగిన విచారణలో నిష్పన్నమయిన ప్రతిపాదనగా దీన్ని గుర్తించవలసి ఉంటుంది. ఇంతకు ముందరి రెండూ అట్లాంటివే. కాగా, ఈ ప్రతి పాదనలోని ఆయన 'నవీన'త గమనించదగింది.

కావ్యానికి సంబంధించి 'గుణ' ప్రతిపాదన భారతీయ కావ్య విమర్శ మార్గంలో భరతుని నాటినుంచే మొదలయింది. తన 'నాట్యశాస్త్రం'లో ఓజః ప్రసాద మాధుర్య, సమతా, సుకుమారతా, అర్థవ్యక్తి, ఉదారత్వ, కాంతి, సమాధి, శ్లేష లనే కావ్యగుణాలను పదింటిని ఆయన ప్రతిపాదించాడు. 'కావ్యానికి శోభ కలిగించేవి గుణాలు' అని వామనుడు తన 'కావ్యాలంకార సూత్రంలో నిర్వచించాడు. దండి చెప్పినట్లు అలంకారాలు గూడా కావ్య శోభాకరాలే[17] అయినా గుణాలు అపరిహార్యాలు – అంటే, వదిలేయటానికి వీల్లేని కావ్య ధర్మాలనీ; వీటి దృష్ట్యా అలంకారాలు అప్రధానాలని వామననుని తాత్పర్యం.[18] 'అంగి అయిన అర్థాన్ని అవలంబించేవి గుణాలు' అని ఆనందవర్ధనుని అభిప్రాయం.[19] అంటే, కావ్యంలో 'అంగి అయిన అర్థం (ప్రధానమయిన విషయం /అంశం) రసం కాబట్టి గుణాలు రసాన్ని ఆశ్రయించుకొని

ఉంటాయని తాత్పర్యం. ఈ అన్నింటి పర్యవసానంగా కావ్యానికి శోభనూ, రసానికి ఉద్దీప్తినీ కలిగిస్తూ ఉపమా – రూపకాద్యలంకారాలకు భిన్నమయిన కావ్య ధర్మం 'గుణ'మని స్థూలంగా చెప్పుకోవచ్చు. అయితే ఈ కావ్య'గుణా'లెన్ని? ఈ గుణాల సంఖ్య కచ్చితంగా 'ఇంతే' అని నిర్ధారణ అయినట్టు కన్పించదు. ఉప మాద్యలంకారాలంతగా కాకున్నా, గుణ 'సంఖ్య' విషయంలో పెంపు – కుదింపులు కన్పిస్తూనే ఉన్నవి. భరతుడు చెప్పిన పది గుణాలు మొత్తానికి మొత్తంగా భామహునికి అంగీకార్యం కాలేదు. ఆయన మూడు గుణాలను మాత్రమే అంగీకరించాడు. కాని, దండి పదింటినీ అంగీకరించాడు. ఆ పదింటినీ శబ్దార్థ భేదంతో వామనుడు ఇరవయి గుణాలుగా ప్రదర్శించాడు. ఆయన దృష్ట్యా ఆ పది శబ్ద గుణాలూ అవుతాయి. మళ్లీ ఆ పదే అర్థ గుణాలుగా కూడా ప్రవర్తిస్తాయి. ఈ విధంగా – శబ్ద గుణాలుగా పది + అర్థగుణాలుగా పది = మొత్తం ఇరవయి గుణాలు. ఈయన కన్నా గుణ సంఖ్యాభిమాని భోజుడు ఆయన ఇరవై నాలుగు గుణాలను గుర్తించాడు. వాటిని బాహ్య – ఆభ్యంతర (శబ్ద – అర్థ) భేదంతో నలభయి ఎనిమిదిగా ప్రదర్శించాడు అంతటితో ఆగక; కొన్ని కొన్ని సందర్భాల్లో కొన్ని కొన్ని (కావ్య) దోషాలు 'గుణ'త్వం పొందుతాయనీ, అట్లాంటి వాటిని 'వై శేషికా' లనే పేర గుర్తించవలసి ఉంటుందనీ ప్రతిపాదించి గుణ సంఖ్యను మరింత పెంచాడు.[20] ఈ ధోరణిని బట్టి చూస్తే; గుణ సంఖ్య నియతమనిగానీ, నిశ్చితమనిగానీ చెప్పటానికి వీలు కన్పించదు. కాని; భామహుడు గుర్తించిన ఓజస్సు, ప్రసాదం, మాధుర్యం, అనే గుణత్రయం ఆనంద వర్ధనాదుల ద్వారా అందరికీ ఆమోదయోగ్యంగా నిలిచింది. గుణాలకు సంబంధించి భోజుని ఆరాటానికి అంతగా వ్యాప్తి రాలేదు. కాగా, ఈస్థితిలో ఇన్నిన్ని గుణాలు ప్రసిద్ధమయి ఉండగా, సోమనాథుని 'నవీన గుణ' సనాథత్వం పరిశీలించవలసి ఉంది.

### గుణాల నవీనత్వం

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు సోమనాథుని ఈ ప్రతిపాదనలోని 'గుణ' పదాన్ని పట్టించుకో లేదు. కవిత్వంలో ప్రధానంగా ఉండే తత్వాలు – భావం, వస్తువు అనీ; వీటిని వ్యక్తీకరించేది రచన అనీ; కాగా; ఈ మూడు భావ – వస్తు – రచనా కళలని వ్యవహరించబడుతాయని ఆయన ప్రతిపాదించారు. తొలుతటి కవుల కావ్యాల్లో భావం ప్రధానం; క్రమంగా తరువాతి కవుల కావ్యాల్లో వస్తువుకు ఆ తరువాత రచనకూ ప్రాధాన్యం వచ్చింది. సోమనాథుని నాటికి రచనా కళా నిర్వహణం నవీనం. దాన్ని సోమనాథుడు గొప్పగా సాధించాడు. అందువల్ల 'నవీనగుణ సనాథ' అని చెప్పుకొన్నాడు

– ఇది శర్మగారి అభిప్రాయం.[21] తమ ఈ అభిప్రాయాన్ని ఆయన అనేకోదాహరణాలతో వివరించారు. కవిత్వ విషయంలో భావ – వస్తు – రచనా కళా ప్రతిపాదన, నిజానికి, శర్మగారి నిశిత విచారణలో నిష్పన్నమయిన మౌలికాంశం కావచ్చు కాని, ప్రస్తుతానికి అది అంతగా ఉపకరించేట్లు కన్పించదు. ఆయన వివరణ దృష్ట్యా చూసినా గూడా, భావ – వస్తు – రచనలనేవి కళలే తప్ప 'గుణాలు' కావు. రచనా కళను ఒక 'నవీన గుణం'గా సోమనాథుడను కొన్నాడని శర్మగారి అభిప్రాయం. నిజానికీ, 'రచన' గుణవంత మవుతుంది. కాని. రచనే 'గుణం' కావటానికి అవకాశం కన్పించదు. అదట్లా ఉంచి; సాహిత్య – రసపోషణ, సంవిధాన చక్ర విషయాలను ప్రతిపాదించిన సోమనాథుడు భావ – వస్తు ప్రాధాన్యం లేని కేవల రచనా కళను 'నవీనం' గా భావించి, అదొక గొప్ప బిరుదంగా చెప్పుకొన్నాడనటంలోనూ సామంజస్యం లేదు. సోమనాథుని విషయంలో 'నవీనగుణ' మన్న దాన్ని సామాన్య వ్యవహార ధోరణిలోనే – అంటే, ఒక 'మంచి' లక్షణంగా – భావించి వ్యవహరించారే తప్ప అదొక 'కావ్యగుణ' విషయంగా, విశేషాంశంగా గుర్తించక పోవటం చేత ఆయన వల్ల సోమనాథునికి జరుగవలసిన న్యాయం జరుగలేదనిపించటంలో అసామంజస్యం ఏమీ లేదు. ఒక వేళ సోమనాథుడు రచనా కళ గూర్చి చెప్పి ఉండక తప్పదనుకుంటే 'సాహిత్య' పదం దగ్గర దాన్ని గూర్చి విచారిస్తే కొంతైనా ఫలితం ఉండేదేమో! మరొకటి: శర్మగారి వివేచన ప్రకారం రచనా కళలో భావకళకు దాదాపుగా ప్రసక్తే ఉండదు. కొంత కొంత వస్తుకళకు ప్రవేశం ఉండవచ్చు. మరి, భావకళకు ప్రాధాన్యం లేని చోట రసానికి అవకాశమే లేదు. మరి 'రసపోషణ' అని సోమనాథుడెందుకన్నట్టు? దాన్ని పట్టించుకుకోకపోతే, ఈ 'నవీన గుణ' విషయం గూడా పట్టించుకో నక్కరలేదు. అప్పుడాయన చెప్పుకొన్న వాటిని గూర్చిన విచారణకే అవకాశం ఉండదు. కాని, విచారిస్తున్నాం గదా! అందుకని సోమనాథుడు ప్రతిపాదించిన దాన్ని ఆ ప్రతిపాదించిన తీరులోనే గమనించటం ఋజు మార్గం. అప్పుడు 'గుణ' మన్నదాన్ని నిర్లక్ష్యం చేసేందుకు వీలు లేదు.

అయితే; భరతాదులు ప్రతిపాదించిన గుణాలకన్నా 'నవీన గుణాలు' అనటం కేవలం ఉజ్జాయింపు మాటే అవుతుంది. వాటికన్న భిన్నంగా – ప్రత్యేక పద్ధతిలో 'నవీన మయిన గుణాలు' నిర్ధారితమయినప్పుడే సోమనాథుని ప్రతిపాదనకు ఒక ప్రామాణికం కలిగే అవకాశం ఉంటుంది. అదట్లా ఉంచి; కొంత జాగ్రత్తగా నైనా పరిశీలిస్తే; సోమనాథుని నవీన గుణాలనే గాక ఆ గుణాలతో ఏర్పడే 'రీతి'ని, దాని

నవీనత్వాన్ని గూడా ఉద్దేశించినట్లు కన్పిస్తుంది. ఎట్లా అంటే –

రీతులు గుణాత్మక మయినవనేది ప్రసిద్ధం. రీతి సంప్రదాయానికి ఆచార్యుడయిన వామనుడు – 'విశిష్టమయిన పదరచన రీతి' అనీ, ఆ విశిష్టత గుణాత్మకత్వమనీ నిర్ణయించాడు. వామనుని 'రీతి'కి మార్గ దర్శకుడు దండి. 'గిరాం మార్గము'లనేక మంటూ, వాటిలో 'ప్రస్ఫుటాంతరములు' (స్పష్టమయిన తేడా కలవి) వైదర్భి, గౌడి అనే రెండు 'మార్గా'లను ఆయన స్పష్టంగా పేర్కొన్నాడు. గత్యర్థకమయిన 'రీఙ్' ధాతువు నుంచి 'రీతి' పదం నిష్పన్నమయిందని 'మార్గ'మే రీతిగా వ్యవహరింప బడుతున్నదని భోజుడు వివరించాడు. దండి చెప్పిన రెండు రీతులకు (మార్గాలకు) 'పాంచాలి' పేర మరొకటి చేర్చి రీతులు మూడు అని వామనుడు నిర్ణయించాడు. వైదర్భీ రీతిలో శ్లేష – ప్రసాదాది గుణాలు పదికి పదీ ఉంటాయని దండి – వామనుల అభిప్రాయం. అయితే, ఈ గుణాల 'విపర్యయ'మే (వ్యతిరేక లక్షణమే) 'గౌడి' మార్గమని దండి అభిప్రాయం. (సమత అనే గుణానికి విపర్యయం 'విషమత' – ఈ విధంగా అన్ని గుణాలకూ 'విపర్యయం' గమనించవచ్చు.) కాని, వామనుడు ఈ అభిప్రాయాన్ని అంగీకరించలేదు. గుణ విపర్యయం దోషమవుతుంది. రీతి గుణాలతోనే ఏర్పడుతుంది తప్ప దోషాలతో కాదు. అందువల్ల 'ఓజస్సు, కాంతి' అనే రెండు గుణాలతో 'గౌడి' రూపొందుతుందనీ, 'మాధుర్య – సౌకుమార్య' గుణాలు రెండింటితో పాంచాలి రూపొందుతుందని ఆయన నిర్ణయించాడు. అయితే ఈ రెండేసి గుణాలతో ఏర్పడే రెండు రీతులను చెప్పిన వామనుడు[22] పదింటిలో ఇంకా మిగిలి ఉన్న ఆరు గుణాలతో ఏ రీతులు ఏర్పడుతాయో చెప్పలేదు. గుణాలు మిగిలినందువల్ల వాటి కోసం రీతులు తప్పక ఏర్పడాలనేది తప్పని సరి కాక పోవచ్చు గాని, చెప్పటానికి వీలుందని మాత్రం గుర్తుంచుకోవలసిన అంశం. ఆనందవర్ధనుని తరువాత రీతుల విషయంలో గుణాలను గూర్చిన ఆలోచనలో కొంత శైథిల్యం వచ్చిందనవచ్చు. ఆనందవర్ధనుడు గుణాలు మూడేననీ, అవి రస ధర్మాలనీ అన్నాడు. కాగా, గుణాలకు బదులు సమాసాల కూర్పు రంగం మీదికి వచ్చింది. సమాస, అసమాస, దీర్ఘ సమాసాల ప్రాతిపదిక మీద రీతులను గూర్చి విచారించటం మొదలయింది.[23] అయితే, అంత మాత్రాన రీతి విషయంలో గుణ ప్రసక్తి పూర్తిగా పోలేదు. రీతి గుణోపేతమన్న ప్రసిద్ధి దాదాపుగా ఉండనే ఉన్నది. కాగా, గుణ రహితమయినది రీతి కాదు. రీతికి గుణాలు ప్రాణాలు. (గుణాన్ని ప్రాణం అని వ్యవహరించటం సాహిత్య శాస్త్ర సంప్రదాయంలో ఉంది.) గుణాల ద్వారా రీతి ఏర్పడుతున్నట్లే, రీతి ద్వారా గుణాలు వ్యక్తమవుతాయని గూడా చెప్పవచ్చు.

ఎట్లా చెప్పినా రీతి – గుణ సంబంధం ఉండనే ఉంటుంది. కాగా, రీతిని గుణోపేత మనటంలో అసామంజస్యమేమీ లేదు. సోమనాథుడు రీతి గుణోపేతమని భావించే తీరుకు చెందినవాడు. అందువల్ల 'గుణ సనాథ' అనటం ద్వారా రీతిని సూచిస్తున్నాడు. దండి 'ఉదార' మన్న గుణాన్ని గూర్చి చెప్తూ, ఉదార గుణం వల్ల 'కావ్య పద్ధతి' (కావ్య మార్గం = మార్గం = రీతి) 'సనాథ' మవుతుందన్నాడు. అంటే కృతార్థమవుతుందని తాత్పర్యం. ఇక్కడి 'సనాథ' పదం సోమనాథుడి ప్రేరణ కలిగించిందనటం బాగనిపించక పోవచ్చు గాని, 'గుణసనాథ' అనటం ద్వారా సోమనాథుడు రీతిని ఉద్దేశించాడనటంలో అభ్యంతరం ఉండనక్కరలేదు. అయితే రీతిని 'గుణ సనాథ'గా గుర్తించటం 'నవీన' మేమీ కాదు. కాని సోమనాథుడు 'నవీనగుణ సనాథ' అన్నాడు. అంటే, గుణాలూ నవీనాలే, వాటితో ఏర్పడే రీతి నవీనమే అని ఆయన తాత్పర్యం. అయితే, ఆ నవీన గుణాలేమిటి? ఆ నవీన రీతులేమిటి?

సాధారణంగా వైదర్భి గౌడి మొదలయిన రీతుల పేర్లను గమనిస్తే అవన్నీ ఆయా దేశాలను బట్టి వచ్చిన పేర్లని గుర్తించటానికి పెద్ద ఇబ్బంది పడవలసిందేమీ లేదు. 'విదర్భాది దేశాల్లో కన్పించటం వల్ల వైదర్భీత్యాదులుగా రీతులు పేర్కొనబడుతున్న'ని వామనుడీ విషయం స్పష్టంగానే చెప్పాడు గూడా.[24] వామనుని తరువాత రీతుల సంఖ్యను పెంచిన రుద్రటుడు, భోజుడు కూడా 'లాటి, అవంతిక'... ఇత్యాదిగా దేశాలను బట్టే రీతులను పేర్కొన్నారు. కాని, ఈ పద్ధతి సరయింది కాదు. కుంతకుడు ఈ విధంగా పేర్లు పెట్టే పద్ధతిని తీవ్రంగా నిరాకరించాడు. రీతులను నిర్ణయించటంలో, వాటికి పేర్లు పెట్టటంలో దేశభేదాలనే ఆశ్రయించేట్టయితే, దేశాలు అనంతాలు కావటం వల్ల రీతులు గూడా అనంతాలు కావలసి ఉంటుంది.[25] ఒక వ్యవస్థ అంటూ ఉండదు. అంతే కాదు, ఒక దేశంలోని కవులందరూ, లేదా అధిక శాతం కవులు ఒకే విధమయిన రీతిని మాత్రమే అభిమానించి ఉపయోగిస్తారనటంలోనూ సామంజస్యం ఉండదు. అందువల్ల విదర్భ, గౌడ, పాంచాల, లాట... మొదలయిన దేశాలను బట్టి రీతులను నిర్ణయించటంలోనూ, వాటికి పేర్లు పెట్టటంలోనూ సామంజస్యం లేకపోవటం మాత్రమే కాదు; ప్రయోజనం గూడా లేదు. అదట్లా ఉంచి, దేశాల పేర్లను బట్టి రీతులను వ్యవహరించిన లాక్షణికులలో నాటి లక్షణాలను చెప్పటంలో తడబాట్లు కూడా కన్పిస్తున్నాయి. భోజుడు 'అవంతికా' రీతికి చెప్పిన లక్షణాన్ని విశ్వనాథుడు 'లాటీ' రీతికి చెప్పాడు; భోజుడు లాటీ రీతికి చెప్పన లక్షణం వేరే ఉన్నది. ఆరంభించిన రీతిని చివరి దాకా నిర్వహించకపోవటం వల్ల అది ఖండ రీతి అవుతుందనీ, దాన్ని 'మాగధి' అనీ భోజుడు భావించాడు.[26] ఇట్లాంటి 'మాగధి' కావటంలో సామంజస్య

మేమిటి? వైదర్భీ రీతితో మొదలయి ఒక రచన గౌడి రీతితో పూర్తయిందనుకొందాం. అప్పుడది 'వైదర్భ గౌడి' కావలసి ఉంటుంది. తప్ప 'మాగధి' కాదు. ఖండ రీతులన్నీ మాగధీ రీతు లనేట్టయితే, మగధ దేశంలో ఏ ఒక్క 'రీతి' గూడా ఆద్యంతం నిర్వహించబడదనీ, రీతుల కలగలుపు మాత్రమే మాగధ లక్షణమని నిర్ణయించవలసి ఉంటుంది. కాని, ఈ నిర్ణయం వాస్తవానికి అనూకలం కాదు.

**కుంతక మార్గం : గుణ ప్రవృత్తి**

ఈ విధమయిన విప్రతిపత్తులకు విరుగుడుగా, దేశాలకు బదులు కవి స్వభావాలను భూమికగా గ్రహించి రీతులను గుర్తించవలసి ఉంటుందని కుంతకుడు ఒక నవీన పద్ధతిని ప్రతిపాదించాడు. కవి స్వభావాలను బట్టి ఆయన ప్రతిపాదించిన మార్గాలు మూడు. వామనుని బట్టి కాక, ఆయనకు మార్గ దర్శకుడయిన దండిని బట్టి కుంతకుడు 'మార్గ' స్వీకారం చేశాడు. ఆయన చెప్పిన మూడు మార్గాలు : సుకుమారం, విచిత్రం, మధ్యమం. ఈ మూడింటిలో మొదటి రెండు స్పష్టంగా భిన్నమయిన – ప్రస్ఫుటాంతరాలయిన – మార్గాలు. మూడవది మొదటి రెండు మార్గాల ఛాయలతో రూపొందుతుంది; అంటే – సుకుమార, విచిత్ర మార్గాలకు మధ్యేమార్గంగా ఉంటుంది కాబట్టి అది 'మధ్యమం'.[27] కుంతకుని నిర్ణయం ప్రకారం ఈ మూడు మార్గాలు గూడా 'గుణ సనాథ' మయినవే – గుణాలతో ఏర్పడేవే. అయితే –

కుంతకుడు గుర్తించిన గుణాలు అచ్చంగా దండి మొదలయిన వారు పేర్కొన్నవి కావు; పదీ కావు; మూడూ కావు; ఇరవయ్యీ కావు; నలభై ఎనిమిదీ కావు. అవి నాలుగు మాత్రమే. ఒకటి : మాధుర్యం; రెండు: ప్రసాదం; మూడు : లావణ్యం; నాలుగు : ఆభిజాత్యం. వీటిలో మొదటి రెండు మాత్రమే దండి ప్రభృతులు గుర్తించిన పదింటిలోనివి. కాని, ఆ పదంటిలోని మాధుర్య, ప్రసాద లక్షణాలకూ, కుంతకుడు వాటికి చెప్పిన లక్షణాలకూ తేడా ఉన్నది కాబట్టి మొత్తంగా కుంతకుడు ప్రతిపాదించిన గుణాలు నవీనాలు. అంతేకాదు. మార్గాలన్నింటిలోనూ ఈ నాలుగు గుణాలుంటాయి.[28] కాని, స్వరూపం మారుతుంది. అంటే, ఉదాహరణకు, మాధుర్య గుణం సుకుమారం మార్గంలోనూ, విచిత్ర మార్గంలోనూ ఉంటుంది. కాని, సుకుమార మార్గంలోని మాధుర్యం ఒక విధం కాగా, విచిత్ర మార్గంలోనిది వేరొక విధంగా ఉంటుంది. మాధుర్యం తీరులోని భేదాన్ని ఇక్కడ కుంతకుడు గుర్తించటం, నిజంగా, కొత్త విషయం. ఆయనకు ముందుగాని, తరువాత గాని ఎవరు గూడా ఈ పద్ధతిలో ఆలోచించలేదు. పూర్వ పద్ధతిలో చూస్తే, ఒక మార్గంలో ఉండే గుణం మరొక మార్గంలో ఉండే

అవకాశం దాదాపుగా లేదు, కాగా, మాధుర్యాదులయిన నాలుగు గుణాలూ ఈ విధమయిన భేదంతో స్పష్టమయిన తేడా గల మార్గాలు రెండింటిలోనూ ప్రవర్తిస్తాయి. ఈ నాలుగు గుణాలే కాక, మార్గాలన్నింటికీ మొత్తంగా వర్తించే గుణాలంటూ మరి రెండింటిని కుంతకుడు ప్రతిపాదించాడు. అవి: ఔచిత్యం; సౌభాగ్యం. ఇవి మాధుర్యాదులవలె స్వభావ భేదం కలవి కావు. అన్నింటికీ ఒకే విధంగా వర్తిస్తాయి. అంటే, ఒక మార్గంలోని ఔచిత్యం ఒక విధంగానూ, మరొక మార్గంలోని ఔచిత్యం మరో విధంగానూ ఉండదు – రెండు మార్గాలోనూ ఒకే తీరుతో ఉంటుంది. ఈ విధంగా సుకుమారాది మార్గాలు నవీనమైనవి. ఈ మార్గాల కోసం ప్రతిపాదించబడిన గుణాలూ నవీనమైనవే. ఈ పద్ధతిలో అనంతర కాలాన వేరే ప్రతిపాదన లేవీ లేకపోవటం వల్ల వీటి 'నవీన'తకు క్షతి కలుగనే లేదు.

ఇక్కడ ఒక ప్రశ్నకు అవకాశముంది. దేశాలను బట్టి రీతులను నిర్ణయించేట్టయితే, దేశాలనంతం కాబట్టి రీతులు గూడా అనంతమయి ఒకానొక అవ్యవస్థ ఏర్పడుతుందన్నాడు గదా, కుంతకుడు! మరి, ఆయన ప్రతిపాదన వల్ల గూడా అవ్యవస్థ కలుగుతుంది. ఎట్లా అంటే, కవి స్వభావాలు మాత్రం అనంతం కావా? దేశాలు 'అనంతాలే' కావచ్చు గాని, ఏదో విధంగా అవి 'ఇన్ని' అని లెక్కించటానికి ఎంతో కొంత అవకాశముంది గాని, కవి స్వభావాల విషయంలో ఈ సూత్రం అవకాశం గూడా లేదు గదా! మరి, ఇది అవ్యవస్థ కాదా? అయితే, ఈ ఇబ్బందిని కుంతకుడు గమనించక పోలేదు. గమనించి సమాధానం గూడా చెప్పాడు. కవి స్వభావాల్లో అనంత వైవిధ్యం ఉండవచ్చు కాదు, ఉన్నది. కాని, ఈ వైవిధ్యాన్ని వింగడించి చూపటానికి అవకాశం లేదు; సాధ్యం కూడా కాదు. అందువల్ల ఈ మార్గాలు స్థూలంగా ప్రతిపాదించాడు.[29] ఎంత వైవిధ్యమున్నా గూడా ఈ మూడింటి పరిధిలోనే తప్ప వాటిని మించి ఉండబోదని కుంతకుని అభిప్రాయం. ఉదాహరణకు : 'సుకుమార మార్గముంది. ఈ సౌకుమార్యంలో వైవిధ్యం ఎంతగానో ఉండవచ్చుగూడా. కాని, ఎంత వైవిధ్యమున్నా అదంతా 'సుకుమార' విభాగంలోకే వచ్చి చేరుతుంది. ఒక్కొక్క విధం ఒక్కొక్క అవాంతర భేదంగా ఉంటుందే తప్ప 'సుకుమారం' కాకుండా పోదు. ఈ అవాంతర భేదాలను లెక్కించటం అసాధ్యం కావచ్చుగాని వాటిలోని సుకుమార లక్షణాన్ని మాత్రం గుర్తింవచ్చు. అందుకనే ఈ మార్గాలు స్థూలంగా ప్రతిపాదించబడ్డవి. ఈ విధంగా గమనిస్తే, దేశాన్ని బట్టి కాక, ఏ దేశంలోనయినా కవి స్వభావాన్ని బట్టి సుకుమారాది మార్గాలను గుర్తించవచ్చు. దీని వల్ల అవ్యవస్థ తొలగిపోతుంది. అంగీకర

యోగ్యమయిన వ్యవస్థ ఏర్పడుతుంది. అని కుంతకుని తాత్పర్యం. అనంతర కాలాన కుంతకుని ఈ 'మార్గ' విధానాన్ని సరిగా అవగాహన చేసుకొన్న సింగభూపాలుడు కోమల – కఠిన – మిశ్ర భేదాలతో మూడు రీతులను గుర్తించాడు. అంతే కాదు; దండి ప్రభృతులకూ కుంతకునికీ సమన్వయం సాధించటానికా అన్నట్టు వైదర్భీ, గౌడి రీతులు ప్రధానమైన పనీ; లాటీ, అవంతికాదులు మిశ్రరీతులనీ అన్నాడు. సింగభూపాలుడు గుర్తించిన మిశ్ర రీతులలో 'ఆంధ్రీ' అనే రీతి ఒకటి ఉండటం విశేషంగా గమనించవలసిన అంశం. ఆంధ్రీ రీతిని మిశ్ర రీతి అంటూ కొత్తగా ప్రతిపాదించటం సింగభూపాలుని పర్యాలోచనలోని విలక్షణత్వం.

సోమనాథుని నాటికి ప్రసిద్ధమైనవి భోజుడు పేర్కొన్న వైదర్భీ, గౌడీ, పాంచాలీ, ఆవంతికా, లాటీ(యా) మాగధీ రీతులు మొత్తం ఆరు. ఇవన్నీ దేశాల ప్రాతిపదికపయి రూపొందింపబడ్డాయని వాటి పేర్లే స్పష్టపరుస్తున్నాయి. ఈ తీరులోని లోపాలను గమనించిన కుంతకుని ఆలోచనా విధానం సోమనాథుని ఆలోచనా విధఆనం ఒకటే అయింది. అందువల్లనే కుంతకుడు ప్రతిపాదించిన రీతి విధానం, వాటి కోసమయిన గుణాల ప్రతిపాదన సోమనాథునికి అంగీకార యోగ్యంగా కన్పించింది. రీతి – గుణ విషయంలో ఇది నవీన విధానం. ఇందుకనే, సోమనాథుడు 'నవీన గుణ సనాథ' అని ప్రతిపాదించాడు. 'నవీన గుణములతో సనాథమయినది' – అంటే రీతి / మార్గం. రీతి, మార్గం అన్నవి సామాన్య వ్యవహారానికి చెందిన మాటలవలె అనిపిస్తాయి. నిజానికి వీటి ప్రాణం గుణ సనాథత్వమే.

కావ్యం మొత్తంగా చూసేప్పుడు సాహిత్య – రసపోషణ; కథా నిర్మాణానికి సంబంధించి చక్రసంవిధానం; రచనా విధానానికి సంబంధించి నవీన గుణ సనాథ మయిన 'మార్గా'న్ని సోమనాథుడు తన బిరుదాల ద్వారా వ్యక్తీకరించాడు. కాగా – సోమనాథునిది కుంతకుని ఆలోచనా విధానాన్ని తన ఆలోచనా విధానంతో సమన్వయించుకొని స్వతంత్ర వ్యక్తిత్వాన్ని ప్రతిభాసింప జేసిన కావ్య దృక్పథం.